# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక జనవరి, 2013 ₹ 20



వెలుగు బండి

# మిసిమి
మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*

**సంపుటి 24** **జనవరి 2013** **సంచిక 1**

*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాండ్రేగుల నాగేశ్వరరావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి
కుర్రా జితేంద్రబాబు
నందిగం కృష్ణారావు

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi

| | | |
|---|---|---|
| ప్రతి : ₹20 | సంవత్సరానికి | : ₹240 |
| విదేశాలకు ప్రతి : $ 2.50 | సంవత్సరానికి | : $ 25 |

(Library of Congress Control Number)
LCCN 91-903060

# ఈ నెల...

కమ్మతెమ్మెరలు ........................................... 3
తెలుగు భాషాభివృద్ధి – కొన్ని సూచనలు ............... 5
– *ఆచార్య ఎలవర్తి విశ్వనాథరెడ్డి*
జ్ఞానపీఠ్‌ను కాదన్న సుభాష్ ముఖోపాధ్యాయ్ .......... 8
– *డాక్టరు మంతెన సూర్యనారాయణరాజు*
భాగ్యనగర కోకిల ........................................ 10
– *డాక్టరు ముక్తేవి భారతి*
చందాల కేశవదాసు ....................................... 14
– *కుర్రా జితేంద్రబాబు*
జర్మన్ నాటకరంగం........................................ 19
– *రవీంద్ర*
సాహిత్యంలో గిరిజనుల పాత్ర .......................... 26
– *దూపాటి శేషుకుమారాచార్యులు*
ఆముక్త మాల్యద:ప్రాచీన తమిళులు, సామాజిక జీవనం...... 30
– *కొత్త వెంకటేశ్వరరావు*
ఆంధ్రేతరుల తెలుగు కృతులు .......................... 35
– గొల్లపూడి *మారుతీరావు*
లేపాక్షి...................................................... 40
– *మిసిమి*
బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు .......... 46
– *డాక్టరు దామెర వెంకట సూర్యారావు*
అనువాదాల హరివిల్లు ................................. 48
– *అంపశయ్య నవీన్*
హిందూస్థానీ–కర్ణాటక: భాత్ఖండే సంగీత పద్ధతి ..... 56
– *నండూరి పార్థసారథి*
ప్రేమమూర్తి స్వామీజీ...................................... 61
– *నటరాజ రామకృష్ణ*
తిక్కన తెలుగులో దేశీయత............................. 65
– *చాగం కొండారెడ్డి*
తెలుగు ప్రచురణ సంస్థలు ............................. 71
– *పుస్తక ప్రియ*
చదవండి (పుస్తక పరిచయం)......................... 76
బొడ్డెమ్మ పండుగ ....................................... 78
– *శ్రీమంతుల దామోదర్*

*ముఖచిత్రం* : రాజరాజ నరేంద్రుడు – చిత్రకారుడు : ఎమ్. రాజాజి
*రెండవ అట్ట*: వెలుగు బండి " సి.యన్. చామకూరు
*మూడవ అట్ట* : బసవన్న " : గిరిధర్ గౌడ్
*నాల్గవ అట్ట* : పెద్ద పండగ " : పి.కె. రాజు

(*వివరాలు :* 39వ పుటలో...)

# ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ...

**తె**లుగువారంతా ఒకటై 56 ఏళ్లు గడిచినా, వారికి తమ మూలాల గురించి సరైన అవగాహన లేక- సాంస్కృతిక ఉన్నతిని చాటుకోలేకపోయారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రయోజనాన్ని వినియోగించుకోలేక పోయారు.

తెలుగుభాష మూలాలు మధ్య ద్రావిడంలో ఉన్నాయి. ప్రాకృత భాషలతో ప్రభావితమైన ఈ ద్రావిడ భాషను ఆ రోజుల్లో 'దేశీ' అనే వారు. సుమారు రెండు వేల ఏళ్లపాటు 'దేశీ'గా చలామణీలో ఉన్న తెలుగుభాష శాతవాహనుల కంటే ముందు నాటి నాణేలపై చోటు చేసుకున్నది. అయినా తెలుగు భాష పూర్వచరిత్రపై మన పండితులు, మేధావులు ఏనాడూ తమ దృష్టిని సారించలేదు. తెలుగుభాష మొదళ్లు సంస్కృత భాషలో ఉన్నాయని భావించడంవల్లే వారు తెలుగుభాష చారిత్రకతను అధ్యయనం చేయడంపై ఆసక్తి చూపలేదు. తెలుగు నాట వెలుగు చూసిన ప్రాకృత సాహితీ రచనలు – గుణాఢ్యుని బృహత్కథను కానీ, హాలుని గాథాసప్తశతిని కానీ తెలుగువారు సొంతం చేసుకో లేక పోవడం విచారకరం. తమిళులు 'శిలప్పదికారం', 'మణిమేఖలై'లను తమ వారసత్వ సంపదగా చూసినట్టుగా మనం బృహత్కథను, గాథాసప్తశతిని చూడాలి. కానీ మనకు ఆమాట చెప్పే వారే కరువయ్యారు.

తెలుగు విశ్వవిద్యాలయం మనుగడలోకి వచ్చి 27 ఏళ్లు పూర్తవుతున్నా తెలుగు ప్రామాణిక భాషగా ఎదగడానికి నిర్దుష్ట విధానాలు రూపొందలేదు. మాండలికాలు మాట్లాడుకునేందుకు బాగుంటాయే తప్ప భాషాభివృద్ధికి దోహదం చేయవు. పరిపాలన, సారస్వత కార్యకలాపాల నిర్వహణ సాఫీగా సాగాలంటే, ప్రామాణీకరణ తప్పనిసరి.

అదేవిధంగా మన వ్యాకరణం ఏదో మనకే తెలియదు. చిన్నయసూరి తర్వాత మళ్లీ వ్యాకరణ గ్రంథాన్ని రాసేందుకు ఎవరూ పూనుకోనందున ఆ లోటు అలాగే ఉండి పోయింది. చిన్నయసూరి కూడా తెలుగును ద్రావిడ భాషగా చూడకపోవడం వలన సంస్కృత వ్యాకరణ సూత్రాలను దానికి అన్వయించి, లేనిపోని గందరగోళానికి కారణమయ్యారు. అందుబాటులో ఉన్న నిఘంటువులేవీ మన పద సంపదను పెంచేవిగా లేవు. తెలుగు విశ్వవిద్యాలయం భాషాభివృద్ధి మినహా మిగిలిన అన్ని పనులను చేస్తుంది. భారతీయ భాషలను, ఇంగ్లీషును నేర్చుకునేందుకు అందుబాటులో ఉన్న సాధనాలు, తెలుగుభాష నేర్చుకునేందుకు లేవు. ఈ పరిస్థితి గడచిన అర్ధశతాబ్ది కాలాన్ని మనం ఎంతగా దుర్వినియోగం చేశామో విశదపరుస్తోంది.

లలితకళలు- ముఖ్యంగా నాట్యకళ వంటి ప్రదర్శన కళలు మన రాష్ట్రంలో అంతులేని నిర్లక్ష్యానికి గురయ్యాయి. తెలుగువారికి ప్రదర్శన కళలు, అటు మార్గ సంప్రదాయంలో, ఇటు దేశీ సంప్రదాయంలో లెక్కకు మిక్కిలిగా ఉండేవి. పోషణ, ఆదరణ కరువై అవి క్రమంగా అంతరించిపోయాయి. సినిమా ప్రభావం, పండితుల అశ్రద్ధవలన అవి క్షీణించాయి. తెలుగు వారికి ఒక వల్లతోల్, ఒక శివరామ కారంత్, ఒక రుక్మిణీదేవి అరుండేల్ లేరు. ఉన్న ఒకే ఒక నాట్యాచార్యులు నటరాజ రామకృష్ణ, నేర్చుకునే వాళ్లు లేక అశాంతితో తమ చివరి రోజులు గడిపారు. దేవదాసీ-రాజదాసీ సంప్రదాయాల మేలు కలయికగా అవతరించిన భరతనాట్యం నిజానికి తెలుగువారి సొత్తు. కానీ మన ఉదాసీనత మూలంగా ఆ నాట్యకళా రూపాన్ని తమిళులు తమ సొంతం చేసుకున్నారు. యక్షగానంపై కన్నడిగులకు ఎంత హక్కు ఉందో మనకూ అంతే ఉంది. కానీ, దాన్ని కూడా మనం కన్నడ సోదరులకు వదిలిపెట్టాం.



మనందరినీ ఏకం చేయగల మౌలిక సంస్కృతి కొరవడిన ఫలితంగా, ఈ రోజున సాంస్కృతికంగా మనం ఒక ప్రతిష్టంభన ఎదుర్కొంటున్నాం. ఈ స్థితి నుంచి మనం బయట పడాలే తప్ప, దానికి లొంగి పోరాదు. భిన్న సంప్రదాయాలతో ప్రభావితమైన తెలుగు సంస్కృతికి వారసులుగా తలెత్తుకుని గౌరవంగా బ్రతకటం మన చేతుల్లోనే ఉంది. చరిత్ర మనపై మోపిన ఈ గురుతర బాధ్యతను నిర్వర్తించడంలో మనం విఫలమైతే, భావితరాలు మనల్ని క్షమించవు.

**– సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

**ఉత్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో మిసిమి చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి 'అంతర్వీక్షణం' పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!**

✶ "...మీరు సాదరంగా పంపిన *మిసిమి* నవంబరు 2012 సంచిక కూడా అందుకొన్నాను. ఆద్యంతం సావధానంగా పఠించాను. గురజాడ, జాషువా మొ॥ గొప్పరచయితలను గూర్చి వ్యాసాలు, *కర్ణాటక హిందూస్థానీ సంగీత* విశేషాల గురించిన వ్యాసం, *బాలవాఙ్మయం, వైద్యసంప్రదాయాలు, కృష్ణశాస్త్రి జ్ఞాపకాలు, బౌద్ధమత ప్రాధాన్యం, సాంకేతిక భాషగా తెలుగు, కళాకార విమర్శక* విశేషాలు – అన్నీ పత్రిక స్థాయిని ఉదాత్తంగా మలచినవి. సహృదయులైన పాఠకుల గుండెలపై కమ్మతెమ్మెరలు విరజిమ్మినవి.
పత్రిక ముద్రణ – ఏలూరిపాటి అన్నపూర్ణగారి 'శివపార్వతులు, మయూరి , పద్మరాగం, మౌనగానం' చిత్రాలు పరమ మనోజ్ఞంగా ఉన్నాయి. *మిసిమి* నూతనకాంతులు బహు కళావిన్యాసాల వెలుగులు. పత్రికా సంపాదకులకు, పత్రికా రచయితలకు, కళాకారులకు ధన్యవాదాలు. **– సాహిత్యబ్రహ్మ వి.వి.ఎల్ నరసింహారావు,** హైదరాబాదు.

✶ "...*మిసిమి* సంస్థాపక సంపాదకులున్నారే – ఆలపాటి రవీంద్రనాథ్‌గారు వారు ఎమ్.ఎన్ రాయ్ అనుచరుడు – ఆనాటి రాజకీయాల్లో, ఆవుల గోపాలకృష్ణమూర్తిగారితో పాటు! ఈ ఆలపాటివారు, అన్ని ఆధునిక అభ్యుదయకర ఉద్యమాలకు చేయూతనిచ్చిన మనీషి!
...రామ్‌గారినుండే కాదు, రవీంద్రనాథ్ గారి నుండీ, నేను నేర్చిన పాఠమొకటున్నది. ఆ రోజుల్లో, అంటే మీరు పుట్టకముందు, రవీంద్రనాథ్, తెనాలినుండి, *జ్యోతి* మాసపత్రిక ప్రచురించారు. అది– పుస్తకరూపంలో వుండేది. దానికి మా మేనమామ – సాంబయ్యగారు చందాదారులు! అప్పుడు నేను 8వ తరగతి విద్యార్థిని. *జ్యోతిని* చదువుతుండేవాడిని...
...తొలిపేజీ సంపాదకీయంలో, ఒకమారు, ఆలపాటివారు– వాడుకభాషను సమర్థిస్తూ ఒక మాటన్నారు:
న్యగోధ వృక్ష చ్ఛాయా తలంబున కేరింతంబులాడు,
కోలాంగులజాలంబాలోకింపుము!
అనే కంటే, ఆ మఱ్ఱిచెట్టు నీడన కేరింతలు కొట్టే, ఆ కోతుల గుంపుచూడు! అంటే, యేమయింది. అర్థం చెడిందా, అందం తగ్గిందా? – అంటూ చీవాట్లు పెట్టారు – పండిత ప్రకాండులను. ఎంత కఠినమైన, మారుమూల పదాలువాడితే, అంతగొప్ప – అన్న భ్రమలో వుండేవాడిని ఆ కాలంలో! ఆ భ్రమ నుండి, నన్ను దారి మళ్లించిన రవీంద్రనాథ్‌గారికి నేను ఇప్పటికీ కృతజ్ఞుడనే, 80వ పడిలో సహితం!...
...ఈ ఉదంతం రవీంద్రనాథ్‌గారి కుమారులకు చెప్పండి! యీ మెచ్చుకోలుకు సంతసిస్తారు!...
...తాపీ ధర్మారావుగారు *తెలుగునుడికారం* శీర్షికతో 25పుటల వ్యాసమొకటి వ్రాసారు. వాడుకభాషే వ్రాస్తున్నామా? అన్నపేరున, రంగనాయకమ్మగారిది, మరొక వ్యాసమున్నది. ఈ రెండూ ప్రామాణికమయిన వ్యాసాలే! విస్తృతమయిన, ఈ రెంటిని చదివే తీరకలేని వారు – రవీంద్రనాథ్‌గారి సంక్షిప్త ఖండన, చదివితే సరిపోతుంది.

**జీడిపప్పు వలయు, జేజేల బాసయు**
**వలయు పాశమునకు, తెలుగునకును;**
**తూలితూలి, దేని పాలు హెచ్చించిన**
**రుచులడంగి, రెంట రోతపుట్టు**
– అన్నారు!...

...పూజ్యులు తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు. ఈ మాదిరి సమన్వయదృష్టే – రవీంద్రనాథ్‌గారిదీ! ఈ సందర్భంగా, రవీంద్రనాథ్‌గారి వాదాన్ని సమర్థించే పిట్టకథ ఒకటున్నది. నవ్వు తెప్పిస్తుంది!...

...ఒక కోమటి శెట్టి వీధి బడికి వెళ్ళి పంతులుగారూ! సింతపండు – అని రాస్తే! మాపిల్లాడి సెంపలు, వాయగొట్టారే! సింతపండంటే, పులుపు తగ్గుద్దా, ధరపెరుగుద్దా, చెప్పండి! అంటూ నిలదీశాడు. పంతులుగారి నోటమాటలేదు! ఈ పిట్టకథలకేమొచ్చెగాని, ఆత్మకథలంటే, నా కెంత యిష్టమో; ఈ మధ్య కస్తూరి రంగయ్యగారి జీవితచరిత్ర (1859–1923) చదివాను; జీవితచరిత్రలన్నా నాకిష్టమేగదా! ఈ మహనీయుడు – *ది హిందూ* వ్యవస్థాపకుడు, సంపాదకుడు కూడ! రచయిత వి.కె. నరసింహంగారు వీరి రచనా ప్రణాళిక, నిర్వహణ సామర్థ్యము, శైలీమాధుర్యమూ అన్నీ – కొనియాడదగ్గవే!...

...కస్తూరివారి చరిత్ర చదివినంత జర్నలిస్టిక్ కేరీర్ పై నాకున్న గౌరవం శతాధికమయింది. ఈ తమిళునకు దీటయినవాడు, మన ఆంధ్రులలో, నార్ల వెంకటేశ్వరరావుగారే! ఈ యిరువురి కాలాల్లో, నిరంతరంగా నేనుండగల్గినట్లయితే, అదెంత అదృష్టమో! పోనివ్వండి, నార్ల వారికి సమకాలికుడిగానయినా, నేనుండగలిగాను, అదే చాలు!...”

**– పెద్ది సత్యన్నారాయణ,** నేల మంగళ, బెంగుళూరు.

✶ “...మీరు నాపట్ల అభిమానంతో పంపిన పుస్తకం *Oscar Wilde's De Profundis*– తెలుగు అనువాదం *అగాధం* ఈ రోజునే పోష్టులో అందినది. సంతోషము. కాలేజి రోజుల్లో *Oscar Wilde* చదువుకున్న *Classics* తిరిగి తిరిగి ఏ రోజు నైనా చదువుకోవడం ఆనందం, ఆహ్లాదకరం. మీరు సంతకం చేసి పుస్తకం పంపించియుంటే మరింత సంతోషకరంగా ఉండేది. అంతమాత్రంచే పుస్తకం విలువ తగ్గిందనను కాని ఆ పుస్తకంతో మరింత పెరిగియుండేది ఆత్మీయత...”

**– వెలమాటి సత్యనారాయణ,** రాజమండ్రి.

✶ “...ఇప్పుడే ***మిసిమి*** అందినది. డిసెంబరు సంచికలో *అబ్రహాం లింకన్ లేఖ* చదివి ఆశ్చర్యపోయాం. ఇంత అరుదైన ఉత్తరం, అదీ తన కుమారునికి పుస్తక ప్రపంచాన్ని, పూలతోటల్ని, కొండలోయలను పరిచయం చేయమని అడుగుతూ, డబ్బుకు ఎంత వరకూ విలువ ఇవ్వాలో– మనుషుల విలువ ఏమిటో, నిజాయితీ నడత అంటే ఏమిటో నేర్పమని ఉపాధ్యాయుని కోరుతూ రాసిన ఉత్తరం ఇంత చక్కని రచనను మాకు పరిచయం చేశారు. మీకు ధన్యవాదాలు. ఇది కేవలం ***మిసిమి*** పాఠకులకు మీరు అందిస్తున్న అరుదైన రచనలలో భాగం, ఆలోచనకు సరితూగే పదాలు – మాకు మహాభాగ్యం...”

**– సీతారామరాజు,** ఇ–మెయిల్.

✶ “...గొల్లపూడి మారుతీరావుగారి *గురజాడ గిరీశం* ఒక అత్యద్భుతమైన విశ్లేషణ. గురజాడ Alter ego గిరీశం అనడం అనంతమైన గురజాడ విజ్ఞానాన్ని ఆ పాత్రద్వారా సాహిత్యలోకానికి 123 ఏళ్లు నిలిచేటట్లు చేశారని నిరూపించారు. రామప్పపంతులులోని నియోగపు లౌక్యం, అగ్నిహోత్రవధానుల్లోని వైదిక మూర్ఖత్వం అని గుర్తించడం ద్వారా మతాల తత్త్వాన్ని స్పష్టం చేశారు. బ్రాహ్మణ కుటుంబాలలో అరిష్టాల్ని, ఉత్తరాంధ్ర బ్రాహ్మణుల అభిప్రాయాలను తేట తెల్లంగా విశ్లేషించారు. గురజాడ పాత్రలను, షేక్స్పియర్ పాత్రలతో సమాన స్థాయి కల్పించడం విశేషం. హిపోక్రసికి గురజాడ పదునైన మేధస్సు జత చేయడాన్ని గుర్తించిన మారుతీరావు ప్రశంసనీయుడు. సంక్షిప్తంగా గిరీశం పాత్రపై గురజాడ కృషి అద్భుతంగా విశ్లేషించారు మారుతీరావు గారు...”

**– పాతూరి కోటేశ్వరరావు,** గుంటూరు.

# తెలుగు భాషాభివృద్ధి
## – కొన్ని సూచనలు

*– ఎలవర్తి విశ్వనాథరెడ్డి*

'ప్రవాహినీ దేశ్యా' అన్నారు వ్యాకరణ వేత్తలు. తెలుగు భాష నిత్యనూతనమైనది. పరిణామశీలమైనది. కాలంతో పాటూ మారూతూ, కొత్త రూపాంతరాలను పొందుతూసాగే జీవద్భాష, ఇటువంటి భాష విస్తృతినీ, వరిధినీ, పరిణామాల్నీ, చర్చించటమూ, విశ్లేషించుకోవడం అవసరం.

ఇటీవల – అంటే గత దశాబ్దకాలం నుంచి తెలుగు భాష విషయంలో కొన్ని ప్రశ్నలు, ఆలోచనలూ ఆందోళనలూ మనం వింటున్నాం. వాటిలో ప్రధానమైనవి. 1. తెలుగు భాష మనుగడ క్రమేపీ క్షీణిస్తోంది. 2. భవిష్యత్కాలంలో తెలుగు కూడా అంతతరించబోతుంది.

ఇవి ప్రశ్నలు, వీటికి సమాధానాల్ని అన్వేషించాలి. అన్వేషించే ముందు కారణాలను కనిబెట్టాలి. ఆ కారణాలు లోపాలనిపిస్తే సవరించుకోవాలి. ఇలా చేస్తే భాషపరంగా తొలిమెట్టు అభివృద్ధిని సాధించినట్లు అవుతుంది.

భాష మనుగడ దేనిపై ఆధారపడి ఉంటుంది? అని ప్రశ్నించుకొని పరిశీలిస్తే – ప్రధానంగా రెండు అంశాలు 'తెరపైకి వస్తాయి' 1. అధ్యయనం. 2. వ్యవహారం. ఈ రెండింటిలో మొదటిది కేవలం అక్షరాస్యులకు మాత్రమే సంబంధించింది. రెండోది అక్షరాస్యులతో పాటు నిరక్షరాస్యులకూ వర్తిస్తుంది. ఈ రెండు భాషాభివృద్ధికి ప్రధాన వ్యూహాలు. ఈ రెంటిలోనూ వ్యవస్థాగతమైన లోపాలను సరిదిద్దుకోగలిగితే భాష మనుగడ అభివృద్ధి దిశగా పయనిస్తుంది.

**అధ్యయనం :**

అధ్యయనం విషయంలో ముందుగా పాఠ్య ప్రణాళికలను సర్వ సమర్థంగా రూపొందించుకోవడం అవసరం. భాష, పదజాలం, సాహిత్యం, సాధుత్వా సాధుత్వాలు, భాషా పరిణామ క్రమం, వివిధ దశలు, భాషా శాస్త్రావగాహన వంటి ప్రాథమికమైన జ్ఞానం పాఠ్య ప్రణాళికలో ఉండటం అవసరం. ఇది భాషాధ్యయన సౌలభ్యాన్ని అందించటమే కాక భాషా పుష్టికి దోహదం చేస్తుంది. తెలుగు ప్రాథమిక స్థాయి బోధన కుంటుపడకూడదు. ప్రాథమిక పాఠశాలలలో తెలుగు అధ్యాపకులే బోధకులుగా ఉండటం అవసరం. వీరి ప్రభావం పిల్లలపై, భాష పట్ల ఆసక్తిని పెంచుతుంది.

భాషను ప్రత్యేకాంశంగా చదివిన వారికే భాషాభిమానాన్ని పిల్లల్లో కలిగించే శక్తియుక్తులు బోధనానుభవాలు ఉంటాయి. తెలుగు భాషా బోధనలలోనూ కొన్ని మార్పులు ఆహ్వానించవలసి వుంటుంది. పిల్లలకు ఆధునిక భాషలో వ్యక్తం అయ్యే అన్ని వర్ణాలనూ చెప్పవలసి వుంటుంది. వ్యవహారంలో లేని వర్ణాలను తొలగించే విషయంలో భాషావేత్తలు తీసుకొన్న నిర్ణయాలు శిరోధార్యమైనవి. ఉపాధ్యాయులు, భాషతో సంబంధం ఉన్న ఇతర ఉద్యోగులు తప్పనిసరిగా భాషణ, లేఖనాలలో తెలుగు పదాలనే విధిగా వాడటం ఈ సమస్య పరిష్కారానికి కొంత మార్గదర్శకమవుతుంది. చాలా సందర్భాలకు తగిన మాటలు తెలుగు భాషలో ఉన్నాయి. వాటిని అందరికీ పరిచయం చేయాలి. లేని వాటికి ప్రయత్న పూర్వకంగా కొత్త మాటల్ని సృష్టించి చూపాలి.

**వ్యవహారం :**

వ్యవహార భాషపై అనేక ప్రభావాలు ఉంటాయి. ఆధునిక తెలుగు భాషా వ్యవహారంపై కూడా భిన్న సంస్కృతులు, భాషల ప్రభావం ఉంది. దీనివల్ల భాషకు ఉండే సహజ లక్షణాలు దెబ్బతింటాయి. అన్యదేశ్యాలు మన భాషలోనికి ప్రవేశించినప్పుడు వాటికి తగిన పదాలను, పదబంధాలను వ్యవహారంలోనికి తీసుకురాకపోతే అన్యదేశ్యాలు రాజ్యమేలతాయి. ముందు మాటను కాపాడుకొంటే – భాష దానంతటదే వృద్ధి చెందుతుంది. అన్య సంస్కృతులతో సంపర్కం ఉన్న సందర్భంలో అన్యదేశ్యాలు తప్పనిసరిగా ప్రవేశిస్తాయి. వాటిని

కాదనకూడదు. కాదంటే భాష విస్తృతం కాదు. ఆయా అన్య దేశ్యాలకు తెలుగులో సమానార్థకాలు ఉంటాయి. వాటి కోసం అన్వేషించాలి. కొన్నింటికి ప్రయత్న పూర్వకంగా కల్పించాలి. మరికొన్ని ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉంటాయి. వాటికి మాత్రమే అన్య దేశ్యాలను వాడాలి. అది కూడా తెలుగు భాషా లక్షణాలకు అనుగుణంగా తత్సమీకరించుకొని వ్యవహారంలోనికి తేవాలి. వ్యవహార యోగ్యంగా ఉండే పద నిర్మాణాలను చేయడం వరకే భాషావేత్తల బాధ్యత. తదుపరి ఆయా పదాలను వ్యవహర్తలే నిగ్గుతేలుస్తారు.

భాషా అభివృద్ధికి గానీ పతనానికి గానీ పూర్తిగా పత్రికలపైనే నేడు మనం ఆధారపడుతున్నాం. పత్రికలలోని ప్రయోగాలకే విస్తృత వ్యాప్తి ఉంది. అపశబ్ద ప్రయోగాలు పత్రికలలో వస్తే సామాన్య వ్యవహర్త అదే ప్రమాణం అనుకొనే ప్రమాదం ఉంది. అందుకే పత్రికలు ప్రతిపదాన్నీ ఆచితూచి ప్రయోగించాలి. పత్రికలకు అంత సమయం ఉండదు. అయినా ఇది తప్పనిసరి. ఒక్క మాటలో చెప్పాలంటే - పత్రికలే మాటల్ని సంస్కరిస్తాయి. ప్రయోగార్హతను కలిగిస్తాయి. ఇవి భాషా కర్మాగారాలు. ఈ విషయాన్ని పత్రికా సంపాదకులు గుర్తుంచుకుంటే మంచిది. పత్రికలు వ్యవహారంలో ఉన్న పదాలనే స్వీకరిస్తాయి. వాటిని సంస్కరించి మళ్ళీ వ్యవహర్తల ముందుకు తెస్తాయి. ఈ భ్రమణంలో ప్రామాణికత జారిపోకుండా జాగ్రత్త వహిస్తే - కొంతలో కొంత భాషకు మేలు జరుగుతుంది. అర్థక్లిష్టత, ఉచ్చారణాక్లిష్టతలను దృష్టిలో పెట్టుకొని శబ్ద స్వరూపాన్ని మార్చకూడదు. దీనివల్ల ఆయా భాషలలో ఉండే పద సంపద క్షీణ దశకు చేరుకుంటుంది. ఇది భాషకు మంచిది కాదు. కొత్త పదాల్ని కలుపుకోవడం భాషకు ఆరోగ్యం. ఉన్న పదాలను రాతనుండి గానీ వ్యవహారం నుండి గానీ జారిపోనివ్వడం అనారోగ్యం.

భాషా వ్యవహారంలో వయస్సు బట్టి వ్యత్యాసం వుంటుంది. ఆయా వ్యక్తి వయో సమూహాలను బట్టి భాషా వ్యవహారం ఉంటుంది. ఇద్దరు పెద్దతరం వాళ్ళనీ, ఇద్దరు మధ్య వయస్కులను, ఇద్దరు పరిశోధకులను, మరో ఇద్దరు విద్యార్థులను ఒక సంఘంగా ఏర్పాటు చేసి, భాషా విషయంగా విస్తృతమైన చర్చలు జరపాలి. చర్చల అనంతరం భాషను తీర్చిదిద్దుకోవాలి. ఇది కాలానుగుణంగా కొన్ని సమయ పరిధులను అనుసరించి ఎప్పటికప్పుడు జరపాలి. అపశబ్దాలను పరిహరిస్తూ పత్రికలు లిఖిత రూప భాషను పటిష్టం చేయాలి. లిఖిత రూప భాష, మాట్లాడే భాషపై లేఖన భాష పరస్పరం ఆధారపడి ఉంటాయి. ప్రసార మాధ్యమాలు భాషా విషయికంగా ఉచ్చారణను నిర్దుష్టం చేసుకోవాలి. భేషజాలకు పోయి అన్య భాషా ప్రభావంతో తెలుగు భాషను మాట్లాడే వ్యాఖ్యాతల పట్ల, ప్రయోక్తల పట్ల సర్వత్ర నిరసన వ్యక్తమవుతుండటం మనకు తెలిసిందే.

**విద్యా రంగం :**

ఆధునికంగా విద్యా రంగంలో సంభవించిన పరిణామాలు తెలుగు భాషపై దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి. విద్య విజ్ఞానం కోసం కాక, ఉపాధి, ధనార్జనలకే పరిమితమై పోయింది. అందువల్ల సాహిత్యాభిలాష భాషాభిమానం ఆవిరైపోతాయి. అందుకే నేటి తరానికి సాహిత్య గంధం, భాషా సౌందర్యం అనేవి సంఘబాహ్యామైన విషయాలు. స్పందించే మనసుకి సాహిత్యం ఊపిరి. ఈ ప్రాణశక్తి భాష ద్వారా అందాలి. లేకపోతే మనోవికాసం శూన్యమవుతుంది. సాత్వికత జీవన లక్ష్యం. దీనిని ఆలోచన ద్వారా సాధించాలి. ఆలోచన సాహిత్యం ద్వారా లభిస్తుంది. సాత్వికత లేని ఆలోచనలతో ఉగ్రత ఊపిరి పోసుకుంటుంది. దీనివల్ల కలిగే అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. కొందరి అలసత్వం వల్ల జరిగే నష్టం కొన్ని సమూహాలు, కొన్ని సంవత్సరాలు అనుభవించవలసి వస్తుందని గుర్తుంచుకోవాలి.

తెలుగును తెలుగులా మాట్లాడాలి. తెలుగు మాటల్నే మాట్లాడాలి. తెలుగు పద సంపద తగ్గి పోకుండా చూసుకోవాలి. ఇది మనందరి గురుతర బాధ్యత. దీనికి ప్రభుత్వం ప్రోత్సాహమూ అవసరమే.

**దోష పరిహరణ :**

తెలుగు భాష విషయంలో లేఖన మౌఖిక విధానాలలో అనేక దోషాలు కన్పిస్తున్నాయి. దీనికి కారణం భాష విషయికమైన అనాసక్తత. తెలుగు చదవడానికీ, చదివించడానికీ విముఖత పెరిగిపోయింది. మాతృ భాషలో చదివితే ఉద్యోగ అవకాశాలు తక్కువ అనే అపోహ. అందరికీ ఉద్యోగాలు అందకపోవడానికి కారణం ఆర్థిక అసమానతలు. మాతృ భాషాధ్యయనం. ఉచ్చారణ, భాషాపటుత్వం ఈ రెండు

దోష భూయిష్టమై పోతున్నాయి. వ్యాఖ్యాతలు ల-ళ ల మధ్య భేదాన్నీ, శ, ష, స, ల మధ్య అంతరాన్ని పాటించడం లేదు. కర్మణి ప్రయోగాలు, యత్తదర్థక ప్రయోగాలు తెలుగు భాషకు అసహజం. 'దరఖాస్తులు కోరబడుతున్నాయి' వంటి వాక్యాలు యధేచ్ఛగా ప్రయోగార్హాలవుతున్నాయి. పద, వాక్య, సమాన ప్రయోగాలలో లెక్కలేనన్ని దోషాలు. భాషలో అపశబ్దం ఏదీ ఉండదు. వ్యవహర్త చేతుల్లో నిగ్గుతేలితే చాలు. కానీ కొత్తగా ప్రయోగించేటప్పుడు భాషా లక్షణాలను త్యజించి ఇష్టం వచ్చినట్లు వాడకూడదు.

మాట్లాడే భాషలో వైవిధ్యానికి కారణాలు చాలా వున్నాయి. వ్యక్తి, ప్రాంత, సంస్కృతి, అన్యభాషా సంపర్కాలు, దీని ప్రభావం లిఖిత భాషపై కూడా చూపుతుంది. ప్రసార మాధ్యమాలలో సృజన రంగాలలో పని చేసే వారికి భాషపట్ల సామాన్యుడికంటే అధికమైన పాండిత్యం, ఆసక్తి ఉండాలి. వ్యాఖ్యాతలకు అందమైన రూపం ఉంటే చాలుననుకొంటే పొరబాటే. వారి భాష అందంగా ఉండటం ప్రధానం. వీటన్నింటినీ అధ్యయనం చేసి, విస్తృతమైన చర్చల ద్వారా సదస్సులు, గోష్టుల ద్వారా దోషాలను పరిహరించుకొనే దిశగా మనం ముందడుగు వేయాలి.

**ప్రామాణికత :**

ఆధునిక తెలుగు భాషకు 4 మాండలికాలున్నాయి. ప్రసార మాధ్యమాలు రవాణా సౌకర్యాలు కారణంగా అవగాహనా పరిధి పెరిగి ఒక మాండలికంలో పదాలు మరో మాండలికం వారికి తెలిసే అవకాశం ఇప్పుడు ఉంది. ఇది వరకు ఇది కొంచెం తక్కువగా ఉండేది. అందువల్ల అన్ని మండలాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ ఆధునిక తెలుగు భాషకు ప్రామాణికమైన వ్యాకరణ రచన ఒకటి పటిష్ఠంగా రూపొందాలి. ఇది అన్ని మండలాలనూ సమన్వయ పరిచేదిగా ఉండాలి. జీవద్భాషకు వ్యాకరణం రచించటం కష్టం.

ఒక వేళ రచించినా అది సార్వకాలిక ప్రయోజనాలను చేకూర్చలేదు. ఈ ప్రయత్నం ప్రతి పది సంవత్సరాల కొక సారి విధిగా జరగాలి. అన్ని విధాలుగా తెలుగు భాషను సుసంపన్నం చేసుకోవాలి. సుసంపన్నమైన భాష ద్వారానే జాతి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కీర్తి ప్రతిష్ఠలు వ్యక్తం అవుతాయి. జన బాహుళ్యంలో వ్యాప్తిలోనికి వచ్చిన ప్రయోగాలకు ప్రాధాన్యం ఇస్తూ, భాషకు ఉండే సహజత్వాన్ని పరిరక్షించుకోవడం అవసరం. మాతృభాషా వ్యవహారం వల్ల చైనా, జపాన్ వంటి దేశాలు ప్రగతి పథంలో అగ్రగామిత్వాన్ని పొందాయన్న తార్కాణాలు మనకు స్ఫూర్తిమయం కావాలి.

**ఆధునిక తెలుగు అభివృద్ధికి సూచనలు :**

1. వివిధ రంగాల్లో తెలుగు అమలు చేసి, తెలుగు భాషాభివృద్ధికి తెలుగు అధికార భాషా సంఘం, తెలుగు అకాడమి కృషి చేయాలి.
2. పరిపాలన అధికారులకు, ఉద్యోగులకు పూర్తి స్థాయిలో ఆధునిక తెలుగులో శిక్షణ ఇవ్వాలి.
3. విశ్వ విద్యాలయాల, కళాశాలల అధ్యాపకులకు ఆధునిక తెలుగు అభివృద్ధి ఆవశ్యకతను తెలియజేసి, దానికి అనుగుణంగా శిక్షణ ఇవ్వాలి.
4. తెలుగులో పరిశోధన, విద్యా బోధన ఆధునిక తెలుగులో చేయడానికి కొత్త పదజాలాన్ని రూపొందించుకోవాలి.
5. ఆధునిక తెలుగులో ఉత్తమ రచనలను సంకలనాలుగా, సంపుటాలుగా ప్రచురించాలి.
6. ఆధునిక తెలుగు భాషకు వ్యాకరణం రచించాలి.
7. రోజువారీ కార్యకలాపాలు, అవసరాలు నానాటికి పెరిగిపోతున్నాయి. దానికి అనుగుణంగా భాషాభివృద్ధికి జరగాలి.
8. ఆధునిక రచయితలు తరచుగా సమావేశమై అభివృద్ధికి తీర్మానాలు చేయాలి.
9. ఆధునిక తెలుగు భాషా నిఘంటువులు తయారు చేయాలి.
10. తెలుగు పత్రికలు, రేడియో, టి.వి., సినిమాలు ఆధునిక తెలుగు భాషాభివృద్ధిలో భాగస్వామ్యం వహించాలి.

---

**ఆచార్య ఎలవర్తి విశ్వనాథరెడ్డి**
**విశ్రాంతాచార్యులు, ఆంధ్రవిశ్వకళాపరిషత్తు**
**ఫోన్ : 9849258010**



# జ్ఞానపీఠ్‌ను కాదన్న సుభాష్ ముఖోపాధ్యాయ్

*- మంతెన సూర్యనారాయణరాజు*

**అవార్డుల కోసం అర్రులు చాస్తూ, పురస్కారాల కోసం పరుగులు పెడుతూ తమకున్న పరిచయాలను, పరపతినేకాక సర్వశక్తులు ఒడ్డి అడ్డదారులన్ని తొక్కుతున్న మన సూడో మేధావులకు ఇది హెచ్చరికే!**

వంగ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవులు, కథకులు, రచయిత లెందరో ఉన్నారు. వారంతా ఆయా ప్రక్రియల్లో ఉద్దండులే! రవీంద్ర నాథ్ ఠాగూర్, శరత్‌బాబు, డి.ఎల్.రాయ్ (బెంగాలీ నవలల కర్త) మహాశ్వేతాదేవి, తారాశంకర్ బెనర్జీ, బకించంద్ర ఛటర్జీ, మైకేల్ మధుసూదన్ దత్తు, పియార్‌చంద్ మిత్ర, శశిచంద్ దత్తు, శివనాథ్ శాస్త్రి, ఇంద్రనాథ్ బెనర్జీ, గిరిష్ చంద్రఘోష్, బీహారీలాల్ చక్రబర్తి, దేవేంద్ర నాథ్‌సేన్, మానిక్ బంధోపాధ్యాయ, బన్‌ఫూల్- ఇలా ఎందరో వంగ భాషలో కవిత్వాన్నీ, నవలల్ని, కథల్ని, నాటకాల్ని, సామాజిక స్పృహ గలిగిన వ్యాసాల్ని ఆ భాషా సాహిత్య శాఖలను విస్తృతపరచిన ప్రసిద్ధులలో కొందరు. ఆ కోవకు చెందిన వారిలో సుభాష్ ముఖోపాధ్యాయ్ ఒకరు. బెంగాలులో గల నాడియా జిల్లా, కృష్ణనగర్‌లో ఫిబ్రవరి 12, 1919న సుభాష్ ముఖోపాధ్యాయ్ జన్మించారు. తన 11వ యేట ఆయన బెంగాలు రాజధాని కలకత్తాకు జేరుకున్నారు. ఆ మహానగరమే సుభాష్ ముఖోపాధ్యాయ్‌కి కవిత్వం అబ్బేలా తీర్చిదిద్దింది. ముఖ్యంగా అక్కడ జరిగిన ప్రముఖమైన సంఘటనలతో ఆయన సాహిత్య జీవితం ముడిపడింది. విద్యార్థి దశ నుండే ముఖోపాధ్యాయ్ కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షింప బడ్డారు. నిన్నటి దాకా వెస్ట్ బెంగాలు కమ్యూనిజానికి కంచుకోటగా విరాజిల్లిన సంగతి మనకు తెలియంది కాదు. తొలుత ఆ పార్టీలో సుభాష్ సభ్యుడుగా ప్రవేశించి, కమ్యూనిస్టు సిద్ధాంతాల ప్రచారానికి తన కలాన్ని ఉపయోగించిన వామపక్ష కవి.

సుభాష్ ముఖోపాధ్యాయ్ 1940వ సంవత్సరంలో తన మొదటి కవితా సంపుటి *పదాతిక్* (సైనికుడు) వెలువరించడం విశేషం. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అప్పటి 'సోవియట్ యూనియన్'లో పుట్టిన కమ్యూనిస్టు విప్లవం, రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సందర్భంలో చైనా, రష్యా దేశాల మీద జపాన్ బాంబుల దాడిని వ్యతిరేకిస్తూ సుభాష్ తన కవితలను అల్లడం మొదలుపెట్టారు. తెల్ల ప్రభుత్వం భారతదేశానికి స్వతంత్ర్యం ఇచ్చినందుకు ఆయన నగటు భారతీయుడుగా సంతోషించాడు. కాని కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా సుభాష్ అది అసలు స్వాతంత్ర్యం కానేకాదని ఉద్ఘోషించాడు. ముఖ్యంగా ఆయన పీడిత, తాడిత, కార్మిక వర్గానికి పాత్రలేని ఆ స్వాతంత్ర్యం, స్వాతంత్ర్యం కానే కాదంటూ, తెల్లవాళ్ళు ఇచ్చింది అధికార బదలాయింపేనని భావించాడు. అటు బెంగాల్, బీహార్ రాష్ట్రాలలోను, ఇటు మన ఆంధ్రప్రదేశ్‌లో గల తెలంగాణా ప్రాంతంలో చెలరేగిన కమ్యూనిస్టు తిరుగుబాటుకు సుభాష్ ముఖోపాధ్యాయ్ మద్దత్తును ప్రకటించారు. ఇది తన రాష్ట్రానికి సంబంధించిన అంశం కాకపోయినా పార్టీ ఆలోచనా పరంగా చేసిన పని.

అప్పుడప్పుడే కేంద్రంలో పాలనాపరంగా కాలుపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆదిలోనే కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. ముఖ్యనాయకుల నెందరినో జైలుపాలు జేసి నిర్బంధించినది. ఆ అందరితోబాటుసుభాష్ ముఖోపాధ్యాయ్ పేరు కూడా ఆ లిస్టులో కెక్కింది. పర్యవసానంగా సుభాష్‌ని అరెస్టుచేసి జైల్లో రెండేళ్ల పాటు శిక్ష విధించింది ఇక్కడి నల్ల ప్రభుత్వం. తాను జైలు జీవితాన్ని అనుభవిస్తూనే ఆ నేపథ్యంతోనే *అగ్నికోణ్* (అగ్నికోణం) అనే కవితా సంపుటిని ముఖోపాధ్యాయ్ వెలువరించడం ఇంకో విశేషం. ముఖ్యంగా ప్రేరణ-కవితా వస్తువుల చిత్రణ కాబట్టి పేరు ప్రఖ్యాతులన్నవి వాటంతట అవే రావడం జరిగింది. ఎప్పుడూ కాలంఒకేరకంగా, మనిషీ ఒకే విధంగా వుండరుగా! క్రమేపీ పార్టీ సిద్ధాంతాలతో సుభాష్‌కి విభేదాలు చాల తొందరలోనే తలెత్తాయి. అలాంటి విభేదాలనే ఆయన

కవిత్వీకరించి చెప్పడం కూడా జరిగింది. ఆ రకంగా వెలుగు చూసిన మరో కవితా సంపుటి *జాతోదురేహై* (ఎంత దూరం వెళ్లినా) అనేది. 1962లో ఇది విడుదలయ్యింది. 1964లో దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ లభించినది.

కాలానుగుణ్యమైన మార్పులు కావచ్చు, సిద్ధాంతాల వట్ల విభేదించి నందువల్ల కావచ్చు సుభాష్ ముఖోపాధ్యాయ్‌కు కమ్యూనిజం మీద తాను కన్న కలలన్నీ కాల క్రమేణా చెదిరిపోయాయి, చెరిగిపోయాయి. అటువంటి సమయంలో సుభాష్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వైపు ఆకర్షితుడు కావడం జరిగింది. నెహ్రూ గురుత్వాకర్షణ పుణ్యమా అని "తిరుగు బాటు లేకుండానే ఈ దేశంలో సామ్యవాదం సిద్ధిస్తుందని..." కవిత్వం రాశాడు. అంతటితో సరిపెట్టుకోక కాంగ్రెస్ పార్టీని, దానిని ముందుకు నడిపిస్తున్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూని కీర్తిస్తూ కవిత్వం రాయడం కూడా జరిగింది. కరడుగట్టిన కమ్యూనిస్టు ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీ తీర్థం తీసుకోవడమే కాదు, 'మావోదే మార్గం' అన్న ఆయన కలం 'మావో' పేరును 'మ్యావ్' అనే పిల్లికూత అంటూ కవితాత్మకంగా అభివర్ణించడం ఒక చారిత్రాత్మక ఘట్టం అనే చెప్పుకు తీరాలి. 1971లో లోకసభ ఎన్నికలొచ్చినప్పుడు సుభాష్ ముఖోపాధ్యాయ్ తను మార్క్సిస్టులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దత్తు తెలుపుతూ ప్రచారం సాగించారంటే ఆశ్చర్యం కలుగకమానదు.

కవిగా సుభాష్ ముఖోపాధ్యాయ్ పార్టీ సిద్ధాంతాల పరంగా ఎటువంటి మార్పులకు లోనైనా తాను విశ్వసించిన అంశాలను (సిద్ధాంతాలైనా సరే) అతిశక్తి వంతంగా కవిత్వీకరించి చెప్పడంలో దిట్ట అనిపించుకున్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను నమ్మి చెప్పిన కవిత్వంలో గల వాడి, వేడి తర్వాత నమ్మిన కాంగ్రెస్ సిద్ధాంతాలలోనూ తగ్గకుండా కవిత్వీకరించ గలిగారంటే ఆయన పెన్ను గన్నులా పనిచేసినట్లేగా మరి. ఆలోచన ఆయన కవిత్వంలో గల ప్రత్యేకత. సామాన్యుల నుండి అతి సామాన్యులకూ అర్థమయ్యేటంత సన్నిహితంగా భావాల్ని వ్యక్తీకరించ గలగడం అవి రెండు మూడు తరాలవారిని ప్రభావితం చేసిందంటే అది ఎంతమాత్రం అతిశయోక్తి అనిపించుకోదు. సుభాష్ వ్యక్తిగత జీవితం గురించి చెప్పాల్సొస్తే ఆయన ప్రముఖ సంఘసేవకురాలైన గీతాముఖర్జీతో జరిగిన పరిచయం కాలక్రమేణా ప్రేమబంధంగా రూపొంది గార్హస్థ్య జీవితానికి దారి సుగమమైనది. చాలాకాలం అంటే ఆయన వామపక్ష అభిప్రాయాలు ప్రతిబింబించే 'పరిచయ్' పత్రికకు ముఖ్య సంపాదకులుగా పనిచేశారు. అనంతరం బెంగాలీ సుప్రసిద్ధ దర్శకులు సత్యజిత్‌రేతో కలిసి 'సందేష్' పత్రికకు సంయుక్త సంపాదకులుగా ఉన్నారు.

ఒక కవిగా, రచయితగా, నవలాకారుడుగా, సంపాదకుడుగా సుభాష్ ముఖోపాధ్యాయ్ 52 సంవత్సరాల కాలం గడిపిన సాహిత్య ప్రస్థానంలో మొత్తం 47 గ్రంథాలకు కర్తగా నిలిచారు. నాలుగు నవలలు, 175 కవితా సంపుటాలు ఆయన ప్రకటించినవైతే, మిగిలిన వాటి గురించి చెప్పాల్సొస్తే బాలసాహిత్యం, అనువాద సాహిత్యాలకు సంబంధించినవిగా చెప్పుకోవచ్చును. భారతీయ భాషలలో సాహిత్య సాధకులకు ప్రతి యేటాయిచ్చే 'జ్ఞానపీఠ్ అవార్డ్' 1991వ సంవత్సరానికిగాను ప్రముఖ బెంగాలీ రచయితయిన సుభాష్ ముఖోపాధ్యాయ్‌కు ప్రకటించారు. ఆయన ఆ అవార్డు తనకు వచ్చిందన్న వార్త చెవిసోకగానే "మరెందరో అర్హులైన సాహితీవేత్తలుండగా ఈ అవార్డ్ నాకు ఇవ్వడం సమంజసంగా లేదనిపిస్తున్నది" అన్నారు. సుభాష్ ముఖోపాధ్యాయ్ ఈ మాటలన్నారంటే సాహితీ వేత్తలందరికీ ముఖోపాధ్యాయ్‌లో అంతర్లీనంగా వున్న నిరాడంబరత ఏపాటిదో అర్థమైంది.

నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే అవార్డులు, రివార్డుల్లో, బిరుదుల్లో, విశ్వవిద్యాలయాలిచ్చే డాక్టరేట్, డి.లిట్ వంటి వాటిల్లో ఎన్నెన్ని రాజకీయాలు, ప్రాంతీయ తత్వాలు, అక్రమాలు, పైరవీలు నడుస్తున్నాయో పాఠకులకు తెలియందేమీ కాదు. సొమ్ములతో అమ్మకాలు మాట అటుంచినట్లైతే ఇలా అన్నవారెందరున్నారని బేరీజు వేసుకుంటే జవాబు చెప్పలేం మరి. సుభాష్ తన జీవితకాలంలో సాధించిన కొన్ని పురస్కారాలను పరిశీలిద్దాం: 1977లో 'ఆ ప్రో- ఆసియన్‌లో టగ్ ప్రైజ్, వస్తే, 1982లో 'కుమరన్ ఆసన్ అవార్డ్', 1984లో 'యార్జా తర్సన్ జీద్ అవార్డ్', 1987లో మధ్యప్రదేశ్ ప్రభుత్వం వారి 'ఆనంద్ పురస్కార్ అవార్డ్', ఇంకా కబీర్ సమ్మాన్ పురస్కార్ వంటి వెన్నో లభించాయి. మనిషి ప్రతిభను కొలవాలంటే కేవలం ఇటువంటి అవార్డులు కొలబద్దలు కావన్నది ఆయన ప్రగాఢ విశ్వాసం కావచ్చు.

డాక్టరు మంతెన సూర్యనారాయణరాజు,
ఫోన్ : 9989542228

# భాగ్యనగర కోకిల

*– ముక్తేవి భారతి*



నాయని సుబ్బారావు

**నా**యని సుబ్బారావుపేరు వినగానే భావకవి మనకి సాక్షాత్కరిస్తాడు. భావ కవితా శాఖలన్నీ చేపట్టి, విభిన్న కోణాలలో తన రచనల ద్వారా సాహితీ వేత్తల మనసుల్ని ఆకట్టుకున్న మహాకవి నాయని సుబ్బారావు. ప్రణయ కవిత, ప్రకృతి కవిత, దేశభక్తి కవిత, స్మృతి కవిత – ఇలా అన్ని ప్రక్రియలు వారి కలంలో ముందు ముందుకు నడిచి పరుగులు పెట్టాయనటం అతిశయోక్తి కాదు. *సౌభద్రుని ప్రణయయాత్ర, మాతృ గీతాలు, విషాద మోహనం, వేదనా వాసుదేవం* – ఇవన్నీ తెలుగు పాఠకులకు సుపరిచితాలే.

*భాగ్యనగర కోకిల* ఒక విలక్షణమైన రచన. ఇందులో వున్నవన్నీ కవితా ఖండికలు. ఇరవై ఏడు శీర్షికలున్నాయి. మొదట కవితా ఖండిక *భాగ్యనగర కోకిల* అనే ఈ గ్రంథానికి పేరుపెట్టడం ఎంతోసముచితం సమయోచితంగా వుంది.

నాయని వారు నరసరావు పేట పురపాలకోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి, పదవీ విరమణ చేశారు. విశ్రాంత జీవితం భాగ్యనగరంలో గడప నిశ్చయించారు. సుబ్బారావు భాగ్యనగరం రావడం తన కవితా జీవితంలో మరో గొప్ప మలువుగా భావించారు. "1957లో నేను హైదరాబాదు వచ్చి వేయుట తటస్థించినది. అంత వరకు నిద్రాణమై యుండిన నా కవిత మరల వికసించినది. అందుకు భాగ్యనగరము నకు కృతజ్ఞుడను"అన్నారు (భాగ్యనగర కోకిల మొుక్కుబడి) 1958 నుంచి 1964 వరకు అప్పుడప్పుడు రాసిన కవితలు ఇందులో ఉన్నాయి.




ఏడేళ్ళ మనుమడు శ్రీకృష్ణకి, తాత సుబ్బారావు *భాగ్యనగర కోకిల* ను అంకిత మివ్వటం విశేషం. 'దీర్ఘాయు రారోగ్యవినీలపరమ భాగ్యసంపదలతో' ఆ పసివాడు, ఆంధ్రకవితా వనవిహారం చేయాలని ఆశీర్వదించారు.

భాగ్య నగరంలోవుండే కోయిలలు వసంత ఋతువులో మాత్రమే కాదు, అన్ని ఋతువుల్లోనూ కనిపిస్తాయి. అందుకే భాగ్యనగరం నిత్య వసంత శోభతో అలరారు తుందన్నారు కవి. ఒకనాటి భాగ్యనగర వైభవం నేడు స్మరించుకోవాలంటే ఈ ఖండిక ఎంతో దోహదం చేస్తుంది.

**అరుదగు నీ కలరవమున**
**కరుగుదారే చార్‌మినార్ సిగారెట్ దమ్మున్**
**జరదా వేసిన బీడా**
**పరమార్థము వారి కింక పని వలదేయన్.**

చార్మినార్ సిగరెట్టు దమ్ము, జర్దాపాన్ తెలిసిన వారికి అవే పరమార్థాలు అంటారు. సుబ్బారావుగారు భాగ్యనగరాన్ని, దాని విన్యాసాన్ని, వైభవాన్ని చాలా నిశితంగా పరిశీలించారు. భర్త ఒక్క అణాతో వేరు సెనగలు కొనుక్కొని

సగం భార్యకిస్తే, ఆకాస్తదానికే పరమానందు రాలైన భార్య.

**"ఆమె మదీన సామ్రాజ్యపు పట్టాభిషిక్త**

**యైన రీతి హసన్ముఖమై వెలుంగు"**

ఆమె నవ్వుముఖాన్ని గమనించి కవితాపరం చేయటం భావకవి నాయని సుబ్బారావుకే చెల్లింది. "కోయిల కూతకి వసంతం తోడైతే, ఆ ఆనందం అనుభవించని 'సంస్కార జడులు' కూడా భాగ్యనగరం లో వున్నారంటో వారి మోటారు హారనే వారి వీణ" అంటారు కవి. మోటార్ సైకిలుపై షికార్లు, గుమ్మటమువంటి రిక్షాలు, జాపురా వల్లె కొంగులు, వాల్జడలు, రెండు రెండు గలిపి టపటపల్, రెపరెపల్, మూడు చక్రాల వాహనాలు - ఇలా ఆనాటి భాగ్యనగరాన్ని ఎన్నో విధాల వర్ణించారు కవి.

'గార్హస్థ్య పరమార్థము' అనే కవితా ఖండిక ఒక ఉపదేశ ఖండిక అది. గార్హస్థ్య జీవితం పరమార్థమేమిటో సరళంగా సందేశాత్మకంగా చెప్పటం గృహస్థులందరికీ సందేశం అందించడమే. ఒకడు ఒక ప్రాణమిత్రుని అడిగాడు, "మీ నిలయము కూపమ్మున పానీయము చెడదు" - మీ ఇంటి బావిలో నీళ్ళు ఎప్పుడూ చెడవు, స్వచ్ఛంగా వుంటాయి, మా నిలయము కూపమ్మున పానీయము పడదు, అదేమి పాపమో" అని దానికి ఆ మిత్రుడికి ఈ మిత్రుడు సమాధానం చెప్పాడు.

**కుఱ్ఱలకు, వృద్ధులకు, సేవకులకు, పెట్టి**

**నెల వెతిగి వచ్చు అభ్యాగతులకు పెట్టి**

**బిచ్చగాండ్రకూ పెట్టి మా ఇంట మిగిలి**

**నేమి యదె, తృప్తిగా భుజింతుమయ్యా"** అన్నాడు.

అంతే కాదు, ధాన్యపు కంకులు తెచ్చి చూరులకి వేలాడ దీస్తాము. పిచ్చుకలకు ఆహారార్థం- ఇంతకన్నా మానవీయ గృహస్థ ధర్మం మరొకటుండదు గదా -

అందుకే ఆ ఇంటి బావిలో నీళ్ళు ఎప్పుడూ స్వచ్ఛంగానే వుంటాయి మరి!

'రేడియో అవ్వ' - కరుణ రసాత్మకమైన కవిత. ఆకాశవాణిలో క్లాస్‌కు సిబ్బందిలో ఆ అవ్వ ఒకతె - ఆ అవ్వ తెల్లని జుట్టు, ముడుతలు పడ్డ శరీరం - ఆమె "ముగురమ్మల గన్న మూలంపుటవ్వ" అంటారు కవి.

ఆ అవ్వ ఎవరంటారా, ఆమె కార్యనిర్వాహకురాలు కాదు, సంగీత కళా లక్ష్మికాదు, నిత్యప్రసారాలు నీటుగా ప్రకటించు నెరజాణ కదా - మరి! ఆ అవ్వ ఎవరంటే పెద్దయ్య గదిలో (స్టేషన్ డైరక్టర్) విలువైన జాజుని, చిన్నయ్య గదిలో చెలువైన జాజుని, దుమ్ముని, ధూళిని దులిపి ఆకాశవాణి కార్యాలయాన్ని శుభ్రంగా




వుంచే ఆ అవ్వ తట్ట నెత్తిన పెట్టుకు రోజూ కనిపిస్తూనే ఉంటుంది. ఆరిపోయే దివ్వెలలా వెలుగుతున్నాయి ఆ అవ్వ కళ్ళు నాడు. అవి ఆరిపోయాయి. కానీ ఆ వార్త విన్న కవి కన్నుల నీరు నిడింది. అదే ఆమె కిచ్చే అశ్రుతర్పణం. అయితే, కవి కరుణరసార్ద్ర హృదయం ఆ సందర్భంలో ఎలా స్పందించిందో చూడండి -

**పేరు పెండును గన్న పెద్దల కట్టు**

**సాగుచున్న ప్రసారమ్ము నాపి**

**మధ్యలో అవ్వ ఆత్మకు శాంతిగోల**

**ఆకాశవాణి శ్రద్ధాంజలి లేదు -**

**సంతాప సూచక సభయైన లేదు**

- అన్నారు కవి.

ఈ రేడియో అవ్వ కవిత చదువు తుంటే కళ్ళలో నీళ్ళు తిరక్క మానవు.

భావకవితా యుగంలో దేశభక్తి కవితలు కవి కలాలనుండి జాలువారాయి. దేశ స్వాతంత్ర్యోద్యమంలో స్వాతంత్ర్య సమరయోధులను సంస్మరిస్తూ చాలా కవితలు చెప్పి వారికి స్మృత్యంజలి ఘటించారు సుబ్బారావుగారు.

*గాంధీ సంస్మృతి*

**ఆర్య ధర్మమ్ములైన సత్యము నహింస**

**భూతదయ ఆత్మశక్తియు నొసగ మరల**

**మాకు నేర్పుటకై దయారహిత వృత్తి**

**పుడమి నడుగడు పురుషోత్త వీరుడవు నీవు"** - అంటూ

మా కోసం మరోసారి పుట్టు మహాత్మా అంటూ తన వాక్కు వినిపించిన గాంధేయవాది సుబ్బారావుగారు. సాగర

*సంగీతము* అని చిత్తరంజన్ దాసు స్మృతిపైన, అంజలి అని నేలేజూని గూర్చి –

**"జయహింద్ నినాద దిక్చక్ర సమ్మోహితా**
**ప్రయుత స్వతంత్ర భారత వాహినీ పితా"**

అని స్మరించి, సర్దార్ వల్లభాయ్ పటేలుకు శ్రద్ధాంజలి ఘటించి, నాయని సుబ్బారావు వారి యెడల కృతజ్ఞత గౌరవ భావాలను కవితారూపంగా మనకు అందించారు.

నాయని సుబ్బారావు కవితల్లో ఒక ప్రత్యేకత సంతరించుకుని, *భాగ్యనగర కోకిల* సంపుటిలో వెలుగు చూసినవి. *కార్టూన్ కవితలు* 1962 కాలంలో పత్రికల వార్తలు విశ్లేషిస్తూ వ్రాస్తుండే వారిని సౌభద్రుడని, క్షేత్రజ్ఞుడనీ కలం పేర్లతో అవి సాగుతుండేవని, ఆచార్య నాయని కృష్ణకుమారి (సుబ్బారావుగారి అమ్మాయి, *భాగ్యనగర కోకిల* అంకితం ఇచ్చిన శ్రీకృష్ణకు తల్లి) *భాగ్యనగర కోకిల* ముందుమాటలో చెప్పారు.



సుబ్బారావు ఇంట్లో గోడపై ఉండే కాలెండరుపై అప్పటికప్పుడు హాస్య గుళికల్లాటి ఖండికలు రాసే వారని, అవి పన్నీటి జల్లులా హాస్యంతో పాటు, తియ్యని నీటి ఊటలాటి కవితా మధురిమ కూడా వుందని, కనుకనే వాటిని కూడా *భాగ్యనగర కోకిల* తో జత చేస్తామన్నారు కృష్ణకుమారి.

ఇప్పుడు తెలుగు భాష మాట్లాడటం చాలా తగ్గిపోతోందని భాషా వేత్తల ఆవేదన ఆనాడే (8–8–65) నాయని అక్షరబద్ధం చేశారు ఆవేదనతో.

మూడు విశ్వ విద్యాలయాల్లో కలసి మూడిరవైలు లేరు తెలుగు ఎం.ఎ క్లాసు విద్యార్థులు – ఎందుకు లేరూ అని సమాధానంగా,

**అవును నిజమే మరి ఆఫీసులో ఇంగ్లీష్**
**ఉపన్యాసాలకింగ్లీషు, ఊళ్ళేల డానికింగ్లీష్**
**అమ్మానాన్నప్రియతమ్ మమ్మీ డాడీ డార్లింగ్**
**పద్యపానాలకు తెలుగు, వన భోజనాల కింగ్లీష్ –**

అని చమత్కారంగా, వ్యంగ్యంగా చురక వేశారు.

"ఏనుగు ఏడ్చింద" ట – అదేమిటంటే, పత్రికలో ఒక వార్త చదివారు సుబ్బారావుగారు. "రామనాథ్ సంస్థానపు టేనుగు మావటి వాడి మరణానికి శోకించింది" అనేది వార్త. ఆ వార్త కవి హృదయాన్ని కదిల్చింది. శవం మీద తొండంచాచి ఎవర్నీ చేరనివ్వలేదని, యజమాని కుమారుడొచ్చేదాకా ఎదురు చూసిందన్నారు కవి. కుక్క విశ్వాసం విన్నాం. కానీ ఏనుగు విశ్వాసం ఇప్పుడు తెలిసింది కదా, అయితే, "మనిషికీ మనిషికీ మధ్య ఈ మమకారం అరుదన్నాడట ఒక అమాయకుడు.

ఈ కవిత ముగింపే దాని లక్ష్యం –

**ఇది ప్రజాయుగం / ప్రజా తంత్రంలో**
**ప్రజా సంక్షేమంకోసం / పగలనక రాత్రనక**
**వేన ప్రజాప్రభువులు / ముద్దు ముద్దుగా కార్చడంలేదూ,**
**మొసలి కన్నీరు.**

*(22-8-65)*

వీ.ఐ.పీ – వాస్తవానికి అద్దంపట్టిన కవిత

(12–9–65)

వీ.ఐ.పీ అంటే ఎవరూ – ఏ విధంగా వాళ్ళ ప్రత్యేకత–

**మనలాగే రెండు కాళ్ళు**
**మనలాగే రెండు కళ్ళు**
**మనిషంతా మనలాగే**
**ఇతగాడు వేం చేస్తున్నాడని**
**ఎందుకో ఇంత హడావిడి? –**

వీ.ఐ.పీల స్థాయిని, అధికారాన్ని నిశితంగా పరిశీలించడమే ఈ కవితకు మూలం.

కుల వర్గ రహితం కావాలంటో కీర్తికులాలు సృష్టిస్తాడని, సామాన్యుల గాలిసోకి, అమాన్యుడై మైల పడతాడని, చెప్తూ అంతా లేని ఇంతార్భాటం, అంతాలేని పటాటోపం – కానీ, కానీ –

**అల్మాగారి వైభోగం**
**అనిదంపూర్వమే కాని**




**అధికారానికి ఐపీ**
**పెట్టిన మర్నాడే చూడు**
**వి.ఐ.పీ సౌభాగ్యం –**

నాయని సుబ్బారావు ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా జీవితానుభవాలు కాచివడపోశారు. "రిటైరయిన టీచర్లకు పెన్షన్ శాంక్షన్ చేసే ఉత్తర్వులు శరవేగంతో వస్తుంది." విద్యా మంత్రి అన్న వార్త చదివాక సుబ్బారావుగారికి ఒక కవిత రాయాలనిపించింది.

అయ్యవారికి చాలు అయిదు స్టేట్‌మెంట్లు

– అంతే పెన్షన్ జారీ అయినా కాక పోయినా స్టేట్‌మెంట్లొస్తాయి ముందు అనే వ్యంగ్యం.

టీచర్లు చాలా అల్ప సంతోషులు.... ఎక్కడో, ఏ షాపులోనో, కూరగాయల అంగడిలోనో కనిపించి విద్యార్థి పలకరిస్తే చాలు జన్మధన్య మయిందని తృప్తి చెందే సహృదయులు ఉపాధ్యాయులు. ఉపాధ్యాయవృత్తి మహోన్నతమైందని అందరూ అన్నా, ఈ రోజుకీ ప్రభుత్వ దృష్టిలో చిన్న చూపే అనే ఆవేదన ఉంది.

**చచ్చిపోతే ఫించన్**
**శాంక్షన్ చేస్తారా వాళ్ళకు**
**అమాయకంగా అడిగి**
**హాసం పలికించాడు సభలో**
**భద్ర సింహాసనస్థుడు**
**అయ్యలూ స్టేట్‌మెంట్ల ఆజ్యంతో**
**ఆనలు పొంగించుకోండి**
**అలసి పోయిన ప్రాణాలు**
**హరీ అనేంత వరకూ**

నిజాలు చేదుగానే కాదు, కరుణరసార్ద్రంగా కూడా ఉంటాయి మరి.

*భాగ్యనగర కోకిల* లో కాలండర్ కవితలున్నాయి. ఇవి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా వాళ్ళ కాలండర్ మీద అలవోకగా నాన్న గిలికిన కవితలు.




ఇంగ్లీషులో వున్న శీర్షికలను చూసి తెలుగు అనువాదాలు రాశారు అన్నారు ఆచార్య కృష్ణకుమారి.

ఇవేవి ప్రచారంలోకి రాకపోయినా, వాటిని భద్ర పరిచి, అందించిన సుబ్బారావు గారి అమ్మాయి కృష్ణకుమారిని అభినందించాలి.

ఒక తల్లి పిల్లని ఒళ్ళో పెట్టుకు మురుస్తున్న దృశ్యానికి కాలండర్ వాళ్ళు Fulfillment అనే శీర్షిక పెడితే, దాన్ని అనువదించి *వరఫలం* అన్నారు సుబ్బారావు. ఆ సందర్భంగా ఐదు కవితలు, అదే కాలండర్ కవితలు రాశారు.

భోజనంచేసి, మంచం మీద నిద్ర హాయి. ఒక సీరియల్ చదివి, మనుమడు, మనుమరాలు తనవెంట రాగా, అమ్మమ్మ తిరుపతి క్షౌరమునకు కదిలింది అని రాశారు. అలాగే, మనుమరాలి పరికిణీ చిరిగిపోతే అది కిటికీలకు అందమైన తెరలు అని రాశారు.

**ఉన్నది గర్భశ్రీసరి**
**చిన్నది నీయింటిలోన సిగరెట్ దమ్మే**
**ఉన్నాడ ముదురు వరుడను**
**కన్నియ నాకిచ్చి పెంపు గనవే వేమా–**

ఇలా సుబ్బారావుగారు కాలండర్‌పై రాసిన కవితలివి.

నాయని సుబ్బారావు హైదరాబాద్ వచ్చిన తరువాత, అప్పుడప్పుడు, రాసిన కవితాఖండికలు *భాగ్యనగర కోకిల* అయ్యాయి.

నాయని సుబ్బారావు సుప్రసిద్ధులైన భావకవి – సాహిత్యంలో అన్ని ప్రక్రియలు చేపట్టి, ప్రణయం, కరుణ, చాలా కవితల్లో జాలువార్చి, సాహిత్య లోకానికి కావ్య సుమాలందించిన భావ కవికి స్మృత్యంజలి ఘటిస్తున్నాను.

మి

---

**డాక్టరు ముక్తేవి భారతి**
**ఫోన్** : 040-27508487

# చందాల కేశవదాసు :
## తొలి సినీ గేయ రచయిత

– కుర్రా జితేంద్రబాబు

**తొ**లి సినీ గేయరచయితగా, సినీరచయితగా, కవిగా, నాటకకర్తగా, అష్టావధానిగా, హరిదాసుగా, ఆధ్యాత్మిక గురువుగా తెలంగాణ ప్రాంతంలో ప్రసిద్ధులైన చందాల కేశవదాసు క్రీ.శ. 1876 జూన్ 20న లక్ష్మీనారాయణ పాపమ్మ దంపతులకు ఖమ్మం జిల్లా జక్కేపల్లిలో జన్మించారు. బాల్యం నుంచే చదువు మీద, ఆధ్యాత్మిక విద్యల పై ఆసక్తి కలిగింది. ప్రజలలో ధార్మిక చింతన, పాపభీతి ఏర్పడితే ప్రజల జీవితం కుదురు కుంటుదనే విశ్వాసం అతనిలో కలిగి భక్తి తత్త్వాన్ని ప్రజల్లో ప్రచారం చేసి సమతా భావాన్ని, పారమార్థిక చింతనను ప్రచారం చేయటం ప్రారంభిచాడు. సంగీత సాహిత్యాలను అభిరుచిగా సాధన చేస్తూ, సంప్రదాయంగా వస్తున్న వైద్యవృత్తిని జీవికకు స్వీకరించారు. సాహిత్యాన్ని సంపాదనకోసం, వినోదకాలక్షేపం కోసం కాక సందేశాత్మకంగా ప్రజల్లో మార్పు కలిగించాలనే ఉద్దేశ్యంతో వివిధ ప్రయోగాలు చేసి చూపారు.

20వ శతాబ్దం ఆరంభంలో అనగా 'ప్లవంగ నామ సంవత్సర శ్రావణ బహుళ పక్షం' 1907లో కోదాడ దగ్గరి తమ్మర గ్రామంలో సీతారామచంద్ర స్వామి దేవాలయంలో సప్తాహాలు ప్రారంభించి 108 సప్తాహాలు నిర్వహించారు. తొలిసారిగా ఈ దేవాలయాన్ని సందర్శించటంతోనే ఆశుకవితతో స్వామిని స్తుతి చేశారు. ఆ దేవాలయ పూజారిగా ఉన్న నర్సింహాచార్యులు ఇతని వాగ్ధాటికి ఆశ్చర్య పోయిన నర్సింహాచార్యులు ఇతనితో మైత్రి చేశాడు. నర్సింహా చార్యుల వద్ద శ్రీవైష్ణవ తత్త్వాన్ని, కవితానిర్మాణ లక్షణాలను, పౌరాణిక రచనా శైలిని నేర్చి అతనినే గురువుగా భావించాడు. ఆ దేవాలయానికి తన ఇంటి నిర్మాణం కోసం సమకూర్చుకున్న కలపను వాడటమే గాక, అష్టావధానాలు, హరికథలు గానంచేసి తద్వారా లభ్యమైన ఆదాయాన్ని ఆ దేవాలయ నిర్మాణానికి వాడినారు. దేవాలయ గాలిగోపురం, ధ్వజస్తంభం పనులను వారి భార్య చేతి బంగారు గాజులమ్మి కొనసాగించారు. తాను నిర్వహించే సప్తాహాల్లో పండిత సత్కారాలకు ధనం సరిపోకపోతే చేతి బంగారు కంకణాన్ని అమ్మి కొనసాగించారు. పోలంపల్లి గ్రామంలో 'కనక్తార' నాటకం వేయించగా వచ్చిన పదివేల రూపాయలతో ఆ ఊరి గ్రంథాలయంలో బీరువాలు చేయించి పుస్తకాలు కొని యిచ్చారు.


చందాల కేశవదాసు

శ్రీ రామనవమి వేడుకలకు భద్రాచలం వేళ్ళే యాత్రికులు తిరువూరులో భోజన విశ్రాంతుల కొరకు ఆగుతారు. వారి సౌకర్యార్థం సొంత ఖర్చుతో మంచినీళ్ళ బావి తవ్వించి నారు. ఇలాంటి సత్కార్యాలు ఎన్నో చేసిన కేశవదాసు ధనవంతుడు కాదు.

కేశవదాసు తెలుగుసాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో అనేక రచనలను చేశాడు. 1911లో *కనక్తార* నాటకాన్ని రచించాడు. ఈ రచన దాదాపు నాలుగు దశాబ్దాల కాలం తెలుగునాట వేల ప్రదర్శనలను ప్రదర్శించటం జరిగింది. ఈ నాటకాన్ని 1937లో సరస్వతీ టాకీసు వారు సినిమాగా తెరకెక్కించారు. హెచ్.వి. బాబు దర్శకత్వంలో తీసిన ఈ సినిమాకు గూడవల్లి రామబ్రహ్మం స్క్రీన్‌ప్లే,

సముద్రాల మాటలు పాటలు వ్రాసారు. కేశవదాసుగారి *కనకతార* నాటకంలోని రెండు సీస పద్యాలను, మూడు పాటలను మాత్రమే ఈ సినిమాలో స్వీకరించారు. దీనిలో ప్రధాన పాత్రధారులుగా దొమ్మేటి సూర్యనారాయణ, కన్నాంబలు నటించారు. ఈ చిత్రానికి మాటలు సముద్రాల రాఘవాచార్యులు సమకూర్చారు. ఇదే పేరుతో మరొక సినిమాను 1955లో తీశారు. ఈ పాటలనే అందులోనూ కొనసాగించారు.

**పద్యాలు :**

**1. ఏ పాపమెఱుగని పాపలకీ చావు**
**గల్పింపజేయుట ఘనమెనీకు?**
**ఏ కర్మమెఱుగని యీ పసికందుల**
**నంతమొందించుట యశమె నీకు?...**

**2. దప్పిచే నాలుక దడిపాడిలేక దా**
**హము దాహమని యెంత అడలినావో!**
**స్మృతిలేక పడిన దుస్థితిలోననే మృగ**
**మ్ములు పొట్టలో బడి పోయినావో!...**

**పాటలు :**

1. **ఎంతబాగుండాది**
**యేం తాణ గుండాది**
**యెంత సక్కందిరా పడుసు**
**బంతిలాగుండాది**
**బౌబేసుగుండాది**
**పొంతకుండ మూకుడంబోలె మొకము ॥ఎంత॥**
...........

**2. సక్కనిగుంట! రాయే నాయెంట**
**సరస గూసుంట పెల్లిసేసుకుంట ॥సక్కని॥**
**గుఱ్ఱాన్నెక్కిత్తా కూడాన్నానొత్త**
**సఱ్ఱూన వూగి వూరేగివత్తా ॥సక్కని॥**

*కనకతార* నాటకాన్ని వరంగల్ జిల్లా నెల్లుట్ల గ్రామానికి వెళ్లినపుడు అక్కడ న్యాయవాది, భూస్వామి రామనర్సింహా రావు మాటల సందర్భంలో కేశవదాసుని ఒక నాటకం రాయమని ప్రోత్సహించి ఆనాటక ప్రదర్శనకు, ముద్రణకు అయ్యే ఖర్చు తాను భరిస్తానని కోరడంతో ఈ నాటకాన్ని రచించాడు. అందుకనే ఆ నాటకంలో ఒకచోట "నైజాము దేశమునం గల నెల్లుట్ల పురవరవాసుండు పుణ్యమూర్తి అను ప్రస్తావన చేశాడు. ఈ నాటకాన్ని జగ్గయ్య పేట,




**సతీ అనసూయగా కోటిరత్నం**

పట్కారి బజారులో ఉన్న పర్మినెంటు డ్రామా కంపెనీ అనేకసార్లు ప్రదర్శించారు. మైలవరం రాజా సూరనేని వెంకటపాపయారావు 1913లో మైలవరంలో బాలభారతి సమాజం స్థాపించాడు. ఆ తరువాత 1916-17 లలో బెజవాడలో మైలవరం థియేటర్ నిర్మాణం జరిగిన తరువాత బాలభారతి సమాజం కార్యక్రమాలు బెజవాడలో కొనసాగాయి. ఈ నాటక సమాజంలో జీతాలపై నటులు నటిస్తూ నటనను వృత్తిగా స్వీకరించారు. సంగీత విద్వాంసులు పాపట్ల కాంతయ్య రాజమండ్రి నుంచి హార్మోనిస్టు ఎ.టి. రామానుజులు, తబలిస్టు బగ్గన్నలు హైదరాబాదు నుంచి ఈ నాటకసమాజంలో చేరిన తరువాత *కనకతార* నాటకాన్ని వేల ప్రదర్శనలు చేశారు. ఈ నాటకంలో తార పాత్ర వేసిన ప్రముఖుల్లో అక్కినేని నాగేశ్వరరావు కూడా ఒకరు. 1935 లో 'బలిబంధనము' అను పౌరాణిక నాటకాన్ని రచించారు.

1931లో హెచ్.ఎమ్. రెడ్డి 'భక్తప్రహ్లాద' సినిమాతీస్తూ చందాల కేశవదాసు గూర్చివిని ప్రత్యేకంగా ఓ పాటను రాయించారు.

**పరితాపభారంబు భరియింపతరమా!**
**కటకట నేవిధి గడువంగ జాలుదు.**

**పతి ఆజ్ఞను మీర గలనా! ॥పరి॥**
**పుత్రుని కాపాడగలనా / ఈ విషము నేనెటుల**
**తనయుని త్రావించగలను / ధర్మము కాపాడుదునా**
**తనయుని కావగలనా.... ॥పరి॥**

అందులోని లీలావతి పాత్ర పాడేందుకు ఈ పాటను రాయించారు. ఈ పాట తెలుగు సినిమా చరిత్రలో సినిమాకోసం రాసిన తొలి పాట ఇది. ఈ పాట రాసిన కాలములోనే తమ్మర దేవాలయ గాలిగోపుర నిర్మాణం చేపట్టారు.

1935లో 'సతీఅనసూయ' చిత్రానికి మొదటిసారిగా కథ, మాటలు, పాటలు రాయగా ఈ చిత్రాన్ని అరోరా ఫిల్మ్ కార్పోరేషన్ వారు కలకత్తాలో నిర్మించారు. బారువా పిక్చర్స్‌ద్వారా అదే సంవత్సరం యీ చిత్రం విడుదల అయింది. ఈ చిత్ర నిర్మాణంలో దాసరి కోటిరత్నం భాగం పంచుకున్నారు. దానరి కోటిరత్నం క్లోజప్ స్టిల్‌తో, సినిమాకథను 'Synopsis of the story' ఇంగ్లీషు, తెలుగు భాషల్లో యిస్తూ సినిమాపాటలతో సహా Sunday Chronicle Press, Mount Road Madras వారు ఈ సినిమా పై చిన్న పుస్తకాన్ని ప్రచురించారు. అందులో చందాల కేశవదాసు చేతిలో సతీఅనసూయ అను బేనర్‌తో అతని ఫొటోలు కూడా ముద్రించారు.

ఈ సినిమాకు సుప్రసిద్ధ బెంగాలీ నటులైన అహిన్ చౌదరి దర్శకత్వం వహించగా, కాళ్ళకూరి వీరభద్రరావు సహాయ దర్శకులుగా పని చేశారు. ఇందులో తుంగల చలపతిరావు నారదునిగా, దాసరి కోటిరత్నం అనసూయగా, ఎన్. కృష్ణమాచారి అత్రిమహర్షిగా, ఎస్.పి. లక్ష్మణస్వామి మన్మథునిగా, ఎమ్. గోపాలరావు విష్ణువుగా, డి.లీలా కుమారి నర్మదగా, వెంకుబాయి లక్ష్మీదేవిగా, ఎమ్. పుష్పచిత్ర గంగాదేవిగా నటించారు. ఈ సినిమాలో పధ్నాలుగు పద్యాలు, రెండు శ్లోకాలు, ఇరవైఆరు పాటలు ఉన్నాయి. 1936 చివరిలో ఇదే యితివృత్తంతో సి. పుల్లయ్య దర్శకత్వంతో చిన్నపిల్లల చిత్రంగాను, 1957లో రాజశ్రీ వారు, 1971లో శ్రీకాంత్ వారు ఇదే పేరుతో సినిమా నిర్మించినప్పటికీ ఇతివృత్త అనుసరణ ఉన్నప్పటికీ కేశవదాసుకు ఈ చిత్రాలతో సంబంధంలేదు.

1936 చివరిలో రాధాఫిల్మ్ కంబైన్స్ వారు కాళ్ళకూరి సదాశివరావు దర్శకత్వంలో 'లంకాదహనం' చిత్రాన్ని



చందాల కేశవదాసు చేతిలో సతి అనసూయ పుస్తకంతో...

తీశారు. ఆ చిత్రం స్క్రిప్ట్‌ను కేశవదాసు రచించారు. 1939లో లక్ష్మిసినీటోన్ వారు నిర్మించిన 'రాధాకృష్ణ' చిత్రానికి కేశవదాసు కొన్ని పాటలు రచించారు. దాసుగారు రచించిన ఒక పాటను 1945లో ప్రతిభా బేనర్ వారు నిర్మించిన 'బాలరాజు' సినిమాలో ఉపయోగించుకున్నారు. ఈ చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు బాలరాజుగా నటించారు. ఈ చిత్రానికి దర్శకత్వం ఘంటసాల బలరామయ్య వహించారు.

1922లో ముత్తరాజు సుబ్బారావు రచించిన 'శ్రీకృష్ణ తులాభారం' నాటకం కోసం చందాల కేశవదాసు 22 పాటలు రచించారు.

వీటిని "శ్రీకృష్ణ తులాభారములోని కీర్తనలు" పేరుతో కురుకూరి సుబ్బారావు 1929లో ప్రచురిస్తూ గ్రంథ ముఖచిత్రంపై "ఇయ్యది జగ్గయ్యపేట వాస్తవ్యులు, గాన విద్యావిశారదులును అగు బ్రహ్మశ్రీ పావట్ల లక్ష్మీకాంతయ్యగారి ప్రియశిష్యుండగు చందాల కేశవదాసు గారిచే రచించ బడి, బెజవాడ మైలవరం కంపెనీ వారిచే ప్రదర్శనము లందు ఉపయోగింప బడుచున్నవి.

ఇందుగల వర్ణములకు భావయుక్తముగా మైలవరం కంపెనీ హార్మోనిస్టుగారైన అలుగులపాటి రామానుజులు గారిచే స్వరములు కూర్చ బడినవి" అని పేర్కొనటం జరిగింది. ఈ నాటకంలో బాగా పేరుతెచ్చుకున్న నాలుగు పాటలు ఆనాడు తెలుగునాట ప్రతి ఒక్కరినోటా వినిపించేవి. అందులో ఈ పాట ...

బలే మంచి చౌక బేరము
ఇది సమయము మించినన్ దొరకదు
త్వరన్ గొనుడు సుజనులార ॥బలే॥

1. విలువ ఇంతయని తెల్పుట కలవిగాని బేరము
సలిలజ గర్భాదులౌ ఘనుల కందని బేరము
కలుముల చేడియకు సతము నిలయమైన బేరము
ఫలాపేక్షరహిత భక్తసులభమైన బేరము ॥బలే॥
................
ఈ పాటతో పాటు 'మీరజాలగదా....'
'మునివరా తుదకిట్లు.....'
'కొట్టుకొట్టండిరా.....'

అను ఈ పాటలు కూడా ప్రఖ్యాతమైనవి. 1955లో రాజరాజేశ్వరీ ఫిల్మ్ కంపెనీవారు సి.యన్.రావు దర్శకత్వంలో పునర్నిమించారు. దీనిలో రఘురామయ్య, యస్. వరలక్ష్మి, శ్రీరంజని, సూరిబాబు, రేలంగి, సూర్యకళ, సూర్యకాంతం మొదలైనవారు నటించారు. ఈ సినిమాలో కేశవదాసు పాటలను వాడుకొని అతని పేరు పేర్కొనకుండా దైతా గోపాలం పేరు పెట్టుకొన్నారు.

1966లో సురేశ్ ప్రొడక్షన్స్ డి.రామానాయుడు తిరిగి 'శ్రీకృష్ణ తులాభారం' చిత్రాన్ని నిర్మించి ఈ పాటలను వాడుకున్నారు. ఈ చిత్రంలోనూ కేశవదాసు పేరు పేర్కొనలేదు. వారి కుటుంబ సభ్యుల అనుమతి తీసుకొనలేదు. 1966లో ఈ విషయాన్ని గమనించిన కేశవదాసు కుమారుడు కృష్ణమూర్తి ఖమ్మం జిల్లా న్యాయస్థానంలో O.S. No. 1966 డి. రామానాయుడు, వాణి డిస్ట్రిబ్యూటర్స్, విజయా డిస్ట్రిబ్యూటర్స్, మాజేటి సీతారామాంజనేయ గుప్తులపై కాపీరైట్ క్రింద దావా వేశారు. ఈ కేసులో దాశరథి, ఆరుద్ర, శ్రీశ్రీలు సాక్ష్యం ఇచ్చారు.

చివరకు 1971 ఫిబ్రవరి 17న డిస్ట్రిక్ట్ కోర్టు 'భలేమంచి చౌకబేరము' 'మునివరా తుదకిట్లు', 'కొట్టుకొట్టండిరా' అనే మూడు పాటలు కేశవదాసువి, *'శ్రీకృష్ణతులాభారం'* సినిమాలో వాడుకున్నారని తీర్పు ఇవ్వడంతో 1971 తరువాత వచ్చిన సినిమా ప్రింట్లలో కేశవదాసు పేరు పేర్కొనటం జరిగింది.

స్థానం నర్సింహారావు మీరజాల గలడా నా యానతి' అనే పాటను అనేక నాటకాల్లో పాడుతూ వచ్చి ఆఖరికి తన ఆత్మకథ 'నటస్థానం' లో తానే రచించినట్లు పేర్కొనటం దురదృష్టకరం. 1935లో 'బలిబంధనము' అను ఆరు అంకముల నాటకమును రచించినాడు. ఈ నాటకము విశేష ప్రచారం పొంది అనేక ప్రదర్శనలు ఇవ్వటం జరిగింది.

1936లో పరమభాగవతోత్తముడగు 'నందడి నాగదాను చరిత్రము'ను సంప్రదాయ హరికథ'ను రచించడమే కాక అనేక ప్రాంతాల్లో స్వయంగా కేశవదాసు గానం చేయటం జరిగింది. 'భక్త అంబరీష', 'సీతాకల్యాణం', 'లవకుశ' హరికథలను స్వయంగా రచించి కేశవదాసు అనేక ప్రాంతాల్లో గానం చేయటం జరిగింది.

1926లో 'కేశవ శతకం'ను రచించారు. దీనిలో 108 పద్యాలు (ఉత్పలమాల 44, చంపకమాల 29, మత్తేభాలు 20, శార్దూలాలు 15) ఉన్నాయి. 'పంచముఖ ఆంజనేయస్వామి దండకం'ను రచించారు. నల్గొండ జిల్లాలోని కోదాడ, తమ్మర, హుజూర్‌నగర్, కందిబండలలో, కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలోను, ఖమ్మంలోను కేశవదాసు అష్టావధానాలు చేశారు. మోతీలాల్ నెహ్రూ మరణించి నపుడు 'స్మృతి పద్యాలు' రచించారు. 1925లో తమ్మర గ్రామంలోని సీతారామచంద్రస్వామిపై 'సీతారామస్తవ రాజమును' రచించారు. ఈ స్వామిపైనే 'శ్రీరామ నామామృత గేయం' రచించారు.

'మంగళ హారతులు' 'జోలపాటలు' 'హెచ్చరిక' పాటలు ఎన్నో కేశవదాసు రచించారు. అవి ఈనాటికీ నల్గొండ, ఖమ్మం జిల్లాల్లోని రామాలయాల్లో కీర్తించటం ఈనాటికీ గమనించివచ్చు.

మంగళంబులు రామచంద్రా। జగ
న్మంగళప్రద సుగుణసాంద్రా ॥

1. అంగనామణులు యొయ్యారముప్పొంగ
శృంగార నివ్వాళులన్ కరముల బూని
మి॥ రంగదభినవయుక్త మోహ
నాంగ! రఘుకుల నాయకా! రణ
రంగ భీమాఖిల మహోఘవిభంగ యనుచు నొంసగిరి
॥జయ॥

2. రవికులనీరధి సోమా! అభిరామ! సత్పావన నామా!
భవధిమఖ దేవస్తవనీయ సుచరిత్ర
సువిచార ప్రవిమల సుందరమూర్తీ
మి॥ సర్వభూధవ మహోపాతక

హరణా దాసజన విహరణ
నవఘనాఘన దేవ! యని
ఆనందులై భక్తులిడుదురు ॥జయ॥
...........

దేవాలయ ఉత్సవాలు నిర్వహించు సందర్భంలో ఉత్సవవిగ్రహాలను దేవాలయంలోనుండి బయటకు తీసుకు వచ్చి గ్రామమంలో ఊరేగించి, తిరిగి దేవాలయంలోకి ప్రవేశపెట్టడాన్ని 'వేంచేపు' అంటారు. ఈ సందర్భంలో దేవాలయ అర్చకులు స్తోత్రపాఠాలతో పాటు 'హెచ్చరిక' పేరుతో పాటగా పాడే గీత రచనా ప్రక్రియను కూడా ఆలాపిస్తారు. కేశవదాసు ఈ ప్రక్రియను సంప్రదాయ పద్ధతిలో కాంభోజరాగంలో రూపకతాళంలో గానం చేస్తారు.

హెచ్చరిక హెచ్చరికా / హెచ్చరికా రామ
సచ్చరితా మునిజన సం / చారా హెచ్చరికా ॥హె॥

1. సీతామణి హృచ్చోరా / శ్రితజనమందారా
వాతాత్మజనుత నామా / వరదా హెచ్చరికా ॥హె॥
2. శాశ్వత జగదేక వీర / శాంత మయాకారా
విశ్వంభర భారభరణ / విభవా హెచ్చరికా ॥హె॥
3. గాధేయ సవనరక్షక / ఖండిత శివచాపా
వేదాది నిఖిల సురగన / వినుతా హెచ్చరికా ॥హె॥
4. జనకరాజ జామాతా / జనక వాక్యపాలా
వననిధి బంధన సారస / వదనా హెచ్చరికా ॥హె॥

............

ఈ హెచ్చరికను తమ్మర, కోదాడ, హుజూర్ నగర్, బూరుగడ్డ, సూర్యాపేట దేవాలయ ఉత్సవాల్లో ఈనాటికీ గానం చేస్తున్నారు. హుజూర్ నగర్ లోని వేణుగోపాలస్వామి, బూరుగడ్డ దేవాలయాల్లోని గానం చేసే హెచ్చరికను సీతారామచంద్రస్వామి పరంగానూ, శ్రీకృష్ణుని పరంగానూ రచించినారు. దీనిని కూడా కాంభోజిరాగం, రూపక తాళంలో ఈనాటికీ ఆ దేవాలయ ఉత్సవాల్లో గానం చేస్తారు.

హెచ్చరిక హెచ్చరికా / హెచ్చరికా స్వామీ.
పచ్చవిలుతుని గన్న / ప్రభుడా హెచ్చరికా ॥హె॥

1. అండానా దోర్దండా / చండా మార్తాండా
కుండలి శయనా / గోవిందా హెచ్చరికా ॥హె॥
2. గోపాలా పరిపాలా / గోపీజనలోలా
కుపిత శత్రునిపాల / కృష్ణా హెచ్చరికా ॥హె॥
3. శ్రీరామా జయరామా / శ్రీ సీతారామా
కారుణ్య గుణధామా / రామా హెచ్చరికా ॥హె॥
4. పురుషోత్తమ పురవైభవ / హరి కల్పకవల్లీ
పరితోషిత సుధవెల్లీ / తల్లీ హెచ్చరికా ॥హె॥

............

కేశవదాసు వైవాహిక జీవితం సవ్యంగా సాగలేదు. తమ్మర కడియాల నారాయణ అక్కయైన లక్ష్మమ్మను మొదటిసారి వివాహం చేసుకున్నారు. ఆమెకు సంతానం లేదని నడిగూడెం దగ్గరి సిరిపురం గ్రామంలో ఒకరిని రెండవ వివాహం చేసుకొనగా కొంతకాలానికి ఇద్దరు భార్యలు మరణించారు. తనకు సంసారయోగ్యత లేదని భావించి ఆధ్యాత్మిక జీవితం గడుపుతూ వైరాగ్యంలో ఉన్న కేశవదాసును సహచరులు ఒప్పించి చిట్టెమ్మ అనే ఆమెతో వివాహం జరిపించారు. ఆ దంపతులకు కృష్ణమూర్తి, సీతారామయ్య, ఆండాళ్ళు అనే ముగ్గురు సంతానం.

కృష్ణమూర్తి ఆయుర్వేద వైద్యుడుగాను, సీతారామయ్య భద్రాచలంలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. కుమార్తె ఆండాళ్ళును మునగాల గ్రామ వాస్తవ్యుడు గంధం నర్సయ్య వివాహం చేసుకున్నాడు.

ఇతడు ఉపాధ్యాయునిగా పనిచేసి విశ్రాంతి జీవితం గడుపుతున్నాడు.

కేశవదాసు వృద్ధాప్యంలో ఖమ్మం జిల్లా నాయకుల గూడెం గ్రామంలో ఉంటూ, 1956లో అనారోగ్యంతో కొంతకాలం బాధపడి అక్కడే మరణించారు. అక్కడే వారి సమాధి ఈనాటికీ రోడ్డుపక్కనే ఉంది. సూర్యాపేట నుంచి ఖమ్మం పోయేదారిలో కనిపిస్తూ వుంటుంది.

నల్గొండ వాస్తవ్యులు ఎమ్. పురుషోత్తమా చార్యులు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి చందాల కేశవదాసు సాహిత్యం పై పరిశోధన చేసి గ్రంథాన్ని కూడా గతంలో ప్రచురించారు. ⓑ

---

కుర్రా జితేంద్రబాబు, చరిత్ర పరిశోధకులు
ఫోన్ : 9848882600

# జర్మన్ నాటకరంగం

– రవీంద్ర

జర్మనీలో 17వ శతాబ్ది ఉత్తరార్ధం వరకు సాంస్కృతిక కార్య కలాపాలకు అనువైన వేదిక ఏర్పడలేదు. మతపరంగా ప్రొటెస్టెంట్లు, కాథలికుల మధ్య పరస్పర వైరుధ్యం, రాజకీయంగా అస్థిరత, 1618లో ప్రారంభమైన ముప్పైఏళ్ళ యుద్ధంతో అడుగంటిపోయిన ఆర్థిక వ్యవస్థ, వీటి కారణంగా కకావికలమైన సాంఘిక జీవనం ఉన్న పరిస్థితుల్లో సాంస్కృతిక రంగం తల్లడిల్లిపోయింది. అయినా 17వ శతాబ్దానికి పూర్వం జర్మనీలో నాటక ప్రక్రియ లేదని కాదు. గ్రీకు, రోమన్ సంప్రదాయాల కనుగుణంగా నాటక వాఙ్మయం ఉండేదని తెలుస్తోంది. నీతి బోధక ధోరణిలో సాగే క్రైస్తవ నాటకాలు, వ్యంగ్య పరిహాస ధోరణిలో సాగే హాస్య నాటకాలు ఉండేవి. మతాధికారుల నిబంధనల నీడలో ప్రదర్శితమయ్యే ఆ నాటకాలు నిర్జీవంగా, నిస్తేజంగా ఉండేవి. అద్భుత నీతిబోధక నాటకాలలో సాహిత్య విలువలు, నాటకీయత కొరవడి దృశ్యపరంగా రాణించేవి కావు. కాలక్రమేణా ఆ నాటకాలు చర్చిప్రాంగణాలను దాటి వీధుల్లోకి రావడం జరిగింది. ఈ మార్పు నాటక ప్రదర్శన కొత్త రూపుదాల్చడానికి దోహదం చేసింది. మత సంబంధమైన వస్తువుతోపాటు రచయితలు తమ భావనా బలంతో కొత్తతరహా, స్వతంత్ర నాటకాలు రాయడానికి పూనుకొన్నారు. మొదట్లో వారి ప్రయత్నం అంతగా ఫలించలేదు. ప్రదర్శనార్హత గల నాటకాలు కాకపోవడమే దానికి కారణం. పాలకులు అనాదిగా వీరగాథలు గానం చేసే బృందాలను, సంగీత రూపకాలను ప్రోత్సహిస్తూ వచ్చారు. కొత్త దారి ఏర్పడని కాలంలో ప్రజలు కూడా వాటికే అలవాటు పడి ఆదరిస్తూ వచ్చారు.

16వ శతాబ్దాంతంలో వృత్తి నాటక సమాజాలేర్పడి ప్రదర్శనలివ్వడం మొదలైంది. వీటికి ప్రాచుర్యం కల్పించిన వారు ఇంగ్లీషు నటులు, కొంత వరకు ఇటలీ నటులు. ఇంగ్లీషు నటులు తొలుత జార్జిపీలె, క్రిస్టఫర్ మార్లో, థామస్కిడ్ ముతక నాటకాలను ప్రదర్శించినా, తరువాతి కాలంలో షేక్స్పియర్ నాటకాలను కూడా వేయడం జరిగింది. కొన్నాళ్ళు ఆంగ్లంలోనే ప్రదర్శనలు జరిపినా, తరువాత ఈ నాటకాలు జర్మన్ భాషలోకి తర్జుమా చేశారు.

బ్రౌన్స్విగ్ డ్యూక్ హీన్ రిచ్ జూలియస్ (1564–1613) కొంతవరకు శ్రద్ధ తీసుకొని ఇంగ్లీషు నటులను రప్పించి నాటక సమాజాన్ని నడుపుతూ ఓ పది నాటకాలను రచించాడు. అవన్నీ దాదాపు రక్తసిక్తమైన విషాదాంత నాటకాలు. ప్రప్రథమంగా ఇలా ప్రదర్శించిన సంచార నాటక బృందాలలో రాబర్ట్ బ్రౌన్ (1590– 1606), జాన్ స్పెన్సర్ (1605–1623), జూన్ గ్రీన్ (1606–1628) ఆద్యులుగా పేర్కొనవచ్చు. జర్మన్ భాష మాట్లాడే ప్రాంతాలలోని ప్రజలను ఆకట్టుకోవాడనికి ఇంగ్లీషు నటులు వారి నాటకాలలో ఎక్కువగా వినోద భరిత సన్నివేశాలను, మూక రూపకం, సంగీత, నృత్యాలను చొప్పించడంతో భాష తెలియకపోయినా ప్రజలు ఆకర్షితులయ్యేవారు. ఇంగ్లీషు నాటకాలంటేనే వాటికొక విలువుండేది. అలా జర్మనీ నటులను మెల్లమెల్లగా ఆ ఇంగ్లీషు బృందాలలో చేర్చుకోవడం ప్రారంభమయింది. 1650 ప్రాంతానికి పూర్తి జర్మనీ నటులతో నట బృందాలేర్పడ్డాయి. తరువాత పదేళ్ళలో ఇంగ్లీషు నటులు క్రమంగా దూరమైపోయారు.

కాస్త పేరున్న మొట్టమొదటి జర్మనీ బృందాన్ని 1650 నుండి 1687 వరకు కార్ల్ *ఆంద్రయాన్ పాల్సెన్* నడిపేవాడు. ఆ కాలంలో మరో ముఖ్యమైన వ్యక్తి జహాన్నెస్ వెల్ టెన్ (1640–1695) విద్యాధికుడే కాకుండా జర్మన్లో నాటి నాటకరంగ ప్రమాణాల స్థాయిని పెంచాలన్న సదుద్దేశంతో మోలియర్ లాంటి రచయితల నాటకాలను జర్మన్ భాషలోకి అనువదించి తన నాటకసమాజం ద్వారా ప్రదర్శించాడు. సొంత రంగ స్థలాలు లేకపోవడం, ప్రేక్షకుల ఆదరణ సన్నగిల్లడం మొదలైన కారణాలతో నాటక బృందాలు కొత్త ప్రేక్షకులను వెదుక్కుంటూ ఊరూరాసంచరించడం మొదలు పెట్టాయి. పెద్ద పెద్ద నగరాల్లో, పండుగ రోజుల్లో ఎక్కువగా ప్రదర్శనలివ్వడం జరిగింది. ప్రేక్షకులను ఆకర్షించడం కోసం



**జర్మన్ టి.వి. యాంకర్**



బెట్టిన మాంటిస్సి

ప్రదర్శనల్లో మార్పులు చేసుకుంటూ వచ్చారు. ఆనాటి నాటకాల్లో హింస, అసాధారణ పాత్రలు సమాసభూయిష్టమైన మాటలు చోటు చేసుకోవడమే కాక కొన్ని మూస పాత్రలు దాదాపు అన్ని నాటకాలలోనూ ప్రధానంగా కనిపించేవి.

1725వరకు జర్మన్ నాటకరంగం స్థితి అంతంత మాత్రమనే చెప్పాలి. సరిగ్గా ఆ సమయంలో జోహన్ గాట్‌షెడ్ (1700–1766), కారోలినా న్యూబెర్ జర్మన్ నాటకరంగంలో మార్పు తీసుకురావడానికి కృషిచేశారు. గాట్‌షెడ్ నాటక రంగాభివృద్ధిని కాంక్షించి ఫ్రెంచి నవ్య సంప్రదాయ నాటక విలువలను క్రమంగా జర్మన్ నాటకరంగంలోకి ప్రవేశ పెట్టాడు. జర్మనీ ప్రేక్షకులకు ఈ నియోక్లాసికల్ నాటకం కొత్త. మరో వైపు కారోలినా, నాటక పూర్వాభ్యాసాలు చాలా నిశితంగా పకడ్బందీగా నిర్వహిస్తూ, అభినయంలో స్థాయిని పెంచేందుకు అమితమైన కృషి సల్పింది. గాట్‌షెడ్, కారోలినా, నూబెల్‌ల కృషి, జర్మన్ నాటకరంగంలోనే కొత్తమలుపుకు కారణమైంది. జర్మనీ దేశపు ప్రసిద్ధ నాటక రయితలలో గొట్టోల్డ్ ఎఫ్రయిమ్ లెస్సింగ్ (1729–1781) ప్రథముడు. జర్మన్ ప్రజల అభిరుచి ననుసరించి ఫ్రెంచ్ నియోక్లాసిజం కంటె ఇంగ్లీషు నాటకాలే జర్మనులకు ప్రీతి పాత్రమవుతాయిని తన దృష్టి అటువైపు సారించాడు. ఈయన రచించిన *మిస్సర సాంప్సన్* (1755) నాటకం విషాదాంత నాటకాభివృద్ధికి దోహదం చేసినా, *మిన్నాఫన్ బార్న్ హెల్మ్* (1767) అనే హాస్య నాటకం ఎక్కువ ప్రాచుర్యాన్ని పొందింది. లెస్సింగ్ రచనా వ్యాసంగానికి ప్లాటస్, టెరెన్స్, మోలియర్ రచనలు స్ఫూర్తి దాయకమైనవి. పాత్రలు సహజంగా ఉండి మానవ విలువలు సమృద్ధిగా ఉన్నప్పుడే ప్రేక్షకులు అటు హాస్యంలో గాని, విషాదంలో గాని ఆ పాత్రలతో ఐక్యత పొంది రసానుభూతిని పొందగలరని లెస్సింగ్ దృఢ విశ్వాసం. 1755లో *గోతా*లో మొదటి జాతీయ నాటకశాల నిర్మించబడింది. తరువాత వరుసగా, వియన్నా, మాన్‌హీమ్, కొలోన్, వెయ్‌మర్, బెర్లిన్‌లలో నాటకశాలలు వెలిశాయి. 1800 సంవత్సరానికి ప్రతి రాష్ట్ర రాజధాని లోనూ ఫ్రెంచ్ కామెడియా ఫ్రాంకోయిస్ తరహాలో నాటకశాలలు నెలకొన్నాయి. *గోతా* నాటకశాలలో పనిచేసే ప్రతి నటుడు ప్రభుత్వం ఉద్యోగి. పెన్షన్ వగైరాలకు అర్హత కల్పించారు. ఇక్కడ నాటకాల ప్రదర్శనకు ఎకాఫ్ బాధ్యుడైన కారణంగా దేశంలోని ప్రతిభావంతులైన యువనటుల నెందరినో *గోతా* థియేటర్‌లో చేర్చుకుని, అభినయంలో శిక్షణ ఇవ్వడంతో తన తదనంతరం వారందరూ గొప్ప నటులుగా రాణించారు. ప్రారంభంలో సంచార నాటక బృందాలే ఎక్కువగా ఉండటం వలన దృశ్య బంధాలను అనువుగా నిర్మించు కొని వాటినే కొద్దికొద్ది మార్పుల తో ప్రతి నాటకానికీ ఉపయోగించే వారు. 1752కు ముందు మూడు దృశ్య బంధాలే ఏ నాటకానికైనా సరిపోయేవి. బహిరంగ దృశ్యాల కోసం ఓ అడవి, భవనాల కోసం ఒక హాలు, ఇంటి లోపలి దృశ్యాలకు ఒక ఇంటి సెట్టు ఉండేవి. 1790 నాటికి నాటక రచయితలు, భారీ దృశ్యాలతో వంతెనలు, గోడలు, తలుపులు, కిటికీలు తమ నాటకాల్లో సృష్టించడం వలన క్రమంగా దృశ్య బంధాలు మరికొంత వృద్ధిని సాధించి క్రమంగా జర్మనీలో మొదటిసారిగా పేటికా (Box Set) దృశ్యాలు ప్రారంభ మయ్యాయి.

ఇఫ్‌లాండ్ కన్నా మరింత ప్రసిద్ధి కెక్కిన నాటక రచయిత ఆగస్ట్ ఫ్రెడరిక్ వాన్ కోట్జెబ్యూ (1761–1819). ప్రజల నాడి ననుసరించి వారికి ఆనందాన్ని కలిగించే నాటకాలు రచించడమే ఈయన ప్రత్యేకత. *బర్గ్* థియేటర్‌లో దాదాపు పాతిక శాతం ప్రదర్శనలు కొట్జెబ్యూ నాటకాలే. ఈయన రాసిన రెండు వందల నాటకాలలో చారిత్రక, వినోద భరితాలున్నాయి. మానవ విలువలు ప్రధానంగా ఆ నాటకాల్లో ఉండడం, మామూలు ప్రజానీకానికి కూడా అర్థమయ్యే భాష, సన్నివేశాల చిత్రణ కారణంగా అవి ప్రజాబాహుళ్యంలో ఎక్కువ ప్రాచుర్యాన్ని పొందాయి. 1800 ప్రాంతంలో జర్మన్ నాటకాలు ప్రపంచంలో ఎక్కువగా ప్రజాదరణ పొందడానికి ఈయన నాటకాలు చాలా వరకు తోడ్పడ్డాయి. **గెటే, షిల్లర్ :** ఇఫ్‌లాండ్, కొట్జెబ్యూ నాటకరంగాన్ని ఊహించని ఎత్తుకు తీసుకు పోగలిగారు. అలాగే గెటే, షిల్లార్‌లు కూడా నాటకరచనలో ఉన్నత శిఖరాలను స్పృశించారు. వీరిద్దరూ కలిసి వీయ్‌మర్ ప్రత్యేకమైన శైలితో రూపొందించిన

ప్రయోగాలు, 19వ శతాబ్దం చివరి వరకూ ప్రజామన్నన పొందుతూనే వచ్చాయి. జర్మనీ మానవాళికి ప్రసాదించిన ఒక మహా సాహితీవేత్త జోహన్ వుల్ఫ్‌గాంగ్ వాన్ గెటే (1749–1832). బాల్యం నుండే సాహితీ క్షేత్రంలో వ్యవసాయాన్ని ప్రారంభించాడు. 1773లో రచించిన *గోయట్జ్* నాటకం ఈయనకు ఎనలేని ఖ్యాతిని ఆర్జించి పెట్టింది. ఆగస్ట్ ప్రభువు అభ్యర్థన మేరకు గెటే ఆ పట్టణంలో నాయకుడుగా గుర్తింపబడ్డాడు. అయితే గెటే 1786 నుంచి 1788 వరకు సలిపిన ఇటలీ పర్యటన, తన దృక్పథంలో చాలా మార్పును తీసుకొచ్చింది. సంప్రదాయ రూపకాల పట్ల ఈయనకు కల్గిన ప్రత్యేకమైన అభిరుచితో అంతవరకు అభిమానించిన స్టార్మ్ అండ్ డ్రైంగ్ నాటకాలను తిరస్కరించడం ప్రారంభించాడు. గెటే అపారమైన సృజనాశక్తి లోంచి విశ్వవిఖ్యాత నాటకాలు రావడమే కాకుండా, ఆనాటి అన్ని సాహిత్య ప్రక్రియలలోనూ ఈయన ముద్ర ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. లీప్‌జిగ్‌లో విద్యార్థి దశలోనే తన *ది మూడిలవర్* కామెడీతో గాట్‌షెడ్ గెల్లర్ట్ లాంటి వారిని అధిగమించాడు. షేక్స్పియర్ రచనలు అధ్యయనం చేసి స్నేహితులతో చర్చించి *గోట్జ్* అనే చారిత్రాత్మక నాటకాన్ని రచించాడు. ఇందులో రాబిన్ హుడ్ లాంటి పాత్రను సృష్టించాడు.

ఈ నాటకంలో నాటక సంఘర్షణ హేమ్లెట్‌లో ఉన్నట్లుగా కేంద్రీకృతమై ఉంటుంది. ఇందులో పాత్రలు సజీవాలు, దృశ్యాలు, సన్నివేశాలు అందమైనవి. సంఘర్షణ పటిష్ఠంగా, హృదయాలను కదిలించేవిగా ఉంటాయి. శైలి మనోహరంగా ఉంటుంది. గెటే నాటకాలలో ప్రసిద్ధమైనది *డ్యాక్టర్ ఫాస్ట్.* సృష్టి రహస్యాన్ని ఛేదించడానికి తన ఆత్మను సాటన్‌కు అప్ప గించడమే ఈ నాటకంలోని ప్రధానాంశం. అలాగే గెటే తన సృజనాశక్తిని వ్యంగ్య సన్నివేశాలను రాయడంలో కూడా వినియోగించాడు. నాటక ప్రదర్శనల కొచ్చేసరికి, అభినయంలో ఉన్నత ప్రమాణాల వైపు 19వ శతాబ్దంలో బాగా కృషి జరిగింది. ప్రదర్శనలు మెరుగు పడుతూ వచ్చాయి. 1796లో బెర్లిన్ రాయల్ థియేటర్‌కు దర్శకుడుగా ఇఫ్‌లాండ్ నియమింప బడినప్పుడు, ప్రష్యా కోర్టు నుంచి ఈయనకు విరివిగా సబ్సిడీ అందింది. ఈ ధనాన్ని ఈయన ఎక్కువగా షేక్స్పియర్, షిల్లర్ తదితరుల నాటకాలు ప్రదర్శించడానికి ఖర్చు పెట్టాడు. ఈ ప్రదర్శనలు కూడా మున్నెన్నడు ప్రజలు చూడని రీతిలో రంగురంగుల భారీ సెట్లతో, చారిత్రక దృశ్యాలతో ప్రేక్షకులకు మిరిమిట్లు గొలిపేలా ఉండేవి. మిగిలిన థియేటర్లు ఇంత వైభవానికి నోచుకునేవి కావు. నాటకంలోని వస్తువుకన్నా, నటుల సామర్థ్యాలకన్నా, నాటక ప్రయోజనాన్ని పూర్తిగా ప్రేక్షకులకందించాలన్న తపన కన్నా, రంగస్థలంపై కనిపించే దృశ్యానికే ప్రాధాన్యతనిచ్చాడు ఇఫ్‌లాండ్.

19వ శతాబ్దంలో జర్మనీలో నగరాల సంఖ్య పెరిగినట్లే, రంగస్థలాల సంఖ్య కూడా పెరిగింది. ఆస్ట్రియా, ఫ్రాన్సు, ఇంగ్లాండు దేశాల్లో లాగ కాకుండా జర్మనీలో నాటకరంగానికి ప్రభుత్వం సహకరించడం కారణంగా ప్రష్యా రాజధాని బెర్లిన్‌లోను ఆ తరువాత ఐక్యజర్మనీలోను ఉధృతమైన అభివృద్ధి సాధించింది. 1830 విప్లవాల తరుణంలో యంగ్‌జర్మనీ అనే ఉద్యమం ఒకటి ప్రారంభమయింది. దర్శకులు కొందరు కొన్ని వివాదాస్పదమైన నాటకాలను 1830–40లో ప్రదర్శించారు. ఈ నాటకాల్లో ప్రజలెదుర్కొంటున్న రాజకీయ, సాంఘిక పరిస్థితులను స్పృశిస్తూ సాంఘిక చైతన్యాన్ని కలిగించే వారు. ఈ యంగ్ జర్మనీ లోంచి వచ్చినవాడే జార్జి బుష్‌నర్, వోయ్‌జోక్ నాటకంలోని ఇతివృత్తంలో స్వాభావిక వాదం, అభివ్యక్తివాదం ఆనాడే తొంగి చూడడం తో రాబోయే తరాలలో ఆవిష్కరింపబడే నాటక శిల్పానికి నాంది పలికాడని 1910లో మాక్స్ రీన్‌హార్ట్ పేర్కొన్నాడు. అప్పటి నుండి బుష్‌నర్ 19వ శతాబ్దపు గొప్ప రచయితలలో ఒకడుగా గుర్తింపబడ్డాడు. 1840 తరువాత సమకాలీన విమర్శకుల ప్రశంసలనందుకున్న జర్మన్ నాటకకర్త ఫ్రెడరిచ్ హెబ్బల్. ఈయన రచించిన



గోడో నాటకంలోని ఓ సన్నివేశం

నాటకాలలో ప్రధానమైనవి జెనోవేవ (1841), మరియా మగ్ధలీనా (1844), హెరోడ్ అండ్ మిరియామ్నె (1849), ది నీబెలున్ జెన్. అన్నింటికన్నా ప్రసిద్ధి కెక్కిన మరియా మగ్ధలీనా నాటకంలో పాత్రలు సాధారణ జీవితంలోంచి తీసుకున్నవి. సంఘంలోని సమస్యల కారణంగా నాయిక ఆత్మహత్య చేసుకోవడంతో కథ ముగుస్తుంది. ఈ నాటకం 19వ శతాబ్దపు జర్మన్‌ల జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. తన మిగిలిన నాటకాలలాగే, ఈ నాటకంలో భూత, భవిష్యత్కాల విలువల మధ్య సంఘర్షణ ప్రధానంగా కనిపిస్తుంది. 1863లో హెబ్బెల్ మరణం తరువాత 1890 వరకు దాదాపుగా జర్మనీలో నాటకం తిరోగమనాన్ని చవి చూసింది. అయినప్పటికీ, అత్యుత్తమమైన నటులను ప్రసాదించింది. అందులో ప్రత్యేకంగా కనిపించే నటుడు లుడ్‌విగ్ డెవ్‌రియంచ్ (1784-1832). ఈయన నాటకరంగం మీద దాదాపు ఐదువందల పాత్రలు ధరించి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాడు. ప్రదర్శించిన వాటిలో ప్రత్యేకమైనవి, పేరుతెచ్చి పెట్టినవి షైలాక్, ఫాల్‌సాఫ్, కింగ్‌లియర్, ఫ్రాంజ్‌మూర్ (షిల్లర్ రాసిన రాబర్స్ నాటకంలో) 1820 నుండి 1832 వరకు బర్గ్ థియేటర్‌లో తన నటనా కౌశలంతో వియన్నా ప్రజల హృదయాల్లో నిలిచి పోయాడు. అలాగే గెటే, షిల్లర్ నాటకాలలో తన వాచిక, ఆంగికా అభినయాలతోనూ ముగ్ధులను చేశాడు.

19వ శతాబ్దపు చివర మెనీంజన్ కోర్టు థియేటర్ ప్రజాదరణకు ఎక్కువగా నోచుకున్నది. ఈ కంపెనీని బాగా అభివృద్ధిలోకి తీసుకువచ్చిన వారు రెండవ జార్జి, డ్యూక్ ఆఫ్ సాక్స్ మెనీంజన్ (1826-1914). అతడి భార్య ఎల్లన్ ఫ్రాంజ్, దర్శకుడు లుడ్‌లిగ్ క్రోనెక్, బెర్లిన్‌లో 1874లో మొదటిసారి *జూలియస్ సీజర్, ట్వెల్త్ నైట్* తదితర నాటకాల ప్రదర్శనతోనే మెనింజన్ కంపెనీ జాతీయ ప్రాముఖ్యతను సంపాదించింది. అప్పటి నుండి 1890 వరకు జర్మనీ యూరప్‌లలో చారిత్రక విషయాలలోను, పాత్రల దుస్తుల విషయంలోనూ మెనింజన్ ప్రత్యేకతను కనబరిచింది. చరిత్రకారులు డ్యూక్ ఆఫ్ సాక్స్ మెనీంజన్ కృషిలో ఆధునిక నాటకరంగావిర్భావం చూడగలిగారంటే అందుకు కారణం పూర్వాభ్యాసాలలో దర్శకుడి స్థానం అతి ముఖ్యమైనదని డ్యూక్ గుర్తించడమే కాకుండా ఆ స్థానాన్ని గట్టిగా పదిలపరచడమే. దర్శకుడి కారణంగా నాటక సమాజాలలో అడోల్ఫ్‌లా అరాంజ్ లాంటి నటులను ఉత్తేజ పరచడంతో 1883లో బెర్లిన్‌లో డ్యాషెన్ థియేటర్ స్థాపనకు కారణమయింది. 1889లో నాటక విమర్శకుడు ఓట్టో బ్రహ్మ స్వాభావికవాద నాటక కంపెనీ *ఫ్రయ్ బూనె*ని స్థాపించాడు. అందులో వృత్తి నట సముదాయం స్వాభావికవాద నాటకాలను ప్రదర్శించేవాడు. కాని ఆ నాటకాలు సాధారణ ప్రజానీకాన్ని ఆకర్షించలేదు. కాని విద్యాధికులను, మేధావి వర్గాన్ని ఆకట్టు కున్నాయి.

1894లో బ్రహ్మ డ్యాషెన్ థియేటర్‌కు దర్శకుడుగా నియమింపబడ్డ తరువాత ఆధునిక సంప్రదాయిక నాటకాలను స్వాభావిక పద్ధతిలో ప్రదర్శనలకు కృషి చేశాడు. పురాతన లాక్షణిక నాటకాలలో తగినంత విజయాన్ని సాధించ లేకపోయినా సమకాలీన నాటకాలు ముఖ్యంగా ఇబ్సన్, గెర్హార్ట్ హాప్ట్ మెన్, ష్నిట్‌జ్లర్, సూడర్‌మన్ రచించిన నాటకాల ప్రదర్శనలలో ఈయనను మించిన వారు లేరు. అయితే ఫ్రీయ్‌బూనె పరిచయం చేసిన జర్మనీ నాటక రచయితలలో ముఖ్యుడు గెర్హార్ట్ హాఫ్ట్‌మన్ (1862-1946). 1889లో మొదటిసారిగా తన నాటకం *బిఫోర్ సన్ రైస్* ప్రదర్శించినప్పుడే ప్రేక్షకులు హాఫ్ట్‌మన్‌ను గొప్ప రచయితగా గుర్తించారు. ఆ నాటకంలో జోలా సిద్ధాంతాలు, ఇబ్సన్ నాటక శిల్ప ప్రభావం హాఫ్ట్‌మన్ మీద ఎంతగావుందో విడమరిచి చెబుతుంది. జర్మన్ నాటక రంగంలో స్వాభావికతా వాదానికి ప్రతినిధిగా హాఫ్ట్‌మన్ ను కొనియాడారు. ఓ యాభై ఏళ్ళ కాలంలో దాదాపు 30 నాటకాలు రాశాడు. వాటిలో *ది వీవర్స్* నాటకం హాఫ్ట్‌మన్ ప్రతిభకో మచ్చుతునక. ఈ నాటకంలో కథాసారథులు కార్మిక సముదాయం వారి నిస్సహాయస్థితి విప్లవం వైపు దారితీయడం ఇందులోని కథాంశం. హాఫ్ట్‌మన్ ప్రతీకవాదధోరణిలోనూ నాటక రచనలు చేశాడు. వాటిలో ఎన్నదగ్గవి *ది అసంప్షన్ ఆఫ్ హాన్నిల్* (1893), *ది సంకెన్ బెల్* (1896). హాఫ్ట్‌మన్ 1912లో నోబెల్ బహుమతిని అందుకున్నాడు. తన మరణానికి పూర్వం హిట్లర్ ఆధిపత్యం పట్ల అంగీకారధోరణి ప్రజలలో హాఫ్ట్‌మన్‌పై ఉన్న గౌరవ మర్యాదలు తగ్గడానికి కారణమయింది. తన నాటకాలలో ఎక్కువగా గోచరించేది తోటి మానవుల బాధలు, కష్టాలు తమ ప్రగాఢ సానుభూతి. ఈయన నాటకాల్లోని నాయకులు ఎక్కువగా పరిస్థితులకు బానిసలు కావడంతో వారి పట్ల

సానుభూతి కలుగుతుందే తప్ప వారు ధీరోదాత్త నాయకులుగా అగుపించరు. ఫ్రమ్‌బూనె లాగానే బెర్లిన్‌లో ఫ్రయ్ వోక్స్ బూనె 1890లో స్థాపించబడింది. ప్రతి ఆదివారం మధ్యాహ్నం ఇందులో నాటకాలు ప్రదర్శించేవారు. రంగస్థలానికి విచ్చేసి నాటకాలను చూడాలన్న ధోరణి ప్రజల్లో పెంపొందించిన ఘనత ఈ కంపెనీలదే. హాఫ్ట్‌మన్‌తో పాటు వెలుగులోనికి వచ్చిన మరో ఇద్దరు ప్రముఖ నాటకర్తలు - సూడర్‌మన్, ష్నిట్‌జ్లర్. వాస్తవికతావాదాన్ని ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండడానికి హాఫ్ట్‌మన్ కంటే సూడర్‌మన్ ఎక్కువగా శ్రమపడి ఫలితాలను సాధించాడు. సూడర్‌మన్ రాసిన నాటకాల్లో ఎక్కువ శ్రమపడి ఫలితాలను సాధించాడు. సూడర్‌మన్ రాసిన నాటకాల్లో ఎక్కువ ప్రజాదరణ పొందిన నాటకం *మగ్ధ* (1893). అలాగే ఆస్ట్రియా నాటకకర్త ఆర్థర్ ష్నిట్‌జ్లర్ రాసిన నాటకాల్లో ముఖ్యంగా ప్రజాదరణ పొందిన నాటకం *ఆనటోల్* (1893). జర్మనీలో ఎక్కువమంది నాటక రచయితలు ముఖ్యంగా హాఫ్ట్‌మన్, సూడర్‌మన్‌లు వాస్తవికవాద శైలిలోనే కాక, వాస్తవ వ్యతిరేకశైలిలోనూ నాటకాలు రాయడం జరిగింది. వీరితో పాటు పేరెన్నికగన్న రచయితలు హాఫ్ట్‌మన్‌స్తల్ (1874-1929), బెంజమిన్, వేడ్‌కైండ్. అయితే హాఫ్ట్‌మన్‌స్తల్ నవ్యకాల్పనిక శైలికి ప్రతినిధిగా చెప్పుకోవచ్చు. ఫ్రాన్సు దేశంలో ప్రతీకవాదానికి సమాంతరంగా జర్మనీలో నియోరొమాంటిజం ప్రాచుర్యంలో ఉండేది. హాఫ్ట్‌మన్‌స్తల్ తొలి నాటకాలు *ది ఫూల్ అండ్ డెత్* (1893), *ది అడ్వెంచర్ అండ్ ది సింగింగ్ గర్ల్* (1899) తక్కువ నిడివితో పద్యరూపంలో రాసిన నాటకాలు. నాటక విమర్శకులు గెటే తరువాత అంత గొప్పకవి అని హాఫ్ట్‌మన్‌స్తల్‌ను శ్లాఘించారు.

బెంజమన్ వేడ్‌కైండ్ జర్మనీలో తన నాటకాలను విరివిగా ప్రదర్శించినా తగినంత ప్రజాదరణ పొందలేక పోయాడు. కామ సంబంధ ఇతివృత్తాలనే తన నాటకాలలో తీసుకొని రాశాడు. ఎర్త్ స్పిరిట్, పండోరాస్ బాక్స్ లాంటి నాటకాలు అందులో ముఖ్యమైనవి. చివరిదశలో పిచ్చి, వెఱ్ఱి సమస్యలను తీసుకొని సాసన్ (1914), హెరకల్స్ (1917) నాటకాలను రాశాడు. 1990 తర్వాత ఇతని పట్ల గౌరవం పెరగడమే కాకుండా అభివ్యక్తివాదుల (expressionists) పై తన ప్రభావాన్ని చూపగలిగాడు. 1907లో స్థాపించబడిన మ్యూనిచ్ ఆర్ట్ థియేటర్‌లో నవనమాజాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రేక్షకాగారం రంగస్థలానికి మధ్య (orchestra pit) ఏర్పాటు చేయడం, అవసరమైనప్పుడు రంగస్థల విస్తీర్ణాన్ని పొడిగించడం, రంగద్వారాన్ని (proscenieum) ముందుకు వెనకకు మార్చగలిగేలా నిర్మించడం, నాలుగు రకాల రంగాల్లో గగనికలను (cyclorama) నిర్మించుకోవడం లాంటివి చోటు చేసుకున్నాయి. మాక్స్ రీన్‌హార్ట్ (1873-1943) తన 19వ ఏటనే నటుడుగా గుర్తింపబడిన రీన్‌హార్ట్ *డాషన్ థియేటర్‌లో బ్రహ్మ్* కంపెనీలో నటుడుగా చేరాడు. అక్కడే దర్శకునిగా వివిధ దేశాలకు చెందిన నాటకాలను ప్రదర్శించాడు. అన్ని నాటకాలను ఒకే శైలిలో ప్రదర్శించడం కంటే ఏ నాటకానికి ఏ శైలి నరిపడుతుందో ఆ శైలిలోనే ఆ నాటకాన్ని ప్రదర్శించాలి అన్న సూత్రాన్ని రీన్‌హార్ట్ గుర్తించాడు. ఈడిపస్ రెక్స్ నాటకాన్ని ఒక సర్కస్ ఆవరణలో ప్రదర్శించాడు. దీనికి కారణం ఆ సర్కస్ వాతావరణం కొంత వరకు గ్రీకు రంగస్థలాన్ని తలపింపచేయటమే. ఈ విధంగా రంగస్థల ప్రదర్శనలలో ఎన్నో ప్రయోగాలు చేసి జర్మన్‌లోనే గాక అమెరికా తదితర దేశాల్లో తన ప్రభావాన్ని చూపగలిగాడు.

నాటక ప్రదర్శనలో అన్ని భాగాల మీద దర్శకుడికి పట్టు వుండాలన్నది రీన్‌హార్ట్ విశ్వాసం. నాటకంలో నటుల కదలికలు, దృశ్యబంధం, సామాగ్రి, ధ్వని, రంగదీపనం, వేష భూషలు మొదలైన వాటిని విపులంగా *ప్రాంప్ట్ బుక్‌లో* రాసి సిద్ధం చేసేవాడు. ఈయన నాటకాలలో నటులు అతని చేతిలో కీలుబొమ్మలు అనే విమర్శ ఉండేది. కాని అతను నటులతో చాల సఖ్యంగా, దగ్గరగా ఉండి, అత్యుత్తమ నాటక ప్రదర్శనలను ఏర్పాటు చేశాడు. నాటకంలో త్వరితగతిని దృశ్యబంధాల మార్పు జర్మనీలో ప్రవేశపెట్టారు. ఈ రంగస్థలాన్ని మొదటి సారిగా 1896లో మ్యూనిచ్‌లోని రెసిడెంజ్ థియేటరులో కార్ల్ లేటిన్‌ష్లాగెర్ నిర్మించాడు. అలాగే బెర్లిన్‌లోని రాయల్ ఒపేరా హౌస్ రోలింగ్ ప్లాట్‌ఫామ్ రంగస్థలాన్ని నిర్మించారు. ఎలివేటర్ స్టేజిని మ్యూనిచ్ ఆర్ట్ థియేటర్‌లోనూ బర్గ్ థియేటర్‌లోను నిర్మించడం జరిగింది. క్రమంగా జర్మనీలో నాటకరంగం వాస్తవికతావాదం నుండి దూరమవుతూ అభివ్యక్తివాదం వైపు పరుగులు తీసింది. రీన్‌హార్ట్ జహాన్నెస్ సోర్జ్ ది బెగ్గర్ నాటకం మొదటి అభివ్యక్తివాద నాటకంగా పరిగణించ

బడింది. వాల్టర్ హేసన్ క్లవర్ రాసిన *ది సన్* (1916) నాటకం కూడా ఆ కోవకు చెందినదే. ఈ నాటకాలలో పురాతన ఆచారాలకు, కొత్త విలువలకు మధ్య సంఘర్షణ ప్రధానం. తరువాత కాలంలో అభివ్యక్తివాదం ఇతివృత్తపరంగా వ్యక్తిగత విషయాల నుండి జాతీయ సమస్యల పైకి వెళ్ళింది. హైసన్‌క్లవర్ యుద్ధ వ్యతిరేక నాటకం *అంటిగని* అలాంటిదే. ప్రేమ ఒక్కటే ఆనందానికి మార్గమని, నీతిలేని రాజ్యాధికారులను తొలిగించినప్పుడే ఆ మార్గం సాధ్యమని ఆ నాటకం నీతి. 1924 ప్రాంతానికి అభివ్యక్తివాదం అంతరించేస్థితి ఏర్పడింది. అభివ్యక్తివాదం అంత రిస్తుండటంతో మరోకొత్త విధానంతో *ఎపిక్* థియేటర్ ప్రారంభమయింది. ఈ కొత్త పద్ధతికి ఆద్యుడు ఎర్విన్ పిస్కేటర్ (1893–1966). కొన్ని చిన్న చిన్న నాటక కంపెనీలలో పనిచేసిన తరువాత పిస్కేటర్ బెర్లిన్‌లోని వోక్స్‌బూనె నిర్దేశకుడుగా నియమింపబడ్డాడు. తర్వాత 1927లో పిస్కేటర్ థియేటర్‌ను ప్రారంభించాడు. అక్కడే ఎపిక్ థియేటర్ కోసం సంబంధిత శైలి, శిల్పాన్ని నిర్దుష్ట పరిచాడు. టోలర్ రాసిన హుర్రా, మియ్‌లివ్ రాసిన రాప్పుటిన్‌లను ఎపికి పద్ధతికి అనువుగా కార్టూన్లూ, ట్రెడ్‌మిల్లులను, ఫిలిమ్ సన్నివేశాలను నాటకాల్లో పొందుపరచాడు. 1939లో పేస్కేటర్ అమెరికాకు వెళ్ళి 1951 వరకు న్యూయార్క్ తదితర నగరాలలో నాటకాలను ప్రదర్శించాడు. పిస్కేటర్ ఆద్యుడైనా, ఎపిక్ థియేటర్‌ను ఉచ్ఛస్థితికి చేర్చడానికి, ఆ థియేటర్ కోసం ఎక్కువగా శ్రమించి, ఉద్యమ సారథిగా పరిగణింపబడింది బెర్టోల్డ్‌బ్రెష్ట్ (1898–1956). మ్యూనిచ్ థియేటర్ డైరెక్టరుగా



**జర్మన్ థియేటర్**

నాటకరంగ ప్రవేశం చేసి నాటక రచయితగా బాల్, *డ్రమ్స్ ఇన్ ది నైట్* నాటకాలలో అభివ్యక్తివాదాన్ని ప్రయోగించాడు. అయితే ఈయన మొట్టమొదటి విజయం నాలుగు వందల ప్రదర్శనలిచ్చిన *ది త్రీపెన్నీ ఆపెరా* (1928) ద్వారా వచ్చింది. నాజీల బారినుంచి తప్పించుకోడానికి జర్మనీ వదిలి డెన్మార్క్‌లో ఉన్న బ్రెష్ట్ తన నాటకాలలో తాదాత్మ్య విచ్ఛేద సిద్ధాంతాన్ని పాటిస్తూ ప్రయోగాలు చేశాడు. అప్పుడే ఈయన గొప్ప నాటకాలు *గెలీలియో* (1937–39), *మదర్ కరేజ్* (1938), *ది గుడ్ వుమన్ ఆఫ్ సెట్జువాన్* (1938–40), *ది కాకేషియన్ చాక్ సర్కిల్* (1944–45) వెలువడ్డాయి. విదేశాలలో తలదాచుకున్నందువల్ల తన నాటకాలు ఆ సమయంలో ఎక్కువగా ప్రదర్శించ బడకపోయినా తిరిగి ఈయన 1947లో జర్మనీకి వచ్చిన తరువాత ఆ నాటకాలు ప్రపంచఖ్యాతిని ఆర్జించాయి. నాటకంలో సన్నివేశ వివరణలు, నాటకీయ శిల్పం ప్రత్యేకమైన శైలిలో ఉంటూ, ప్రేక్షకులపై ఒక నిర్దిష్టమైన బాధ్యతను ఉంచాడు బ్రెష్ట్. ప్రేక్షకులు కేవలం సాత్వికంగా నాటకాన్ని తిలకించి వెళ్ళిపోకుండా, అక్కడ జరుగుతున్న సన్నివేశాన్ని నిశితంగా, విమర్శనాత్మకంగా పరికించి చూచి స్పందించమని బ్రెష్ట్ ఆశయం. ఏ క్షణంలోనూ ప్రేక్షకుడు పాత్రల ఉద్వేగాలకు లోను కాకుండా, పాత్రలతో తాదాత్మ్యం పొందకుండా బయటి నుండే పాత్రలను చూడగలగాలి. అది సాధించడం కోసం సన్నివేశాల మధ్యన పాటలు, వివరణలు చొప్పించేవాడు. సంఘంలోని చెడును రూపుమాపడానికి, ప్రేక్షకులు సిద్ధం కావాలనే సందేశాన్నిచ్చే నాటకాలను ప్రదర్శించేవాడు. నటనాపరంగా స్టానిస్లవ్‌స్కీ సిద్ధాంతాలను పూర్తిగా వ్యతిరేకించాడు. 1941 నుంచి ఫిన్‌లాండ్, అమెరికాలలో కొన్నేళ్ళు గడిపిన తరువాత 1948లో తూర్పు బెర్లిన్ నగరానికి తిరిగి వచ్చి అక్కడ స్థిరపడ్డాడు. జర్మనీ లోని నాటక కంపెనీ బెర్లినర్ ఎన్‌సెంబల్ ముఖ్యమైనది. తూర్పు జర్మనీలో స్థాపించబడిన ఈ కంపెనీ ఎక్కువగా బ్రెష్ట్ నాటకాలకే పరిమితమయింది. బెర్లిన్ ఎన్‌సెంబల్ ద్వారా ప్రదర్శితమైన నాటకాల వల్లే బ్రెష్ట్ ప్రతిభ విశ్వవిఖ్యాతమయింది. 1954, 1955లో త్రీపెన్నీ ఆపెరా ఫ్రాన్స్‌లో ప్రదర్శించడంతో బెర్లినర్ ఎన్‌సెంబల్ అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించింది. 1956లో బ్రెష్ట్ మరణానంతరం ఇతని భార్య హెలెన్ వీయ్‌గెల్ ఆధ్వర్యంలో

కంపెనీ కొన్నాళ్ళు నడిచింది. 1933లో హిట్లర్ అధికారంలోకి రావడంతో రంగస్థల కళాకారులెందరో జర్మనీని వదిలి వెళ్ళిపోయారు. అలా వెళ్ళని రచయితలు కేవలం చారిత్రక నాటకాలు రాసుకుంటూ సమకాలీన సమాజానికి దూరంగా ఉండిపోయారు. 1933 నుండి 1945 వరకు జర్మనీ నాటకరంగం రాజకీయ ఒత్తిడుల వలన స్వతంత్రంగా జీవించలేకపోయింది.

1945లో జర్మనీ మిత్రరాజ్యాలకు లోబడిపోవడంతో, థియేటర్‌లు ఎక్కువగా మూతబడ్డాయి. అయినా 1960 నాటికి మళ్ళీ పుంజుకుని శక్తివంతంగా నాటక ప్రదర్శనలు చేయగలిగాయి. 1945లో జర్మనీ రెండుగా విడిపోయినా తూర్పు, పశ్చిమ జర్మనీల రెండింటిలోనూ నాటకరంగానికి ప్రభుత్వాలు చేయూత నిచ్చాయి. పశ్చిమ జర్మనీలో 150 వృత్తి నాటక సమాజాలు ఏర్పడగా, తూర్పు జర్మనీలో 135 వెలిశాయి. ప్రతి నగరంలోనూ ఒక నాటక కంపెనీ ఉండేది. ప్రపంచ సంగ్రామంలో 100కి పైగా థియేటర్ భవనాలను కూల్చివేయడం జరిగింది. 1950 తరువాత అవన్నీ మళ్ళీ పునరుద్ధరించాయి. కొత్త సదుపాయాలతో పశ్చిమ బెర్లిన్‌లోని షిల్లర్ థియేటర్ 1951లో తిరిగి ప్రారంభమైనపుడు అందులో భ్రమణ రంగస్థలం, ఎలివేటర్లు, రోలింగ్ ప్లాట్‌ఫారమ్ సమకూర్చారు. 1950 ప్రాంతంలో జర్మనీలో నాటకాలను ముఖ్యంగా ఇద్దరు స్విస్ నాటకకర్తలు ఫ్రిష్, డురెన్‌మట్ రాశారు. ఫ్రిష్ రాసిన నాటకాలు ది చైనీస్ వాల్ (1946). బైదర్‌మన్ అండ్ ది ఫైర్‌బగ్స్ (1958), అండార్రా (1961). ఇవన్నీ సమాజ నేరాలకు సంబంధించినవి. ఈ నాటకాలలో పాత్రలు, చేసిన నేరాలను సమర్థించుకోవాలని ప్రయత్నిస్తాయే తప్ప వాటికి బాధ్యతను అంగీకరించవు. అలాగే డురెన్‌మట్ రాసిన నాటకాలు ది విజిట్ (1956), ది ఫిజిసిస్ట్స్ (1962). ధనం, అధికారాలను ఎఅజూపి అవినీతి పాల్జేయడం, మానవ బలహీనతలు మొదలైన వాటికి సంబంధించినవే. 1960 తర్వాత జర్మన్ నాటకాలు ఎక్కువగా డాక్యుమెంటరీ నాటకాలుగా ఉండేవి.

1965 తర్వాత జర్మన్ నాటకకర్తలు సమకాలీన సామాజిక సమస్యలను ఇతివృత్తంగా తీసుకొని నాటకాలు రాయడం మొదలుపెట్టారు. జర్మనీలో ప్రజల మెప్పును పొందిన దర్శకుడు పీటర్ స్టీన్ కోసం బోతోస్ట్రాస్ నాటకాలు



జర్మన్ స్టేజ్

రాసేవాడు. వాటిలో బిగ్ అండ్ లిటిల్ గొప్ప విజయాన్ని సాధించింది. విజిటర్ (1989) నాటకం కూడా బాగా పేరు తెచ్చుకుంది. 1990 నాటికి పశ్చిమ జర్మనీలో ఎక్కువ ప్రదర్శనలు స్ట్రాస్ రాసిన నాటకాలు కావడం గమనార్హం.

1970 దశకంలో స్టీన్ ప్రదర్శించిన నాటకాలలోని అంతరార్థ విశదీకరణం నాటక దర్శకత్వంలోనే ఒక కొత్త మలుపును చూపించింది. 1980లో స్టీన్‌తో పాటు ఎందరో దర్శకులు నాటకప్రతిని యథాతథంగా ప్రదర్శించడం ప్రారంభించాడు. 1981లో స్టీన్ ప్రదర్శించిన చెకొవ్ నాటకం *ది త్రీ సిస్టర్స్* వాస్తవికతావాదానికి పూర్తి ప్రతీకగా, నాటక ప్రతిని పొల్లుపోకుండా యథాతథంగా ప్రదర్శించడంతో ఆ నాటక ప్రదర్శనను కంపెనీ ప్రదర్శించిన నాటకాలలో ఉత్తమ నాటకంగా అందరూ కీర్తించారు. జర్మనీలో నాటక విమర్శలు, సమీక్షలు పత్రికాముఖంగా ప్రచురితం కావడం నాటక కళావికాసానికి ఎంతో మేలు చేస్తున్నాయి. కొన్ని వ్యాపార సంస్థలు నాటక సమాజాలను దత్తత తీసుకొని వాటికి అండగా నిలబడటం జర్మన్ నాటక రంగంలో ప్రత్యేకంగా పేర్కొనదగిన విశేష అంశం.

ఈ విధంగా నాటకకర్తలు రచనలోను, ప్రదర్శనలోను ప్రతితరంలోను కొత్త పుంతలు తొక్కి నూతన ప్రయోగాలతో జర్మన్ నాటక రంగాన్ని సుసంపన్నం చేయడమే కాక, ప్రపంచ నాటక రంగాన్ని కూడా ప్రభావితం చేశారు. ముఖ్యంగా నూతన నాటక విధానాలలో పథ నిర్దేశకులుగా జర్మనీ నాటకకర్తలు చిరయశస్సు గడించారు.

# సాహిత్యంలో గిరిజనుల పాత్ర

- దూపాటి శేషుకుమారాచార్యులు

విజయనగర సామ్రాజ్య ఆస్థాన కవులు సాహిత్యానికి చేసిన విధంగానే గిరిజనులు కూడ పల్లెపాటలు, జానపదాలు పాడుతూ వాటికి తగిన విధంగా వాయిద్యాలు వాయిస్తూ లయ తప్పకుండా నృత్యం చేస్తూ ఆనందించే వారు. వీరి జీవన శైలి ఎక్కువగా చెట్లు, జంతువులకి జట్టు కట్టడం కొండలు, కోనల, అందాలు ఆస్వాదించటం చెట్లపై నుండి వచ్చే పరిమళాల ఘుమ ఘుమల మధ్య జీవనం గడిపే జీవులు గిరిజనులు. గిరి అంటే కొండలు అనిఅర్థం. వీటి మధ్యన ఏ చీకూ-చింతా లేక పండగ-పబ్బాలు వారికి నచ్చిన వారితో జీవనం గడుపుతూ జీవించే స్వేచ్ఛాజీవి. వీరి జీవనానికి సాహిత్యానికి అనుబంధం చాలా ఉంది. జనపదుల నుండి జానపద సాహిత్యం ఆవిర్భవించినట్లుగ గిరిజనుల నుండి లిపి లేకపోయినా రేలా రేరేల పాటలు ఉద్భవించాయి. వాల్మీకి గిరిజనుడే, కన్నప్ప, పాండవులు నివసించిన అడవిప్రాంతం, రాముడు, విహరించిన ప్రాంతాలు కూడ గిరిజనుల సహాయ సహకారాలు పొందారు.

మనిషి జీవనానికి కాయకష్టంతో పాటు శ్రమను మరచి పోయే సంగీత, వాయిద్య సాహిత్యాలకి ప్రాముఖ్యతనిస్తారు.

ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వరకు వనాలలోని అందాలు గిరిజన నృత్యాలపై పాటలు, వారి వేషభాషలు పట్నంలోకి వారికి చెప్పబడే అనేక సినిమాలలో, ఫొటో ఎగ్జిబిషన్‌లలో కవుల రచనల ద్వారా! ప్రచారంలోకి వచ్చాయి. గిరిజనులు ఎంతటి మొరటు వారో అంతటి బలాఢ్యులు. కాయ కష్టం చేయడంలోను, బరువులు మోయడంలోను వెనుకాడరు. స్త్రీ, పురుషులు సమానంగా కష్టపడతారు. ఎంత కష్టపడతారో అంత ఉల్లాస జీవితం కట్టుబడులకు లోబడి ఉంటారు. ఆచార వ్యవహారాలు, ఆహార పదార్థాలు వేరుగా ఉంటాయి.

వీరి జీవనం ఊరికి దూరంగా గుంపులు గుంపులుగా గుడిసెలు వేసుకొని ఉంటారు. తలుపులు ఉండవు. ఇంటికి కావలి కాయడానికి చిన్న పిల్లలు ముసలి వారు ఉంటారు.



అరకు లోయ జానపద నృత్యం



థింసా జానపద నృత్యం

ఎండాకాలం చక్కని గాలులు ఆస్వాదిస్తారు. వీరి వ్యవసాయ వృత్తితో బాటు వేటాడటం అడవి సంపద (కాయలు చింతపండు, కరక్కాయలు, ఇప్పపూవు మొదలగునవి సేకరించి బార్టారు పద్ధతి వస్తుమార్పిడి విధానంతో కావలసిన వస్తువులు తెచ్చుకుంటారు. దైవ చింతనతో గడుపుతారు. సమ్మక్క, సారలమ్మ, మైసమ్మ, పోచమ్మ మొదలగునవి. గిరిజనులు మాటలకు ఒక లిపి అంటూ ఏమీ లేదు. కాని ఈ మధ్య కాలంలో దానిపై పరిశోధనలు చేశారు.

గిరిజనులు ఎక్కువగా కొండలు వాగులు ఆహ్లాద వాతావరణంలో జీవనం గడుపుతారు. పొలాల్లో కాయకష్టం చేస్తూ అనేక రకాల పాటలు పాడుతూ అందులోని భావం అర్థం కాక పోయినా మనకు వినటానికి చాలా ఆనందం కలిగిస్తాయి.

వరినాట్లు సమయంలో పాడే పాట మచ్చుకగా చూద్దాం:

**రేరేలయోకి రేరేల రేలరేల రేరేలా**
**సన్నబాదు యేక్కాల్లె నన్న వశ్రినింతినా**
**జల్లిపుంగారి కోయిసీలే నన్న వశ్రిసింతినా!**
**పెండల బద్రో యేక్కాల్లె నన్న వశ్రిసింతినా**
**సెల్లిసి బెగ్గ వియా యే నన్న వశ్రిసింతినా**
**జల్లిపుంగారి కోయసీలె నన్న వశ్రిసింతినా.**

.... అని పాట మొదలును ఒకరు ఒక చరణం పాడగా దానికి అనుగుణంగా మిగిలిన వారు గొంతు కలుపుతూ పాడతారు.

వరికోతల అప్పుడు వారి పాడే పాట ఈ క్రింది పాట చూడండి.

**పాట :**
**రేలరేలా రేరేలా రేరేలా**
**వరికోయిన శయితివా కోడియటె**
**జరితానే దేక వాటి కొడియాడి పరువాలక**
**కంది కోయ నాగయితినా కోడియాటి**
**జరితానా దేక వాటి కొడియాడి పరువాన**
**రేలరేలా రేరేలా రేలరేల రేరేలా!**
**జొన్న సేను సీమల్లో నాగుమల్లె**
**లోగి కొయిమ్ కోయిమల్లె నాగమల్లె**
**గుంజి కోయిమ్ కోయిమల్లె నాగుమల్లె**
**రేలరేలా రేరేలా రేలరేల రేరేలా!**
**కంది సేను సీమల్లో నాగమల్లె**
**గుంజి కోయిమ్ కోయిమల్లె నాగుమల్లె**
**రేలరేలా రేరేలా రేలరేల రేరేలా!**
**పెసల్ సేను సేనల్లె నాగుమల్లె**
**లాగ కోయిమ్ కోయమల్లె**
**రేలరేలా రేరేలా రేలరేల రేరేలా!**
**సెనగ సేను సీమల్లో నాగుమల్లె**
**లాగి కోయిమ్ కోయిమల్లె నాగుమల్లె**
**గుంజి కోయిమ్ కోయమల్లె.**

వరి, జొన్న, పెసలు, శనగ పంటలు చేతికి వచ్చాయి కోయక పోతే పంట భూమి పాలవుతాయి. కాబట్టి ఉత్సాహంగా గుంజి గుంజి (లాగిలాగి) కోయండి అని పాటను పాడుతూ వరి కోతలు కలుపు తీస్తారు. చిక్కని వెన్నెల పిండారబోసి నట్లుంటే ఆ రాత్రి ఏదో జంతువును చంపిన మాంసంతో, ఇప్పసారాతో గూడెంలో ఆటపాటలతో కాలక్షేపం చేస్తారు. దీనిలో స్త్రీ, పురుష భేదం లేకుండా అందరు కలిసి తాగుతారు. వీరి పాటలలో కుల గోత్రాల ప్రస్తావన కార్తీక రాజు చూపిన వీరత్వం చాటే పాటలు పాడతారు. వీరు ఆకాశాన్ని తండ్రిగా భూమిని తల్లిగా భావిస్తూ జనపదాలకు అందిస్తారు.

ఉదా: **రేలరేలా రేరేలా రేలరేల రేరేలా!**
**ఆకాశదేవి తండ్రిలే, భూదేవి తల్లీలే యామ్మాలే**
**భూమి దేవి గర్భాలే–భూమి దేవి గర్భాలే యమ్మాలే**
**అద్దె భూలోకం కలగారోయమ్మాలో ”**



**సంబల్‌పూర్ జానపద నృత్యం**

అంటూ సూర్యచంద్ర వంశరాజుల గురించి భూదేవి గర్భం నుండి విశ్వం పుట్టిందని వీరి భావన. ఈ విశ్వం సంద్ర కవ్వం (చంద్రకవ్వ) లో నిండివుంది అంతకు ముందు విశ్వంలో చెట్టు చేమా పశు పక్ష్యాదులు మానవులు ఎవరు లేక శూన్యంగా ఉందని వీరి నమ్మకం. చంద్ర కవ్వపు శబ్దంనుండి ఓంకార శబ్దం వచ్చిందని వీరికి నమ్మకం దానపైన పాడే పాట :

**ఏడు ఏడు సముద్రాకో ఓ యవ్వా**
**నట్టయేడు సముద్రాకో ఓ యవ్వా**
**అదిశక్తి అవతారం అదిశక్తి అవతారం**
**ఓ దశ పన్నెండు అవతారం**
**అది బార కోడి దయారో**
**అది తూర్పుదిక్కున దయారో**
**అది తుమ్మ స్తంభం తతారో యామ్మాలే**
**అది పడమర దయారే**
**అది పాల స్తంభం తతారో యామ్మాలే**

అంటూ పాడుతూ మూడు గుడ్లను, బారకోడి మూడు నెలల్లో పొదిగింది. మొదటి గుడ్డు పై ఆకాశ భాగం, క్రింది భాగం భూదేవి. రెండవ సంగం పాలసముద్రం సగం నీలం మూడోది కార్తీక రాజు కోయ భూంకం రాజు (కోయోడనే అర్థం)గా కలింగ రాజు తురుకోడుగా, యాదవరాజే గొల్లవాడుగా పిలువ బడ్డారు.

**ఆచార మావహరంతి పాడే పాట.**

**ఓ ఆర్తి ఆచారం ఇల్లెయవ్వా**
**కులగోత్రా ఇల్లెయవ్వా**
**నీయమ నామా ఇల్లెయవ్వా**
**ఓ వర్సా వాయి ఇల్లెయవ్వా**

ఓ కార్తీక రాజు ఉడాయమ్మాయ లారా పట్నం తొత్తారో

**ఓయవ్వా చెబ్కి పట్నం తొత్తారో**
**కెర్జె వెన్నె పట్నం కెక్కెర వెన్నె పట్నమూ!**
**ఓ దాన తర్వాతా లోదాడి పట్నం యావ్వా!**
**లక్క మేడా పట్నం యమ్మాలే**
**కార్తీక రాజు తొత్తొండా! పన్నెండు పట్నాతొత్తండా!**
**బార బయలుదేరారో యావ్వా**
**అద్దు కువ్వారు పట్నం అద్దు కవ్వ పట్నమూ పేలారో.**

ఈ పాటలు కార్తీక రాజు పన్నెండు పట్నాలు కట్టాడు మూడవ గట్ట రాజు కూతురు మచ్చల మాసోతో పెళ్లి జరుగు తుండగా కులం, గోత్రం, ఆస్తి ఆచారం లేనివాడిని, ఆవులు, ఆంబోతులు, మేకలకు, సీంబోతులు వేలవని వాటిని సాధించి తెచ్చె వరకు పెళ్లి చేయననగాకత్తికి కంకణం కట్టి వెళ్లాడు అని అర్థం.

వీరి పాటలలో ధైర్య సాహసాల గురించి ఉండే పాటలు ఓ సారి పట్టా భరుద్రుడు, శిరస్సు కిందపెట్టి తలక్రిందులుగా తపస్సు చేస్తుంటే కార్తీక రాజును చూసి ఓరి గోసి గుడ్డ దరిద్రుడా కోయెడా మంచి మంచోళ్లం నాదగ్గరకు రాలేదు. అని నెట్టి వేశాడు. ఓరాజా! నువ్వు నన్ను తోసినా ఫర్వాలేదు కాని వచ్చిన పనికానిదే తిరిగి వెళ్లను అని నాకు ఆర్తి, ఆచారం, కులం, గోత్రం కావాలన్నాడు. ఇప్పటి వరకు నన్ను ఎవరూ వరాలు అడగలేదు నేను ఇవ్వలేదు. కాని నీవు అడిగావు కాబట్టి ఓ పరీక్ష పెడ్తాను అందులో నెగ్గితే నీవు కోరింది ఇస్తాను అంటూ నిండు గంగాళంలో ఆవునెయ్యి మరుగుతుండగా చెయ్యిని పెట్టమన్నాడు, పొయ్యిలో గునపం కాలుతోంది ఆ గునపంను పందెం పుల్లగా ముఖం కడుక్కోమనగానే కార్తీక రాజు ఎర్రగా కాలిన గునపంతో ముఖం కడుక్కొని , నాలుక మీది పాచితీసి, గంగాళంలోని నూనెతో స్నానం చేసి ఒకసారి విదిలించాడు. అప్పుడు పట్టా భరుద్రుని వంటిపై బొబ్బలు వచ్చాయి. అప్పుడు పట్టాభ రుద్రుడు, కార్తీక రాజుతో నీవు సత్యవంతుడవు నీవు కోయ భూకం రాజువి దొరా! నీకు సియమ నామ గోత్రాలు ఇస్తున్నాను అని మూడు లింగులు మూట గట్టి ఇస్తాడు.

కార్తీకరాజు పధ్నాలుగు, సముద్రాలు దాటి తలను వంచి చూస్తే లింగులు (శక్తులు) లేవు. అప్పుడు పట్టాభరుత్రుని మోసాన్ని గ్రహించి నూటొక్క యోరులు కోయ యువకులతో ఐదు గుట్టల సందుల్లోకి పోయి వెదురు గొట్టాల తేనె టీగల్ని పట్టి పట్టాభ రుద్రుని పట్నంలో వదులుతారు. అవి అందర్ని కుట్టగా పట్టాభ రుద్రుడు తెలుసుకొని కార్తీక రాజుని పిలిపించి తానొక తప్పు చేశానని చెప్పుతాడు. లింగులను మీకు ఇవ్వడం జరిగింది కాని దాని పూజించటం ఎవరికి చెప్పలేదు. అందుకే వాటి శక్తి మీరు గ్రహించ లేక పోయారని చెప్పాడు.

నాగస్తంభం దగ్గర కుర్రోడును ఇస్తున్నా ఇతనే మీకు ఆర్తి బిడ్డ ( జోలోడు, ఈ కథను చెప్పే వ్యక్తిని పిలుస్తారు)

ఇతనికి పుట్టిన బిడ్డకు పురిటి ఖర్చునుండి చావుఖర్చు కూడ మూడు తరాల వరకు భరించాలని ఓ వేళ ముసలోడు చూస్తే ఆవు లేగ గొడ్డును కట్నం (బూడిద కట్నం అంటారు) ఇవ్వాలని చెప్పి మూడు లింగులను పట్టాభ రుద్రుడు కార్తీకరాజుకు ఆర్తి బిడ్డతో సహా అప్పచెప్పాడు.



**ఒరిస్సాలోని గిరిజనుల నృత్యరీతి**

అసలు ఆ లింగులు ఏమిటంటే శక్తులు వేల్పులు అంటారు. ఈ లింగుల్లో ఈ దూరేడు, ఈ దాడొకరి వేల్పులకు కార్తీక రాజు ఉంచుకొని చినకాం, పెదకాం, ఉడికాం వేల్పులు పాటేటి గట్టకు ఇచ్చాడు. కాటూరులు కాటి బోయరాలు మూడవ గట్లు ఇచ్చాడు. తూలముతి టూల్ టోకిరి ఐదవ గట్టుకు ఇచ్చాడు.

ఏ భాషలోనైనా మాట్లాడే తీరు పాడే పాటల నుండి సాహిత్యం ఉద్భవించింది. ఓ గొల్లవాడు ఆవులని కాస్తూ వాయించే మురళి లేదా ఓ దేవాలయంలో ఉపయోగించే డోలు, సన్నాయి పాశ్చాత్య వాయిద్యాలపై వాయించే పాటలు వినటానికి సొంపు కల్గిస్తాయి. తెలుగు సాహిత్యంలో వచ్చిన ప్రకృతి వర్ణనలు శుభా శుభ కార్యాలలో పాడే పాటలు గిరిజన భాషలోకి సాహిత్యంలోను ఉంది.

ఉదా: పండుగలలో

**సుక్కుడు పువ్వు పువ్వయ్య**
**సన్న బాదు సెల్లె నానో సెల్లినాకు**
**సెల్లినానో సెల్లినో సంకు రాత్రి మబ్బులో**
**సన్న పుష్ప సెల్లో నానో సెల్లే నానో**
**సెల్లెని బెగ్గ వోతురు నానో**
**సెల్లె బెగ్గవోతురు....**

అంటూ సంకురాత్రి వచ్చె చిక్కుడు పువ్వును మకుటంగా పాటలు పాడుతారు.

వీరి పాటలలో హాస్య భావంతో పాటు లయ తప్పకుండా పాదం కలుపుతూ ఒకరి నడుము చుట్టూ మరొకరు చేయి వేసి తిరుగుతూ పాడతారు. మి

దూపాటి శేషకుమారాచార్యులు
**ఫోన్** : 9441884744

### ఆముక్త మాల్యద :

# ప్రాచీన తమిళులు

- కొత్త వెంకటేశ్వరరావు

(క్రీ॥పూ॥ 500-క్రీ॥శ॥ 300 వరకు)

**సంగమ్ (శంగమ్) యుగము - అప్పటి సాహిత్యం :**

ప్రాచీన తమిళుల చరిత్ర తెలిసికొనుటకు అప్పటి సాహిత్యమే ముఖ్య సాధనం. దీనినే సం(శం)గమ్ సాహిత్యం అంటారు. దీనిలో కొంత భాగమిప్పటికిని లభ్యమవుతుంది. కాని, దీని కాల నిర్ణయంపై భేదాభిప్రాయాలున్నాయి. కొందరు తమిళ దేశాభిమానులిది క్రీస్తుకు పూర్వమనేక శతాబ్దాల నాటిదంటారు. చరిత్రకారులిది క్రీస్తు తరువాత మూడు వందలేళ్లు వర్ధిల్లిందంటారు.

ఇది దక్కనులోని శాతవాహన పాలన ఉత్తరార్ధానికి, రోమన్ చక్రవర్తి అగస్టన్ శకారంభానికి సమకాలీనమని వారి అభిప్రాయం. మరికొందరు మధ్యసులు ఇది క్రీస్తు పూర్వం 500 నుండి క్రీస్తు తరువాత 300 వరకు వ్యాపించిందంటారు. ప్రాచీన తమిళ ప్రభువుల ఆధిపత్యంలో ఏర్పడిన కవి సంఘములు 'సంగమ్' అని పేర్కొనబడ్డాయి. ఈ సంగమున నెగ్గిన రచనలకు ప్రమాణ్యం లభించేది.

చరిత్ర కందని కాలములో తమిళనాట, రెండు కవిసంగమములు ఒకదాని తరువాత ఒకటి పుట్టి గతించెనని ఒక సంప్రదాయం ఉండేది. మొదటి దానికి శివుడు, రెండవ దానికి అగస్త్యుడు అధ్యక్షులు. ఆ సంగమ్ సమావేశ స్థలములు దక్షిణ మధుర, (ఇప్పటి మధురై కాదు.) కాపాతపురమంటారు.

అవి ఇప్పుడు సముద్రంలో కలసిపోయాయి. ఆ రెండు సంగముల వారి రచన లేవియు ఇప్పుడు లభింపవు. క్రీ॥శ॥ మొదటి మూడు వందల ఏండ్లలో, (150 ఏండ్లని కొందరు) రచింపబడిన సంగ సాహిత్యం మాత్రమే కొంత ఇప్పుడు సంకలన రూపంలో (Anthology) లభ్యమవుతోంది.

**సంగమ్ రాజకీయములు :**

మూడవ సంగమ్ కాలమున తమిళనాడు చేర, చోళ, పాండ్య మండలాలుగా వున్నాయి. వీనిని దేశీయులగు "ముడి అరశరే" = మూర్ధాభిషిక్తులును, 'ఆమె', 'వేళ' అను సామంత నాయకులును పాలించారు. వారు విశేషముగ తమిళ కవి సంఘములను పోషించారు. ఆ కవులొక ప్రభువు నుండి మరియొకరి కడకు పోవుచు వారిని కీర్తించేవారు.

**సంగమ్ ప్రజా జీవనము-ప్రేమ-శౌర్యములు :**

సంగమ్ ప్రజా జీవనం అప్పటి సాహిత్యాన్ని చక్కగా ప్రతిబింబించేది. సంగమ్ కవులు ప్రజల జీవనమును (అహం) (పురమ్) అను రెండు కవితా విభాగములలో వర్ణించారు. "అహం" విభాగ మంతయు ప్రజల అన్పును (ప్రేమను) గృహస్థ జీవనమును వర్ణిస్తుంది. 'పురమ్' విభాగము ప్రజల రాజ్యాంగ, వ్యవహారిక శౌర్యాది బాహ్య జీవనమును చిత్రిస్తుంది.

"అహం" 'పురమ్' విభజన ఇతర సాహిత్యములో లేవంటారు. వీనిలో ఒక విశిష్టత వున్నది. 'పురమ్' లోనే యుద్ధములు మఱక్కళ్ళ వెళ్వి - అను పేర ఒక యాగ విశేషముగ వర్ణింపబడింది. తరువాతి కాలంలో నిది 'పరణి' యను ప్రత్యేక సాహ్యిత ప్రక్రియగా రూపొందినది.

'అహమ్'లో ప్రేమ వర్ణన మరింత విశిష్టమైనది. అది అవివాహిత, వివాహిత, వియోగ దశలన్నిటిని సూక్ష్మ దశాంతరములతో ప్రదర్శిస్తుంది. ఆ దశల కనుకూల రంగములుగ పర్వత, అరణ్య, మైదాన, మాగాణ, మరు భూములు ప్రత్యేకముగా సంకేతింపబడినవి. ఆ భూములకు గురుతుగా ప్రత్యేక పుష్పములు పేర్కొనబడినాయి.

**'సంగమ్' నృత్య గానములు :**

అహం అంచు (ప్రేమ) కవిత్వములతో పాటు తమిళ ప్రజలకు నృత్య, గాన ఉత్సవములందధిక ప్రీతి యున్నట్లని పిస్తుంది. ఇది 'నంగమ్' సాహిత్యమున నెక్కువగా కనిపిస్తుంది. నంగం కాలంలో కొంచెమీవలి *శిలప్పదికారమ*ను కావ్యమున నాగరిక గ్రామీణ, ఆటవిక ప్రజల నృత్య గానాలు, వాద్య విశేషాలు, అతి సూక్ష్మ వివరాలతో వర్ణించబడ్డాయి. 'సంగమ్' సాహిత్యంలో గాయక బృందం ఒక ఆస్థానం నుండి మరొక దానికి వలసపోతూ వారి ఆట పాటల కనుగుణముగా ఆడవారు నృత్యము చేసేవారు. ఆదిమ నివానులగు 'పాణర్', 'విఅచియర్' గుంపులు 'యాత' (Lute) పిల్లన గ్రోవి మొదలగు పురాతన వాద్యాలతో జానపద గీతాలను ఆలపిస్తూ, ఆడుతూ కదలిపోయేవారు. ఒకానొకప్పుడు రాత్రులందు కాగడాల వెలుతురులో హస్త విన్యాసాలతో భరత నాట్యం లాంటి నృత్యం చేసే వారు.

**'సంగమ్' మత జీవనము :**

'నంగమ్' ప్రజలు విశేషంగా లౌకిక జీవనం గడిపేవారు. మత జీవనం గూర్చిన ఆలోచన తక్కువగా వుండేది. ఉన్న మతం అచ్చటచ్చట సూచింప బడింది. అవి స్థూలముగా రెండు రకాలు.

మొదటిది దేశీయం. అది 'నాడుకల్' అను వీర శివారాధన. రెండవది విదేశీయం. దీనిలో ఒకటి వేద పురాణం, రెండు జైన, మూడు బుద్ధ, ధర్మాలను అనుసరించిన మూడు విధానాలు కనిపిస్తాయి. రాజులు యజ్ఞాలు చేసే వారు. ప్రజలు శివ, బలరామ, విష్ణు, కృష్ణ, అర్ధ నారీశ్వర, తులసి ఆరాధన చేయుచుండే వారు. ఇంద్రుని గూర్చి 'ఇంద్రవేల' యను వర్ష ప్రార్థనోత్సవము విశేషముగా నున్నది. మురుగన్ పూనకములలో చిందులాటలు కనపడతాయి.

బౌద్ధ, జైనాలకు అన్ని వర్గాల ప్రజలు గుహలను తొలిచి ఇచ్చినట్లు గుహలలోని ప్రాచీన శాననాలు తెలుపుతున్నాయి. మొత్తము మీద మతపరమైన సహ జీవనము కనిపిస్తుంది. కాని కొన్ని మతాల వారు చేతులెత్తి, జెండాలూపుతూ, వాద ప్రతివాదాలు చేసేవారని సంగ సాహిత్యంలో తెలియవస్తుంది. ఇది బహుశః తొలుత వచ్చిన వైదిక, పౌరాణిక మతాలకు, తరువాత వచ్చిన జైన, బౌద్ధాలకు కలిగిన వివాదాలకు నంబంధించినదై వుండవచ్చు. ఈ వివాదం 'సంగం' కాలం తరువాత కలభ్ర యుగములోనూ (250-క్రీ॥శ॥ 550 క్రీ॥శ॥), తరువాతను భక్తి యుగం విపరీతంగా పరిణమించింది.

మొత్తము మీద ప్రజల సాంఘిక, రాజకీయ, మత జీవనాలు స్వతంత్రంగా ఉన్నట్లు కనపడుతోంది. ప్రజలు లౌకిక జీవనాన్ని ప్రేమించి ఆనందానురాగాలతో జీవితం గడిపేవారు. జీవితం దుఃఖమయమని గాని, దాని నుండి విముక్తి పొందటమే పరమార్థమనిగాని భావించినట్లు కనపడదు. 'సంగమ్' యుగం తరువాత సమీప కాలంలో వెలువడిన *కురల్* అను జగత్ప్రసిద్ధమగు నీతి కావ్యంలో కూడ మోక్ష ప్రసక్తి, ప్రశంస లేదు. ధర్మ, అర్థ, కామాలు మాత్రమే పురుషార్థాలుగా చెప్పబడినవి.

**కలభ్ర యుగము :** (క్రీ॥శ॥ 250-550)

ప్రేమ, సంతోషాలతో స్వతంత్రంగా వర్ధిల్లిన తమిళ దేశం క్రీ॥శ॥ 250 ప్రాంతంలో ఆకస్మికముగ ఒక విషాదం సంభవించింది. అది మూడు వందల యేళ్ల పాటు తమిళ అప్పటి తమిళ సంస్కృతిని మరుగు పరచింది.

కాళప్పాళర్ లేక కలభ్రులను విదేశీయులు ఆంధ్ర కర్ణాట నరిహద్దుల నుండి వచ్చి తమిళ దేశాన్ని ఆక్రమించారు. తరువాత వచ్చిన సాహిత్యం వారిని నాగరికతా విరోధులని, పాపిష్టి పాలకులని, అజ్ఞానులని నిరసించింది. చరిత్రకారులు వారిని జైన, బౌద్ధులంటారు. వారు జైన బౌద్ధాలను ఎంతో అభిమానించి వైదిక, పౌరాణిక మతములను అణగ ద్రొక్కారు. వారిలో అచ్యుత విక్కంతుని కాలంలో చోళ దేశాన బౌద్ధారామాలు మూతపడ్డాయి. బ్రహ్మ దేయములు రద్దు చేశారు. 'శేక్కిలార్' వ్రాసిన *పెరియ పురాణము* అను శైవ భక్తుల చరిత్రలో వైదిక పౌరాణిక మతాలు జైన బౌద్ధాలచే ఏవిధంగా ఆవదపాలు అయినాయో పెక్కుమారులు కనిపిస్తుంది.

**నైరాశ్య ప్రబోధం :**

కలభ్రయుగ సాహిత్యం, సంగమ్ సాహిత్యం రేయి-పవలు లాంటివి. కలభ్రయుగ కవులందరు జైన, బౌద్ధులు. వారి మతములు నివృత్తి పరాలు, అందుచే ప్రవృత్తి పరమైన

సంగమ్ కవితలోని, జీవనప్రియత్వం వీరి రచనలలో అదృశ్యమయ్యాయి. 'అన్బు' (ప్రేమ) 'అహం'లకు తావే లేదు. నీతి, వైరాగ్యాలే చెప్పబడినాయి. *శిలప్పదికారమ్, మణిమేఖలై* అను కావ్యాలు జగత్ప్రసిద్ధి గాంచిన *తిరుక్కురల్* అను నీతి శాస్త్ర గ్రంథం అప్పటివే (క్రీ.శ. 450-550). ఇవి అన్నీ నైరాశ్య, వైరాగ్యాలనే ప్రతిపాదిస్తున్నాయి.

*శిలప్పదికార* కథ శృంగార విలాస జీవనంతో మొదలవుతుంది. అసూయ విభ్రాంతులతో విషాదాంత మయ్యింది. శృంగార జీవితం విపరీత పరిణామాల వలన ఆ కావ్యంలోని ముఖ్య పాత్రలందు నశించుటే గాక, ఆ జీవితానికి ఆశ్రయమైన పాండ్య రాజధాని మదురై అగ్ని పాలయ్యింది.

మణిమేఖలై మొదటి నుండి చివర వరకు జీవిత మందు వైరాగ్యమునే చెప్తుంది. అందలి నాయిక సౌందర్యవతి. నవయవ్వని అగు వేశ్యాకుమారి అయినను జైన, బౌద్ధ సన్యాసినిగమారి, జీవన దుఃఖాన్ని జైన, బౌద్ధ వైరాగ్య పాశస్త్యాన్ని ఉగ్గడించి పర మతాలను ఖండించింది. *మణిమేఖలై* ననుసరించి కళభ్ర యుగాన జీవ చింతామణి మొదలగు అనేక నైరాశ్య కావ్యములు వెలువడినాయి. తమిళంలో ప్రథమముగ నిరాశ కావ్య వస్తువయింది. తమిళులకు అత్యంత ప్రియమగు సంగీతము నిషేధింపబడింది. రాజకీయ మగు స్వేచ్ఛతోను, సాంస్కృతికమగు సంగీత నాట్యాలతోను హృదయ సంబంధమగు వీర, ప్రేమ కవితలతోను ప్రవృత్తి జీవనాన్ని అభిమానించే తమిళులకు ఈ అస్వతంత్ర బద్ధమగు నైరాశ్య, వైరాగ్య నిర్వృతి వాతావరణం భరింపరానిదయ్యింది.

**భక్తి ఉద్యమం రాజకీయ ఉద్యమములవలె కొన్ని సం॥ల లోనో, ఏ కొద్ది యుద్ధములతోనో అంతం కాలేదు. ఇది ఆరవ శతాబ్ది నుండి తొమ్మిదవ శతాబ్ది వరకు ముమ్మరముగ సాగింది. ఆ పిమ్మట 12వ శతాబ్దం వరకు దర్శన నిర్మాణము ప్రధానంగా వుంది.**

**తిరిగి స్వతంత్రము** : *(క్రీ॥శ॥ 550 నుండి దేశభక్తి - దైవభక్తి రాజకీయ - మత విప్లవములు)*

**కలభ్ర పతనము - భక్తి ఉద్యమము :**

క్రీ॥శ॥ 250 నుండి 550 వరకు మూడు వందల యేండ్లు తమిళుల రాజకీయ జీవనం, విదేశీయ జైన కలభ్ర పాలనతోను, మత జీవనం జైన, బౌద్ధ వైరాగ్యాలతోను మ్రగ్గింది. ఉండి ఉండి, తమిళుల క్రోధ మొక్కసారిగ ఉప్పొంగి, రాజకీయ, మత, విప్లవంగా చెలరేగి వారు కలభ్రులను కడతేర్చారు. జైన, బౌద్ధాల నెదిరించారు. భక్తి ఉద్యమాన్ని వెలయించారు.

క్రీ॥శ॥ 550 ప్రాంతాన బాదామి చాళుక్యులను, కాంచి పల్లవులును, మదురై పాండ్యులును, తమ ప్రాంతంలోని జైన కలభ్ర ప్రభుత్వాలను కూలద్రోశారు. ఇదే సమయంలో జైన బౌద్ధాలను ఎదుర్కొని ప్రజలలో భక్తి ఉద్యమాన్ని రగిలించారు. ఈ భక్తి ప్రవాహంలో రెండు వాహికలున్నాయి. ఒకటి శైవ భక్తి. రెండవది వైష్ణవ భక్తి. శైవ భక్తికి నాయనమారులు నాయకులు. వైష్ణవ వాహినికి ఆళ్వారులు నాయకులు. ఇచట ఒక ముఖ్య విషయం గుర్తించవచ్చు. వైదిక పౌరాణిక మత పునరుజ్జీవనకు యజ్ఞయాగాది క్రతు ప్రచారం జరుగలేదు. అవి జన సామాన్యాన్ని ఆకర్షించ లేవు. సర్వజనాకర్షణకు భక్తి సులభ మార్గం. భక్తి తప్ప మరొక త్రోవ లేదు.

భక్తి ఉద్యమం రాజకీయ ఉద్యమం వలె కొన్ని సంవత్సరముల లోనో, ఏ కొద్ది యుద్ధములతోనో అంతం కాలేదు. ఇది ఆరవ శతాబ్ది నుండి తొమ్మిదవ శతాబ్ది వరకు ముమ్మరంగా సాగింది. ఆ తరువాత 12వ శతాబ్దం వరకు దర్శన నిర్మాణం ప్రధానంగా వుంది. మరియు, దీనిలో గమనించదగిన విషయం ఒకటి, బౌద్ధ జైనాలను ఎదిరించుట, శైవ వైష్ణవా లకు సామాన్య ప్రయోజనమే అయినా, వారిలో వారికి వివాదాలు తప్పలేదు. ప్రజలను, రాజులను, ఆకట్టు కొనుటకు, ప్రారంభ దశలో నిలదొక్కు కొనటానికి ఇది అవసరమైంది. ఈ వివాదాలు అనంతర కాలంలో ప్రాముఖ్యం వహించి, ఆయా రాజుల ప్రాబల్యం పరస్పర హింసకు పాల్పడుట చూడవచ్చు.

భక్తి ఉద్యమాలలో ప్రజా బాహుళ్యమతి శీఘ్రంగ చేరి పోయింది. దీనికి ప్రజల మనస్తత్వం, పూర్వ సంస్కృతి ముఖ్య కారణాలు. 'సంగమ్' (క్రీ.పూ. 500 - క్రీ.శ.300) కాలానికే తమిళ జాతి విలక్షణత రూపొందింది. కవిత, సంగీత, నృత్యం, ప్రేమ, అనురాగ జీవనానికి వారు అంకితం అయ్యారు. జైన బౌద్ధంల నీతి వైరాగ్యాలు వారికి తృప్తి కలిగించ లేదు. ఆ కొరతను భక్తి తీర్చింది. జైన బౌద్ధంల

స్వరూపాలను భక్తి సందేశమును పరిశీలించినచో యిది తెలియ వస్తుంది. సంగ్రహంగా చెప్పాలంటే జైన బౌద్ధంల ప్రాతిపదిక నైరాశ్యము, దుఃఖము. భక్తి సందేశము ఆశాపూరితము, ఆనంద వర్ధకము, నైరాశ్య దుఃఖములు తమిళుల పూర్వ సంస్కృతికి వ్యతిరేకము, భక్తి సందేశము వారి కనుకూలం.

**ఆముక్త మాల్యద – ప్రజా జీవన చిత్రణ :**

*ఆముక్త కథలలో కంటె, పుర, ఋతు వర్ణనలలో రాయల సమకాలీన ప్రజా జీవనం ప్రతిబింబిస్తుంది.*

**స్త్రీలు :**

పుర వర్ణనలలో విలుబుత్తూరులో మనకు ఆచారపరాయణులగు వైష్ణవ కుటుంబి నులు, వారి యిండ్ల ముందెండబోసిన కలమవరి ధాన్యమునకు కావలియున్న కన్యలు, వారి వద్దకు పూవుల నమ్ముటకు వచ్చెడి గ్రామ్యతరుణులు, సాయంకాల మందు తమ ఇండ్ల యరుగుదలపై కూర్చుండి జూదములాడు వేశ్యలు కనిపిస్తారు. మధురలో సౌధా గ్రాలందు విలాసమయ జీవితాలను గడుపు సంపన్న గృహిణులు, ఉద్యాన వృక్షాలకు కృత్రిమ దోహదము లొనర్చు ప్రమదలు, కోట అగడ్తలో జలక్రీడలాడు కామినులు, వీధులలో పుష్పములు, పరిమళ ద్రవ్యములు విక్రయించు యువతులు, వారితో నర్మ గర్భముగ బేరమాడు శృంగార పురుషులు, వేశ్యల బజారులో కళా ప్రవీణులగు పణ్య యువతులు కనిపిస్తారు.

> **జైన బౌద్ధంల స్వరూపాలను పరిశీలించినచో యిది తెలియ వస్తుంది. సంగ్రహముగ జెప్పవలె నన్న జైన బౌద్ధంల ప్రాతిపదిక నైరాశ్యము, దుఃఖము. భక్తి సందేశము ఆశాపూరితము, ఆనంద వర్ధకము, నైరాశ్య దుఃఖములు తమిళుల పూర్వ సంస్కృతికి వ్యతిరేకము, భక్తి సందేశము వారి కనుకూలం.**

ఋతు వర్ణనలలో వేసవిలో చలివేంద్రుల వద్ద బాటసారులకు నీరు పోసెడి అందగత్తెలు, బావులలో పాతాళము నంటిన నీరు తోడుటకు చేంతాళ్ళను కలిపి ముడి వేయు గృహిణులు, వర్షాకాలంలో జడి వానలో పొలములలో పునాసపైర్లకు కాపున్న భర్తలకు అంబళ్లు మోసికొని పోవు కాపు వనితలు, ఎంత సేపటికి రాజని పొయ్యి వద్ద, ప్రొద్దు గ్రుంకులు వంట చేయనాయాసపడు పూరిండ్ల కుటుంబినులు, శరత్తులో వరి, చెరకు చేల వద్ద మంచెలపై కాపుండి, తమ అమాయక హాస్యముతో బాటసారులకు తప్పు త్రోవ జూపి నవ్వెడు యువతులు కనిపిస్తారు.

**స్త్రీల యలంకారములు :**

విలుబుత్తూరు గృహిణులు కొలనుగట్టుల మీద పసుపుకొమ్ము నరగదీసి, తమ మెడలే గాక గట్టు క్రింద నుండు హంసల రెక్కలు గూడ వచ్చుబడునట్లు స్నానమాడతారు. కాని ఆ ఊరి వేశ్యల పసుపు పూత విశిష్టమైనది. వారు గూడ పసుపు పూసుకొని స్నాన మాడతారు. కాని ఆ పసుపు శుభ్రమైన వస్త్రముతో ఒరిసి వత్తినను, దాని కంటక దేహముననే నిగ్గులు దేరునట్లు నాజూకుగా పూసికొందురు. చందన మిశ్రమము సైతము ముదుకగాకుండ పైటలోనే చేయాడించి వక్షస్థల మంతట అలదుకొంటారు. నగల విషయంలో గూడ వారు నాజూకుగ నుండు సన్నని తీగల వంటి ముత్యాల హారాలను, కంకణాలను మాత్రమే ధరింతురు గాని, చిలుము పట్టునని బంగారు నగలు ధరింపరు. పొడిపొడిగ నుండు కస్తూరిని పూసుకొంటారే గాని, జిడ్డని పునుగు సహింపరు. తలకు సుగంధ ధూపము వేయుదురే గాని పూలు చెమ్మయని ధరింపరు. జిలుగు వలిపెములే తాల్తురుగాని తక్కినవి ఒత్తు కొనునని నవ్వుదురు.

చలి కాలములో కొందరు స్త్రీలు పెదవులు పగులకుండ మైనమును, శరీరము వేడెక్కుటకు కస్తూరిని, వసంతములో చలువ కొరకు శరీరానికి అగరు చందన మిశ్రమాన్ని, వంట వాననపోయి ఎరుపెక్కుటకు చేతులకు కుంకుమ పువ్వును పూసి కొంటారు. చెవులకు చందనము పూసికొని గులాబీలు పెట్టుకొంటారు. సిగలో సంపెగలు, అలంకరించుకొని, తెల్లని సన్నని పావడలు ధరిస్తారు. ఆముక్త మాల్యదవంటి వైష్ణవ కన్యల ప్రతి దినాలంకారములు, పూజా సమయాలంకారములు, పెండ్లి కుమార్తె అలంకారములు విలక్షణములు.

**భోజనములు :**

ఆముక్తమాల్యదలో రాయలు పది పేరుల భోజనములను వర్ణించెను. విలుబుత్తూరు భాగవతుల ఇంట, పలు తీరుల కూరలు : పాయసములు, విష్ణు చిత్తునింట పిండి వంటలతో కూడి, ఆయా ఋతువుల కనుకూలమగు, బహు విధమృష్టాన్నాలు; రాజ పురోహితుని

ఇంట వేసవి రాత్రి పలు రకముల ఫలహారాలు; వేసవిలో భోగుల చేప మామిడి ముక్కల కూర; దాని కనరు ఉపశమించుటకు చల్లని కొబ్బరి నీళ్లు; వానాకాలమున పొలములలో గుడిసెలందు కాపుండు హాలికులు త్రాగు అంబళ్లు, ఒకపాటి అధికారమబ్బి వానలో పొలముపోక ఇండ్ల వద్దనే యుండు రెడ్లు మ్రెక్కెడి వేడి వేడి చిన్నరిగ అన్నము; నూనెలతో వేయించిన ఆకు కూరలు; సౌధాగ్రములపై నుండు నృపులారగించెడి అడవి జంతువుల మాంసము, ఆనాటి వెన్న కాచిన ఆవునెయ్యి, రాజనాన్నము, తిరునాళ్ల ఊరేగింపులు చూడబోయిన వారు కాలువ యొద్దనందు కూర్చుండి తినెడి రాజనాన్నపు చద్ది; గేదె పెరుగు మీగడలతో పిసికి, నారింజ, అల్లపు ముక్కలతో కలసిన అన్నము, అడవులలో చెట్ల క్రింద కాపురముండు ఆటవికులు (బ్రహ్మరాక్షసుడు) త్రాగు తాటి కల్లు, భార్య కాల్చి అందించు మాంసపు కరుకుట్లనంజు, దూరపు ప్రయాణములలో తీసికొని పోవు సంబారములు, పొరివిళిం గాయలు, అరిసెలు వీటి నన్నిటిని గురించి రాయలు చవులూ రునట్లు వర్ణించారు.

**కృషీవలులు :**

విలుబుత్తూరు కృషీవలులు తొమ్మిది రకముల పైర్లను పండిస్తారు. ఎనిమిది రకముల పూలను పూయిస్తారు. పనస, అరటి, చెరకు, మామిడితోటలను పెంచుతారు. వేసవిలో తెల్లవారు ఝామువనే, తోటలకే తాములు ద్రొక్కుచు గొంతెత్తి శ్రావ్యముగ పాడతారు.

వర్షమునకు భూమి పదును కాగానే సమృద్ధిగా చల్లుతారు. శివుని ఎద్దును, యముని దున్నను వదలక, మెట్టమాగాణుల నొక్కసారిగ దున్నుచు ఏరువాక సంరంభమును సాగిస్తారు..

భాద్రపదమాసమున పునాస పైర్ల వద్ద గుడిసెలలో కాపుంటారు.

శరత్తులో చెరకు రసం ఆడిస్తారు. శరత్తులో కాపు కన్యలు వరి, చెరకు చేలలో మంచెలెక్కి చిలుకలను తోలుచు బాట యడిగిన వారిని అమాయక హాస్యములతో ఆడిస్తారు.

> **విలుబుత్తూరు కృషీవలులు తొమ్మిది రకముల పైర్లను పండిస్తారు. ఎనిమిది రకముల పూలను పూయిస్తారు. పనస, అరటి, చెరకు, మామిడి తోటలను పెంచుతారు. వర్షమునకు భూమి పదును కాగానే సమృద్ధిగా చల్లుతారు. శివుని ఎద్దును, యముని దున్నను వదలక, ఏరువాక సంరంభమును సాగిస్తారు.**

**బాటసారులు :**

వేసవిలో కొందరు బాటసారులు చెట్ల క్రింద ఒడలు మరచి నిద్రించి నీడతో పాటుదొర్లుతారు. ఎండినయేటిలో చెలమలు త్రవ్వి నీరు త్రాగుతారు. చలివేంద్రములలో నీరు త్రాగబోయి, నీరు బోయు స్త్రీల యందమును త్రాగుతారు. వర్షాకాలమున వాన భయంతో ప్రజలు ఊళ్ల ప్రయాణం ఆపుకొంటారు. ఆగక వెళ్లిన వారు దారిలో భంగ పడతారు. దూరాన వచ్చు జల్లు చూచి చెట్ల క్రింద చేరతారు. కాని అంతకు ముందే వానకు తడిసి, గాలికి ఊగుకొమ్మల వంగుల్ల వానలో ఇబ్బడి ముబ్బడిగా తడసిపోతారు. కొందరు చేతిలో గొడుగులు గాలి కెగిరిపోయి మిగిలిన కర్రను పట్టుకొని పరుగు పెడతారు.

కాని, ముంచుకొని వచ్చిన వర్షపు దెబ్బకు నాని ముద్దవుతారు. కొందరు వానకు రచ్చ కచ్చేరీలో ఇరికి నరపతి, అశ్వపతి, గజపతుల సైన్యబలములను గూర్చి మత్తులాడుదురు. వాన తెరపి కాగానే ఎవరి దారిని వారు వెళ్లి పోతారు.

**ఇతరులు :**

వేసవిలో ప్రజలు గ్రామ గ్రామమున సామంతులను చలువ సప్పరములు వేయిస్తారు. ఎరుకలవారు నిర్జల భూములలో పక్షుల నాకర్షించుటకు అక్కడక్కడ నీరుంచుతారు. సుకుమారులు పగలు తోటలో నుండి రాత్రి చెరుకు గానుగ వద్ద చేరుదురు.

వర్షాకాలమున దొంగలను పట్టుటకు బయలు దేరగా, దొంగలు తాము దొంగిలించిన సొమ్మును రాత్రి పూట ఎవ్వరు చూడకుండ పూర్వ స్థలములలో పెడతారు. సూర్యవ్రతులు, సంధ్యార్ఘ్య మిచ్చు ద్విజులు, మబ్బుపట్టి యుండుటచే పొద్దు తెలియక చిక్కుపడతారు. గృహిణులు ఇందుప గింజ రసముతో నీటి వండ్రును తేరుస్తారు.

శరత్తులో శ్రోత్రియులు యాగము చేస్తారు. కొందరు స్ఫటిక శిలవలన అగ్గి పుట్టిస్తారు. అద్దాలను బూడిదతో తోమి, వర్షాకాలపు చిలుమును పోగొడతారు.

ఈ విధంగా – నాటి సామాజిక వ్యవస్థలోని ప్రజల జీవన విధానాన్ని నునిశితమైన పరిశీలనతో, వర్ణనా వైచిత్రితో – కనులకు కట్టినట్లు కవి వర్ణిస్తాడు.



# ఆంధ్రేతరుల తెలుగు కృతులు

*– గొల్లపూడి మారుతీరావు*

తెలుగు భాష తమిళనాడులో బతికి బట్టకట్టినట్టు మరెక్కడా లేదంటే తెలుగువారి ఆత్మాభిమానం దెబ్బతినవచ్చు. కాని అది అక్షరాలా నిజం. 170 సంవత్సరాలుగా తెలుగు భాషకు నేటి తమిళనాడులో జరిగిన ఉపకారం, భాష పట్ల ఆరాధనా, భక్తి- మన తెలుగునాట కూడా లేదని నిరూపించడానికే ఈ ప్రయత్నం. ఈ మాట చెప్తున్నప్పుడు- అన్నమయ్యనీ, క్షేత్రయ్యనీ, రామదాసునీ మినహాయిస్తున్నాను.

తెలుగుకి ప్రాణం పోసిన ముగ్గురు వాగ్గేయకారులు- ఆనాటి తెలుగు దేశంలో- ఈనాటి తమిళనాట ఉన్నారు. ఇప్పటికీ తప్పనిసరిగా ప్రతీ కర్ణాటక సంగీత కచ్చేరీలోనూ కనీసం ఒక్క తెలుగు పాటయినా- ముక్కూ మొహం చెడి వినిపిస్తుంది. ఇందుకు నేనే సాక్ష్యం.

తెలుగు భాషా వైభవానికి నిచ్చెనలు వేస్తున్న నేటి తరం భాషాభిమానులు యిళ్లల్లో కూడా చాలామంది పిల్లలకి తెలుగురాదు. ఇలా అంటే కొందరయినా భుజాలు తడువుకుంటారని- ఈ అవ్యవస్థ నాతోనూ ప్రారంభమయిందని ఒప్పుకుంటాను. మా మనవలకీ తెలుగు రాదు. కాని అమెరికాలో ఉన్న తమిళుల యిళ్లల్లో తప్పనిసరిగా అందరికీ తమిళం వస్తుంది. ఇంకా గొప్ప విషయం- ఒక్క తెలుగు కీర్తనయినా తెలుస్తుంది. అది వారికి సంగీతం మీద ఉన్న మక్కువకి నిదర్శనం.

ఈ వ్యాసం కేవలం సంగీత అభిమానిగానే రాస్తున్నాను. 30 సంవత్సరాల పాటు ఏం తింటున్నానో, ఎక్కడ తిరుగుతున్నానో తెలీని సినీ ప్రపంచంలో తలమునకలయిన నాకు, రేడియోలో 20 సంవత్సరాలు పనిచేసినవాడిగా, సంగీత కళానిధి శ్రీపాద పినాకపాణి వారసత్వానికి తాళికట్టిన వాడిగా (నా భార్య వారింటి అమ్మాయి) సంగీతం మీద మక్కువ కలిసి వచ్చింది. ఆ కారణంగా భారతదేశంలో మహానుభావులయిన ఎందరో గాయకులను సమక్షంలో వినే అదృష్టాన్ని రేడియో ప్రసాదించింది. అరియక్కుడి, చెంబై, రవిశంకర్, బిస్మిల్లాఖాన్, చతుర్లాల్, అల్లారఖా, జి.ఎం.ఖాన్, బడేగులాం, మన్వర్ ఆలీ, సలామత్ ఆలీ, నజాకత్ ఆలీ, ఎమ్మెస్ సుబ్బులక్ష్మి, డి.కె.పట్టమ్మాళ్, ఎమ్మెల్ వసంతకుమారి, బాలమురళికృష్ణ, హీరాబాయ్ బరోడేకర్, జస్‌రాజ్, కారైకురిచ్చి అరుణాచలం, నామగిరి పేట్టై కృష్ణన్- యిలా ఎందరినో వినగలిగే భాగ్యం కలిగింది.

గత 15 సంవత్సరాలలో చెన్నైలో ఏ రోజూ కచ్చేరీకి హాజరు కానిదే గడిచేది కాదు. అదొక వైభవం. తమిళ నాట తెలుగుపాట నిలదొక్కుకోడానికి కారణం ఉంది. దాదాపు 160 సంవత్సరాల క్రితం తిరువయ్యూర్‌లో త్యాగరాజస్వామి ఆలయానికి అటూ యిటూ నూరు గజాల దూరంలో ముగ్గురు వాగ్గయకారులు జన్మించారు. వారు కర్ణాటక సంగీతానికి స్వర్ణయుగాన్ని ప్రసాదించారు.

త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామాశాస్త్రి- ఈ ముగ్గురూ తెలుగులో కీర్తనలు చేశారు. దీక్షితార్ దరిమిలాను సంస్కృతంలో అనితరసాధ్యమైన కీర్తనలు చేసినా ప్రారంభం తెలుగులోనే. (నీ సాటి



అరియక్కుడి రామానుజ అయ్యర్

దైవమెందు– శ్రీరంజని). ముగ్గురివీ మూడు రాచబాటలు. తమిళుల నరనరాల్లోకి సంగీతాన్ని సంధించిన త్రిమూర్తులు వీరు. ఇప్పటికీ సంగీత రసజ్ఞతకి తమిళులదే ప్రథమ తాంబూలం. వారు తమిళ ప్రాంతంలో ఉండటం చేత వారి శిష్యులు–ప్రముఖంగా తమిళులే. త్యాగరాజస్వామికి వాలాజాపేట వెంకటరమణ భాగవతార్ వంటి శిష్యులు– ఆ ప్రాంతాలవారే ఉన్నారు. గురువుగారి ముఖతః కీర్తనలు విని, రాసుకుని సాధన చేశారు. అయితే తమిళభాషలో ఉన్న పరిమితులు– తెలుగు భాషలో ఉన్న విస్తృతి వ్రాతపూర్వకంగా పట్టు కోలేకపోవడం తప్పనిసరి అయింది.

మిత్రులు పి.బి.శ్రీనివాస్ నాతో అనేవారు. నా పేరు 'గొల్లపూడి'ని తమిళంలో రాయాలంటే 'కొల్లబూటి' అని మాత్రమే రాయగలరట. అవే ఆ భాషలో ఉన్నాయి. పేరుతో పరిచయం ఉన్నవారు తప్ప మిగతావారు– కొల్లబూటి అనో, గొల్లపూటి అనో, కొల్లపూటి అనో అనే అవకాశం ఉంది. ఇప్పటికీ తమిళంలో వినాయకం అనరు వినాయగం అంటారు. 'నాయగం' అనే పదానికి ఏ భాషలోనూ అర్థంలేదు. మరి పావనాశన్ శివన్ అంటారుకదా? బాబనాశన్ సిబన్ అని ఎందుకనరు? సమాధానం లేదు. శిష్యుల నోటిలో తెలుగు తెలిసినవారు ఆ భాషని మిగిల్చారు. జేసుదాస్ వంటి ప్రముఖులు– దేవగాంధారి కీర్తన "జిందల బెట్టెదవేల?" అని పాడడం నేను విన్నాను. ఈ విషయాన్ని ఇంత వివరంగా చెప్పడానికి కారణం ఉంది. ఎవరో సీనియర్ గాయకులు వినా – అందరూ ఈ అపభ్రంశాల్ని నెత్తికెత్తుకున్నవారే. తెలుగువారికి– ఆ పాట వింటున్నప్పుడు – అంత అద్భుతంగా పాడుతున్నందుకు ఆనందం, అంతటి



కారైకురిచ్చి అరుణాచలం


హరిశంకర్ ముత్తయ్య

అపభ్రంశానికి మనస్సు చివుక్కుమనడం తప్పనిసరి. కచ్చేరీ అయాక పరిగెత్తుకు వెళ్లి చెప్పాలనిపిస్తుంది. వారు చిన్నబుచ్చుకుంటారేమో. "మా గురువులు మాకిలాగే నేర్పారని ఎదురు తిరుగుతారేమో!" వారసత్వం తప్పుని ఒప్పు చెయ్యదు కదా? అపభ్రంశానికి ఆయుష్షు ఎక్కువ, మన్నిక ఎక్కువ. ప్రతీవారి నోట్లో పల్లవి బాగా పలుకుతుంది. చరణంలో అర్థం చచ్చుబడుతుంది. సంగీతం అనుశ్రుతంగా వచ్చింది కనుక, తిరువయ్యూరు నుంచి తెలుగు దేశానికి ప్రయాణంలో పదస్ఖాలిత్యాల పరంపర కూడా సహజంగా దొర్లాయి. కాగా, తమిళనాడులో ఉన్న కారణంగా త్యాగరాజస్వామి, శ్యామాశాస్త్రి కూడా ఒకటి రెండు చోట్ల వ్యాకరణం తప్పిన సందర్భాలు ఉన్నాయి. శ్యామాశాస్త్రి కీర్తన "దేవీ నను బ్రోవ"లో "నిను నమ్మిన వాడు కదా?" అంటారు. "నమ్మిన వాడను కదా" అనో "నమ్మినవాడిని కదా?" అనో ఉండాలి కదా? అయితే ఈ పాటా వ్రాసుకున్న శిష్యులదేమో! ఇది కేవలం ఒక పార్శ్వం. నేను చెప్పదలిచిన విషయానికి ఇది ముఖ్యమైన అంగం.

విచిత్రమేమంటే– గతశతాబ్దం పైగా ఎందరో తమిళు లు, కన్నడిగులు– తెలుగులో అద్భుతమైన కీర్తనలు చేశారు. వాటిని చిరస్మరణీయమూ చేశారు. ఇదేమిటి? వీరు తమిళు లు కదా! ప్రముఖ గాయకులు టి.ఆర్. సుబ్రహ్మణ్యం ఒక సభలో చెప్పారు. తమిళ వాగ్గేయకారుల్ని ఎవరో అడిగారట. "ఏమయ్యా, మీరు తమిళులు కదా? తెలుగులో కీర్తనలు చేస్తున్నారేం? అని. వారన్నారట: ''మా గురువులు తెలుగులో చేశారు. మేము వారిని అనుసరిస్తున్నాం" అని.

అయితే ఆర్ద్రత, భక్తి, సరళమయిన భావవ్యక్తీకరణకు తెలుగు భాష అనువుగా ఉంటుందంటున్నారు. పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ తెలుగులోనే కీర్తనలు చేశారు.

ఇప్పుడు ఈ వ్యాసానికి కారణం ఉటంకిస్తాను. త్యాగరాజస్వామిని ఆపోశన పట్టి, ఆరాధించి, భగవంతుడ్ని చేసుకుని ఉపాసించి- తమ జీవన విధానంలో భాగం చేసుకున్నారు తమిళులు. చెన్నై టెలిఫోన్ డైరెక్టరీ తీస్తే 'త్యాగరాజు' పేర్లు కొన్ని వందలు కనిపిస్తాయి. త్యాగరాజస్వామి కృతుల మీద కొన్ని డజన్ల డాక్టరేట్లు జరిగాయి. కొందరు త్యాగరాజ కీర్తనల బాణీల్లోనే తమిళంలో కీర్తనలు చేశారు. అంతేకాదు. ఆ భాషమీదా, భావం మీదా కుతి తీరక తెలుగులోనే ఎందరో కృతులు చేశారు. పాపనాశన్ శివన్ అద్భుతమైన వాగ్గేయకారుడు. ఆయన కృతుల్లో త్యాగరాజకృతుల ఛాయలు కనిపిస్తాయి. ఆయన మనతరం మనిషి. 1972లో చెన్నైలో కన్ను మూశారు. నేను 1972లోనే మద్రాను చేరాను. మైలాపూర్‌లో పాపనాశన్ శివన్ వీధిముందు నుంచి వెళ్తున్నప్పుడల్లా "అయ్యో! ఆ రోజుల్లో తెలిస్తే వారిని దర్శించుకునే అదృష్టం కలిగేదే!" అని నేనూ మా ఆవిడా వాపోతూ ఉంటాం. ఆయన కృతులు అపురూపమయినవి. గొప్పవీను.

అనలు బాధ ఇది. మన తెలుగు కీర్తనలన్నీ- త్యాగరాజు, శ్యామాశాస్త్రి, రామదాసు మొదలైన వారిని తమిళులు తమ భాషలో ప్రచురించుకున్నారు. జీవితమంతా తెలుగులోనే కీర్తనలు చేసిన పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ కీర్తనలు తెలుగులో లభించవు- పుస్తకరూపేణా! అలాగే పాపనాశన్ శివన్ కృతులు. ఇది ఒక పార్శ్వం. మరి ఈ తమిళులు తెలుగులో రాసిన వందల కృతుల మాటేమిటి?



మైసూర్ వాసుదేవ అయ్యర్



పినాకపాణి

వాటిని వింటున్నప్పుడు శరీరం పులకరిస్తుంది. వీటిని ఆంధ్రేతరులు ఇంత కమిట్‌మెంటుతో, భక్తితో రాశారంటే గర్వమూ, ఆశ్చర్యమూ కలుగుతుంది. ఇవన్నీ గ్రంథస్తం కాలేదు సరికదా తెలుగుదేశంలో చాలామంది గాయకులకే తెలియవు. నేను కొందరు గాయకుల్ని అడిగాను. వారికి కొన్ని తెలును. తమ గురువులు చెప్పినవి మాత్రం పరిచయమున్నాయి. మిగతావి తెలియవు. ధర్మపురి సుబ్బరాయర్ జావళీలన్నీ తెలుగులో రాసినవే. ఆయన తంజావూరి వాడు. వీణ ధనమ్మ సమకాలికుడు. ఈ కృతుల్ని విని విని, ముచ్చటపడి- అయ్యో ఇవెక్కడ దొరుకుతాయని తిరిగి తిరిగి, వేసారి- కనీనం కృతుల వివరాలు తెలుస్తాయని, విన్నంతవరకూ నేను రాసిపెట్టుకున్నాను. కనీసం తీగె లాగితే డొంక కదులుతుందికదా?

నేను గమనించిన మరో విచిత్రమైన విషయం. కచ్చేరీ వర్ణంతో ప్రారంభమవుతుంది. జావళీతో ముగుస్తుంది. వీణ కుప్పయ్యర్, తిరువట్రియూర్ త్యాగయ్యర్ (త్యాగరాజస్వామి కాదు) వంటివారు రాసిన వర్ణాలు శృంగార ప్రాధాన్యాలు. జావళీ ఎలాగూ శృంగార ప్రధానమే కదా? అంటే- ప్రతి కచ్చేరీ శృంగార ప్రధానమైన తెలుగు వర్ణంతో ప్రారంభమై, శృంగార ప్రధానమైన తెలుగు జావళీతో ముగుస్తుంది. ఎంత ప్రయత్నించినా వర్ణంలో సాహిత్యం పూర్తిగా అర్థం కాదు. ఇవి కాక మిగతా కృతులు. ఈ సాహిత్యాన్ని గుర్తించి, వ్రానుకుని, బాణీలను నొటేషన్లుగా రాసి, రికార్డు చేసుకుని భావితరాలకు అందిచాల్సిన బాధ్యత ఎంతయినా ఉంది. ఇవన్నీ గొప్ప కీర్తనలు. ఇది వరకు లేని సౌకర్యం- వీడియో మనకు చాలా కొంగు బంగారం. ఇప్పటికీ సీనియర్ గాయకుల



ఎమ్మెల్ వసంతకుమారి

నోళ్లలోనే ఉన్న- లేదా వారు రాసిపెట్టు కున్నారేమో- ఈ కీర్తనలను, వారిచేత పాడించుకుని, రికార్డు చేసుకుని- పాఠాంతరాలను తెలుసుకుని (వారంతా ఆంధ్రేతరులు కనుక ముందు చెప్పిన వైక్లభ్యాలు కొన్ని ఉండవచ్చు) పుస్తకాలుగా, సిడీలలో భద్రపరుచు కోవలసిన అవసరం ఎంతయినా ఉంది. ఇది ఆంధ్రేతరలు మన భాషమీద మక్కువతో, భక్తితో అర్పించిన నివాళి. గొప్ప సంపద. వీరెవరు? జి.ఎన్.బాలసుబ్రహ్మణ్యం (రమా రమణ భారమా నన్ను బ్రోవ-వసంత భైరవి), మైసూర్ వాసుదేవాచార్ ('శంకరాభరణం' సినిమా పుణ్యమా అని 'బ్రోచేవారెవరురా' ప్రేక్షకులకు గుర్తుండే ఉంటుంది), హరికేశనల్లూర్ ముత్తయ్యా భాగవతార్ (చాలమేల చేసేవు-వర్ణం-నారాయణ గౌళ)- ఇవి కేవలం నమూనాలు. అలాగే మనంబుచావిడి వెంకట సుబ్బయ్యర్, పూచి శ్రీనివాస అయ్యంగార్, గర్భపురి వాసర్ (కరూర్ దక్షిణామూర్తి), తంజావూరు పొన్నయ్యపిళ్లె, శ్రీరంగం రంగస్వామి పిళ్లె, వాలగంబాడి రంగనాథ అయ్యర్, అన్నయ్యా పిళ్లె, నిన్న మొన్నటి లాల్‌గుడి జయరామన్, అంబుజం కృష్ణ, పచ్చిమిరియం ఆది అప్పయ్యా- మళ్లీ ఈ జాబితా కేవలం ఉదాహరణలు మాత్రమే.

ఈ కృతులన్నీ సీనియర్ గాయకుల నోళ్లలో ఉన్నవీ, నేను తమిళనాట కచ్చేరీలలో విన్నవీను. సంజయ్ సుబ్రహ్మణ్యం, టి.ఆర్. కృష్ణ, ఆర్. వేదవల్లి వంటివారు ఇంకా పాడుతున్నారు. ఇప్పుడిప్పుడు ప్రాంతీయ భాషా వ్యామోహం గాయకుల్లోనూ కనిపిస్తోంది. అందువల్ల ఈ కృతులు అరుదుగా విని పిస్తున్నాయి. ఇప్పుడు తొందరపడి గ్రంథస్థం చేసుకోకపోతే పూర్తిగా కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉంది. నేను ఈ ప్రసక్తిని టి.ఆర్. సుబ్రహ్మణ్యం గారితో తెచ్చినప్పుడు - ఆయన



ఎమ్మెస్ సుబ్బులక్ష్మి

ఒక్క క్షణం ఆశ్చర్యపడి - 'ఇది మంచి ఆలోచన, మద్రాసు యూనివర్సిటీలో ఎం.ఫిల్. చేయిస్తాను' అన్నారు. వారికది చాలు. కాని మనకి ఇది కొన్ని పి.హెచ్‌డి పట్టాలకి సరిపోయేంత పరిశోధన. ఈ వాగ్గేయకారులెవరు? వీరు తెలుగులో వ్రాయడానికి స్ఫూర్తి ఏమిటి? ఇతివృత్తాల్ని ఎలా సాధన చేశారు? తెలుసుకో గలిగిన ఆసక్తి కరమయిన విషయాలు. ఇప్పుడిప్పుడు ప్రతీ విశ్వ విద్యాలయంలోనూ సంగీత విభాగాలున్నాయి. అవి ఈ కార్యక్రమాన్ని ఒక ప్రాజెక్టుగా చేపట్టి- మూడు నాలుగు డాక్టరేట్లు చేయించాల్సిన అవసరం ఉంది. ఆయా సీనియర్ గాయకుల వెంటబడి పాడించుకుంటే ఆయా వాగ్గేయకారుల కథలు, మరిన్ని కృతులు బయటపడవచ్చు.

తమిళనాడులో ఎందరో సీనియర్ గాయకులున్నారు. టి.ఆర్. సుబ్రహ్మణ్యం (తొంభైయోయపడి), ఆర్.వేదవల్లి, ఆర్.కె.శ్రీకంఠన్, టి.ఎన్. కృష్ణన్, టి.వి. గోపాల కృష్ణన్, వరూర్ అనంతరామయ్యర్, ఎమ్మెస్ గోపాల కృష్ణన్, నుగుణా పురుషోత్తమన్ లాల్‌గుడి జయరామన్, నుగుణా వరదాచారి, - ఇంకా ఇంకా ఎందరో!



ఉస్తాద్ నజాకత్ అలీ ఖాన్

తమిళనాట ఆంధ్రేతరుల సృష్టించి ఇచ్చిన ఈ సంపద ఎంతో విలువయింది. ఎవరయినా ఈ ఉద్యమానికి పూనుకుంటే నా దగ్గర ఉన్న కీర్తనల జాబితా యివ్వగలను. ఈ సీనియర్ గాయకుల వివరాలను చెప్పగలను. ఇది పొరుగు భాషల వారు సృష్టించిన, మనం దక్కించి నిలుపుకోవలసిన సంపద.

అన్నమయ్యని రెండు శతాబ్దాలు ఆలస్యంగా వెదికి- రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, వేటూరి ప్రభాకర శాస్త్రిగార్ల ధర్మమా అని- చిరస్మరణీయం చేసుకున్నాం. రెండు శతాబ్దాల కాలంలో మరుగున పడిపోబోతున్న ఈ సంపదను మనం పునరుద్ధరించుకోవాలి. సంగీతాన్ని ప్రేమించే ఆంధ్రేతరులయిన వాగ్గేయకారుల ఈ సృష్టి- 'సుందర తెలుంగు' అనే భారతియార్ ప్రశంసని నెత్తికెత్తుకున్న మనం ఈ సంపదని మిగుల్చుకోలేకపోతే- ముందు తరాలు మనల్ని క్షమించవు. ◉

# అట్టమీద బొమ్మలు

*ముఖచిత్రం :* రాజరాజ నరేంద్రుడు ...



**రాజకులైక భూషణుఁడు, రాజమనోహరుఁ డన్య రాజ తే**
**జోజయశాలి, శౌర్యుఁడు, విశుద్ధ యశశ్శరదిందు చంద్రికా**
**రాజిత సర్వలోకుఁ డపరాజిత భూరి భుజాకృపాణ ధా**
**రా జల శాంత శాత్రవ పరాగుఁడు, రాజమహేంద్రుఁ డున్నతిన్.** – *నన్నయభట్టారకుడు*

**రాజరాజ నరేంద్రుడు :** తూర్పు చాళుక్య వంశానికి చెందిన రాజరాజ నరేంద్రుడు రాజమహేంద్రవరం (ఇప్పటి రాజమండ్రి) ముఖ్యకేంద్రంగా వేంగిరాజ్యాన్ని పరిపాలించాడు. రాజరాజ నరేంద్రుడు తాము చంద్రవంశపు రాజులమని చెప్పుకున్నాడు. తమ పూర్వీకులైన చంద్రవంశపు రాజుల ఇతిహాసమైన మహాభారతాన్ని, అప్పటికి వెయ్యి సంవత్సరాల క్రితం నుంచే ప్రజల నాలుకపై వినసొంపైన భాషగా ఉన్న తెలుగులో గ్రంథంగా వ్రాయమని నన్నయభట్టును కోరటం, ఆయన దానికి శ్రీకారం చుట్టటం మన మెరిగినదే. తెలుగు మహాసభలు, మరో మారు తెలుగు గడ్డపై జరుపుకుంటున్న ఈ శుభ సందర్భంలో ప్రప్రథమ తెలుగు కవితా పోషకుడైన రాజరాజ నరేంద్రుని స్మరించి జేజేలు పలుకుదాం.

*చిత్రకారుడు* – ఎమ్. రాజాజి రాజమండ్రిలో 1897వ సంవత్సరంలో జన్మించిన దామెర్ల రామారావు చిత్రకళా ప్రపంచంలోకి ఒక కాంతిపుంజంలా చొచ్చుకొచ్చాడు. ఆయన చిత్రాలు చూసిన ఎందరో చిత్రకళపట్ల ప్రభావితులైనారు. చిత్రకళకు రాజమండ్రిని ముఖ్యకేంద్రంగా చేయాలన్న తలంపుతో దామెర్ల రామారావు తన మిత్రులు సహాధ్యాయులు అయిన భగీరథ, చామకూరు, వరదా వెంకటరత్నం వంటి వారితోడ్పాటుతో Andhra Society for Indian Artను రాజమండ్రిలో స్థాపించారు. ఆయన అకాల మరణానంతరం దానికి వన్నె తగ్గకుండా వరదా వెంకటరత్నం చిత్రకళలో ఎందరో విద్యార్థులను తయారు చేశారు. అందులో ముఖ్యులు ఎమ్. రాజాజి. 1966వ సంవత్సరంలో వరదా మరణానంతరం రాజాజి చేతుల మీదుగా ఆ సొసైటీ ఎందరో చిత్రకారులకు తర్ఫీదునిచ్చింది. రాజాజీ గొప్ప చిత్రకారుడే కాదు మంచి రచయిత కూడా. "సిద్ధహస్తుడు దామెర్ల రామారావు జీవితం కళాకృతి" అనే పేరుతో పుస్తకాన్ని రచించారు. చిత్రకళలో ఆయనిది పూర్తిగా దామెర్ల వారి ఆంధ్రా శైలి. కొందరికి వారి అర్హత కంటే తక్కువ పేరు వస్తుంది. ఆ కోవలోని వాడే రాజాజి. పేరు, కీర్తి ప్రతిష్ఠలపై ఆయనకున్న నిర్లిప్తత దీనికి కారణం. ఆయన వేసిన కొన్ని చిత్రాలు రాజమండ్రిలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలో ఇప్పటికీ చూడవచ్చు. ఈ రాజ రాజనరేంద్రుని చిత్రం మొదటి తెలుగు ప్రపంచ మహా సభల ప్రత్యేక సంచికకోసం చిత్రించాడు.



***రెండవ అట్ట : వెలుగు బండి...***

*చిత్రకారుడు* – సి. యన్. చామకూరు.

ఈ చిత్రంలో తెల్లటి వెలుగులో దాగున్న సప్తవర్ణాలకు ప్రతీకలుగా సప్తాశ్వాలు చిత్రించ బడ్డాయి. ఈ రథాన్ని లాగే ఏడుగుర్రాలు వైదిక ఛందస్సులు, వాటి పేర్లు గాయత్రి, బృహతి, ఉష్ణిక, జగతి, త్రిష్టుప్, అనుష్టుప్, పంక్తి. ఆ రథచోదకుడు అనూరుడు (గరుత్మంతుని అన్న). ఆ రథం పైభాగంలో ఆశీనుడైన సూర్యుడు, ఆయన్ని నిత్యం అనుసరించే సహచరిణి ఛాయ; రథానికిరు ప్రక్కలా బాణాలు వదులుతూ చీకట్లును పారద్రోలుతున్న అప్సరసలు ఎంతో ప్రతిభావంతంగా చిత్రించబడ్డారు. ఇందులో ప్రాక్, పశ్చిమ ధోరణులు రెంటికి సమతుల్యం పాటించ బడింది. ఇది దామెర్లవారు మనకందించిన శైలి. చిత్రకారులైన చామకూరు, దామెర్ల వారి మిత్రులు, సహచరులు.



***మూడవ అట్ట : బసవన్న ...*** *చిత్రకారుడు* – గిరిధర్ గౌడ్

***నాల్గవ అట్ట :*** **సంక్రాంతి...**



*చిత్రకారుడు* – పి.కె. రాజు, గత యాభై సంవత్సరాలుగా తనదైన శైలిలో అత్యున్నత స్థాయిలో చిత్రాలను అందించిన ప్రఖ్యాత వ్యక్తి. హైదరాబాదు నివాసియైన రాజుగారు అనేక జాతీయ అంతర్జాతీయ అవార్డులను అందుకొన్నారు. ఈ చిత్రం జానపద శైలిలో వేయబడింది. పల్లెటూరు అందానికి, అమాయకత్వానికి అద్దం పట్టేలా అంతే నాజూకు రేఖలు సొగసైన ముఖాకృతులతో ఆయన చిత్రాలు మనల్ని అబ్బుర పరుస్తాయి. ఆయన వందల (వేల) సంఖ్యలో చిత్రాలు వేసి మనదైన గ్రామీణ చిత్రకళపై ఎందరికో అనురక్తిని కలిగించారు.

# లేపాక్షి



లేపాక్షి గ్రామంలో ప్రవేశ ప్రదేశంలో ఒక అద్భుతం దర్శనమిస్తుంది! అది మిమ్మల్ని చిరునవ్వుతో ఆహ్వానిస్తుంది. ఇరవై అడుగుల ఎత్తు, ముప్పయి అడుగుల పొడవు గల ఏకశిలా సుందరుడు బసవయ్య కూర్చుని ముసిముసి నవ్వులతో ముద్దులు మూటగట్టినట్లుంటాడు. కాళ్ళు ముడుచుకొని, ప్రశాంత వదనంతో అర్ధనిమీలిత నేత్రాలతో ఏదో ఆధ్యాత్మిక ముద్రలో వున్నట్లుంది. ఠీవిలో ప్రశాంతత, మోములో సొంపు, మెడనూలి సొగసు, చిరుగజ్జలు మ్రోగుతున్నాయా అను భ్రమ, పెద్ద గంటల పేరు ప్రకంపనలు, సింహ తలాటపు పట్టికలోని వైచిత్రి – గిట్టలను తీర్చిన తీరు – బసవయ్యను చూసిన కొలది – ఒక్కసారిగా లేచివస్తాడా అనిపిస్తుంది. అందకే 'లేపాక్షి బసవయ్య లేత నవ్వు,,,' అన్నాడు కవి!



రంభ

కొంత దూరంలో కొలువుదీరిన లేపాక్షి దేవాలయం – శిల్ప సముదాయానికి భాండాగారం! అదొక సుందర మందిరం – చరిత్రలో శిల్పులు, విజయనగర పాలకులు, వేద విద్యాపారంగతులు, దేవదాసీలు ఈ దేవాలయ శిల్ప మందిరాలను తమ తమ విద్యలతో వర్ధిల్ల జేశారు!

క్రీస్తుశకం 1538లో విజయనగర పాలకుడైన అచ్యుతదేవరాయల ఏలుబడిలోని ప్రాంతం యిది- దేవరాయ కోశాధికారి విరూపణ్ణ. ఇతడు నంది లక్కిసెట్టి కుమారుడు. ఇతని తమ్ముడు వీరణ్ణ. అన్నదమ్ములు శివభక్తులు. తమకున్న వనరులతో సుమారు ఏడెకరాలలో ఉన్న చిన్న చిన్న గుడులను – విగ్రహాలను ఒక చోట చేర్చే వుద్దేశ్యంతో పాపనాశేశ్వరాలయం – (అప్పటికే నిర్మాణంలో వున్నట్లుంది) విరూవణ్ణ సోదరులు శిల్పులను పురమాయించి ఈ మహా సముదాయాన్ని సంకల్పించారు. ఇక్కడ శాసనం ఆధారంగా – రంగమండపం – కళ్యాణమండపం వీరు నిర్మింపచేసి – వీరభద్ర స్వామిని ప్రతిష్ఠించినట్లు తెలుస్తున్నది. అయితే అసలు కథ వేరుగా వుంది.

వీరు నిర్మింప జేసిన 'రంగమండపం' ఒక మహాద్భుత సృష్టి – కొద్దిగా హాళిబేడు సోమనాథుని ఆలయ శిల్ప పోకడలున్నా – ఈ శిల్పులు తమ కల్పనా స్వాతంత్ర్యాన్ని- ఎంతో సరళంగాను, సుందరంగాను వినియోగించి, రాతిని నాతిగా మలిచారు.

ఈ రంగమండపంలోని అరవయి నాలుగు స్తంభాలు అరవయి నాలుగు కావ్యాలు అనవచ్చు – ఇది శివ తాండవ కేళికి శిల్పరూపం. ఇది నాట్యమండపం. చతుర్ముఖ బ్రహ్మ మృదంగం వాయిస్తుంటాడు. తుంబురుడు వీణా వాద్యాన్ని



భృంగి

వినిపిస్తుంటాడు. నందికేశ్వరుడు హుడుక్కను సవరిస్తుంటాడు. దేవతలలో ఒకడు తాళం వేస్తుంటాడు. రంభ నాట్య భంగిమలో కదలు తున్నట్లుంటుంది. ఆమె సౌందర్యాన్ని ఎంత మనోహరంగా ఘనీభూతం చేశారో– మనకు అక్కడ నుంచి కదల బుద్ధి కాదు. రంభకు నాట్య భంగిమను 'ప్రాంప్టింగ్' చేస్తున్న భృంగి మూడుకాళ్లతో మరొక కోణంలో ప్రేక్షకులకు కనపడకుండా, కేవలం రంభకే సంకేతాలిస్తుంటాడు! ఇవన్నీ విడివిడి స్తంభాలపై చెక్కబడి – పద్యాలు కూర్చిన కావ్యంలా ఈ రంగమండపం అనిపిస్తుంది. ఆలయానికి ఈ రంగమండపం ఒక మహాద్భుతమైన భూషణం! దేవతల అలంకరణ పద్ధతులు – జంత్ర వాద్య విధానం – ముఖసౌందర్యం, భావ భంగిమ, నగల సహజత్వం – ఇవన్నీ శిల్పుల శాస్త్ర పరిజ్ఞానాన్ని – నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయి. మొత్తంగా ఈ రంగమండపంలో కూర్చుంటే ఈ శిల్పవిన్యాసాలన్ని మనల్ని శాంతి, సౌందర్యంతో, ప్రశాంత చిత్తుల్ని చేస్తుంటాయి.

ఆలయంలో, అన్నపూర్ణ దేవి విగ్రహంలోని మోములో ప్రశాంతత, ఆధ్యాత్మిక సంయోజన ప్రస్ఫుటమవుతుంది. భిక్షాటనకు వచ్చిన శివుని పిలుపు విని తన వస్త్రం జారిపోతున్నా పట్టంచుకోని ఆమె పారవశ్యం – భిక్ష వేస్తున్న తీరు అచ్చెరువు కలిగిస్తుంది! ఆమె భావోద్వేగాన్ని బండరాతిలో పట్టుకోవటంలోని శిల్పి చాతుర్యాన్ని అభినందించ వలసిందే. శివుని విగ్రహంలోని దృఢత్వం – శక్తి – పురుష సౌందర్యం ప్రస్ఫుటంగా ప్రదర్శించారు.

పద్మిని విగ్రహంలోని కళానిపుణత, నల్లరాతిలో నుంచి స్త్రీ సౌందర్యాన్ని వెలికి తీసిన శిల్పి నైపుణ్యానికి ఆశ్చర్య పోకుండా, కొనియాడకుండా వుండలేం.

మృత్యుంజయ కథలో మృత్యువు ఆసన్నమైన మార్కండేయుని యమపాశంతో తీసుకు పోవటానికి వచ్చిన యమదూతను శిక్షించి, మార్కండేయుని రక్షించటం – ఈ ఘట్టం ఒక కదిలే కథలా మనల్ని కట్టిపడ వేస్తుంది.

వికృత మృత్యు దర్శనంతో వణికిపోతున్నట్లు మార్కండేయుని భావోద్వేగం! శివుని విగ్రహంలోని చలనం, నాగాభరణాలు బుసలు కొట్టడం – ఇవన్నీ మన కళ్లముందు సజీవంగా నిలబడతాయి. శివుని నేత్రాలలోని ఆగ్రహం, పాద విన్యాసంలోని ఆతురతని పసిగట్ట వచ్చు. శిల్పుల నైపుణ్యం, విగ్రహాల రేఖారూప ప్రమాణాల ఔన్నత్యంలో



పారవశ్యంతో శివునికి భిక్ష వేస్తున్న పార్వతి

ఒక ఉదారత - మృత్యుపాశ భయానక దృశ్యం - అదొక అలంకార బంధం!

సిరియాలుని కథ కూడా శివ కథలలో ప్రచారంలోనిదే. శివభక్తుడైన సిరియాలుని తలిదండ్రులను పరీక్షింప మాయ యోగి రూపంలో వచ్చిన శివునికి, వారు తమ కుమారుని వధించి వండి పెట్టటం అసలు కథ! ఇది ఎంత దారుణమైన మానసిక క్షోభకు దారి తీస్తుందో మనం ఊహించటంలో అంత కష్టం లేకపోవచ్చు - కాని భక్తి పాశంతో, యోగి క్షుద్బాధను మాపటానికి, తమ బిడ్డను బలియివ్వటం ఎంత సంక్షోభ భరితం! యోగి తొందరపాటు - తలిదండ్రుల వికలమైన నైతిక సంకట స్థితి- చిగురాకులా వణికిపోతున్న సిరియాలుని భయం, ఇదీ ఆ వృత్తాంతం - ఈ యాతనాభరితమైన సన్నివేశం శిల్పులు 'చంచల' నాటకంలా మన కన్నుల ముందుంచారు! ఇది లేపాక్షి శిల్పులకు జయపతాక లాంటిది!

మనం గర్భగుడి చేరేసరికి లేపాక్షి శిల్పుల రచనా విధానం పరిచయం విస్తృతమవుతుంది. వీరి రచనా విధానం, రేఖా విన్యాసంతో ఒక అవగాహనకు వస్తాం.

గర్భగుడికి ఎదురుగా ఉన్న నల్లరాతి వీరభద్ర విగ్రహంలో సాధారణంగా కనబడే జడత్వం ఉండదు. శివలింగం, రామవిగ్రహాలు మనల్ని ఆహ్వానిస్తుంటాయి. అక్కడి దుర్గాదేవి విగ్రహం వెనక చెక్కబడిన నర్తకితో పాటు అడుగులో అడుగు కలపాలని మనకు బుద్ధి పుడుతుంది. శిల్పులకు మోహినీ విగ్రహాన్ని ఏ మారుమూలో ఉంచటం పరిపాటి. బహుశా చూపరులకు చిత్త భ్రాంతి కలుగకుండా ఉండటానికేమో!



విఘ్నేశ్వరుడు



పడగ నీడలో శివలింగం

అక్కడే నిలబడిన గణేశుని విగ్రహంలో ఒక వినూత్న తీరు, తీర్పు గమనించవచ్చు. విఘ్నేశ్వరుని గంభీరత, సర్వ విఘ్నాలను అధిగమించగల సమర్థత ప్రస్ఫుట మవుతుంటుంది. తిరిగి తిరిగి చూడాలని పిస్తుంది. సరస్వతి విగ్రహంలో కూడా సరికొత్త తీర్పు కొట్టవచ్చినట్లు కనపడుతుంది.

ఆలయ వెనుక భాగంలో ఒక కొండ రాతిలో కావ్యాన్నే రచించారు. శిల్పులకు ఆకలి వేళకు ఆహారం తయారు చేస్తున్న అవ్వ కాలయాపన చేయటంతో ఊరికే ఉండలేని కళాకారులు ఉలితో శివలింగాన్ని నిలబెట్టి ఎండ పొడ పడకుండా ఆదిశేషుని పడగనీడను కూడ చెక్కిపెట్టారు. వంట చేసి బయటకు వచ్చిన అవ్వ దృష్టిదోషంతో అక్కడి రాయి పగిలినట్లు చెప్పుతుంటారు. ఊరి మొదట్లో ముసి ముసి నవ్వులతో కూర్చుని ఉన్న బసవన్నకు ఈ దృశ్యం కనపడుతూ ఉండటం ఆశ్చర్యకరమైన విషయం. పడగ నీడలో ఉన్న శివలింగానికి దగ్గరలోనే మరిన్ని శివకథలు రచించి ఉన్నాయి. కన్నప్ప కన్నులు పెకలించుకోవటం, సాలీడు



శ్రీకాళహస్తీశ్వరుడు



పార్వతీ పరమేశ్వరుల కళ్యాణానికి ఏతెంచిన లక్ష్మీనారాయణులను స్వయంగా ఆహ్వానిస్తున్న బ్రహ్మ.

గూడు అల్లడం, ఏనుగు భక్తితో అభిషేకించటం కథలు రాతిలో కవితలు పలుకుతుంటాయి. ఇక్కడి దేవతా విగ్రహాలు, నాట్యకత్తెలు ఎంత అందంగా అలంకార భూషితంగా ఉంటారో, పుష్ప వృక్షాదులు, జంతువులు కూడా అందుకు ఏమాత్రం తీసిపోవు. ఇవన్నీ ఒక ఎత్తు పార్వతీపరమేశ్వరుల కళ్యాణమండపం ఒక వాస్తు, కళ, భావనాకౌశల్యానికి దృశ్యమాలిక. ఈ కళ్యాణమండపంలోని స్తంభాలు శిల్పుల చేతిలో కవిత్వమే పలికాయి. ఇందుకు కారణం తొంభైఆరు రేఖాగణిత చిత్రకల్పనను వారు సృష్టించడమే. చతుర్ముఖ బ్రహ్మ స్వయంగా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణానికి ఆహూతులను ఆహ్వానిస్తుంటాడు. అష్టదిక్పాలకులు తమ తమ దిక్కులకు ఏలికలై కాపలా కాస్తుంటారు. మనుష్య ప్రమాణంలో ఉన్న రాజర్షులు, బ్రహ్మర్షులు పెళ్ళికి తరలివస్తారు. వారి ముఖాలలో కనిపించే ఆనందం కళ్యాణ శోభను మరింతగా వెలిగిస్తుంది. ఋషి విగ్రహాలలోని ప్రశాంతత, ఆధ్యాత్మికత మనం దర్శించవచ్చు. వారు మనల్ని ఆశీర్వదించటానికే కదిలి వచ్చారా అనిపిస్తుంది. రాజర్షుల కిరీటాల రమణీయత, బ్రహ్మర్షుల నిడుపాటి జటలు ఎంతో నేర్పుతో తీర్చి దిద్దారు. కళ్యాణమండపంలో ఒక శోభాయమానమైన వాతావరణం, గిరిజా పరిణయదృశ్యం ఆనందపారవశ్యాన్ని కలిగిస్తుంది. చివరకు వధువు తలమీద పోస్తున్న తలంబ్రాలు కూడ ఎంతో నేర్పుగా మలచబడినవి.

మన దురదృష్టం ఈ కళ్యాణమండప నిర్మాణం నిరాఘాటంగా సాగలేదు. పైకప్పు పూర్తి కాకుండానే ఇది ఆగిపోయింది. అందుకు చాలా కారణాలే చెప్తారు. విరూపణ్ణ, వీరణ్ణ సంకల్పించిన ఈ ఆలయ నిర్మాణానికి సహజంగానే ఎంతో సొమ్ము ఖర్చవుతుంది. కాని అచ్యుత దేవరాయలు అంతరంగికులు కొందరు ఈర్ష్యతో, తమ పలుకుబడితో ఈ సోదరుల మీద రాజధనాగారంలోని సొమ్ము దుర్వినియోగం చేస్తున్నారని కుట్రపూరితంగా అభియోగం మోపారు. సహజంగానే దూరాన ఉన్న ప్రభువు ఆగ్రహావేశపరుడై విరూపణ్ణను బంధించి కన్నులు ఊడబెరకమని ఆజ్ఞాపిస్తాడు. ఈ శిక్ష, అవమానాన్ని భరించలేక విరూపణ్ణ తనంత తానే కన్నులు ఊడబెరుక్కొని అచటి గోడకు విసిరి కొట్టడం ఒక విచిత్ర సంఘటన. కన్నులు తగిలినచోట గుంటలు పడటం, రక్తం కారటం ఇప్పటికీ వున్నా మనం నమ్మలేని కథలు. విశాలనేత్రాలతో, మరింత విశాలదృక్పథంతో ఈ దేవాలయ సత్యరూపాన్ని శిలారూపాలతో నింపివేసిన విరూపణ్ణకు ఇటువంటి శిక్ష మనం ఊహించలేనిది. అంధుడైన అతడు అప్పటికీ ఆలయాన్ని విడువలేక కొద్దికాలం అక్కడే తారాడుతూ తనువు చాలించాడని ఇక్కడి కథ. అందుకే దీనికి లేపాక్షి అని, అంటే 'అంధీ కృతాక్షి' అని పేరు వచ్చిందని కథ!



శివుని విగ్రహంలోని దృఢత్వం.

ఇక్కడితో లేపాక్షి కథ పూర్తి కాలేదు. రంగమండపం లోని గోడలు, పైకప్పు కిందిభాగం శిల్పకళకు దీటుగా చిత్రకళ కూడ మనకు ఆనందాశ్చర్యాలను కలిగిస్తుంది. సహజవర్ణాలతో అప్పటి చిత్రకారుల కుంచెలు ఆలయపు ఈ భాగాన్ని వర్ణమయం చేశాయి. స్త్రీ రూపాల సౌందర్య సంపన్నాలు, రూప, అలంకారాల్లో, పరిమాణంలో, కనుగవ సొంపులో, చిన్న నొక్కుతో ఉన్న చుబుకాలతో, సన్నని నడుముతో అజంతా చిత్రాలను గుర్తుకు తెస్తాయి. అందుకు భిన్నంగా పురుష రూపాలు లోపాలు లేకపోయినా చిత్రకారుల నిరాదరణకు, నిరాసక్తతకు నిదర్శనంగా ఉంటాయి. స్త్రీల అలంకారాలు, కొప్పుభారాలు ప్రస్ఫుటంగా ఉంటాయి. చెలికత్తెలతో సహా మహాసౌందర్యవతులను చిత్రించి ఆకాశంలో నిలిపారు ఈ చిత్రకారులు.

రామాయణ, భారత కథలను భావోద్రేక పూరితంగా దర్శింపజేశారు. వేయికి పైగా ఉండవలసిన చిత్రాలు, పైకప్పు కాలగతిలో నీరుకారి చివరకు రెండు వందల వరకు మనకు మిగిలాయి. ఇవి రంగమండపంలోను, పార్వతి శిలాశయ్యామందిరాల్లో ఉన్నాయి. ఈ రంగమండప నిర్మాత తప్పక శైవుడే అయివుంటాడని అందలి చిత్రకథలు తెలుపుతున్నాయి. అవన్నీ ప్రసిద్ధ శివలీలలకు సంబంధించినవే. భారత కథలు, పురాణ కథల్లోంచి తీసుకున్నా అప్పటి విజయనగర వాతావరణం ఈ చిత్రాల్లో పొదిగారు. అర్జునుడు మత్స్యయంత్రాన్ని ఛేదించటం. ఇది ఎంతో రమణీయంగా ప్రతిక్షణం ఏమవుతుందోనన్న ఆదుర్దా మనకు కలిగిస్తూ చూపరులను ఆకట్టుకుంటుంది. అర్జునుడు ధనుస్సు ఎక్కుపెట్టటం, బాణాన్ని సంధించటం,



లేపాక్షి చిత్రం



ఆకాశ స్తంభాలు

మత్స్యయంత్రాన్ని కొట్టడం, కృష్ణుడు అభినయంతో చూపించటం, అర్జునుని విలాసవంతమైన విలువిద్యా పాటవం, ఈ విధంగా ఒకరీతిలో వివిధ విషయ సమాహారంతో చిత్రరచన సాగుతుంది. నందీశ్వరుని వివాహం గురించి కూడా చిత్రం మనం చూడవచ్చు.

కిరాతార్జునీయం గాథ కూడ వీరు కదిలే బొమ్మలా చిత్రించారు. పార్వతి మహావీరుడైన అర్జునుని వెన్నుచూడ అభిలషించటం, ఆమె అభిలాషను తీర్చటానికి శివుడు కిరాతుని వేషంలో ధనుర్బాణధారియై రావటం, అడవిలో మాయ వరాహాన్ని సృష్టించటం, శివార్జునులిరువురు దానిని వేటాడటం, ఎవరికి వారే తావే చంపామని వాదులాటడటం, తరువాత వారి ద్వంద్వ యుద్ధం – ఈ మొత్తం సన్నివేశాన్ని పార్వతి అవలోకించటం – ఇదంతా మనకు కన్నుల ముందు కదిలే బొమ్మలా నిలిపారు ఈ చిత్రకారులు.

లేపాక్షి చిత్రాల్లో ఎక్కడా స్త్రీని నగ్నంగా చూపించలేదు. ఒక్క కిరాత స్త్రీ యొక్క కాళ్ళు మాత్రం అనాచ్ఛాదితంగా ఉంటాయి. శివుని దృఢమైన బాహువులు భయాన్ని, అభయాన్ని సూచిస్తుంటాయి. ఇటువంటివే మాధవర్మ రక్షయజ్ఞ గాథలు కూడ చిత్రించారు. నందీశ్వరుడు ప్రత్యక్షమై మరణించబోతున్న యువరాజును, రథచక్రాల క్రింద నుంచి రక్షిస్తాడు. దక్షయజ్ఞం దృశ్యంలో సతి యజ్ఞవాటిక ప్రవేశించటం, తండ్రిచే అవమానించ పడటం, ఆమె ప్రాణ త్యాగం చెయ్యటం, క్రోధంతో శివుడు తన జటాఝూటం నుంచి ఒక కేశాన్ని భూమిపై వేసి కొట్టటం, దానినుండి భయానకమైన వీరభద్రుడు ఆవిర్భవించటం, అతడు దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసి దక్షుణ్ణి సంహరించి వికట నృత్యం చేయటం – ఈ మొదలైన వన్నీ ఒక పరంపరానుగుణంగా



చతుర్ముఖ బ్రహ్మ

ఉండి చూపరులను భయభ్రాంతులను చేస్తుంది. ఇంకా పార్వతీ అంగాలంకరణ, ఆమె శివునితో చదరంగమాడటం, నర్సింహస్వామి యోగముద్రలో ఉండటం, ఇవన్ని అద్భుతమైన చిత్రాలు.

రంగమండపంలో ఒక నిర్మాణ వైచిత్రి. రెండు ఆకాశ స్తంభాలు నేలకి తాకకుండా ఏకశిలా స్తంభాలు మర్రి ఊడల్లా వ్రేలాడటం ఆశ్చర్యం గొలుపుతుంది. కళ్యాణమండపంలో పార్వతీపరమేశ్వరుల వివాహానికి విష్ణుమూర్తి సతీసమేతంగా ఏతెంచటం, అష్టదిక్పాలకులు తమ తమ దిక్కులలో వాస్తుశాస్త్ర పద్ధతిలో నిలిచి కళ్యాణమండపానికి శోభను కూర్చటం, పెళ్ళికొడుకు బాసికం కట్టుకోవటం, అరె! అరె! ఎంత అద్భుతంగా వాద్యమేళాలతో దేవగంధర్వులు కళ్యాణం జరిపించటం, ఇంత విస్తృతమైన సంఘటనను, సందర్భాన్ని - ఇప్పుడు మనం ఈవెంటు మానేజ్‌మెంట్ అంటున్నాం - బండరాళ్లలో శిల్పాలుగా మలచి, నిలిపి శివపార్వతుల కళ్యాణాన్ని నిత్యకళ్యాణంగా మార్చారు లేపాక్షి శిల్పులు. ఈ కళ్యాణమండపం ప్రక్కనే ఉన్న 64 శిలా స్తంభాలతోరణం (రెండువరుసలు) ఆహూతులకు విశ్రాంతికోసం నిర్మించినట్లుంది. ఒక్కొక్క స్తంభానికి నాలుగు ప్రక్కలా ఉన్న లతా తోరణాల రేఖావైచిత్రి చూడవలసిందే. ఈ 64 స్తంభాలపై నాలుగు వైపుల (256) శిల్పించిన తీరు, ఇప్పటికీ లేపాక్షి డిజైన్స్ పేరుతో చీర అంచులు నేసి, నేతన్నలు ప్రేరణ పొందుతున్నారు. ఈ కళ్యాణ మండపంలోని స్తంభాలన్నీ ఒక్కొక్కటి ఒక కవితారూపం, ఒక భావచిత్రం. మన దురదృష్టం దీని పైకప్పు పూర్తికాక పోవటం.

ఎంత సేపు చూసినా తనివి తీరని ఈ లేపాక్షి పాపనాశేశ్వరాలయం ప్రాంగణాన్ని వదిలి తిరిగి రావాలి కదా! మీకు ఇప్పుడు ఊరి బయట బసవన్న వీడ్కోలు చెప్పటం ఇష్టలేక తన ముఖాన్ని మరో ప్రక్కకు తిప్పినట్లు ఉంటుంది.

లేపాక్షి అనంతపురం జిల్లాలో హిందూపురానికి 10 కిలోమీటర్ల దూరాన ఉన్న గ్రామం. విజయనగర రాజుల కాలంలో ఇది ప్రసిద్ధ క్షేత్రం. 108 శైవక్షేత్రాల్లో లేపాక్షి ఒకటని స్కందపురాణం చెప్తుంది. ఇక్కడి కూర్మ శైలంమీద ఉన్న పాపనాశేశ్వరలింగం అగస్త్య మహర్షి ప్రతిష్ఠించాడని స్థలపురాణం. శివమూర్తికి ఎదురుగా రఘునాథ మూర్తియైన విష్ణువు ఉండటం విశేషం.

బెంగుళూరు–హైద్రాబాదు రహదారికి 11 కిలోమీటర్ల దూరంలో వుంటుంది. హైవే ప్రక్కన మన టూరిజం శాఖ వారు నిర్మించిన విశ్రాంతి మండపం కూడా వుంది. మి



---

ఇటీవల మా లేపాక్షి దర్శనం, మాకు అడుగడుగునా విరూపణ్ణ (గైడ్) పూసగుచ్చినట్లు చెప్పిన వివరాలు , కల్లూరు సుబ్బారావు రచన కొంత, ఆధారంగా ఈ వ్యాసం రూపొందింది. ఫోటోలన్నీ మేము తీసినవే.

**- వి. అశ్వినీకుమార్**

# బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు

*- దామెర వెంకట సూర్యారావు*

**భా**రతదేశ ధార్మిక చరిత్రలో బ్రహ్మ సమాజం ఒక మానవీయ మహోద్యమం. వసుధైక కుటుంబ భావనకు, సాంఘిక దురాచార నిర్మూలనకు, సంస్కరణ ప్రియత్వానికి, నిర్గుణ ఉపాసనా మార్గానికి ప్రతీకగా నిలిచింది.

రాజారామ్మోహనరాయ్ వెలిగించిన బ్రహ్మ సమాజ జ్యోతి కాంతుల్ని ఆంధ్రావనిలో ప్రసరింప జేసిన వారు రఘుపతి వేంకటరత్నం నాయుడు, కందుకూరి వీరేశలింగం సాహిత్యాన్ని సంస్కరణ సాధనంగా స్వీకరిస్తే, వెంకటరత్నం విద్యారంగంలో గొప్ప బోధకుడిగా నాటి యువతరాన్ని సంస్కార వంతులుగా తీర్చి దిద్దడంలో అమేయమైన కృషి సాగించారు.

20వ శతాబ్ది తొలినాళ్లలో భారతీయ విద్యారంగంలో సుప్రసిద్ధులైన వారిలో నాయుడు ఒకరు. వారి పేరు తలచుకోగానే సంస్కార వంతుల్లో ఒక వినమ్ర భావంగా గోచరిస్తుంది. ఒక సుందరమైన ప్రకృతి దృశ్యాన్నో, మనసు పొరల్లోకి సృ్పశించే పాటనో, దేవాలయ గోపురాన్నో ఆయన స్మృతి మన ముందు నిలుపుతుంది. బ్రహ్మ సమాజ సిద్ధాంతాల్లోని పవిత్రతంతా ఆయనలో మూర్తీభవించింది. ఉపనిషత్తుల దివ్యబోధనలన్నీ ఆయన ఆచరణలో జీవింప జేశారు.


**బ్రహ్మర్షి రఘుపతివెంకటరత్నంనాయుడు**

నాయుడు 1862 అక్టోబరు 1న మచిలీపట్నంలో జన్మించారు. తండ్రీ, తాతలు సైన్యంలో పని చేశారు. తండ్రి సుబేదార్ అప్పయ్య నాయుడు, తల్లి శేషమ్మ. ఆమె దయార్ద్ర హృదయిని. ఆ రోజుల్లోనే కులమతబేధాలు పాటించని మహోన్నత వ్యక్తి. వెంకటరత్నం నాయుడుపై మాతృమూర్తి ప్రభావం ఎక్కువ. నాయుడు విద్యాభ్యాసం ఉత్తరప్రదేశ్‌లోని చాందాలో ప్రారంభమైనా ఆ తర్వాత హైద్రాబాద్‌లో సరోజినీనాయుడి తండ్రి డాక్టరు అఘోరనాథ చటోపాధ్యాయకు శిష్యులయ్యారు. మద్రాసు క్రైస్తవ కళాశాలలు నవభారత విద్యావేత్త డాక్టరు మిల్లరు ప్రిన్సిపాలుగా ఉండగా వెంకటరత్నం అక్కడ విద్యార్థిగా వారికి ప్రీతిపాత్రులయ్యారు.

విద్యార్థి దశలోనే నాయుడు విగ్రహారాధనపై వైముఖ్యం ఏర్పడింది. భగవంతుడొక్కడేనని, ఆయనే లోకేశ్వరుడనీ ప్రబోధించే సూఫీ సిద్ధాంతం పట్ల మక్కువ ఏర్పడింది. సాధారణ బ్రహ్మసమాజ నాయకుడు పండిత శివనాథ శాస్త్రి బోధనల వల్ల బ్రహ్మసమాజం వైపు ఆకర్షితు లయ్యారు. ఆ రోజుల్లో సనాతనులు బ్రహ్మసమాజాన్ని ద్వేషించేవారు. సంస్కరణలను ప్రతిఘటించే వారు. ఈ విషయంలో నాయుడుకి తండ్రి నుంచి వ్యతిరేకత ఎదురైంది. బ్రహ్మ సమాజంలో చేరడమంటే మతం మారడంగా పరిగణించేవారు. వీరి కుటుంబాన్ని వెలివేశారు. నాయుడు చెక్కు చెదరలేదు. నాయుడు పవిత్రత, నిరాడంబరత, సత్య వర్తనలకు కట్టుబడిన వ్యక్తి. బ్రహ్మ సమాజం ద్వారా విశ్వైకమత్యాన్ని రూపొందించాలని ఆయన ఆకాంక్ష. బి.ఏ. చదువు కుంటుడగానే ఆయనకు శేషమాంబతో వివాహమైంది. వివాహమైన ఐదేళ్ళకు ఆమె ఆడపిల్లకు జన్మనిచ్చి

మరణించారు. ఆ తర్వాత నాయుడు యాభై సంవత్సరాలు జీవించినా కఠినమైన బ్రహ్మచర్యాన్ని అవలంబించారు. మద్రాసులో ఎం.ఏ., ఎమ్.టి పట్టాలు సాధించిన నాయుడు బందరు, హైదరాబాదు, కాకినాడ కళాశాలల్లో పనిచేశారు. ఆంగ్లోపన్యాసకులుగా నాటి విద్యార్థులపై వారి ప్రభావం అపూర్వం. షేక్స్పియరు, మిల్టన్, కార్లైలే, టెన్నిసన్ మొదలైన వారు వారి మధుర గంభీర ఉపన్యాసాల్లో సజీవంగా దర్శనమిస్తున్నట్లు విద్యార్థులు భావించేవారు. తరగతి గదిలో వారి పాఠం ఒక అపూర్వ ఆధ్యాత్మికానుభవంగా పరిగణించే వారు. భోగరాజు పట్టాభిసీతారామయ్య, ముట్నూరు కృష్ణారావు, చలం, దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేమూరు రామకృష్ణా రావు, మొదలైన నాటి ప్రముఖులెందరో నాయుడు శిష్యులు.

1904లో నాయుడు కాకినాడలో పిఠాపురం రాజా కళాశాల ప్రిన్సిపాలు పదవిని స్వీకరించారు. వెంకటరత్నం విద్యార్థుల జీవనంలోను, వారి నైతిక సంక్షేమం పట్ల శ్రద్ధ వహించే వారు. ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారు. కళాశాలలో స్త్రీలకు ప్రవేశం కల్పించారు. స్త్రీలకు, దళిత విద్యార్థులకు ఉచితవిద్యను కల్పించారు. వారి విద్యార్థులు వారిని కేవలం గురువుగానే గాక తండ్రిగా, దైవంగా ఆరాధించేవారు. వెంకటరత్నం శిష్యులమని చెప్పుకోవడం ఆరోజుల్లో గొప్ప. ప్రార్థనా, దైవం, ప్రేమ, దయ మొదలైన విషయాలపై ఉత్తేజకరమైన ప్రసంగాలు చేసేవారు.

నాయుడు భోగం మేళాలను, దేవదాసీ వ్యవస్థను నిరసించారు. మద్యపానాన్ని వ్యతిరేకించేవారు. వితంతు



కందుకూరి వీరేశలింగం

**నాటి నాయుడు శిష్యులు**



గుడిపాటి వెంకటచలం



దేవులపల్లి కృష్ణశాస్త్రి



ముట్నూరు కృష్ణారావు

వివాహం, స్త్రీ జనాభ్యుదయం, దళిత సంక్షేమం, అస్పృశ్యతా నివారణ - ఇవన్నీ వీరేశలింగం, పిఠాపురం రాజా వంటి వారి తోడ్పాటుతో నాయుడు శ్రద్ధ మూలంగా ఉద్యమ స్థాయిలో ప్రవర్తిల్లాయి.

నాయుడు కరుణార్ద్ర హృదయులు. ఒకసారి తమిళనాడులో ఒక రైల్వేస్టేషన్‌లో నలుగురు అనాధ బాలికలను చూసి వారిని ఇంటికి తీసుకు వచ్చి స్వంత పిల్లల వలె పెంచి విద్యాబుద్ధులు చెప్పించి పెళ్ళిళ్లు జరిపించారు. ఎందరో పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం అందించేవారు.

1923లో మద్రాసు శాసన పరిషత్తు సభ్యులయ్యారు. 1925లో మద్రాసు విశ్వ విద్యాలయ ఉపాధ్యక్షులుగా సుదీర్ఘ పరిణామాలు గల సంస్కరణలు ప్రవేశపెట్టారు. కాకినాడ, మద్రాసుల్లోని *బ్రహ్మసమాజం*, రాజమండ్రిలోని *హితకారిణి సమాజం*, మద్రాసులోని, *సోషల్ ప్యూరిటీ అసోసియేషన్* లలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం 1927లో తొలిస్నాతకోత్సవంలో నాయుడుని గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. నాటి ఆంగ్ల ప్రభుత్వం *నైటా పబడ్* వంటి బిరుదులతో గౌరవించింది.

1932లో వారి 70వ జన్మదినం నాడు వారి విద్యార్థులు, అభిమానులు ఆయనను 'బ్రహ్మర్షి' బిరుదుతో సత్కరించారు. బౌద్ధంలోని దయాగుణం, క్రైస్తవంలోని మానవ సేవాపరాయణత, మూర్తీభవించిన వెంకటరత్నం ఋషితుల్యులే. ఈ తెలుగు వారి సోక్రటీసు 1939 మే 26న తనువు చాలించారు.

డాక్టరు దామెర వెంకట సూర్యారావు
ఫోన్ : 9885188431

# అనువాదాల హరివిల్లు

- అంపశయ్య నవీన్

డాక్టర్ ఎల్.ఎస్.ఆర్. ప్రసాద్ ఒక అద్భుత వ్యక్తి. శస్త్రచికిత్స చేసే వైద్యుడు (కార్డియాక్ సర్జన్). ప్రవృత్తిరీత్యా చదువరుల గుండెల్లో పలికే రచయిత. ఆయన తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో పండితుడు. ఆయన సాహితీ ప్రక్రియలన్నింటిలోనూ రచనలు చేశాడు. ఆయన కవిత్వం రాశాడు, నవలలు (సైన్స్ ఫిక్షన్) రాశాడు, వ్యంగ్య రచనలు చేశాడు. స్వప్నశాస్త్రం, సంఖ్యాశాస్త్రం (న్యూమరాలొజి) లాంటి శాస్త్రగ్రంథాలు రచించాడు. ఇవన్నీ ఒక ఎత్తైతే ఆయన చేసిన అనువాదాలు - ఇంగ్లీషు నుండి తెలుగులోకి, తెలుగు నుండి ఇంగ్లీషులోకి - మరొక ఎత్తు. పోతన 'భాగవతాన్ని', ఆదిశంకరాచార్యుల 'సౌందర్యలహరి'ని, సుప్రసన్న గారి 'సాంపరాయాన్ని', రామా చంద్రమౌళి కవితల్ని, అంపశయ్య నవీన్ నవల "రక్తకాసారాన్ని" ఇంగ్లీషులోకి అనువదించాడు. ఆయన రాయటం మొదలుపెట్టింది 2002వ సంవత్సరం లోనే. పది సంవత్సరాల్లో - అంటే 2012 వరకు ఆయన రచించిన గ్రంథాల సంఖ్య అనువాదాలతో కలుపుకొని 25కు చేరింది.

ఇటీవలనే ఆయన మరొక బృహత్తర సాహిత్య కార్యక్రమాన్ని పూర్తిచేశాడు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మూడు ప్రాచీన గ్రీకు గ్రంథాలను - ఇలియాడ్, ఒడెస్సీ, గ్రీక్ ఎపిక్‌సైకిల్, రెండు లాటిన్ ప్రాచీన గ్రంథాలను - ఈనీడ్, డివైన్ కామెడి, రెండు ఇంగ్లీషు ప్రాచీన గ్రంథాలను - పారడైజ్ లాస్ట్, పిల్‌గ్రిమ్స్ ప్రొగ్రెస్, మొత్తం 7 గ్రంథాలను ఆయన తెలుగులోకి అనువదించి ప్రచురించాడు. ఈ యేడు గ్రంథాలను "పాశ్చాత్య సాహిత్యాకాశంలో వెలసిన సప్తవర్ణాల హరివిల్లు" గా అభివర్ణించవచ్చు.

గ్రీకు సాహిత్యంలో ఆదికవిగా ప్రఖ్యాతుడైన హోమర్ రచించిన రెండు గొప్ప కావ్యాలు 'ఇలియాడ్', 'ఒడెస్సీ'. భారతీయ సాహిత్యంలో 'రామాయణ, మహాభారతాలు' ఎంతగా మన సంస్కృతిలో అంతర్భాగాలుగా మారిపోయాయో, యూరోపియన్ సంస్కృతిలో ఈ 'ఇలియాడ్', 'ఒడెస్సీ' అంతగా మారిపోయాయి. అలాగే లాటిన్ కావ్యాలైన వర్జిల్ రచించిన 'ఈనీడ్', 'డాంటీ' రచించిన 'డివైన్ కామెడి'లు 'ఇలియాడ్', 'ఒడెస్సీ'లకు కొనసాగింపుగా వెలువడిన ఇతిహాసాలేనని చెప్పాలి. ఇవ్వాళ్టి యూరోపియన్ నాగరికతకు మూలాలు ఈ గ్రీకు మరియు లాటిన్ ఇతిహాసాల్లోనే ఉన్నాయని చరిత్రకారులు చెబుతారు. ఇంత ప్రాముఖ్యం గల ఈ గ్రీకు అండ్ లాటిన్ మహాకావ్యాలను తెలుగులోకి అనువదించటానికి ఇదివరకెవరూ సాహసించలేదు. సాహసానికి మారుపేరైన డా॥ ఎల్.ఎస్.ఆర్. ప్రసాద్ లాంటివారే ఆ సాహసం చెయ్యగలరు.

'ఇలియాడ్', 'ఒడెస్సీ', 'ఈనీడ్', 'డివైన్ కామెడీ' లాంటి గ్రీకు అండ్ లాటిన్ మహాకావ్యాలను తెలుగులోకి అనువదించటం చాలా కష్టసాధ్యమైన పని. అందుకు ఉభయ భాషల్లో ఎంతో పాండిత్యం, కఠోర శ్రమ, లోతైన అవగాహన కావాలి. ఇవన్నీ ఉన్న డా॥ ఎల్.ఎస్.ఆర్. ప్రసాద్ ఇంత కష్టసాధ్యమైన పనిని అలవోకగా పూర్తిచెయ్యడం నా లాంటి ఎందర్నో అబ్బురపరచింది.




***ఇలియాడ్ :***

గ్రీకు ఆదికవి హోమర్ రచించిన 'ఇలియాడ్'ను మన రామాయణ, భారతాల్లాగే ఇతిహాసం (ఎపిక్) అన్నారు. ఇతిహాసం అంటే

చరిత్రలో నిజంగా జరిగినట్టుగా భావించిన కథనే కావ్యాలుగా రచించబడే ప్రక్రియ. రామాయణంలో రామ రావణ యుద్ధం, మహాభారతంలో పాండవులకు కౌరవులకు మధ్య జరిగిన కురుక్షేత్ర యుద్ధం ఎలా ప్రధాన ఘట్టాలయ్యాయో 'ఇలియాడ్'లో గ్రీకులకు, ట్రోజన్లకు మధ్య జరిగిన యుద్ధమే ప్రధాన ఘట్టం.

క్రీస్తుకు పూర్వం 8వ శతాబ్దంలో హోమర్‌చే రచించబడినట్లు చెప్పబడుతున్న 'ఇలియాడ్' మహాకావ్యం పాశ్చాత్య కావ్యాలన్నింటికి తలమానికం లాంటిది. పదిహేనువేల పంక్తులతో 24 భాగాలుగా అత్యద్భుతమైన సంఘటనలతో ఆద్యంతం అలరించే అతి మనోహరమైన కావ్యం ఇలియాడ్.

ట్రాయ్ నగరానికి చెందిన పారిస్ అత్యంత అందగాడు. అతడు జన్మించినప్పుడు జ్యోతిష్యులు అతని కారణంగా ట్రాయ్ నగరం నాశనమౌతుందని జోస్యం చెబుతారు. ఈ కారణం వల్ల పారిస్ తల్లిదండ్రులు పారిస్‌ను అడవుల్లో వదిలేస్తారు. అఫ్రోడైట్ అనే శృంగారదేవత పెంపకంలో పెరిగి పెద్దవాడైన పారిస్ గ్రీకుల నగరమైన స్పార్టాకు అతిథిగా వెళ్తాడు. అక్కడ ప్రపంచంలోకెల్లా సౌందర్యవతిగా పేరుగాంచిన హెలెన్ అనే ఆమెను చూసి ఆమె ప్రేమలో పడ్డాడు. అయితే హెలెన్‌కు మెనెలాస్ అనే అతనితో ఇదివరకే పెళ్లయింది. మెనెలాస్ మైసీనియాకు రాజైన ఆగమెమ్నాన్ తమ్ముడు. ఒక అర్ధరాత్రి పారిస్ హెలెన్‌ను తీసుకొని ట్రాయ్ నగరానికివ వెళ్ళిపోతారు. (హెలెన్ కూడా పారిస్ ప్రేమలో పడుతుంది) దీంతో ఆగ్రహించిన గ్రీకులు హెలెన్‌ను తమకు అప్పగించమంటారు. ట్రోజన్లు అందుకు అంగీకరించక పోవడంతో గ్రీకులందరూ కలిసి ట్రాయ్ నగరం మీదకు దండెత్తుతారు. 9 సంవత్సరాలు గ్రీకులకు ట్రోజన్లకు మధ్య భీకరయుద్ధం జరుగుతుంది. ఇరుపక్షాలకు చెందిన ఎందరో గొప్పగొప్ప వీరులు ఈ యుద్ధంలో మరణిస్తారు. (ఈ యుద్ధం మన కురుక్షేత్ర యుద్ధాన్ని తలపిస్తుంది) ట్రాయ్ నగరాన్ని స్వాధీనం చేసుకోవడంలో విఫలులైన గ్రీకులు ఆ నగరంలోకి ఒక మాయాగుర్రాన్ని (ట్రోజన్‌హార్స్) పంపించి ట్రాయ్ నగరాన్ని సర్వనాశనం చేయడంతో ఈ యుద్ధం ముగుస్తుంది. ఈ మహాకావ్యాన్ని డా॥ ఎల్.ఎస్.ఆర్. ప్రసాద్ చక్కని తేట తెలుగులోకి సామాన్య పాఠకునికి కూడా అర్థమయ్యేరీతిలో అనువదించాడు.

ఇరు పక్షాల సైన్యం యుద్ధానికి సన్నద్ధమౌతున్న ఘట్టాన్ని హోమర్ కవి ఎలా వర్ణించాడో డా॥ ప్రసాద్ తెలుగులో ఇలా చెప్పాడు:

**రథాలలో తీవ్రగమ్యం కలవి యుమెలస్ అశ్వాలు పూన్చినవి**
**అపోలో సూర్యుని పెంపకంలో ఆరితేరిన జననాశ్వాలవి.**
**వయసులో, గమ్యంలో సాటిలేని వాటిని**
**ఫెరస్ మనవడు నడుపుతాడు.**
**వీరుల్లో మొనగాడు పెద్ద అజాక్స్**
**అందరికంటె వీరుడు ఎఖిల్లిస్ ప్రస్తుతం**
**యుద్ధానికి దూరంగా ఉన్నాడు.**
**అతని అనుచరులు తమ నైపుణ్యం మొద్దుబారకుండా**
**బల్లాలు విల్లమ్ములతో తమ విద్యలకు మెరుగు పెడుతున్నారు.**
**వాళ్ల అశ్వాలు తీరికగా రథాల పక్కన**
**పచ్చగడ్డి నెమరువేస్తున్నవి.**
**గుడారాల క్రింద భద్రపరచబడిన రథాలు**
**నాయకుని ఆజ్ఞకోసం ఎదురుచూస్తున్న**
**సైనికులతో అక్కడ ప్రశాంతతకు పైచేయి**
**వీళ్లు తప్ప మిగతా సైన్యసమూహం ఒక్కుమ్మడిగా కదలగా**
**భూమి అంతా అగ్నిజ్వాలలకాహుతై కంపించినట్లు కానంబడి**
**జ్యూస్ దేవుని మెరపు ప్రహారాలకు భూమి కంపించి**
**అతలాకుతలమై**
**అరిమాలోని టైఫోయియస్ రాకాసి మృగం కదిలినట్లు**
**సైనికుల కాళ్ల క్రింద నేల దద్దరిల్లింది.**
**అక్కడ ట్రోజన్లు**
**ఐరిస్ వాయువేగంగా ఇలియం చేరుకున్నది.**
**తన శిరస్త్రాణం ప్రకాశిస్తుండగా**
**పొడగరి మహాయోధుడు హెక్టార్**
**తమసైన్య అగ్రభాగాన నిలబడ్డాడు.**
**ఆ యుద్ధపాణులైన సమస్త సైన్యం**
**అతని ఆజ్ఞకై ఎదురుచూస్తున్నది.**

అయితే ఆ రెండు సైన్యాలు అలా మోహరించి ఉన్న సమయంలో ట్రోజన్ల నాయకుడు హెక్టార్ ఒక ప్రతిపాదన చేశాడు. ఈ యుద్ధానికి ప్రధాన కారకుడైన తన సోదరుడు పారిస్ హెలెన్ భర్త మెనెలాస్‌తో ద్వంద్వ యుద్ధం చేస్తాడని, ఆ యుద్ధంలో ఎవరు గెలిస్తే వారే హెలెన్‌కు, ఆమె సర్వ సంపదలకు అర్హులౌతారని అంటాడు హెక్టార్. ఆ ప్రతిపాదనకు మెనెలాస్ అంగీకరించటంతో పారిస్‌కు,

మెనెలాస్‌కు మధ్య ద్వంద్వయుద్ధం ప్రారంభమౌతుంది.

**సాయుధపాణులైన ఇద్దరు యోధులూ**
**వ్యూహాత్మకంగా ఒకరితోఒకరు భీషణ చీత్కార ధిక్కార సహిత**
**చూడ్కులు విసిరికొనుచు, చూచువారలకు ఉద్రేకోత్సాహములు**
**పెల్లుబుక, ఇరుసైన్యముల మధ్య హద్దులేర్పరిచిన**
**యుద్ధక్రీడా ప్రాంతములో చెరొకవైపు చేరుకున్నారు.**
**ఎవ్వరూ ఊహించని క్షణంలో అకస్మాత్తుగా పారిస్**
**తన చేతిలోని శక్తివంతమైన బల్లేన్ని మెనెలాస్‌పై విసిరాడు.**
**అతనంత వేగంగా వెళ్లిన ఆ బల్లెం మెనెలాస్ యొక్క దుర్భేద్యమైన**
**డాలు మధ్యకు తగిలి వంగిన మొనతో నేలవ్రాలింది.**

ఇలా ప్రారంభమైన ఈ ద్వంద్వ యుద్ధంలో పారిస్ ఓడిపోతున్న క్షణంలో ఎఫ్రొడైట్ అనే శృంగారదేవత అతన్ని రక్షిస్తుంది. ఈ ద్వంద్వయుద్ధంలో గెలుపోటములు నిర్ణయించబడకపోవడంతో ఇరుసైన్యాల మధ్య యుద్ధం తప్పదు.

ఈ యుద్ధం తొమ్మిదేళ్ళపాటు సాగి మాయాగుర్రంతో ముగుస్తుంది.

*ఒడెస్సీ :*

"ఇలియాడ్" తర్వాత హోమర్ రచించిన "ఒడెస్సీ" కావ్యం కథ ప్రారంభ మవుతుంది. ట్రోజన్ యుద్ధంలో పాల్గొన్న మహావీరుల్లో ఒకడైన ఒడిస్సిస్ (యులీసెస్) ట్రాయ్‌నగరం పతనమయ్యాక తన యుద్ధ నౌకలతో తిరుగు ప్రయాణమవడంతో 'ఒడెస్సీ' కావ్యం ప్రారంభమౌతుంది. ఎన్నో ఆటంకాలనూ, అవాంత రాలను ఎదురుకుంటూ ఒడెసిస్ 10 సంవత్సరాల తర్వాత తన మాతృనగరమైన ఇథాకాకు చేరుకుంటాడు. అతడు తన మాతృదేశంలో లేని సమయంలో అతని భార్య పెనెలోప్‌ను ఒడిస్సియస్ శత్రువులు తమను పెళ్ళి చేసుకొమ్మని వేధిస్తుంటారు. ఆమెను ఒడిస్సియస్ కుమారుడు టెలిమాఖస్ రక్షిస్తుంటాడు. స్థూలంగా ఇదీ 'ఒడెస్సీ' కావ్యంలోని కథ. ఈ ఒడెస్సీలోని ఈ మూడుపాత్రలనే నమూనాగా తీసుకొని జేమ్స్‌జాయిన్ 'యులీసెస్' అనే ఆధునిక మహాకావ్యం లాంటి నవలను చైతన్యస్రవంతి శిల్పంలో రచించాడు. ఈ ఒడెస్సీ కావ్యంలోని ఒడిస్సియస్ లేక యులీసెస్ (రోమన్లు ఒడిస్సియస్‌కు పెట్టిన పేరు) లియోపాల్డ్ బ్లూమ్‌గా, అతని కొడుకు టెలిమాఖస్ స్టెఫెన్‌డెడ్లస్‌గా, అతని భార్య పెనెలోప్ మొల్లీబ్లూమ్‌గా 'యులీసెస్' నవలలో మనకు ప్రత్యక్షమౌతారు.




*గ్రీకు ఇతిహాసచక్రం :*

గ్రీకు వాఙ్మయానికి మూడవ భాగంగా డా॥ ఎల్.ఎస్.ఆర్. ప్రసాద్ గ్రీకు ఇతిహాసచక్రం అన్న గ్రంథాన్ని వెలువ రించాడు. ఈ గ్రంథంలో ఆయన గ్రీకు భాషలో రచించబడిన పన్నెండు కావ్యాలను పరిచయం చేశాడు. ఈ గ్రంథంలో ఎపిక్ సైకిల్‌లోని పన్నెండుకావ్యాల సారాంశమే కాకుండా గ్రీకు దేవతల గురించి, ఖ్యాతిగాంచిన గ్రీకువీరుల గురించి క్లుప్తంగా పాఠకులకు పరిచయం చేశాడు. హోమర్ రచించిన ఇలియాడ్, ఒడెస్సీలను అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకంలోని వివరణలు చాలా తోడ్పడ్తాయి.




ఈ పుస్తకంలో డా॥ ప్రసాద్ ఈ క్రింది 12 గ్రీకు కావ్యాలను పరిచయం చేశాడు.

1. మహాకాయుల చరిత్ర (war of the Titans)
2. ఇడిపస్ (Oedipus)
3. థెబాయిస్ (Thebeus)
4. ఎపిగొని (Epigony)
5. సైప్రియా (Cypria)
6. ఇలియాడ్ (Iliad)
7. ఎథియోపిస్ (Aethiopis)
8. చిన్న ఇలియాడ్ (Little Iliad)
9. ట్రాయ్‌నగర విధ్వంసం (The Sak of Troy)
10. తిరుగుప్రయాణం (Return)
11. ఒడెస్సీ (Odyssey)
12. టెలిగొని (Telegony)

ఈ 12 కావ్యాల్లోని ముఖ్యాంశాల్ని పరిచయం చెయ్యడం వల్ల ఆ కావ్యాలను మనం చదవకపోయినా చదివిన అనుభూతి కల్గుతుంది.

ఈ 12 కావ్యాలను పరిచయం చేశాక ఈ గ్రంథంలో డా॥ ప్రసాద్ గ్రీకు ఆదిదేవతల్ని పరిచయం చేశాడు. ఆ తర్వాత గ్రీకుల దైత్యుల్ని పరిచయం – మన పురాణాల్లోని దేవతలకు, రాక్షసులకు ఈ గ్రీకు పురాణాల్లోని దేవతలకు, రాక్షసులకు చాలా పోలికలున్నాయని డా॥ ప్రసాద్ చెప్పాడు.

ద్వాదశ ఒలంపిక్ దేవతలైన జ్యూస్, హెరా, పొజిడాన్, డిమేటర్, ఎథెనా, డయొనెసస్, అపోలో, ఆర్టెమిస్, ఏర్స్, ఎఫ్రొడైట్, హెఫాస్టిన్, హెర్మెస్‌లను పరిచయం చేశాడు రచయిత. ఆ తర్వాత మరికొందరు గ్రీకు దేవతలను, కొందరు చిల్లర దేవుళ్ళను కూడా పరిచయం చేశాడు.

ఈ పుస్తకంలోని రెండో భాగంలో కొందరు గ్రీకువీరులను గురించిన పరిచయాలున్నాయి. ట్రిప్టొలెమస్, పెర్సియస్, జేసన్, థెసియస్, హెరాక్లిస్, ఇడిఫస్, ఎఖిల్లిస్, ఒడెసిస్, హెక్టార్, పారిస్, ఎయినీస్ లాంటి గ్రీకుకావ్యాల్లోని వీరుల్ని డా॥ ప్రసాద్ పరిచయం చేశాడు. అలాగే ఈనాటికి ఇంగ్లిషు భాషలో వాడుకలో ఉన్న కొన్ని గ్రీకు పదబంధాల్ని చెప్పి వాటి అర్థాల్ని కూడా ఈ పుస్తకం చివర్లో డా॥ ప్రసాద్ అందజేశాడు. ఉదాహరణకు అఖిలీస్ హీల్ (Achilles Heal), కాట్‌బిట్విన్ 'స్కిల్లా అండ్ చార్‌బిడీస్ (Caught between Scylla and Charybdis), ద ఫేస్ దట్ లాంఛ్‌డ్ థౌజండ్‌షిప్స్ (The face that launched thusand Ships) ట్రోజన్‌హార్స్ (Trojan Horse) లాంటి కొన్ని పదబంధాలు, వాటి అర్థాలు గ్రీకు కావ్యాల్లోని పాత్రలతో ఎలా ముడివడి ఉన్నాయో డా॥ ప్రసాద్ వివరించాడు.

**ఈనీడ్ :**




గ్రీకు సాహిత్యం మీద ఆసక్తి ఉన్న వాళ్ళందరూ తప్పకుండా చదవాల్సిన పుస్తకం ఇది. లాటిన్ భాషలో వర్జిల్ రచించిన ఈనీడ్ కావ్యానికి చక్కని తెలుగు అనువాదం.

గ్రీకు తర్వాత యూరోపియన్ భాషల్లో లాటిన్ భాష అత్యంత ప్రాచీనమైనది. లాటిన్ భాషలో వర్జిల్ రచించిన 'ఈనీడ్'కు పాశ్చాత్య సాహిత్యంలో చాలా గొప్ప గ్రంథమన్న గుర్తింపు ఉంది. ఈ 'ఈనీడ్' మహాకావ్యాన్ని డా॥ ప్రసాద్ మొట్టమొదటిసారిగా తెలుగు అనువాద సాహిత్యంలో ప్రవేశపెట్టాడు.

ఈనీడ్ కావ్యం మహావీరుడైన ఈనియస్ ప్రయాణాన్ని, ఆ ప్రయాణంలో అతడు ఎదురుకున్న సమస్యల్ని, అతని సాహసకృత్యాల్ని చిత్రిస్తుంది.

(మన రామాయణం రాముని ప్రయాణాన్ని చిత్రించినట్టుగా).

తన ఈనీడ్ కావ్య తెలుగు అనువాదానికి ముందుమాట రాస్తూ వ్యాసుడు రచించిన మహాభారతానికి, హోమర్ రచించిన 'ఇలియాడ్'కు, వర్జిల్ రచించిన 'ఈనీడ్'కు మధ్య ఉన్న పోలికల్ని గమనిస్తే చాలా ఆశ్చర్యం కల్గుతుందంటాడు డా॥ ప్రసాద్. ఈ నాలుగు కావ్యాల్లోని కథను పాత సంఘటనల్ని గుర్తుచేసుకుంటూ సాగే ఫ్లాష్‌బ్యాక్ పద్ధతిలో చెప్పడం జరిగిందనీ, అలాగే కథా ప్రారంభంలో గ్రీకులు సకల కళాధిదేవతలైన మ్యూజ్‌ను ప్రార్థించినట్టే మన భారతీయ కావ్యాల్లో ముగ్గురమ్మలను ప్రస్తుతిస్తాయని, అలాగే యుద్ధాలు జరిగేముందు ఇరువక్షాల వైరివీరులను వర్ణించటానికి మ్యూజ్‌దేవతో, హెలెన్ లాంటి స్త్రీగానీ, సంజయుడుగాని పాత్రలుగా కనిపిస్తారని గ్రీకు, లాటిన్, సంస్కృత కావ్యాలకు మధ్య ఉన్న పోలికలను డా॥ ప్రసాద్ చెప్పాడు.

ఈనీడ్ కావ్యాన్ని రచించిన వర్జిల్ క్రీ.పూ. 70–29 సంవత్సరాల మధ్య ఇటలీలో మాంటువా దగ్గరున్న ఆండెస్‌లో జన్మించాడనీ, బలిష్ఠంగా, మొరటుగా ఉండేవాడని చెప్పుకుంటారు. ఈయన 'ఈనీడ్' కావ్యాన్ని పదేళ్ళపాటు (క్రీ.పూ. 29–19 సంవత్సరాలు) రచించి పూర్తిచేశాడని, సుమారు పదివేల పంక్తులున్న ఈ గ్రంథాన్ని పదేళ్ళపాటు శ్రమించి రచించాక ఈ గ్రంథాన్ని తగలబెట్టుమని తన చివరి కోరికగా చెప్పినా, ఆనాడు ఇటలీని పాలిస్తున్న ఆగస్టస్ ప్రభువు అతని మాటను త్రోసిపుచ్చి, ఆ గ్రంథాన్ని కాపాడాడని చెప్పటానికి చారిత్రక ఆధారాలున్నాయంటాడు డా॥ ప్రసాద్.

'ఈనీడ్' కావ్యం ట్రోజన్‌యుద్ధం చివర్లో గ్రీకులు ట్రాయ్ నగరంలోకి మాయాగుర్రాన్ని ప్రవేశపెట్టడంతో ట్రాయ్ నగరం పతనం కావడంతో ట్రోజన్ వీరుల్లో ఒకడైన

ఈనియస్ తన తండ్రిని భుజాలపైకి ఎక్కించుకొని కొద్దిమంది ట్రోజన్లను వెంటబెట్టుకొని, తన మాతృమూర్తి వీనస్ ఆశీస్సులతో, నానా కష్టాలు పడి లాటిన్ తీరానికిచేరుకొని, రక్తపుటేర్ల మధ్య విజయాన్ని సాధించి రేపటి రోమన్ సామ్రాజ్యానికి పునాదులు వేసిన కథను అత్యంత కవితాత్మకంగా, రసవత్తరంగా చెబుతుంది.

ఈనియస్ సముద్ర ప్రయాణం, ఆ ప్రయాణంలో అతడెదురుకున్న కష్టాలు, డిడో రాణితో అతడి ప్రణయం, డిడోరాణి విషాదాంతం, మృతుల సామ్రాజ్యానికి వెళ్ళి తండ్రిని దర్శించటం, టర్నస్ నాయకత్వంలోని ఇటాలియన్ తెగలను ఓడించి లాటిన్ నేలపై తన రెండవభార్య లాటినస్ కుమార్తె లవీనియా పేరుమీదుగా పట్టణాన్ని నిర్మించటం మొదలైనవి 'ఈనీడ్' కావ్యంలోని ముఖ్యాంశాలు.

'ఈనీడ్' కావ్యాన్ని డా॥ ప్రసాద్ తెనిగించిన తీరును తెలుసుకోవడానికి ఆ కావ్యంలోని కొన్ని ఘట్టాలను చూద్దాం.

ట్రాయ్ నగరం ఎలా ధ్వంసమైపోయిందో చెప్పమని డిడోరాణి ఈనియస్‌ను అడిగినప్పుడు ఈనియస్ ఇలా చెబుతాడు:

"దుఃఖం.... మాటల వర్ణనల కందనంత దుఃఖం! మహారాణీ! మరపునకు వస్తున్న మహావిషాదాన్ని మరల బతికించమని కోరుతున్నావు. గ్రీకులు చరిత్ర ప్రసిద్ధికెక్కిన ట్రాయ్ నగరాన్ని ఎలా ధ్వంసం చేసారో,పునాదులతో సహా ఎలా పెకిలించివేసారో, ఆ మహాసామ్రాజ్యం మట్టిలో కలిసి, ఒక విషాదగీతమై, సంతాపగానమై శోకపు పాటగా ఎలా మారిందో చెబుతాను. ఆ భయంకర దృశ్యాల్ని, ఆ విషాద సంఘటనల్ని ప్రత్యక్షంగా చూసినవాడిని, ఆ ఘట్టంలోని సజీవపాత్రను నేను గాక ఇంకెవ్వరు ఆ వివరాలను ఉన్నదు న్నట్టుగా చెప్పగలరు?"

ఇలా ఈనియస్ ట్రాయ్ నగరపు పతనాన్ని, ఆ తర్వాత జరిగిన అనేక సంఘటనల్ని డిడోరాణికి వివరించడం ప్రారంభించటంతో ప్రారంభమైన 'ఈనీడ్' కావ్యం ఈనియస్ ఇటలీ దేశాన్ని జయించి రోమన్ సామ్రాజ్యానికి పునాదులు వేయడంతో ముగుస్తుంది. హోమర్ రచించిన 'ఇలియాడ్'కు వర్జిల్ రచించిన 'ఈనీడ్' కొనసాగింపుగానే కనిపిస్తుంది.

డా॥ ప్రసాద్ తెలుగు అనువాదం చాలా సాఫీగా, అందంగా, సరళంగా సాగింది. వర్జిల్ లాంటి మహాకవి రచించిన 'ఈనీడ్' కావ్యాన్ని లాటిన్ భాషలోనే గానీ లేక ఇంగ్లీషులో గాని చదువుకోవడానికి అవకాశం లేని ఎందరో తెలుగు పాఠకులకు ఈ అనువాదం ఎంతో ఉపయోగపడుతుంది.

**డివైన్ కామెడి :**

వర్జిల్ 'ఈనీడ్' తర్వాత మరో గొప్ప ఇటాలియన్ కావ్యం డాంటీ రచించిన 'డివైన్ కామెడి'.




డాంటీ పూర్తిపేరు డాంటీ అలిఘీరి. ఈయన 1265లో ఇటలీలోని ఫ్లోరెన్స్ నగరంలో జన్మించాడు. ప్రేమ కవిత్వంతో ప్రారంభమైన డాంటీ రచనల్లో 'విటానోవా' Vitanuova అంటే New Life అనే రచన చాలా ప్రఖ్యాతి పొందింది. బియాట్రెస్ అనే యువతి ప్రేమలో పడిన డాంటీ ఆ ప్రభావంతో ఈ కావ్యం రాశాడు. తొమ్మిదేళ్ళ వయసులో ఆమెను తొలిసారిగా చూసిన డాంటీ అతని 25వ యేట ఆమె మృతి చెందటంతో అతని కవిత్వం ఇహలోక పరలోక భావాలతో విస్తృతమైంది.

డాంటీ రచించిన 'డివైన్ కామెడీ'లోని కథాంశం భారతీయులకేం కొత్తది కాదు. భూలోకంలో పాపం చేసిన వాళ్ళు నరకలోకంలో రకరకాల శిక్షలకు గురవుతారన్న నమ్మకం ఒక్క భారతీయుల్లోనే కాదు... దాదాపు అన్ని మతాల వారిలోనూ ఉంది. మనిషి మరణించాక యేమవుతాడు? అన్న ప్రశ్న మానవులందరికీ ఎదురయ్యేదే. అతనికో ఆత్మ ఉంటుందని, ఆ ఆత్మకు మరణం లేదని, ఆత్మ ఒక శరీరాన్ని విడిచి మరో శరీరంలోకి ప్రవేశిస్తుందని మన ఉపనిషత్తులు, భగవద్గీత చెబుతాయి. అలాగే పాపులను శిక్షించటానికి నరకలోకం ఉంటుందని, పుణ్యాత్ములు స్వర్గలోకం వెళ్ళి సుఖిస్తారని మన ప్రాచీన గ్రంథాల్లో చెప్పబడింది.

డాంటీ 'డివైన్ కామెడీ' ఇటువంటి ఎత్తుగడతోటే ప్రారంభమౌతుంది. మహాకవి వర్జిల్‌తో స్ఫూర్తి పొందిన డాంటీ 'డివైన్ కామెడీ'ని అత్యద్భుతంగా రచించాడు.

భగవంతుని బృహత్‌పథకంలో మూడు లోకాలుంటాయంటాడు డాంటీ. ఒకటి: Inferno –అంటే నరకాగ్ని లోకం. పాపులందరూ ఈ లోకానికే వెళ్తారు.

రెండోది Purgatory – అంటే ప్రక్షాళనాలోకం – ఇక్కడ పాపుల్ని శుద్ధి చేసి దివ్యాత్మలుగా మార్చి భగవంతుని సన్నిధిలోకి ఎలా చేరుస్తారో వర్ణిస్తాడు డాంటీ. మూడవది: Paradise – అంటే స్వర్గలోకం. శుద్ధి చెయ్యబడి దివ్యాత్మలుగా మార్చబడిన వారు ఈ లోకంలోకి వెళ్తారు. ఇలా డివైన్ కామెడీలో మూడు భాగాలుంటాయి. ఈ మూడు భాగాల్ని ఒకేసారి డా॥ ప్రసాద్ తెలుగులోకి అనువదించి పాఠకులకందించాడు.

డాంటీ 1265లో జన్మించి 1321లో మరణించాడు.

డివైన్ కామెడిలోని నరకాగ్నిలోకపు భాగంలో మొత్తం 34 Canto లున్నాయి. మొదటి Canto లో డాంటీ వర్జిల్‌ను కలుసుకోవడం వర్ణించబడింది. ఆ తర్వాత రెండు, మూడు కాంటోలలో నరకలోకంలో వర్జిల్ డాంటీలు కలుసుకోవడం, ఆ తర్వాత రకరకాల పాపాలు చేసిన వాళ్ళకు రకరకాల శిక్షలు విధించబడటం– ఉదాహరణకు కామంతో కళ్ళు మూసుకుపోయిన వాళ్ళకు విధించబడే శిక్షలు, హింసా ప్రవర్తకులకు విధించబడే శిక్షలు – ఇలా రకరకాల పాపాలు చేసిన వాళ్ళకు రకరకాల శిక్షలు విధించబడటాన్ని మిగతా కాంటోలలో వర్ణించబడినాయి.

డివైన్ కామెడీలోని రెండో భాగం– Purgatory (ప్రక్షాళనాలోకం)లోమళ్ళీ 33 కాంటోలున్నాయి. మళ్ళీ ఈలోకంలో కూడా వర్జిల్, డాంటీలు కలుసుకోవడం, రకరకాల పాపులను శుద్ధిచేసి దివ్యాత్మలుగా మార్చడం వర్ణించబడింది. డివైన్‌కామెడీలోని మూడవభాగం – Paradise (స్వర్గలోకం) లో మళ్ళీ 33 కాంటోలున్నాయి. స్వర్గలోకంలో తొలిమజిలి చంద్రగ్రహమని, రెండవ స్వర్గం మెర్క్యురీ–బుధగ్రహమని – ఇలా పది స్వర్గాలను ఈ భాగంలో డాంటీ వర్ణిస్తాడు.

ఈ మూడు లోకాలను డాంటీ స్వయంగా చూస్తున్నట్టు ఉత్తమపురుషలో నేను అంటూ తను చూసిన దృశ్యాలను వర్ణిస్తూ ఈ కావ్యాన్ని నడిపిస్తాడు.

నరకాగ్నిలోకంలో ఎలా ప్రవేశించాడో ఇలా చెబుతాడు:

“ఎలా ఆ అడవిలోపలికి ప్రవేశించానో సరిగా గుర్తులేదు. ఏదో నిద్రలాంటి బద్ధకం నా ఇంద్రియజ్ఞానాన్ని పోగొట్టగా నేను సత్యమార్గాన్ని వదిలి దారితప్పి ఇదిగో ఈ కొండపాదాల వద్దకు చేరుకున్నాను. నన్ను నానా రకాలుగా భయపెట్టి దాదాపు చంపినంత పనిచేసిన ఈ అరణ్యపు లోయ ఇక్కడితో అంతమైనట్టుంది. వణుకుతున్న గుండెను అదిమిపట్టుకుని నేను అల్లంతదూరంలో ఓవ్యక్తి కనిపించగా నాకు చీకటిలో కాంతిరేఖ కనిపించినట్లై అతడివేపు నడిచాను. వెడల్పు భుజాలతో భూమిపైబడిన కాంతి కిరణాలతో వెలుగుతున్నవాడు, దారితప్పి తిరుగుతున్న వాళ్ళను కాపాడి రక్షిత ప్రదేశానికి తీసికెళ్ళేవాడు, ఆ మార్గదర్శి కనిపించాడు”

ఆ మార్గదర్శి మరెవరో కాదు మహాకవి వర్జిల్. వర్జిల్ మార్గదర్శకత్వంలో డాంటీ ఈ మూడు లోకాలను దర్శించినట్టుగా, అక్కడి దృశ్యాలను వర్ణించినట్టుగా డాంటీ డివైన్ కామెడీని రచించాడు.

కామంతో కళ్ళు మూసుకొని పాపులైనవారిలో డిడోరాణి, క్లియోపాత్రా, హెలెన్, ఎఖిల్లిస్, పారిస్, ట్రిస్టాన్ లాంటి వేలాది మందిని వర్జిల్ డాంటీకి చూపిస్తాడు. అలా ప్రారంభమైన వర్జిల్, డాంటీల ప్రస్థానం స్వర్గలోకంలో మేరీకన్యను దర్శించి, సూర్యుడిని, ఇతర నక్షత్రాలను నడిపించే ఆ అద్వితీయమైన శక్తి ప్రేమ (Love) అని తెలుసుకోవడంతో పూర్తవుతుంది.

**పారడైజ్ లాస్ట్ :**



మహాకవి జాన్‌మిల్టన్ రచించిన ‘పారడైజ్ లాస్ట్’, ‘పారడైజ్ రీగెయిన్డ్’ అనే రెండు గొప్ప ఇంగ్లిషు కావ్యాలను డా॥ ప్రసాద్ తెలుగులోకి అనువదించి, ఈ రెండు గ్రంథాలను ఒకే పుస్తకంగా తెలుగు పాఠకులకు అందించాడు. అలాగే మిల్టన్ సమకాలికుడైన జాన్ బున్యన్ వచనంలో రచించిన ‘పిల్‌గ్రిమ్స్ ప్రోగ్రెస్’ అనే మరో గ్రంథాన్ని కూడా డా॥ ప్రసాద్ తెలుగులోకి అనువదించి, ప్రచురించాడు. ఈ రెండు గ్రంథాలను గూర్చి డా॥ ప్రసాద్ ఇలా చెప్పాడు:

“ఇంగ్లండ్ రాజు మొదటి చార్లెస్ రాజు ఉరితీయబడిన తర్వాత ప్యూరిటన్–ఆలివర్ క్రామ్‌వెల్ పాలన, అతడు మరణించిన తర్వాత రెండో చార్లెస్ రాజుగా తిరిగి రాజరికం పునరుద్ధరించబడడం – అటువంటి కల్లోల కాలంలో రాజరికానికి వ్యతిరేకులైన ఒక మహాపండితుడి కావ్యం పారడైజ్ లాస్ట్ కాగా, ఒక సాధారణుడైన వ్యక్తి నుంచి

పెల్లుబికిన కావ్యం– 'ది పిల్‌గ్రిమ్స్ ప్రొగ్రెస్'. కవిత్వంలో జాన్‌మిల్టన్, వచనంలో జాన్‌బున్యన్‌లు అప్పటికి, ఇప్పటికీ నెంబర్‌వన్లుగా, సాటిలేనివారుగా ప్రసిద్ధికెక్కారు"

జాన్‌మిల్టన్ డిసెంబర్ 9, 1608లో జన్మించాడు. 8 నవంబర్, 1674లో మరణించాడు. చరిత్రలో రక్తపాతరహిత విప్లవంగా ప్రసిద్ధి గాంచిన విప్లవంలో మొదటి చార్లెస్ రాజును ఉరితీశాక ఆలివర్ క్రామ్‌వెల్ అధికారాన్ని స్వీకరించాడు. మిల్టన్ ఆలివర్ క్రామ్‌వెల్ పరిపాలనలో సివిల్ సర్వెంట్‌గా పనిచేశాడు. ఆయన ఇంగ్లిషు, లాటిన్, ఇటాలియన్ భాషల్లో పండితుడు. తన జీవితకాలంలోనే మిల్టన్ 'పారడైజ్ లాస్ట్' కావ్యం ద్వారా అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించాడు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను, పత్రికాస్వేచ్ఛను సమర్థిస్తూ ఆయన వచనంలో రచించిన 'ఆర్యోపజిటికా' (Areopagitica) అనే కరపత్రం చాలా ప్రఖ్యాతిగాంచింది. హోమర్, వర్జిల్‌లాంటి మహాకవులు రచించిన కావ్యాలకు ధీటుగా నిలిచే కావ్యాన్ని తనూ రాయాలని మిల్టన్ కలలుగన్నాడు. ఆ కలల ఫలితమే ఆయన రచించిన పారడైజ్ లాస్ట్, పారడైజ్ రీగెయిన్డ్ కావ్యాలు. బైబిల్‌లోని మనిషి ఈడెన్ గార్డెన్ లోంచి బహిష్కరించబటం అనే కథ ఆధారంగా మిల్టన్ ఈ కావ్యాలను రచించాడు. మాత్రాఛందస్సు (Blank Verse)లో రచించబిన 'పారడైజ్‌లాస్ట్' కావ్యం 1667లో 10 పుస్తకాలుగా ప్రచురించబడింది. 10 వేల లైన్లున్న ఈ కావ్యం 1674లో రెండోసారి ప్రచురించబడింది.

ఈడెన్ గార్డెన్‌లోంచి మనిషి పతనమయిన ఉదంతం – సాతాన్ ప్రేరేపణతో ఆదిమానవులు ఆడమ్–ఈవ్‌లు నిషేధించబడిన ఆపిల్‌పండును భుజించటంతో భగవంతునికి కోపం వచ్చి వాళ్ళను స్వర్గతుల్యమైన ఈడెన్ గార్డెన్‌లోంచి బహిష్కరించటం– అలా ఆడమ్–ఈవ్‌లు స్వర్గాన్ని కోల్పోవడం– ఇదీ 'పారడైజ్‌లాస్ట్'లోని ప్రధాన కథ.

"మనుషుల పట్ల దేవుడి పద్ధతులను సమర్థించటం కోసమే నేనీ కావ్యాన్ని రచించా"నని మిల్టన్ చెప్పుకున్నాడు. (To justify the ways of God to men) *పారడైజ్ లాస్ట్* కావ్యాన్ని డా|| ప్రసాద్ తెలుగులోకి అనువదించిన తీరు ఎలా ఉందో తెలుగు అనువాదంలోని కొన్ని పంక్తుల్ని చూద్దాం:

**"ఇది మానవుని తొలిదైవధిక్కారమూ, అవిధేయత గురించి**
**నిషేధ వృక్షపు ఫలాన్ని రుచి చూసి**
**ప్రపంచంలోని మృత్యువునూ, కష్టాల కడగండ్లనూ మన ప్రాప్తం చేసి**
**ఈడెన్ స్వర్గ ఉద్యానవనాన్ని కోల్పోవడం నుంచీ**
**మరల ఓ మహామనీషి జన్మించి మర్త్యులకు**
**సచ్చిదానంద స్వరూపమైన ఆ స్థానాన్ని**
**పునః ప్రాప్తింపజేయడం వరకు**
**గానం చేయి! ఓ సకల కళాధిదేవతా! మ్యూజ్!**
**ఒరెబ్, సినాయ్ రహస్యతలాలపై**
**నడయాడిన ఆ గొర్రెలకాపరి**
**ఎన్నిక చెయ్యబడిన సంతతికి ఎరుక చెప్పిన విషయం.**
**కేయాస్ గందరగోళం నుంచి**
**భూ ద్యు లోకాలు ఎలా వెలువడ్డాయో**
**సియాన్ పర్వతరాజం, సిలోవా సెలయేరు, కోనేరు**
**దైవ సంకల్పంతో ఎలా ఆవిర్భవించాయో వివరించు తల్లీ!**
**నేను వ్రాయబోతున్న ఈ అద్భుత సాహస గీతానికి**
**నీ స్ఫూర్తికై ప్రార్థిస్తూ, సకల కళాధిదేవతల పుట్టినిల్లైన**
**యవన పర్వత శిఖరాగ్రాన్ని అందుకునేలా**
**ఇంతవరకు సాహసించని నూతన కవితా మార్గాన పయనించేలా**
**స్వచ్ఛమై, పవిత్రమై, ప్రశాంతమైన సమస్త దేవాలయాల సాక్షిగా**
**నా మానవ సరోవరంలోకి నీ అనంతశక్తిని ప్రహోదించుము తల్లీ!"**

ఇలా సాగుతుంది డా|| ప్రసాద్ అనువాదం. చదువుతోంటే మనకు మిల్టన్ పారడైజ్‌లాస్ట్‌ను ఒరిజినల్‌లో చదువుతున్నట్టే అనిపిస్తుంది.

**పిల్‌గ్రిమ్స్ ప్రోగ్రెస్ :**

జాన్‌బున్యన్ రచించిన 'పిల్‌గ్రిమ్స్ ప్రొగ్రెస్' ను 'తీర్థయాత్రికుని ప్రగతి' పేరుతో డా|| ప్రసాద్ తెలుగులోకి అనువదించాడు.




'పిల్‌గ్రిమ్స్ ప్రొగ్రెస్' ఆంగ్లభాషలో ఒకప్పుడు బైబిల్ తర్వాత స్థానాన్ని పొందిన రచన అంటాడు డా|| ప్రసాద్. ఈ గ్రంథం రెండువందలకు పైగా ఇతర భాషల్లోకి అనువదించబడి

ప్రొటెస్టెంట్ క్రిష్టియన్లకు అత్యంత అభిమాన గ్రంథంగా పేరొందింది. "మత గ్రంథాలలో ప్రతీకాత్మక కావ్యాలలో అత్యున్నత స్థానాన్ని పొందిన అద్భుత రచన ఇది" అంటాడు డా॥ ప్రసాద్.

జాన్ బున్యన్ నవంబర్ 28, 1628లో జన్మించి ఆగస్టు 31, 1688లో మరణించాడు. ఆయన ఒక సాధారణ కుటుంబంలో జన్మించి వీధి వర్తకుడిగా, పాత్రలకు అతుకులు వేసేవాడుగా పనిచేసి తర్వాత పార్లమెంటరీ సైన్యంలో చేరాడు. చాలాకాలం దైవాన్ని తిరస్కారభావంతో చూసిన ఈయనకు ఒకరోజు కలలో దేవుడు కనిపించి "నీ పాపాలను ప్రక్షాళనం చేసుకొని స్వర్గానికి వెళ్తావో లేక నీ పాపాలతో నరకానికి వెళ్తావో తేల్చుకొమ్మని ఆజ్ఞాపించాడట. అప్పట్నించి ఈయన బైబిల్ పఠనంలో మునిగిపోయి మతబోధన ప్రారంభించాడట.

సుమారు 60 గ్రంథాలు రచించిన ఈయన నవలా రచనకు ప్రారంభకుడని రుడ్యార్డ్ కిప్లింగ్ పేర్కొన్నాడు.

'పిల్‌గ్రిమ్స్ ప్రొగ్రెస్' మొదటిసారి ఫిబ్రవరి 1678లో ప్రచురించబడింది. మత సంబంధమైన సాహిత్యంలో ఈ రచనను చాలా గొప్పదిగా, ప్రధానమైనదిగా ఆంగ్ల విమర్శకులు భావిస్తారు. ఒక లక్షా ఎనిమిదివేల రెండువందల అరవై పదాలతో నిండిన ఈ పిల్‌గ్రిమ్స్‌ప్రొగ్రెస్ రచన రెండు భాగాలుగా ప్రతీకాత్మకంగా సాగుతుంది.

క్రిష్టియన్ అనేవాడు ఈ రచనలో ప్రధాన పాత్రధారి. అతడు మొదలు 'సిటీ ఆఫ్ డిస్ట్రక్షన్ నుండి (అంటే ఈలోకం) బయల్దేరి సెలెస్టియల్ సిటీ (స్వర్గలోకం)కి చేసిన ప్రయాణం ఈ గ్రంథంలోని మొదటిభాగంలో వర్ణించబడింది.

రెండో భాగంలో క్రిష్టియన్ భార్య, కొడుకులు, క్రిష్టియన్ పరిచారిక (Maiden) చేసిన ప్రయాణం వర్ణించబడింది. ఈ రెండు భాగాల్లోనూ ఒక మనిషి తను చేసిన పాపాలను ప్రక్షాళనం చేసుకొని స్వర్గానికి ఎలా చేరుకుంటాడో ప్రతీకాత్మకంగా వర్ణించబడింది.

ఈ పుస్తకానికి ముందుమాటగా బున్యన్ 'The Author's Apology' పేరుతో రాసుకున్న భాగాన్ని డా॥ ఎల్.ఎస్.ఆర్. ప్రసాద్ ఇలా అనువదించాడు:

**"నేను కలాన్ని చేబట్టిన రోజున**
**ఒక చిన్న పుస్తకాన్నైనా ఈ విధంగా పూర్తిచేస్తాననుకోలేదు.**
**తీరా రెండో పుస్తకమూ ముగింపుకు వచ్చేసరికి**
**నేను గ్రంథరచన మొదలుపెట్టినట్టే అనిపించలేదు.**
**వృథాగా కదిలిపోతున్న రుతువుల కాలాన్ని నింపడానికో**
**పనికిరాని ఆలోచనల్నుంచి నన్ను నేను**
**పక్కకు మళ్ళించడానికో కాదు**
**కాగితం కలం చేబట్టినప్పట్నించి**
**నాలో మెదిలిన ఆలోచనలు తమంతట తామే**
**ఒక వ్యూహంగా, పద్ధతిగా రూపొందిన కమనీయ కావ్యమిది.**
**ఈ రచనలోని ప్రధానపాత్ర**
**క్రిష్టియన్ కన్న ఒక సుదీర్ఘ కలగా**
**ఈ కావ్యం రచించబడింది.**
**"క్రిస్టియన్ ఈ లోకాన్ని వదలగానే**
**ఇవాంజిలిస్టు (సువార్త ప్రబోధకుడు)**
**మరో లోకానికి స్వాగతం పలుకుతాడు.**
**అక్కడి విశేషాల్ని ఘనంగా వివరిస్తూ**
**ఇంత దిగువ నుంచి పైకెక్కడం నేర్పిస్తాడు."**

ఈ గ్రంథాన్ని రచించిన జాన్‌బున్యన్ పెద్దగా చదువుకోలేదు. సాహిత్యంతో అతనికి పెద్దగా పరిచయం కూడా లేదు. అలాంటి రచయిత కేవలం తన ఊహాశక్తితో ఈ ప్రతీకాత్మక కావ్యాన్ని రచించాడంటే ఆశ్చర్యం కల్గుతుంది. క్రిష్టియన్ పాత్రలో నిజమైన క్రిష్టియన్ ఎలా ఉండాలో బున్యన్ చూపించాడు. ఈ క్రిష్టియన్ లేక ఈ ప్రయాణికుడు (పిల్‌గ్రిమ్) సిటీ ఆఫ్ డిస్ట్రక్షన్ – అంటే నరకం నుండి సెలెస్టియల్ సిటీకి అంటే స్వర్గానికి చేసిన ప్రయాణమే ఈ పిల్‌గ్రిమ్స్ ప్రొగ్రెస్ అన్న మహాకావ్యం.

ఇలా ఈ 7 పాశ్చాత్య గ్రంథాల్ని డా॥ ఎల్.ఎస్.ఆర్. ప్రసాద్ తెలుగులోకి అనువదించి తెలుగు పాఠకులకు అందించటం అనువాదకుడిగా ఆయన సాధించిన మహత్తర విజయమని నేను భావిస్తున్నాను.

పాశ్చాత్య సాహిత్యాకాశంలో వెలసిన ఈ సప్తవర్ణాల హరివిల్లును తెలుగు సాహిత్యాకాశంలో కూడా ప్రతిష్టించాడు డా॥ ఎల్.ఎస్.ఆర్. ప్రసాద్. ఇంత బృహత్తర కార్యాన్ని అలవోకగా నిర్వహించిన ఆయనను తెలుగువాళ్ళందరూ అభినందించాలి.

---

**అంపశయ్య నవీన్,** (ప్రముఖ నవలారచయిత)
**ఫోన్** : 9989291299



## హిందూస్థానీ – కర్ణాటక
# భాత్ఖండే సంగీత పద్ధతి

– నండూరి పార్థసారథి

'సంగీతరత్నాకరం' తర్వాతి కాలంలో భారతీయ శాస్త్రీయ సంగీతంలో క్రమంగా వచ్చిన మార్పుల గురించి, కర్ణాటక–హిదూస్థానీ సంగీత పద్ధతుల మధ్య సామ్యాలను గురించి, భేదాలను గురించి, స్థూలంగా వాటి స్వభావాలను గురించి కొందరు సుప్రసిద్ధ విద్వాంసులు చెప్పిన విషయాలను పరిశీలిద్దాం.

ముందుగా విష్ణునారాయణ్ భాత్ఖండే (1860–1936) ఏం చెప్పారో చూద్దాం. ఆయన గురించి క్రిందటి (నవంబరు–2012) సంచికలో అతి క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది. నిజానికి ఆయన గురించి సుదీర్ఘవ్యాసమే రాయవలసి వున్నప్పటికీ ఈ సంచికలో కూడా ప్రస్తుత విషయానికి లోబడి క్లుప్తంగానే చెప్పుకుందాం.

భాత్ఖండే గారు ఉత్తర, దక్షిణ భారతీయ సంగీత పద్ధతులకు సంబంధించిన అతి ముఖ్యమైన 19 సంస్కృత గ్రంథాలను సంపాదించి, క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రచురించారు. వాటిని సమీక్షిస్తూ ఇంగ్లీషులో "A comparative study of some of the Leading Music Systems of the 15th, 16th, 17th & 18th centuries" అనే శీర్షికతో ఒక పుస్తకం ప్రచురించారు. అది కాక, 1916లో బరోడాలో జరిగిన ప్రథమ అఖిల భారత సంగీత మహాసభలో "A short Historical survey of the upper India" అనే శీర్షికతో ఇంగ్లీషులో సమర్పించిన ప్రసంగ పత్రం కూడా ప్రచురితమయింది. ఆ ప్రసంగ పాఠం చివరి భాగంలో ఆయన చెప్పిన విషయాలు ఇవి :

* సుమారుగా గత ఐదు శతాబ్దాల కాలంలో మహమ్మదీయ గాయకులు ప్రవేశపెట్టిన సంగీత పద్ధతే ఇప్పుడు ఉత్తర భారతంలో ఉన్నతశ్రేణి ప్రామాణిక సంగీతంగా చెలామణీ అవుతున్నది. నిరక్షరాస్యులైన, సంకుచిత మనస్కులైన ఆ గాయకుల దయాదాక్షిణ్యాలపై మన శాస్త్రీయ సంగీతం ఆధారపడవలిసి వస్తున్నది. వారికి మన ప్రాచీన లక్షణ గ్రంథాల పట్ల శ్రద్ధాగౌరవాలు లేవు. తగిన అనుకూల పరిస్థితులు లేకపోవడం వల్ల మన ఆధునిక పండితులు ఏమీ చేయలేక నిస్సహాయంగా చూస్తూ వుండి పోతున్నారు. అయితే, హిందుస్థానీ సంగీత పద్ధతిలో ఒక సువ్యవస్థను పునర్నిర్మించడానికి ఈ క్రింది ముఖ్య సూత్రాలను ప్రాతిపదికగా గ్రహించవచ్చును :

* గత మూడు, నాలుగు వందల సంవత్సరాలలో వెలువడిన సంగీత శాస్త్ర గ్రంథాలన్నీ పన్నెండు స్వరాలనే పరిగణనలోకి తీసుకున్నాయి.
* ముందుగా జనకరాగాలను నిర్ధారించి, ఇతర రాగాలన్నింటినీ వాటి జన్యాలుగా వర్గీకరించాలన్న సూత్రాన్ని ప్రాచీన శాస్త్రకారులు, ఇప్పటివారు కూడా అంగీకరిస్తున్నారు.
* రాగాలన్నింటినీ ఔడవ, షాడవ, సంపూర్ణ అనే మూడు ముఖ్యమైన జాతులుగా వర్గీకరించాలన్న విషయంలో పూర్తి ఏకీభావం వున్నది.
* ప్రతిరాగంలోనూ తప్పని సరిగా కనీసం ఐదు స్వరాలను ఉపయోగించాలి.
* ఏ రాగంలోనూ ఒకే సారి మ, ప స్వరాలను వదిలివేయ కూడదు.
* మిక్కిలి అరుదైన కొన్ని ప్రత్యేక సందర్భాలలో తప్ప ఏ రాగంలోనూ రి గ మ ధ ని స్వరాల కోమల, తీవ్ర రూపాలను పక్కపక్కన ఉపయోగించకూడదు.

(ఈ సూత్రాలన్నీ కర్ణాటక సంగీతంలో కూడా పాటించబడుతున్నాయి.)

* హిందూస్థానీ సంగీతంలో ప్రయోగంలో వున్న రాగాలన్నీ ప్రధానంగా మూడు వర్గాలుగా కనిపిస్తాయి. అవి – (1) రి, ధ తీవ్ర స్వరాలు గల రాగాలు. (2) రి, ధ కోమల స్వరాలు గల రాగాలు. (3) గ, ని కోమల స్వరాలు గల రాగాలు.
* హిందూస్థానీ సంగీతం బిలావల్‌ను శుద్ధ స్వర మూర్ఛనగా పరిగణిస్తున్నది. (ఇది కర్ణాటక సంగీతంలోని ధీర శంకరాభరణ మేళకర్తకు సమానమైనది. కాగా, కర్ణాటక సంగీతం కనకాంగి మేళకర్తను శుద్ధస్వర మూర్ఛనగా పరిగణిస్తున్నది.)
* హిందూస్థానీ పద్ధతిలో ప్రతి రాగానికి ఒక 'వాది' స్వరం – అనగా అతి ముఖ్యస్వరం – వుంటుంది. దాని ప్రయోగం ఒక ప్రత్యేక పద్ధతిలో వుంటుంది.
* వాది స్వరం యొక్క స్థానాన్ని బట్టి హిందూస్థానీరాగాలు పూర్వ, ఉత్తర అనే రెండు వర్గాలుగా వుంటాయి. (వీటిని పూర్వాంగ ప్రధాన రాగాలు, ఉత్తరాంగ ప్రధాన రాగాలు అంటారు. ప్రతి రాగంలోనూ 'సరిగమ' పూర్వాంగం, పధనిస ఉత్తరాంగం.)
* మానసిక స్థితి (మూడ్) ని బట్టి పగటి రాగాలనీ, రాత్రి రాగాలనీ మరో వర్గీకరణ.
* హిందూస్థానీ సంగీతంలో తీవ్ర మధ్యమానికి ప్రత్యేక ప్రాముఖ్యం ఉంటుంది. రాగ సమయాన్ని నిర్ధారించడానికీ, తాళం ఎంపికకూ అదొక ఆధారంగా ఉపయోగపడుతుంది.
* ఉదయ సంధ్యలో, సాయం సంధ్యలో (సూర్యోదయ, సూర్యాస్తమయ వేళల్లో) గానం చేయదగు రాగాలను సంధి ప్రకాశరాగాలని అంటారు. ఇవి కోమల 'రి', కోమల 'ధ' స్వరాలు గల రాగాలై వుంటాయి.
* కోమల 'గ', కోమల 'ని' స్వరాలు గల రాగాలు మధ్యాహ్నం వేళ, మధ్య రాత్రివేళ గానం చేయదగినవి.
* హిందూస్థానీ సంగీత కళాకారులు తమ మనోధర్మానుసారం వివాది స్వరాలను ప్రయోగిస్తూ వుంటారు. (వాటి ప్రయోగం పూర్తిగా నిషిద్ధం కాదు – ఔచిత్యవంతంగా, అరుదుగా ప్రయోగించవచ్చు.)
* 'పూర్వ' రాగాల అందాల ఎక్కువగా ఆరోహణలోనూ, 'ఉత్తర' రాగాల అందాలు ఎక్కువగా అవరోహణలోనూ ప్రకటితమవుతూ వుంటాయి.
* సంధిప్రకాశ రాగాలకు ముందుగా– అంటే పగలు మూడవ జాములో, రాత్రి మూడవ జాములో – గానం చేయదగు రాగాలలో స, మ, ప స్వరాలకు ప్రాధాన్యం వుంటుంది. వాటిలో ఏదో ఒకటి ఆ రాగాలలో వాది స్వరంగా వుంటుంది. ఆ రాగాలలో ఆ స్వరాలు దీర్ఘ స్వరాలుగా గానం చేయబడుతాయి.
* ప్రాత:కాల సంధిప్రకాశ రాగాలలో రి, ధ స్వరాలను రెండింటినీ పూర్తిగా వర్జించడం జరగదు. అలాగే సాయంత్రపు సంధి ప్రకాశ రాగాలలో గ, ని స్వరాలను రెండింటినీ పూర్తిగా వర్జించడం జరగదు.
* హిందూస్థానీ గాయకులు, కర్ణాటక గాయకులు ప్రయోగించే గమకాలు, నగిషీ స్వరాలు పూర్తిగా భిన్నమైనవి.
* వారి రాగాలాపన పద్ధతులు కూడా భిన్నమైనవి.
* వారు గానం చేసే రచనల స్వరూపాలు భిన్నంగా వుంటాయి.
* హిందూస్థానీ సంగీతంలో విభిన్నరాగాల కళాత్మకమేళనాలకు అవకాశం వుంది. కర్ణాటక సంగీతంలో అటువంటి మేళనాలకు ఆస్కారం లేదు.
* హిందూస్థానీ, కర్ణాటక సంగీతాలలో తాళ పద్ధతులు కూడా భిన్నంగా వుంటాయి.
* హిందూస్థానీ సంగీతంలో తాళం కంటే రాగానికి ప్రాధాన్యం వుంటుంది. కర్ణాటక సంగీతంలో రాగం కంటే తాళానికి ప్రాధాన్యం వుంటుంది.

కర్ణాటక సంగీత పద్ధతికొక ప్రామాణిక లక్షణ గ్రంథంగా *చతుర్దండి ప్రకాశిక* ను రచించిన వెంకటమఖిని మహామేధావిగా భాత్ఖండే గారు ప్రస్తుతించారు. అయితే, వెంకటమఖి ప్రతిపాదించిన 72 మేళ కర్తలలో హిందూస్థానీ సంగీతం కోసం పదింటిని మాత్రం ఆయన స్వీకరించి ఒక కొత్త పద్ధతిని రూపొందించారు. 12 స్వరాల ప్రాతిపదికపై 72 మేళకర్తలు ఏర్పడడానికి అవకాశం వున్నప్పటికీ దాక్షిణాత్యరాగాల వర్గీకరణకు 19 మేళకర్తలనే వెంకటమఖి ఎంచుకున్నారనీ, అలాగే ఇప్పుడు హిందూస్థానీ గాయకులు సుమారుగా రెండు వందల రాగాలను మాత్రమే గానం చేస్తున్నందున వాటి వర్గీకరణకు తాను పది థాట్ (మేళకర్త) లను మాత్రం

ఎంపిక చేసుకున్నాననీ, విద్యార్థులు తేలికగా గుర్తుపెట్టుకోడానికి వీలుగా వాటికి లక్షణ గీతాలు రచించాననీ భాత్ఖండే గారు తన ప్రసంగ పత్రంలో తెలియజేశారు. 1916లో అఖిలభారత సంగీత మహాసభ జరిగే నాటికే ఆయన రచన 'హిందూస్థానీ సంగీత పద్ధతి' ప్రచురితమయింది.

భాత్ఖండే గారు ఎంపిక చేసిన పది థాట్‌లు, వాటికి సమానమైన కర్ణాటక సంగీతమేళకర్తలు ఇవి : (ఆయన తన ప్రసంగ పాఠంలో పేర్కొన్నవి.)

| హిందూస్థానీ థాట్ | - | కర్ణాటక మేళకర్త |
|---|---|---|
| 1. యమన్ | - | శాంత కళ్యాణ |
| 2. బిలావల్ | - | ధీరశంకరాభరణ |
| 3. ఖమాజ్ | - | హరికేదారగౌళ |
| 4. భైరవ్ | - | మాయామాళవగౌళ |
| 5. పూర్వీ | - | కాశీరామక్రియా |
| 6. మారవా | - | గమక క్రియ |
| 7. కాఫీ | - | శ్రీరాగ |
| 8. ఆసావరీ | - | నారీ రీతిగౌళ |
| 9. భైరవ | - | జనీతోడి |
| 10. తోడి | - | శైవ పంతువరాళి |

రాగాలకు థాట్‌లకు మధ్యగల పోలికలు ఆధారంగా భాత్ఖండే గారు రాగాల వర్గీకరణ జరిపారు. ఉదాహరణకు హమీర్, కేదార, కామోద, శ్యామ వంటి రాగాలకు యమన్ థాట్‌తో పోలికలున్నందున వాటిని యమన్ థాట్ క్రిందకు చేర్చారు. శ్రీ, జేతశ్రీ, టంకీ, పూరియా ధనశ్రీ, మాళవి, గౌరీ వంటి రాగాలను పూర్వీ థాట్ క్రిందకు చేర్చారు. అలాగే మిగిలినవి.

హిందూస్థానీ సంగీతంలో అతి సమీపరాగాలు కొన్ని వున్నాయి. వాటిలో కొన్ని - శ్రీ, గౌరి; జైతశ్రీ, పూరియా ధనశ్రీ; ఆసావరీ, జైన్‌పురి; దేశి, దేవగాంధార్; త్రివేణి, టంకీ; మారవా, పూరియా; భటియార్, భంకార్; భైరవ్, రామ్‌కలీ; భీంపలాసీ, ధనాశ్రీ; కాఫీ, సిందూర; బిహాగ్, శంకరా; దేశ్, సొరట్. ఈ జంట రాగాల మధ్య వ్యత్యాసాలు చాలా సూక్ష్మంగా వుంటాయి. ఆ రాగాలు గానం చేసేటప్పుడు ఒక రాగంలో నుంచి మరో రాగంలోకి జారి పోకుండా వుండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు కొన్ని వుంటాయి.

రాగాల ప్రస్తారం (విస్తారం) లో గ్రహస్వరం, అంశ స్వరం, న్యాస స్వరం, విశ్రాంతి స్థానం అనే వాటిని దృష్టిలో వుంచుకోవాలి. ఇవి కాక ప్రతి రాగానికి 'పకడ్' అనేది ఒకటి వుంటుంది. 'పకడ్' అంటే పట్టుకోవడం. రాగాల విషయంలో 'పకడ్' అంటే ఇది ఫలానీ రాగం అని పట్టియిచ్చే కొన్ని స్వరాల సమూహం అని చెప్పుకోవాలి. "ని, సరిగ, మగ" అనేది పూర్వీ రాగం యొక్క 'పకడ్'. రాగప్రస్తారంలో ఆ స్వర సమూహం రాగానే అది పూర్వీ రాగమని గుర్తుపట్టవచ్చు. అలాగే "సనిధని" అనే స్వరసమూహం పూరియా రాగానికి గుర్తు. అంటే అది ఆ రాగం యొక్క 'పకడ్' అన్నమాట. భాత్ఖండే గారు వీటిని తన ప్రసంగ పాఠంలో పేర్కొన్నారు.

దేశమంతటా - ఉత్తర భారతంలోనూ, దక్షిణ భారతంలోనూ కూడా - అన్ని పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాలలో ఒకే పద్ధతిలో సంగీత విద్యాబోధన జరగాలనీ, ఒకే జాతీయ సంగీతం రూపు దిద్దుకోవాలనీ, దేశమంతా ఒకే గొంతుతో ఒకే (సం) గీతం పాడాలనీ భాత్ఖండే గారు ఆకాంక్షించారు.

* * *

*శ్రీమల్లక్ష్యసంగీతం, అభినవరాగమంజరి* అనే రెండు సంస్కృత గ్రంథాలు కూడా భాత్ఖండే గారు రచించారు. వీటిలో *శ్రీమల్లక్ష్యసంగీతం,* అనేది 'హిందూస్థానీ సంగీత పద్ధతి'కి సంగ్రహరూపం. ఇవికాక *'క్రమిక్ పుస్తక్ మాలికా'* పేరుతో హిందీలో ఆరు సంపుటాలుగా ప్రచురించిన గ్రంథంలో ఆయన సుమారు వెయ్యి సాంప్రదాయక స్వర సహిత రచనలతో పాటు తాను స్వయంగా రచించిన సుమారు 300 గీతాలను కూడా చేర్చారు.

*'హిందూస్థానీ సంగీత పద్ధతి'* గ్రంథంలో ఆయన తన కాలంలో ప్రయోగంలో వున్న ప్రసిద్ధ రాగాలన్నింటి లక్షణాలను వివరించారు. సంగీత విద్యార్థులకు, అధ్యాపకులకు, పరిశోధకులకు అది అవశ్యపఠనీయమైన గ్రంథం; గొప్ప రిఫరెన్స్ బుక్. కాని, అది మరాఠీనుంచి ఇంగ్లీషులోకి, హిందీలోకి తర్జుమా కాకపోవడం దురదృష్టకరం. అయితే, ఆయన జీవితకాలంలోనే ఆ బృహత్ గ్రంథాన్ని కొందరు గుజరాతీ భాషలోకి అనువదించారు.

*సంగీతరత్నాకరం* తర్వాత వెలువడిన 19 ముఖ్య సంస్కృత సంగీత లక్షణ గ్రంథాలను భాత్ఖండే గారు వ్యాఖ్యాన సహితంగా ప్రచురించారు. వాటిలో ఈ క్రింది దాక్షిణాత్య పండితుల గ్రంథాలు కూడా వున్నాయి.

రామామాత్యుని *'స్వరమేళకళానిధి';* వెంకటమఖి రచన *'చతుర్దండి ప్రకాశిక',* తంజావూరు మహారాజు తులజేంద్ర రచన *'సంగీత సారామృతోద్ధార';* పుండరీక విఠలుని రచనలు *'షడ్రాగ చంద్రోదయ'; 'రాగమంజరీ'; 'రాగమాలా'; 'నర్తన నిర్ణయ';* భావభట్టు రచనలు *'అనూప సంగీత రత్నాకర'; 'అనూప సంగీత విలాస'; 'సంగీత అనూప అంకుశ';* సోమనాథుని *'రాగవిబోధ';*

కర్ణాటక సంగీత పద్ధతికి సంబంధించిన ముఖ్య గ్రంథాలన్నింటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేయడమేకాక భాత్ఖండే గారు 1904లో ఎట్టయపురం వెళ్ళి సుబ్బరామ దీక్షితుల వారిని కలుసుకొని *'సంగీత సంప్రదాయ ప్రదర్శిని'* గ్రంథం గురించి తెలుసుకున్నారు. దీక్షితుల వారి నొటేషన్ పద్ధతిని పరిశీలించారు. కాని, అంతకంటే చాలాముందే 1895 నాటికే ఆయన కొన్ని వందల ధ్రుపద్, ఖయాల్ రచనలను నేర్చుకొని, తన సొంత నొటేషన్ పద్ధతిలో రాసుకొని భద్రపరిచారు. 1904లో సుబ్బరామ దీక్షితుల వారి గ్రంథం వెలువడే నాటికే మనదేశంలో గ్రామఫోన్ రికార్డుల ఉత్పత్తి ప్రారంభమయింది. హిందూస్థానీ శాస్త్రీయ సంగీతం రికార్డులు కూడా వెలువడినాయి. ఉస్తాద్ ఇమ్దాద్ ఖాన్ (విలాయత్ ఖాన్ గారి తాతగారు) సితార్ రికార్డులు కొన్ని 1905లో విడుదలైనాయి.

భాత్ఖండేగారి పది థాట్‌ల పద్ధతి, రాగాల వర్గీకరణ పద్ధతి, లక్షణ గీతాలు ఆయన జీవితకాలంలోనే గుర్తింపు, గౌరవం పొందాయి. నిరక్షరాస్యులైన ఉస్తాదుల మౌఢ్యం వల్ల హిందూస్థానీ సంగీతంలో ఏర్పడిన 'గానటబీసట' స్థితి భాత్ఖండే గారి కృషి ఫలితంగా తొలగిపోయింది. ఇప్పుడు దేశమంతటా హిందూస్థానీ సంగీత బోధన ఆయన పద్ధతిలోనే జరుగుతున్నది.

అయితే, ఆయన పద్ధతులు విమర్శలను ఎదుర్కొనక పోలేదు. ఆయన ప్రచురించిన కొన్ని గీతాల సాహిత్యం, వాటి స్వరాలు సరిగా లేవని కొందరు, శ్రుతులకు సంబంధించిన ఆయన సిద్ధాంతం నిర్దుష్టంగా లేదని కొందరు, పది థాట్‌ల పద్ధతి ఆమోదయోగ్యం కాదని కొందరు విమర్శించారు. *సంగీత రత్నాకరం* తర్వాత లక్షణ గ్రంథాలు రచించిన పండితులందరూ తమ సొంత వర్గీకరణ పద్ధతులను ప్రతిపాదించిన వారే. ఆ పద్ధతులలో ఏ ఒక్కటీ నిర్దుష్టమూ కాదు, సమగ్రమూ కాదు, సర్వామోదకరమూ కాదు. వెంకటమఖి 72 మేళకర్తలపై ఇప్పటికీ విమర్శలు సాగుతూనే వున్నాయి. అయినా, కర్ణాటక సంగీతంలో అదీ, హిందూస్థానీ సంగీతంలో భాత్ఖండే గారి పద్ధతీ స్థిరపడిపోయాయి. భాత్ఖండే గారి పద్ధతిలో ఎంతో సౌలభ్యం వుంది.

పన్నెండు స్వరాలలో ఏవి శుద్ధస్వరాలు, ఏవి వికృత స్వరాలు అనే విషయంలో హిందూస్థానీ, కర్ణాటక సంగీత పద్ధతులు పూర్తిగా పరస్పర విరుద్ధమైనవి. స, మ, ప స్వరాల విషయంలో సమస్య లేదు. కాని, రి, గ, ధ, ని స్వరాల విషయంలో హిందూస్థానీ వారు కోమల స్వరాలను వికృతి స్వరాలు గానూ, తీవ్రస్వరాలను శుద్ధస్వరాలుగానూ పరిగణిస్తారు. కాని, కర్ణాటక సంగీత పండితులు కోమల స్వరాలను శుద్ధస్వరాలుగానూ, తీవ్రస్వరాలను వికృతి స్వరాలుగానూ గుర్తిస్తారు. అయినా, కర్ణాటక పద్ధతిని భాత్ఖండే గారు తప్పు అని ఖండించలేదు. వెంకటమఖి పద్ధతినీ ఆయన విమర్శించలేదు. వివాదంలోకి చొరబడడం ఆయనకు ఇష్టంలేదేమో.

కాని, "A comparative study of some of the Leading Music Systems of the 15th, 16th, 17th & 18th centuries" గ్రంథంలో ఆయన చెప్పిన ఈ క్రింది మాటలు గమనించ దగినవి :

"శ్రుతులు, స్వరాల స్థానాలు, వాటి విలువల విషయంలో శార్ఙ్గదేవుడు భరతుని ప్రణాళికనే అనుసరించాడనుకోవచ్చు. దీన్ని కాదన్న వారు లేరు. కనుక భరతముని చెప్పింది మనం అర్థం చేసుకోగలిగితే శార్ఙ్గదేవుడు చెప్పింది అర్థమవుతుంది. కాని, నిజంగా ఆ రెండు గ్రంథాల (*నాట్యశాస్త్రం, సంగీత రత్నాకరం*) లోని స్వరాలు, శ్రుతుల విలువలను అర్థం చేసుకున్నవారు ఇప్పటిదాకా నాకు కనిపించలేదు. ఆ రెండూ ఎంతో ప్రాముఖ్యం గల గొప్ప గ్రంథాలేననడంలో సందేహంలేదు. వాటికి ఆధునికుల వ్యాఖ్యానాలు కూడా చాలానే వచ్చాయి. కాని, శ్రుతులు, స్వరాల విషయంలో వారి వివరణలేవీ నాకు సంతృప్తికరంగా, నమ్మదగినవిగా కనిపించలేదు. ఇలా

అయివుంటుంది, అలా అయి వుంటుందని ఊహించి చెప్పడం కాదు. ఆ పుస్తకాలలో వున్నవాటిని వున్నట్లుగా తీసుకుని అర్థం చెప్పాలి. లేని విషయాలను – అర్థం చెప్పడం కోసం – చొప్పించ కూడదు. ఏ పరిశోధకుడైనా తప్పనిసరిగా పాటించవలసిన సూత్రం ఇది. గ్రామాలు, మూర్ఛనలు, జాతులు, రాగాలు అన్నీ శుద్ధ, వికృత స్వరాల నుంచే ఉత్పన్నమవుతాయన్న సంగతి మనకు తెలిసిందే. శుద్ధ, వికృత స్వరాలు శ్రుతులపై ఆధారపడి వుంటాయి. కాబట్టి శ్రుతులు, స్వరాల స్థానాల, విలువలు ఎటువంటి సందేహాలకు ఆస్కారం లేకుండా నిర్ధారణ కావాలి!"

ఆయన ఆ మాటలన్నది దాదాపు తొంభైయేళ్ళ క్రిందట. నిజానికి సంగీతానికి సంబంధించినంత వరకు శుద్ధ వికృత స్వరాలపైన, శ్రుతులపైన జరిగినంత తర్జన భర్జన మరే విషయం పైన జరగలేదు. అటువంటి తర్జన భర్జన దండగ అనే అభిప్రాయం కూడా చాలామందిలో వుంది.

నండూరి పార్థసారథి,
ఫోన్ : 9959734534

**2012** నవంబరు నెల *మిసిమి* 4వ పుటలో ప్రచురించిన నా లేఖకు జవాబుగా మిత్రులు నండూరి పార్థసారథి 34 నుండి 37 వరకూ నాలుగు పుటలలో వ్రాసిన ఉపోద్ఘాత సహిత వ్యాసంలో సమస్తం తెలిసినట్లుగా నటించడంగాని, తెలియని విషయంపై ఛాలెంజ్ చేయడం గాని ప్రమాదకరమనీ తాను సమస్త సంగీత విషయాలపైనా అథారిటీ అని ఆకెళ్ళ వారు చెప్పుకోగలరా అనీ, సంగీత సముద్రం అట్టడుగుదాకా దిగి అందులో దొరికే రత్నాలను (హాలాహలం కూడా ఉంటుందిలెండి) ఎవరూ పైకి తీయలేరు ఆకెళ్ళవారూ తీయలేరు అనీ, కైశికీ నిషాద విశ్లేషణ జరిగిన మూడు గంటల కార్యక్రమంలో ఆ విషయం కంటె అప్రస్తుత విషయమైన విద్యార్థుల బోధనా పద్ధతుల గురించే నేను ఎక్కువ సేపు ప్రసంగించాననీ, హిందూస్థానీ సంగీత మంటే కూడా నాకు చాలా సదభిప్రాయం ఉన్నట్లుగా వారిని ఎలాగోలా ఒప్పించడం కంటే నాకు కావలసిన గమకాలను వారింట్లోని సంగీత భాండాగారంలోనే వెతుక్కోవచ్చుననీ, సంగీత, చారిత్రక పరిశోధన శుద్ధ దండగ అనే విధంగా నేను వ్రాశాననీ, అటువంటపుడు గమక ఛాయా భేదాలంటూ వారిని నిగ్గదీయడమెందుకనీ, ఆకెళ్ళవారు బోధనా పద్ధతుల మీదే కేంద్రీకరించి రసాలూ, భావాలూ, అందాల గురించి పట్టించు కోకుండా ఉంటేనే మంచిదనీ... యింకా మే నెల *మిసిమి*లో 'ఉత్తర దక్షిణ సంగీత పద్ధతులు రెండింటికీ నూటికి 99 వంతులు శాస్త్రం ఒక్కటే అంటూ నిర్ద్వంద్వంగా వ్రాసిన దానికి ప్రతిగా నేను లేవనెత్తిన గమక, తాళాంగ వినియోగ వివరాల విషయంలో గల అభ్యంతరాలకు మాత్రం సరియైన సమాధానమీయకపోవడం ఆశ్చర్యాన్నీ, అమిత బాధనూ కలిగించడం చేత యింతకంటే ఎక్కువ ఏమీ వ్రాయలేక పోతున్నాను.

– ఆకెళ్ళ మల్లికార్జున శర్మ



# ప్రేమ మూర్తి స్వామీజీ

*– నటరాజ రామకృష్ణ*

**మా**ది పెద్ద కుటుంబమే. కాని నా చిన్ననాటికి నేనూ, నాన్న, అక్కయ్యా మిగిలాం. అమ్మనేనెరుగనప్పుడే పోయారు. తరువాత అన్న శ్యాంసుందరుడు. నాన్న రామకృష్ణ పరమహంస భక్తులు. నన్ను అక్కయ్యను రామకృష్ణ మఠంలో చేర్పించాలని నిర్ణయించుకున్నారు. నాకూ అక్కయ్యకూ రామకృష్ణ – శారదామాయి పేర్లు పెట్టారు అమ్మా నాన్నలు–

అక్కయ్య–అచ్చం శారదామాయిలాగే– యోగినిగానే జీవించింది. స్వామి శాశ్వతానందాజీ శుశ్రూషలో ఒక త్యాగమయిగా స్వామీజీ పనుపు పైన బెంగాలు చారసాత్‌లో కాందిశీకుల సేవలో 45 సంవత్సరాలు గడిపి దరిద్ర నారాయణుల సేవలో సర్వమూ అర్పించి– యోగినిగా జీవించి – ఆఖరి దశలో నన్ను చూడడానికి హైదరాబాదు వచ్చి దైవసాన్నిధ్యం చేరింది. ఆమె ఎంతటి త్యాగమూర్తి అంటే ఆమె సేవలకు మెచ్చి బెంగాలు ప్రభుత్వం వారు Nightingale of Bengal పతకం యిచ్చారు. నా కెందుకు ఈ పతకాన్ని మరెవరికన్నా యిప్పించాలని త్రిప్పి యిచ్చి వేసింది.

ఇక అన్న శ్యాం అతిసుందరరూపుడు. గొప్ప మేధావి, చిత్రకారుడు– చక్కని బొమ్మలు గీసేవాడు, సంగీతం పాడేవాడు, కవితలు చెప్పేవాడు అతనికి తెలియని విద్యలేదు. నన్నొక నాట్యకళాకోవిదునిగా తీర్చి దిద్ది దేశానికి అర్పించాలని సంకల్పం– కాని ఆయన గూడా పోయారు–నాన్న గతించారు. నేను రామకృష్ణ మఠంలో ఉండక బైటకు వచ్చేసినందుకు నాన్నకు నాపై కోపం– చనిపోయిన నాటివరకూ వుండేది. ఇక మిగిలింది– మా వంశంలో నేను ఒక్కణ్ణి.

నాగురించి నేను మఠంలో వుండకపోయినా సన్యాసుల వస్త్రధారణ చేయకపోయినా నేను ఆరాధించే కళాసరస్వతి సేవలో సర్వము త్యాగం చేసి కళా సన్యాసిగానే జీవిస్తున్నాను.

నా జీవితంలో గురుమహారాజ్–

కొన్ని సంవత్సరాల క్రిందట, హైదరాబాద్, అశోక్ నగరం ఇందిరా పార్కు వద్ద రామకృష్ణ మఠంలో గురుమహరాజ్ మందిరంలో విగ్రహ ప్రతిష్ట జరిపారు. స్వామి రంగనాథానంద ప్రెసిడెంట్. అప్పుడు ఆ ప్రతిష్ట వుత్సవానికి అక్కయ్య వచ్చింది బెంగాలు నుండి. 40 సంవత్సరాల తరువాత అదే ఆమెను చూడడం. చిన్నప్పటి అంబకు, యిప్పటి శారదాంబకు ఎంత మార్పు. ఆమెలో యోగి మీరాను చూశాను.

“బాబూ అందరూ ప్రదర్శనలు చేస్తున్నారు. మరి మీ పేరిణి లేదా? అని అడిగింది.

నేను నిద్ర మేల్కొన్నాను. స్వామిజీ పెట్టించలేదు. వెంటనే పరిగెత్తా.

స్వామి రంగనాథానందాజీ మా పేరిణి – మా పేరిణి అడిగాను. “నీవు వచ్చి అడిగావు, పెట్టిద్దాం. బేలూరు మఠం నుండి ప్రెసిడెంటు స్వామీజీ వస్తున్నారు. ఇండియా మొత్తం నుండి ఎందరో స్వామిజీలు వస్తున్నారు.” పెట్టిద్దాం అన్నారు.

గురుమహరాజు విగ్రహ ప్రతిష్ట జరిగింది. పేరిణి పెట్టారు. ఎంతోమంది స్వామీజీలు, నా చిన్ననాటి వారు. మిగతా పెద్దవారయి పోయారు. అందులో నా బాల్యం మదరాసులో రామకృష్ణ మఠంలో గడిపి నప్పుడు, నన్ను ప్రేమతో పెంచిన ఒక స్వామీజీ కూడా వున్నారు. వారే సర్వజ్ఞానానందాజీ. నిజంగా హృదయం ఆనందంతో నిండిపోయింది. అది ఆనాటి ఆనందం వర్ణించడానికి మాటలు లేవు.

ఆ సాయంత్రం ప్రెసిడెంటు స్వామీజీ సుందరమైన పేరిణి ప్రదర్శింపజేశారు. బాల్యంలో నన్ను జూచిన ఆ స్వాములకందరికీ ఎంత ఆనందం కల్గింది.

రామకృష్ణ ఎంత ఎదిగాడు అని ఎంతో సంతోషించారు.

అక్కయ్య ఆనందం చెప్పలేను.

స్వామి అనన్యానందాజీ ప్రేమతో నా తల నిమురుతూ నీవు నిజంగా సార్థక నాముడవు రామూ అని ఆశీర్వదించారు. ప్రెసిడెంట్ మారాజ్‌జీ గారి దర్శన మిప్పించారు. నన్నూ నా పేరిణి శిష్యులను ఆశీర్వదించి బేలూరు మఠంలో పేరిణి లో పెంట్టించ రాదా అని తెలిపారు. జన్మతరించింది కానీ- నాన్న మట్టుకు దూరంలో ఉండి అన్నీ చూచి ఆనందించారు. వారెందుకో నాయీ నాట్యకళారాధనను అంతగా అంగీకరించలేదు మొదటి నుండీ.

నేను ఈ కళాతపస్సులో వుండుటవల్ల మఠాలకు ఎక్కువగా వెళ్ళుట లేదు. ఆ రోజు అందరూ స్వామీజీలను దర్శించడం- మఠంనుండి విడిపోయిన వారితో కలిసి పోయాను. చిన్నప్పుడు... మైలాపూరు మఠంలో వున్నాను. మఠం వేరు. మిషన్ వేరు. సవాళ్ళు వేరు. అక్కడ ఒక స్వామీజీ మహరాజ్ పూజ చేసేవారు. వారు ఎప్పుడూ ఒంటరిగా వుండేవారు. ఎక్కువగా మాట్లాడేవారు కారు. భారత .... బాడీ బిల్డర్‌లా ఆయన శరీరం కండలు తిరగి ఉండేది. మంచి శరీరఛాయ. ఒక ప్రత్యేక తేజంతో ఆయన ముఖం ప్రకాశించేది.

పూజాసమయంలో ఆయన చేతుల వ్రేళ్లతో కొన్ని ప్రత్యేకమైన ఆకారాలు సృష్టించి దైవాన్ని ఆరాధించేవారు. అది ఆగమశాస్త్ర ముద్రావిధానం అని నాకు అప్పట్లో తెలియదు. కాని ప్రతిరోజు చూడ్డంవల్ల అవివచ్చేశాయి. ఈ విధంగా పూజల్లో ఉపయోగించే ముద్రవిధానం వచ్చేసింది. నా నాట్యాభ్యాసంలో, తరువాత కాలంలో శైవాగమం కాళహస్తిలో గవరు రాజమ్మగారు చెప్పించినపుడు ఈ ముద్రలు గూర్చి వివరంగా తెలిసి కొన్నాను.

మేఘనాట్య ప్రదర్శనలు సాధారణంగా అభినయాన్ని అద్దం పట్టేవి. ఈ లగ్గకు, శీతిణి చాల తేడాలున్నాయి నృత్యంలో. నృత్యంలో పెట్టేవి నృత్య, వృత్త, హస్తాలు అని మరో విధానం కోసం బంధించిన వాటిని ముద్రలని పిలుస్తారని తెలిసింది. రామస్వామి మారాజ్- వీరు తెలుగు చక్కగా తెలిసిన తమిళదేశీయులు- సంగీతం చక్కగా పాడేవాడు. మంచిగాత్రం- వారు గోపమహరాజ్ గొత్తిన భక్తిగీతాలు ఎన్నో చెప్పారు.

ఒకే ఒక్క తెనుగు స్వాములు శాస్త్రి గారు. వారు అప్పుడు బ్రహ్మచారి. వారు స్వామి వివేకానంద జీవితం తెలుగులోనికి అనువాదం చేస్తున్నారు. ఆయనకు తీరినప్పుడు గోప మహరాజు, శారదామాయి వారి జీవిత కథలు చెప్పేవారు మిగిలిన వారిలో జ్ఞాపకమున్నవారు. కన్నడ ప్రాంతం వెంకట పతి మహరాజు. ఆయన కాస్త పొట్టిగా వుండేవారు- ఆయన ఎప్పుడు ఆఫీసులో అకౌంటు రాస్తూ వుండేవారు. అందువల్ల ఎక్కువగా మాట్లాడే అవకాశం వుండేది కాదు.

ఇక మా సర్వజ్ఞానందగారు దయామయుడు, ప్రేమమూర్తి. నన్ను అక్కయ్యను ఎంతో ప్రేమతో చూచేవారు. తల్లి లేని బిడ్డలమని జాలిపడేవారు. అక్క అడయారులో డాక్టరు ముత్తు లక్ష్మి అమ్మ ఆశ్రమంలో వుండేవారు. అప్పుడప్పుడు వచ్చి కలిసేది.

మాయిద్దరికి తెనుగు భోజనం పెట్టించాలని- అప్పుడప్పుడు. ఆయన, భక్తుల యింట ఏర్పాటు చేసేవారు. భక్తులు బీదవారు వారికి డబ్బు యిచ్చి వండింపించి పెట్టేవారు. మేము కడుపునిండా తిన్నామంటే అదొక ఆనందం సర్వజ్ఞానానందులకు. మైలాపూరు మఠంలో మంచి రుచికరమైన, పుష్టికరమైన భోజనం వుండేది. బాగా భోజనం చేసి ఆరోగ్యంగా వుంటేనే కష్టపడి సంఘసేవ చేసే శక్తిని సంపాదించగలం అని ఆశ్రమం వారి నమ్మకం.

భోజనమంటే జ్ఞాపకం వచ్చింది- అందరూ ఒక దగ్గర పెద్ద హాలులో కూర్చొని భోజనం చేసేవారం. హిందువులు, ముస్లిం, క్రైస్తవ వారూ వీరని గాక అందరం ఒక్కటే- అందరిలో ఆ భగవంతుడు వున్నాడని నమ్మకం- ఒకరోజు ఒక గమ్మత్తు జరిగిపోయింది.

ఒకవైష్ణవ భక్తుడు మఠానికి వచ్చారు. మాతో పంక్తిలో కూర్చొన్నారు. సాధారణంగా మఠంలో ఉల్లిపాయలు వండరు. దేనిలోనూ వేయరు, గాని వారానికి ఒకరోజు గోపమహరాజు నైవేద్యంలో కొద్దిగా సన్నగా తరిగినవి నేతిలో వేయించినవి నైవేద్యం పెట్టి- అవి పంక్తిలో వడ్డిస్తారు. శ్రీ వైష్ణవులకు ఉల్లి నిషేధం అట- భగవంతుని స్మరించి- అందరం మొదలు పెట్టాము.

రుచిగా వున్నాయోమో తొలిసారి తినడం, ఆయన తినేశాక- అవి వుల్లి అని తెలిసి బిక్కమొఖం వేసి దిక్కులు జూచారు.

అది గ్రహించి శాశ్వతానందాజీ భగవంతునికి అర్పించిన ప్రతి వస్తువు పవిత్రమై పోతుంది, అందువల్ల తప్పుగాదు. ఆచార్యా భుజించండి అన్నారు. ఆయన మారుమాట చెప్పలేదు. ఆనందంతో భోంచేశారు. అతనిలో కలిగిన మార్పు అప్పుడు అర్థం కాలేదు.

ఇక శాశ్వతానందాజీ–

ఆయన అక్కను, నన్నూ బిడ్డల మాదిరిగా పెంచారు. తల్లిప్రేగు,అమ్మ చిన్నప్పుడే పోయినా, ఆ ప్రేమ ఎలా ఉంటుందో స్వామీజీ యొద్ద అనుభూతి పొందాము. వృద్ధాప్యంలో అతనికి దూరంగా వున్నాను.

స్వామీజీకి మేమంటే ఎంత ప్రేమంటే– నేను మఠం వదిలేసిన తరువాత ఆయన్ని మళ్ళాచూడలేక పోయినా– అక్కయ్య కలుస్తూ వుండేవారు. స్వామీజీకి అను కొంటా ఆఖరి దశలో రాంచీ హాస్పటల్‌లో వుండగా– అక్కయ్యతో ఒకసారి అన్నారట– రామకృష్ణా పెరిగి పెద్ద వాడయ్యాడనుకొంటా శారదా– ఎలా వుంటాడు. ఆయన ఆఖరి ఘడియల్లో అక్కే స్వామీజీకి సేవచేసి పితృఋణం తీర్చుకొంది. అక్క వుత్తరం వ్రాసింది కాని నేను వెంటనే వెళ్లలేక పోయా. అక్కయ్య నా చిన్ననాటి ఫొటో స్వామీజీ కాళ్ళదగ్గర పెట్టి యిదిగో 'రాం' స్వామిజీ అన్నదట. ఆయన కండ్లలో నీరు నిండాయి. నేను వెళ్ళే ప్రయాణంలో సిద్ధమయ్యేలోగా ఆమె మరల అక్కడ స్వామీజీ – గోప మహరాజ్‌లో చేరిపోయారు. మానవునిలో మాధవుని చూడడం ఆ ప్రేమమూర్తి నుండే నేర్చుకొన్నాను.

సర్వానంద వీరు త్యాగం చేసినా ఆ స్వామీజీలో ఎంత ప్రేమ, ఆత్మీయత, పవిత్రత నిండి వుండింది. మరి రాధలో వుందదా– ఒక రోజు మాంబళంలో వెళ్లా – అక్కడ పనగల్ పార్కువద్ద సభలో చాల సరస్వతి గారి భరతనాట్యం, అభినయం చూశాను.

వారి తల్లి జయమ్మ పాట ఆమె అభినయం అలాగే డి.కె. పట్టమ్మాళ్ సంగీతం విన్నాను. ఆ కాలంలో ముగ్గురు ప్రఖ్యాతి గాంచిన సంగీత పాటకారులుగా వుండేవారు. శ్రీమతులు డి.కె.పట్టామ్మాళ్, నిండైన గంభీర గాత్రం, ఎమ్. ఎస్. సుబ్బలక్ష్మి– కోకిల గానం–ఎమ్మెల్ వసంత కోకిల– భావపూరిత గానం, ఈమె చాలా రూపసి– ఈమె గోపమహరాజు భక్తురాలు. చనిపోయే ముందు తన ఆస్తిలో సగం– శ్రీ శారదామాయి అనాధ బాలికల ఆశ్రమానికి దానం చేశారు. మఠంలో స్వామీజీలు ఎప్పుడూ బిజీగా వుండేవారు. వారి వేదాంత చర్చలు నాకు అంతగా ఆ చిన్ని వయస్సులో అర్థమయ్యేవి కావు. తరచూ ఒంటరిగా వుండేవాణ్ణి. "మానవుడు చనిపోయాక ఏమవుతాడు." ఇది పెద్ద డౌట్. నాలోనేను చర్చించు కొనే వాణ్ణి.

మఠం లైబ్రరీ పుస్తకాల్లో ఒకటి దొరికింది "లైఫ్ బియాండ్ డెత్." సంతోషంగా తీసి చదవడం మొదలు పెట్టాను. ఇంగ్లీషు అక్షరాలు, వాక్యాలు బోధపడేవి గాని, భావం ఏమిటో అంతా అయోమయం. ఒకసారి స్వామీజీ నా చేతిలో ఆ పుస్తకం చూచి నవ్వుతూ– ఇంకా చాలా కాలం పడుతుంది. అది అర్థం చేసుకోడానికి రావాలంటే అన్నారు. అంతే ఆ రోజుతో ఆ ఆలోచన మానేసి ఆరోజు నన్ను మాంబళం రామకృష్ణ స్కూల్లో చదువుకు వేశారు. అక్కడ ఒక పరీక్షలో లెక్కల్లో 100 కి 120 మార్కు వచ్చాయి. మా లెక్కల మాష్టారు పొంగి పోయి అందరికీ చెప్పారు. నేను మైలాపూరు మఠానికి వెళ్ళి స్వామీజీలకు చెప్పాను. అక్కగారికి చెప్పడానికి అడయారు వారు వెళ్లారు.

డాక్టరు ముత్తులక్ష్మి రెడ్డిగారు నన్ను చాలా ప్రేమతో చూచేవారు. ఆమెకు ఈ న్యూస్ చెప్పా– ఆమె సంతోషించి నా చేయి పట్టుకొని మేడ మీదకు తీసుకొని పోయి ఆమె భర్త ముందు నిలబెట్టి నా ఘనత చెప్పారు. అతడు తన ముందున్న పళ్లెంలోని మిఠాయి ఒకటి తీసి నానోటిలో పెట్టి గ్రేట్ కంగ్రాట్స్! కాబోయే ఇంజనీర్ అని పొగిడారు. స్వామి నిశ్రేషానంద– ఆయన గొప్ప కళాకారులు. పెయింటిగ్స్ వేసేవారు. భజనలు పాడేవారు. వారి వున్న వాయులీనం మీద నాచే సాధన చేయించారు కొంత కాలం.

ఇలా జరిగిపోతున్న ఆ సమయంలో ఈ ఘట్టం ముగిస్తాను. ఇంటిగుట్టు లంకకు చేటు– కొత్త వాడ్ని నమ్మడం నాకేగాదు, నాన్నకుగూడా అలవాటే. అది వారసత్వంగా వస్తున్నదనుకుంటా– అంతేగాదు వేషాలు రంగు అంటే అమితపిచ్చి. నాన్నకు ఎవరైనా కాషాయి బట్టలు వేసుకొని కనిపిస్తే చాలు. ఎక్కడైనా సరే వారి ఎదురుగుగా నిలబడి పాదాభివందనం చేస్తే గాని వదిలేవారు గాదు. ఎంత ఎరుగని వారైనా– వారికి హృదయం విప్పి అమాయకంగా అన్ని విషయాలు చెప్పేసే వారు.

ఒకసారి నేను మదరాసులో రామకృష్ణ మిషను స్కూలులో చదువుతుండగా– ఒక విచిత్ర సన్నివేశం

జరిగింది. మా మాతృమూర్తి చాలా ధనికులయింట పుట్టారు. అంతేగాక కూడా ఆ భూషణాలు ధరించడం వంశాచారమని అమ్మ చనిపోయేనాటికి ఆమెకు ఏడు వారాల బంగారు నగలు వుండేవట- నాన్నగారు తరువాత కాలంలో ఆ భూషణాల అవసరం కనిపించక ఒక్కటొక్కటి అమ్మి దాన ధర్మాలు చేసేవారు.

ఈ వివరాలు అన్న ఒక పెద్ద ఉత్తరంలో మా వంశ చరిత్రతో పాటు ఆయన చేస్తున్న ఈ ఘనకార్యం కూడా వ్రాశారు. క్రొత్తగా బిహారునుండి వచ్చిన మైతెల్లె గంగ స్వామిజీకి ఆ స్వామీజి ఏమనుకున్నారో ఏమో, ఒక ఆదివారం కుదరడం హాస్టలు విద్యార్థులు అందరం పూజామందిరంలో కూర్చొని వుండగా అక్క విడదీసి... ఇది ఉత్తరమా, మాగ్‌జైన్ వ్యాసమా రామకృష్ణా - మీ నాన్నగారు వ్రాశారు. పాపం మీ అమ్మగారి బంగారు నగలు. మీ అమ్మా నాన్న బాగా డబ్బుపంపుతుంటే నీవు జల్సాలు చేస్తున్నావు. చూడండి ఈ వుత్తరం అని లేఖను టేబులు మీద పెట్టారు. పబ్లిక్ ప్రోపర్టీ అయింది ఆ ప్రైవేట్ లేఖ. అందరూ నన్ను విచిత్రంగా చూసి నవ్వడం చేశారు.

నాకు రోషం వచ్చింది. కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. లేచి నా గదిలోకి వెళ్ళాను- అక్కడనుండి మండు టెండలో నడిచి మాంబళం నుండి మైలాపూరు నడిచి వెళ్ళాను. విశ్రాంతి తీసుకొంటున్న శాశ్వతానంద మహరాజు నిద్ర లేచేవరకు వుండి- స్వామీజీ నేనింక మాంబళంలో వుండను. మైలాపూరులో అసలే వుండను. ఎక్కడికైనా వెళ్ళిపోతానని చెప్పాను.

స్వామీజీ మనస్సు నే నెరుగను.

కొంచెము సేపు ఆలోచించి వెంకటపతి మా రాజును పిలిచి- రాముకు రేపటికి నాగపూరుకు ఒక టిక్కెటు కొనాలి అని సెలవిచ్చారు. అంతే నేను మదరాసునుండి నాగపూరుకు వచ్చేశా.

మళ్లీ పూజ్య స్వామీజీని కలుసుకోలేకపోయా. ఆయన లేరు. ఇక కలిసికోలేను. ఈ అనుభవం ఎవరికీ చెప్పలేదు. నా హృదయంలో దాచుకొన్నాను.

ఇంతవరకూ, ఇదొక అమాయకత్వమో? మరేమిటో చెప్పలేను. నేటికీ ఆలోచిస్తుంటే అంతా అయోమయమే- అంతు దొరకదు.

ఏమిటంటే-

చనిపోయిన తరువాత జీవితం ఎలా ఉంటుంది? ఎవరినీ అడగకుండా నేనే తెలిసికోవాలని యిచ్ఛ కలిగింది. మైలాపూరు మఠం ఆవరణలో ఎన్నో రకాల పూలచెట్లు వుండేవి. అందు పసుపు పచ్చ పూట గన్నేరు కూడా వుండేది. ఆ కాయలు చేదుగా వుండేవి. గింజలు తింటే మనిషి వెంటనే చచ్చిపోతాడని ఎవరో అంటే విన్నాను. ఒక దినం స్వాములు అందరు ధ్యానంలో వుండగా తోటలోకి వెళ్ళి కొన్ని కాయలు కోసి, అందులోని పప్పుతీసి నూరి చేదు వాసన వున్నా కండ్లు మూసుకొని నోరు తెరచి గొంతులో వేసుకొని - దిగడానికి కొంత నీరు త్రాగాను. కొంత సేపైన తరువాత శరీరం త్రిప్పడం మొదలు పెట్టింది.

చనిపోవడం దేవుడెరుగును గాని ఒళ్లు త్రిప్పటం- భూమి ఆకాశం తిరిగి పోవడం - కడుపులో బాధ మొదలైంది. తరువాత ఘట్టం వాంతులు. స్వామీజి తెలుసుకున్నారు. డాక్టరు గారిని పిలిపించారు. అప్పటికే రెండు వాంతులు శరీరం చల్లబడడం జరిగిపోతూంది.

డాక్టరు వచ్చి- ఇంజక్షన్ మీద ఇంజక్షన్ రెండు సూదులు గుచ్చి చల్లని నీరు త్రాగించి పడుకోబెట్టారు. కాళ్ళు చేతులు నరాలు లాగేస్తున్నాయి. కండ్లు తెరిస్తే గాలిలోకి ఎగిరి పోవడం- భూమి ఆకాశం ఒక్కటై తిరిగి పోవడం - ఏమిటో ఏమిటో ఎలాగో ఎలాగో జరిగిపోతుంది. నా కండ్లు మూతలు పడ్డాయి. - అపాయం లేదు. అని ఎవరో ఎక్కడో అంటున్నారు. అది మాత్రం వినిపించింది. నేను నిద్ర లోకి జారుకున్నా.

అలా యెంతో సేపు గడిచిపోయిందో- కండ్లు మెల్లగా తెఱిచా. అంతాచీకటిగా వుంది. స్వామీజీ లైటు వేసి నా ముఖంలోకే చూస్తూ వుండి పోయారు.

బ్రహ్మజీ మహరాజు వేడికాఫీ తెచ్చారు.

రామా - గోపమహరాజు నాతో వున్నాడు.

నీరు యింకా చాలా తాగించాలి. నీకేమీకాదు- నీవు బాగుంటావు- అని నవ్వుతూ నా కండ్లల్లోకి చూచారు. - అసలు విషయం ఆయనకు అర్థమయ్యింది- అక్కడనుండి లేచి ధ్యానానికి వెళ్లారు. ఇక మళ్ళీ అలాంటి ప్రయోగాల జోలికి పోలేదు.

నిజంగా ఈనాడు గోప మహరాజు నాలోనే ఉన్నారు.

# తిక్కన తెలుగులో దేశీయత

- వాగం కొండారెడ్డి

**ఉపక్రమం**

**మార్గ-దేశి :**

నన్నె చోడుడు (క్రీ.శ 1130) తన *కుమార సంభవ* పీఠికలో...

**"మును మార్గ కవిత లోకం బున వెలయగ దేశి కవితఁ బుట్టించి తెనుం గున నిలిపి రంధ్ర విషయం బున జన చాళుక్య రాజు మొదలుగ పలువుర్"**

అనే పద్యంలో మార్గ, దేశి పదాలను మొట్టమొదట కవిత్వ పరంగా ప్రయోగించాడు.

దీనిని బట్టి సంస్కృత కవిత్వ సంప్రదాయాన్ని అనుసరించేది మార్గ కవిత అనీ, దేశ భాషా సంప్రదాయాను గుణంగా రచించేది దేశి కవిత అనీ కొందరు స్థూల విభజన చేశారు. కానీ ఈ విభజనకు కేవలం భాషాశ్రయత్వం ప్రమాణం కాజాలదు.

**దేశి కవితా నిర్వచనం :**

ఇతివృత్తం, భాష, ఛందస్సు అనే కవిత్వాంగాలు మూడు దేశీయమైనవిగా ఉంటే అది దేశి కవిత అవుతుందని కొందరు సాహిత్య చరిత్రకారులు భావించారు. ఈ భావన కూడా రాను రాను సంకుచితమై కేవలం దేశిచ్ఛందస్సుతో కూడిందే అనే ఒక సాధారణ అభిప్రాయం రూఢమౌతున్నట్లు తెలుస్తోంది. దీనికి కారణం పాల్కురికి సోమనాథుడు ద్విపద, రగడ, సీసం, తరువోజ, కందం మొదలైన దేశి ఛ్ఛందాలను ప్రయోగించడం. అలాగే నాయక రాజుల కాలంలో విరివిగా వెలసిన యక్షగాన వాఙ్మయంలో రగడలు, తోహరలు, దరువులు, ఏలలు మొ. దేశిచ్ఛందాలు ఎక్కువగా ఉండటం కూడా మరొక కారణంగా పేర్కొనవచ్చు.

ఒక సాహితీ రూపంలో ఏదో ఒక దేశి లక్షణం ఉన్నంత మాత్రాన దానిని దేవి కవితగా భావించలేం. ఇతివృత్తం, భాష, ఛందస్సులే కాకుండా, రచయిత దృక్పథాన్ని, అతడుద్దేశించిన పాఠకలోకాన్ని, అతడు జీవించిన విశాల సమాజంలోని విలక్షణతను, అతడు అనుభవించిన ప్రజా జీవన సన్నిహితమైన భాషా వ్యవహారాద్యానేకాంశాలను పరిశీలించినప్పుడు, జన సామాన్యంలో బహుళవ్యాప్తి పొందిన ప్రజా కవితయే 'దేశి కవిత' అని స్థూలంగా నిర్వచించవచ్చు.

**తిక్కన తెలుగులో దేశీయత :**

**పూర్వ రంగం**

తిక్కన క్రీ.శ 1205-1288 సంవత్సరాల నడిమి కాలానికి చెందిన వాడన్నది సాహిత్య చరిత్ర కారులు నిర్ణయించారు. అంతకు ముందే క్రీ.శ. 12వ శతాబ్దిలో శివకవులున్నారు. నన్నె చోడుడు మార్గ, దేశి కవితా శాఖలను పేర్కొని, జాను తెనుగు, వస్తు కవితలను ప్రస్తావించాడు. పాల్కురికి సోమనాథుడు తన రచనల ద్వారా శైవ మత ప్రచారాన్ని ఒక మహోద్యమంగా నిర్వహించాడు. దేశిచ్ఛందస్సులను ఎక్కువగా వ్యాప్తిలోకి తెచ్చాడు. వీరిద్దరూ శైవ మత ప్రచారానికి ప్రాధాన్యమిచ్చారే కాని, తెలుగు వారి జీవ లక్షణాన్ని, వారి సామాజిక జీవితంలోని మూలతత్త్వాన్ని తమ రచనల్లో ప్రతిపాదించ లేకపోయారు.

**తిక్కన తెలుగు :**

'ఆంధ్రావళి మోదముం బొరయునట్లు' తిక్కన భారతాన్ని రాశాడు. తెలుగు వారికి మోదం కలిగే విధంగా వారి తెలుగునే తన రచనల్లో ప్రయోగించాడు. తిక్కన తెలుగులో తెలుగు వారి జీవనాడి స్పందిస్తూ ఉంటుంది.

ఆవేశం, ఆప్యాయత, స్వార్థం, సహనం, అహంకారం, పగ, పట్టుదల, రోషం, శాంతి, కాముకత, ధర్మ పరాయణత, మర్యాద, మంచితనం, బంధు ప్రీతి, దయా, ద్వేషం మొదలయిన గుణావగుణాల చేత నిండారిన చిత్త వృత్తి తిక్కన ప్రయోగించిన తెలుగు నుడికారం ద్వారా వ్యక్తమౌతూ వుంటుంది. వారి స్వభావాన్ని వారి వ్యవహారానికి సన్నిహితమైన నుడికారపు తెలుగు ద్వారా తిక్కన వ్యక్తం చేశాడు. అదే తిక్కన తెలుగులోని దేశీయతా లక్షణం. అంటే తిక్కన భాషలో తత్సమ పద ప్రయోగం లేదని చెప్పడం కాదు. అది కవులందరిలో,

కావ్యాలన్నింటిలో కన్పించే విషయమే. కాని, దాని కంటే తెలుగు వారిని ఆకట్టుకున్న అంశం తిక్కన ప్రయోగించిన నుడికారపు భాష.

**తిక్కన తెలుగులో దేశీయ లక్షణాలు :**

లెక్కనేనన్ని తెలుగు కావ్యాలున్నా, తిక్కన రచన, అందులోను తిక్కన భారతం తెలుగు వారికి ఇష్టమైన కావ్యం. దీనికి కారణం తిక్కన తెలుగులోని విలక్షణత. ఈ విలక్షణతకు మూలం తిక్కన తెలుగు దేశీయ వ్యవహార సంప్రదాయాన్ని కలిగి ఉండటమే. తిక్కన రచనకు దేశీయతను సంతరించి పెట్టిన తెలుగు నుడికారపు విలక్షణతను సోదాహరణంగా ప్రదర్శించడమే ఈ వ్యాస లక్ష్యం.

తెలుగు వ్యవహార సహజమైన 1. పదాలు, 2. సమాసాలు, 3. కల్పిత రూపాలు, 4. మాండలికాలు, 5. శబ్ద పల్లవాలు, 6. తద్ధితాలు, 7. ఉపమలు, 8. సామెతలు, 9. వాక్య రూపాలు, 10. పదునైన మాటలు, 11. ఎత్తి పొడుపులు, 12. కాకువు, 13. ఛందం, 14. ఇతరులుగా సౌలభ్యం కోసం పేర్కొనడమైంది.

**పదాలు :**

అమూర్తమైన భావాలను తెలిపే సంస్కృత పదాలకు బదులుగా దేశీయమైన తెలుగు పదాలు తిక్కన కవితలో కన్పిస్తాయి.

**ఉదాహరణ :**

అఱలేక (సంకోచం లేకుండా) - (ఉ-3 ఆ-276)
ఈసు (ఈర్ష్య, అసూయ, కోపం) - (ఉ-2వ ఆ-323)
వెఱగు (ఆశ్చర్యం) - (ఉ-4 ఆ-162)
ఏపు (అతిశయం) - (ఉ-2 ఆ-69)
తగవు (న్యాయం) - (ఉ-2 ఆ-64)
వెరపు (ఉపాయం) - (ఉ-2 ఆ-125)
వెఱపు (భయం) - (ఉ-2 ఆ-226)
చలము (దృఢనిశ్చయం) - (ఉ-2 ఆ-95)
పెంపు (అభివృద్ధి) - (ఉ-2 ఆ-11)
ఒచ్చెము (అల్పం) - (వి-4 ఆ-181)
కాన్పు (కనిపించడం) - (వి-2 ఆ-84)
గౌసెన్ (గలీబు, కవచం) - (ఉ-4 ఆ-214)
బానసీడు (వంటలవాడు) - (వి-1 ఆ-77)
లావు (బలం) - (ఉ-2 ఆ-170)
ఎల్లిదము (లోకువ, చులకన) - (ఉ-2 ఆ-88)
రజ్జులు (గొప్పలు) - (వి-4 ఆ-193)
సిలుగు (కష్టం, ఇబ్బంది) - (వి-5 ఆ-20)
ఇఱకటము (సమ్మర్దం) - (వి-5 ఆ-211)
ఉల్లసము (పరిహాసం) - (క-2 ఆ-113)

**సమాసాలు :**

సంస్కృత సమాలతోడి సమాసాలకు బదులుగా తెలుగు పదాల తోడి సమాసాలను ఏర్పరుచుకొని ప్రయోగించడం తిక్కన తెలుగులో కన్పిస్తుంది.

**ఉదాహరణ :**

అని పని (యుద్ధకార్యం) - (ఉ-4 ఆ-140)
అంప పాన్పు (శరతల్పం) - (భీ-3 ఆ-425)
అంపసెల (బాణాగ్రం) - (ఉ-4 ఆ-192)
అంపవెల్లి (బాణపరంపర) - (ఉ-4 ఆ-342)
అంపమూడము (బాణాలనెడి మంచు) - (వి-5 ఆ-169)
అంప వాన (శర వర్షం) - (ఉ-5 ఆ-192)
కయ్యపు నేల (యుద్ధ భూమి) - (భీ-1 ఆ-181)
కల్లసారెలు (కపటపు పాచికలు) - (శ-2 ఆ-281)
పాఁపరమ్ము (నాగాస్త్రం) - (క-3 ఆ-325)
పాఁప తూపు (నాగాస్త్రం) - (ఉ-2 ఆ-321)
కన్నె కయ్యం (తొలిసారి చేసే యుద్ధం) - (భీ-1 ఆ-110)
నెత్తురు వాన (రక్తం వర్షం) - (భీ-1 ఆ-144)
కారాకు (ఎండుటాకు) - (భీ-1 ఆ-204)
అంప పెన్వెల్లి (శర ప్రవాహం) - (క-2 ఆ-120)
తూఁపుల వాన (బాణ వర్షం) - (క-2 ఆ-163)
వాలమ్ము (వాలు+అమ్ము = వాడి బాణం-(వి-5 ఆ-96)
కందెఱ (కన్ను+తెఱ- కంటి ఱెప్ప) - (వి-2 ఆ-241)
అంప పెనుఁ జీకటి (శర పరంపర)
పెద్ద మనిషి (మహాత్ముడు)
కయ్యపు నేల (యుద్ధ భూమి)
కల్ల జూదం (కపట ద్యూతం)
పాప+ తూపు, పాముటమ్ము (నాగాస్త్రం) మొదలైనవి.

**కల్పిత రూపాలు :**

వస్తు స్వభావ ధర్మాలను పట్టి ఇచ్చే విధంగా కొన్ని తెలుగు పద బంధాలను తిక్కన కల్పించాడు. తిక్కన తెలుగుకు విలక్షణత కల్పించే రూపాలివి.

**ఉదాహరణ :**

మెత్తని పులి (ధర్మరాజును గురించి సంజయుడన్న మాట) - (ఉ-2 ఆ-14)

పొడుపుంగొండ (ఉదయాద్రి, ఉదయాచలం అనే సంస్కృత సమాసాలకు బదులు)

ఇనుప గుండియ (ఇది రాతి గుండె కంటె కఠినమైంది) - (ఉ-5 ఆ-192)

పెట్టని కోట (పాండవులకు శ్రీ కృష్ణుడు పెట్టని కోట వంటి వాడనే సందర్భం) - (ఉ-1 ఆ-297)

ఎండ కన్నెఱుగని (అసూర్యం పస్య అనే సంస్కృత రూపానికి బదులు, అంతఃపుర స్త్రీ)

వాన కన్నెఱుగని (ఇది తిక్కన అపూర్వ సృష్టి)

ఉల్లి కుట్టు మాటలు (ఉల్లమును అనగా మనస్సును నొప్పించే మాటలు)

ఒంటర మింటరములు (ఎక్కువ తక్కువ మాటలు, కఠినపు మాటలు)

గద పండువు (గదతో శత్రువులను అమితంగా చంపడం)

దయ్యము నెత్తికోలు (దైవ సంకల్పం)

శాంత శూరులు (తమ శక్తిని అదుపులో ఉంచుకొన్నవారు, బల గర్వితులు కాని వారు)

లెస్స పువ్వులు (మేలైన/మంచి పువ్వులు-నిర్వచనోత్తర రామాయణంలోనిది)

లెస్స కూడు (మంచి అన్నం - ఉద్యోగ పర్వంలో శ్రీకృష్ణుడు దుర్యోధనునితో అన్నాడు.)

కరి పురము, గజ పురము, దంతి పురము (హస్తినాపురము) పతి, పత్ని, మగనాలు మొదలైన ఇవి తత్సమ పదాలతో కల్పించాడు.

**మాండలికాలు :**

తిక్కన నివసించిన నెల్లూరులో, ఆ పరిసర ప్రాంతాలలో నేటికీ వ్యవహారంలో నిల్చి ఉన్న పద బంధాలు, క్రియారూపాలు తిక్కన రచనలో కన్పిస్తాయి.

**ఉదాహరణ :**

1. కన్నాకు (కన్నాకు మనకు భీష్ముడు - భీష్మ - 1 ఆ - 76 వ పద్యం) అంటే ప్రధానుడు.

ముఖ్యుడు, శ్రేష్ఠుడు అని అర్థం. నెల్లూరు ప్రాంతంలో ఇప్పటికీ వ్యవహారంలో ఉంది.

2. అయ్యెడు దానికి (కులక్షయమయ్యెడు దాని కోర్చి, భీష్మ - 1వ ఆ -186) కులక్షయమగుటకు అన్నది దీని గ్రాంథిక రూపం. ఇంకా తనకు వశంబు సేసికొనుదానికి నోర్చి - ఉ-2-199, ఇప్పటి భంగి నొక్కడుగు నేగెడు దానికి నోర్వనెమ్మెయిన్, వి-1-148, ఇప్పుడు వచ్చిన దానికిం గతం బెయ్యది - వి-1-190. వీనికి మార్కొను జాలెడి దానికి - వి-2-9. వచ్చేదానికి, పొయ్యేదానికి, తినేదానికి మొదలైన వ్యవహారిక ప్రయోగాలు నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో నేటికీ నిల్చివున్నాయి.

3. తెగ (అని తెగనిండ దిగిచి యేసిన, కర్ణ 1 ఆ - 360 పప) ఎక్కువగా, చాలా అని దీని కర్థం. నేటికీ తెగ చదువుతున్నాడు. తెగ వాగుతున్నాడు మొదలైన వ్యవహారిక రూపాలు విన్పిస్తాయి.

4. ఊరికి పోవు (మానవ యూరికిఁ బోయె. శల్య -2 ఆ -55) దీనికి నశించు అని అర్థం. నెల్లూరు పరిసరాలలో ఈ ప్రయోగం వ్యవహారంలో ఉంది.

5. మందు (ఇమ్మహాత్మునకొక మందు సెప్పెద, ద్రోణ -5 వ ఆ-305) మందు అంటే ఉపాయం. దీని కేమి మందు? మొదలైన వాక్యాలు నేటికీ కూడా నెల్లూరు ప్రాంత జన వ్యవహారంలో ఉంది.

6. ఎఱుక పడు (తొలుత నీ పెనుపరి చందం బెల్ల నెఱుక పడియెడు! ఉద్యోగ 3 ఆ - 214) తెలియడం అనే అర్థంలో ఈ మాట నేటికీ వ్యవహారంలో ఉంది. ఎఱుకయ్యిందా? అన్నది నేటి వ్యవహారం.

7. నా తల పెద్ద మోపెత్తి ఉ-4-251.

8. కన్నా రంగా ఉ-4-352

9. బీఱువోవకుండ (ఎడం/సందు లేకుండా) ఉ-3-235

10. వారెల్లను నొక తల మారుతి యొక తల. (ఒక ఎత్తు) ఉ-2-184.

11. పొడతురె పాండునందనులు ఉ-2-208

12. తోలూడ్చు మహానాగం (కుబుసం విడుచు) ఉ-2-146.

13. పయిఁ బూపుకొనుట (తన మీద వేసుకోవడం) వి-1-125).

14. తెండీ (వి-4-47).

15. బలే - (ఔరా!) ఉ-4-418

**శబ్ద పల్లవాలు :**

ఒక ధాతువుకు మరొక ధాతువు చేరి విలక్షణార్థమిచ్చేవే

శబ్ద పల్లవాలు. ఆడు అనే ధాతువు వేరు వేరు ధాతువులతో చేరి విలక్షణార్థమిస్తున్న వైనం తిక్కన తెలుగులో కన్పిస్తుంది. ఇవి దేశ్య పదాలు కావడమే కాదు. జన వ్యవహారంలో నేటికీ నిల్చి వున్నాయి. చెడు+ఆడు చెడనాడు (నిందించు)
తెగ+ఆడు తెగనాడు (నిష్కర్షగా చెప్పడం)
ఉల్లసము+ఆడు ఉల్లసమాడు (పరిహసించడం)
చేతులు+ఆడు చేతులాడు (పనికి పూనుకోవడం)
కాళ్ళు+ఆడు కాళ్లాడు (వెళ్లడానికి ఉద్యమించడం)
నోరు+ఆడు నోరాడు (మాటలాడడం)
నీళ్ళు+ఆడు నీళ్ళాడు (ప్రసవించడం)
కొట్లాడు (యుద్ధం చేయడం/తగాదా పడటం) ఉ-3-242
చెడనాడు (నిందించడం) శాం - 1-117
ఉల్లసమాడు (గేలిచేయడం) వి-5-182
చేయాడు (పనికి పూనుకోవడం) ఉ-4-150
నోరాడు (నోరు మెదుపు, మాటలాడపూను) ఉ-4-183)
ఖచియించు (పొదగడం/బిగించడం) ఉ-4-123
పెనకువ (యుద్ధం) ఉ-4-91
ఇలాగే తెగనాడు, కాళ్ళాడు మొదలైనవి

**తద్ధితాలు :**

రెండు నామ పదాలు కలిసి ఒకే నామ పదంగా మారడం. పడు అనే క్రియా ధాతువు నుండి పాటు అనే నామం ఏర్పడుతుంది. అది వివిధ నామ పదాల మీద చేరడం వల్ల కొత్తనామ పదాలు ఏర్పడి భాషా వికాసం కలుగుతుంది.

**ఉదాహరణ :**

వెక్కసము+పాటు వెక్కసపాటు (అసహ్యం పొందడం)
అబ్బురపడడం, ఆశ్చర్యం వి-1-123, వి-5112.
భంగము+పాటు భంగపాటు (అవమానం పొందడం)
ఉ-3-184
దుఃఖపాటు (శోకం పొందడం) ఉ-3-184
సంకటపాటు (కష్టం పొందడం) ఉ-3-184
ఒడబాటు (సమ్మతించడం) ఉ-2-283
కీడు-పాటు కీడ్పాటు (నశించు పోవడం) (చేటు కలగటం)
వి-1-103, వి-4-80
ఉత్తలపాటు (దుఃఖం కలగడం) వి-1-99
అగపాటు (తెలియడం) వి-1-158)
బ్రుంగుడు పాటు (మరుగున పడడం) వి-2-192
వేగిర పాటు / వేగపాటు (త్వరపడడం) వి-2-242.
వి-2-260 తోడు+పాటు తోడ్పాటు (సహాయ పడడం)
మ్రాను + పాటు మ్రాన్పాటు (నిశ్చేష్టత పొందడం)
కొందలము+పాటు కొందలపాటు (దుఃఖమనుభవించడం)
ఉ-2-129, వి-4-198
నివ్వెఱపాటు (ఆశ్చర్యపడడం) భీ-1-297
క్రుందుపాటు (సమ్మర్ధం/ఒత్తిడి) భీ-2-103
మొదలైనవి. ఇలాగే పోరు+ఆట పోరాట, (ఆ సుయోధను తోడి పోరాట దక్కి... ఉద్యోగ 3వాఆ. 7 పద్యం) దీనికి యుద్ధమని అర్థం. ఒక వేళ కౌరువులతో పోరు తప్పనిసరి అయితే అది తమకు ఆట వంటిదేనని ధర్మరాజు ఈ మాట ద్వారా ధ్వనింపజేశాడు.

**ఉపమలు :**

తిక్కన ప్రయోగించిన ఉపమానాలు తెలుగు వారి వాడుకలోనివే. జన వ్యవహార సమ్మతమైన తెలుగు మాటల ద్వారా భావాన్ని తేట పరచడం తిక్కన ఉపమానాల విశిష్టత. ఉదా... తలిరెసగిన నడ మామిడి చెలువున (చిగుళ్ళు తొడిగి నడుస్తున్న మామిడి చెట్టు అందంతో)
కాగిన ఎనరుల కరణి (సముద్రాలు ఉప్పొంగడం)
ఉ-4-116
దేగఁ గనిన పులుగు పిండు కరణి (సైన్యం చెల్లా చెదరవడం)
శాంతి-2-374
కంటికి ఱెప్పయుం బోలి (మిక్కిలి జాగ్రత్తతో)
ఉ-4-144
నీఱు గవిసి యున్న నిప్పువలె/లట్లు (బూడిద కప్పిన నిప్పులాగా, గూడంగా) వి-1-128, వి-5-351.
పెన్నిధి గన్న పేద వోలె/చందంబున (ఆపదలో ఉన్న వాడికి గొప్ప ఆలంబనం దొరకడం) ద్రోణ-5-468, వి-4-149
మడుగు జీర యందు మసి దాకినట్లు (స్వచ్ఛమైన వస్తువు కళంకితం కావడం) ఉ-1-295)
పాలలోఁబడిన బల్లి విధంబు (సౌఖ్య సాధనాలుండి కూడా వ్యధ చెందడం. ఉ-3-135
నిప్పులు వేడిమి సెడినట్లు (ఒక వస్తువు దాని సమాజ ధర్మాన్ని కోల్పోవడం) ఉ-3-135
పిల్లి వట్టిన యీరువు వోలె ఉ-2-25
మున్నీరు సొచ్చిన యేఱుల చందంబు ఉ-2-265
మంటలో మిడతలు సొచ్చినట్లు వి-5-33

ఆలలోని ఆబోతుల పోలి భీ-1-133
పామున్న యింటిలో నున్న యట్లు ఉ-3-20
పొగలేని మంట పగిది (మిక్కిలి తీక్షమైన బాధ) మొదలైనవి.
నూతి కప్ప విధమున ఉ-4-196
చెలువు వడయు క్రొమ్మావి చాడ్పున ఉ-4-321
సాళువము కాకి నొడసిన భంగిన్ వి-2-282
పిడుగు పడిన వానిం గొఱవిం జూడిన తెఱంగు వి-2-102
బొబ్బిలి యున్న పొదరు సొచ్చు లేడి చందంబున వి-2-112

**సామెతలు :**

తెలుగు వ్యవహారంలో సందర్భోచితమైన సామెతలెన్నో తిక్కన తెలుగులో కన్పిస్తాయి. భావాన్ని త్వరగా బోధ పరచడానికి సామెతలుపకరిస్తాయి. సామెతలు ఒక భాషా సమాజపు సొంత సొత్తు.

మడుగు జీర యందు మసి దాకినట్లు (స్వచ్ఛమైన వస్తువు కళంకితం కావడం)
పాలలో బడిన బల్లి విధంబు (సౌఖ్య సాధనాలుండి కూడా వ్యధ చెందడం)
పామున్న ఇంటిలో నున్న యట్లు (ఎల్లప్పుడూ ఆందోళనతో ఉండడం)
నిప్పులు వేడిమి సెడినట్లు (ఒక వస్తువు దాని సమాజ ధర్మాన్ని కోల్పోవడం)
కొండం గని తగరు దాక గోరుట (బలహీనుడు బలవంతుణ్ణి ఎదిరించడం)
అందని మ్రాకుల వండ్లను కోయ దలచుట (తన కందుబాటు కాని వస్తువును ఆశించడం) వి-2-58.
ఢీ కొనం దగరే కొండం గని ఉ-2-12
శ్రీరా మోకాలొడ్డిన విధము కాదె ఉ-3-343
మాకుం గడుమిండెదె మీరు ప్రక్క గొనుడు ఉ-1-312
మిన్నందిన యట్టివాని పొడవెంతన్నట్లు ఉ-2-174
చిచ్చునకు తోడు కరువలి వచ్చు గతిన్ ఉ-2-181
పాముఱుఁగు పాము కాళులు శాంతి -4-182
నూతి కప్ప విధమున (పరిమిత విషయ జ్ఞానం, కూపస్థమండుకం) మొదలైనవి.

**వాక్య రూపాలు :**

నాటి జన వ్యవహారంలో ఉన్న వాక్యాలను పోలిన వాక్యాలు తిక్కన తెలుగులో ఉన్నాయి. ఇటువంటి వాక్య ప్రయోగాలు నేటి వ్యవహారంలో కూడా వున్నాయి.

**ఉదాహరణ :**

భూతకాల వ్యతిరేకార్థక క్రియా రూపం మీద ప్రశ్నార్థక ప్రత్యయాన్ని చేర్చి వ్యవహరించడం. చెప్పవు+ఐతి చెప్పవైతి (శాంతి-1-252), గైకొనవు+ఐతి గైకొనవైతి (శాంతి-3-399). నువ్వు రావైతివి, ఈ పని చేయవైతివి మొదలైన వాక్య రూపాలు నేటి వ్యవహారంలోనివి.

వారు దెస లెత్తుకొనియు ధ, రా రాజ్యం బిచ్చి పోయిరా. పోరా (ఉద్యోగ 4-176) పోయిరా పోరా అనే వ్యవహారిక వాక్య రూపం నేటి వ్యవహారంలో కూడా ఉంది.

**నీవు చెప్పిన పని చేశానా చెయ్యలేదా మొదలైనవి నేటి వ్యవహారిక రూపాలు.**
**తానైన నపుడు వక్రుం, దై నీతి పథంబు విడిచె నక్కట పతి మ**
**మ్మైనను చక్కని తెరువున, బూనినడువు దనుచు నిపుడు బుద్ధులు సెప్పున్**

*(ఉద్యోగ పర్వం-1-33)*

తానేమో అపుడు, మమ్మల్నేమో ఇపుడు అనే నాటి వ్యవహార వాక్య విన్యాసం నేటికి కూడా నిల్చి వుంది.

అనపుడు భీష్ముడు.... నివునుం గొడుకు నేమని

చ్చిన నొకటి యీగి లేకున్నను వేఱొక్కటి తలంచునా కేశవుడున్ ఉద్యోగ-3-165 ఏదైనా కానుక యిస్తే ఒకటీ, ఇవ్వకుంటే వేరొకటా. అనే వ్యావహారిక వాక్య రచన ఇక్కడ కన్పిస్తుంది. ఇలాంటి వ్యవహార రూప వాక్యాలు తిక్కన భారతమంతటా ఉన్నాయి.

**పదునైన మాటలు :**

ఒక భావాన్ని శక్తిమంతంగా చెప్పడం కోసం తిక్కన పదునైన మాటలను ప్రయోగిస్తాడు. లోక వ్యవహారంలో ఆయా వ్యక్తులు ఆయా సందర్భాలలో ఎంత ధీటుగా మాటలతో స్పందిస్తారో అలాంటి మాటలే తిక్కన తెలుగులో ఉన్నాయి.

**ఉదాహరణ :**

కపట ధర్మ .... వారల నమ్మంగ, గాదు సీత గుండెకాయనిడిన (శల్య-2-396) పాండవులు తమ గుండెకాయ తీసి చేతిలో పెట్టినా, వాళ్ళను నమ్మరాదని దుర్యోధనుడు సంజయునితో చెప్పిన మాటలివి. చేత గుండెకాయ నిడిన అనే మాటలోని శక్తి అమోఘం.

**ఎత్తి పొడుపులు :**

తిక్కన భారతంలో సందర్భానుగుణమైన ఎత్తి పొడుపు మాటలు తెలుగు వారిని అలరిస్తాయి. తెలుగు వారి సహజ వ్యవహార శైలి యిలాగే వుంటుంది.

**ఉదాహరణ :**

నీకు వెఱవ నేల నిన్ను నా బుద్ధిమంతుడు సెప్పమనిన తులువ మాట లెన్నిగలవు వానినన్నింటి ననుమాన, మింతలేక యాడు మెల్లవినగ. (ఉద్యోగ-4-189) దుర్యోధనుని దూతగా వచ్చిన ఉలూకునితో ధర్మరాజన్న మాటలివి. బుద్ధిమంతుడనే మాటకు వ్యతిరేక లక్షణం చేత యిక్కడ బుద్ధి లేని వాడని అర్థం. ఎందుకంటే బుద్ధిమంతుడు తులువ (తుంటరి) మాటలెలా పలుకుతాడు.

**కాకువు :**

ఒక మాటకున్న అర్థాన్ని కొంత భిన్నంగా వ్యక్తం చేయడం కోసం స్వరంలో చూపే ధ్వని వికారమే కాకువు. ఐ.ఎ. రిచర్డ్స్ ఒక పదానికి వచ్చే నాలుగు అర్థ భేదాలలో టోన్ ఒకటని అన్నాడు. ఈ టోన్ అన్నదే కాకువు. ఒకే మాటకు ఉచ్చారణలోని భేదాన్ని బట్టి అర్థం మారడమే కాకువు.

**ఉదాహరణ :**

**పగయడగించు టెంతయు శుభంబిది...**

(ఉద్యోగ-3-21)

**జగతి గల జనపతులు ...** తల్లి ప్రజల యెడ విరోధంబు వాటించు టెంత మేలు (ఉద్యోగ - 3-265).

పై రెండు సందర్భాలలోని మొదటి ఎంతకు చాలా ఎక్కువ అని అర్థం. రెండవ ఎంతకు శూన్యమని, ఏ మాత్రమూ కాదని అర్థం.

**ఛందస్సు :**

తిక్కన దేశిచ్ఛందస్సులనే ఎక్కువగా ప్రయోగించాడు. తిక్కన రచన మొత్తంలో మూడవ వంతు పద్యాలు కంద పద్యాలేనని శ్రీ చాగంటి శేషయ్య తన ఆంధ్ర కవి తరంగిణిలో (11 అధ్యాయం-172, 173 పుటలు) లెక్క కట్టి చూపారు. కందాలు మాత్రమే కాకుండా, తేటగీతి, ఆటవెలది, సీసం మొదలైన దేశీయ ఛందాలను కూడా లెక్కిస్తే, మొత్తం తిక్కన రచనలో సగానికి పైగా దేశిచ్ఛందాలే కనబడతాయి.

**ఇతరాలు :**

భారత రచన కోసం నన్నయ ఏర్పరచిన నిర్మాణపు చట్రాన్నే తిక్కన అనుసరించినప్పటికీ, ఆ నిర్మాణం కోసం తిక్కన ఉపయోగించిన ద్రవ్యం (మెటల్) మాత్రం దేశీయమైంది. అలాగని తెలుగు మాటలను ఎక్కువగా ప్రయోగించినంత మాత్రాన ఏ రచనకయినా దేశీయతా లక్షణం సిద్ధించదు. జన వ్యవహారంలో ఉన్న మాటలను ప్రయోగించినప్పుడే దేశీయత కన్పిస్తుంది. అలాంటి వ్యవహార రూఢమైన భాషా ద్రవ్యాన్ని తిక్కన తన భారతంలో ప్రయోగించాడు.

భారత కథ సంస్కృత భాషలోనైనా, తిక్కన దానిని తెలుగులో నిర్మించిన తీరు తెలుగు వారికి ప్రీతి పాత్రమైంది. మొన్న నిన్నటి వరకు తెలుగు వారు (భారతీయులందరూ కూడా) అనుసరించిన ఉమ్మడి కుటుంబ జీవిత గాథ తిక్కన భారతంలో ప్రతిబింబిస్తూ వుంది. దానిలో తామిష్టపడే జీవన విధానాన్ని చూసుకొని మురిసి పోయారు.

ఇక పాత్రల విషయంలో పుత్ర వ్యామోహాంధులు, దురభిమాన దర్పితులు, మితిలేని సహనశీలురు, ఆవేశపరులు, పతి ఉదాసీనతను సహించలేని పత్నులు మొదలైన పాత్రలు సమాజంలోని వ్యక్తులకు ప్రతిరూపాలు. అలాంటి వ్యక్తులు ఆయా సందర్భాలలో ప్రదర్శించే హావ భావాలను, వారి శారీరక చేష్టలను, వారి మాటతీరును గమనించి, రచనలో నిక్షేపించడమే నాటకీయత. రచనలోని నాటకీయతకు సమాజ అవగాహనే మూలమౌతుంది. ఈ కారణం చేత ఇతివృత్త నిర్వహణ, పాత్ర చిత్రణ, నాటకీయతతోడి రచన దేశీయతకు అంగాలవుతాయి.

**ముగింపు :**

పైన పేర్కొన్న అంశాలన్నీ తిక్కన తెలుగులోని దేశీయతకు తార్కాణాలు. తిక్కన భారతం ఒక మహా సముద్రం. అందులో దేశీయమైన పలుకుబళ్ళు వేల సంఖ్యలో ఉన్నాయి. ఈ వ్యాసంలో తెల్పిన రూపాలు వాటికి నమూనాలు మాత్రమే.

ఈ విధంగా తన రచనలో దేశీయతను పోషించిన తిక్కన తెలుగు జాతికి ప్రాతినిధ్యం వహించిన మహా కావ్య కర్త. తెలుగు జాతీయ మహాకవి.




# తెలుగు ప్రచురణ సంస్థలు

- పుస్తక ప్రియ

ఆ రోజుల్లో సామినేని ముద్దుకృష్ణ *పుస్తకం అచ్చు వేయడం మాటలు కాదు. ఎంతో జాగ్రత్త పడాలి. ప్రెస్‌లోనే కాపురం పెట్టాలి. ప్రతి గ్యాలీ' ఒక శిశువు, రచయిత, 'మంత్రసాని'* అని ఛలోక్తిగా అనేవారు.

తల్లావఝుల శివశంకర శాస్త్రి పుస్తక ప్రచురణ గురించి మాట్లాడుతూ *పుస్తకానికి అట్ట అందం. అది చూచి పుస్తకం కొనాలి చదవాలి. కనుక అట్ట 'జవరాలి చెక్కిలిలా ఉండాలి'* అన్నారు. ప్రక్కనున్న ఆయన *మీరు చెప్పింది బాగానే ఉంది గాని, ముద్దులతో తడిసి నలిగిపోతుందేమో!* అని సందేహం వ్యక్తం చేశారు శాస్త్రి గారు. *నలిగితే ఆ గ్రంథంలోని నాణ్యత బయట పడుతుంది* అన్నారు.

*అచ్చు పాఠ్య పుస్తకాలు, గైడ్లు, టెలిఫోన్ డైరెక్టరీలు పుస్తకాలు కావు. చదివిన వ్యక్తి మనసుకు రెక్కలు తొడిగేది, అతడి ఏపైన ఎదుగుదలకు ఏతాముగా నీరుతోడేది, చీకటి వేళల మనస్సుకు బాసటగా నిలిచేది, త్రికాలాలను రెండట్టల మధ్యన ఒదిగించేది ఒక్క పుస్తకమే. ఆ ఆనందం, ఆ అనంతం, ఆ ఆకాశం, ఆ ఆహ్వానం - మీ చేతి చివర ఉండాలి సుమా!* అంటారు వాకాటి పాండురంగారావు గారు.

**"మది కుదురజేసి చల్లని మాటజెప్పి**
**కలక నెడలించి ధైర్యంబు కలుగజేసి**
**తల్లిదండ్రుల బోలి పెద్దలను బోలి**
**సదుపదేశంబుజేయు పుస్తకమే నీకు"**

*పుస్తకాలు బాలలకు చల్లని మాట జెప్పి మనసు కుదురు కొనేలా చేస్తాయి. భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని కలుగజేస్తాయి. తల్లిదండ్రులలాగా, పెద్దలలాగా మంచి ఉపదేశాన్ని అందజేస్తాయి* అంటారు వెంకట పార్వతీశ కవులు.

**"పుస్తకంబులు గలిగిన పూరిగుడిసె**
**యందు నిరుపేద కాపునై యుందుగాని**
**పుస్తకంబులు లేనట్టి భూరి సౌధ**
**మందు చక్రవర్తిగా నుండ నభిలషింప"**

*పుస్తకాలు ఉన్న పూరిగుడిసెలో నిరుపేద కాపుగా ఉంటాను గాని, పుస్తకాలు లేని పెద్ద భవనంలో చక్రవర్తిగా ఉండటానికి ఇష్టపడను* అంటారు మధురకవి నాళం కృష్ణారావు గారు.

**"పూలతో నిండి కమ్మదనాలు చిమ్ము**
**పుస్తక నికుంజ పుంజాళికి పొంత బిలిచి,**
**నా జనము, నాదు దేశ మనంగ జాలు**
**ఇంత జ్ఞాన భిక్ష దానమిమ్ము తల్లి!"**

అంటారు రాయప్రోలు సుబ్బారావుగారు.

పదిహేడవ శతాబ్దంలో తెలుగులిపిలో ముద్రణ ప్రారంభమైనట్లు చారిత్రక ఆధారాలున్నాయి. జాన్‌ఫ్రేయర్ అనే విదేశీయాత్రికుడు తొమ్మిదేళ్ళపాటు తూర్పు దేశాలలో పర్యటించి *న్యూ ఎకౌంట్ ఆఫ్ ఇండియా అండ్ పర్షియా* అనే గ్రంథాన్ని రాసి 1698 లో ప్రచురించాడు.

ఈ గ్రంథములో తెలుగు లిపిలో వాక్యాలున్నాయి. ఈ గ్రంథ ప్రతి నేడు న్యూ ఢిల్లీలోని నేషనల్ ఆర్కైవ్స్‌లో పదిలంగా ఉంది. డెన్మార్క్‌రాజు భారతదేశానికి పద్దెనిమిదో శతాబ్దారంభంలో కొందరు మతాచార్యులను పంపాడు. వారిలో బెంజిమన్ షూల్జి ఒకరు. షూల్జి ఇరవైమూడు సంవత్సరాలపాటు దక్షిణ భారతదేశంలో మతప్రచారం చేస్తూ తెలుగు, తమిళ, హిందీ తదితర భాషలు నేర్చుకున్నాడు. బైబిల్‌ను తెలుగులో అనువదించాడు. అనారోగ్య కారణాల వల్ల 1743 లో జర్మనీలోని హాలే

నగరం చేరాడు. కఠోరదీక్షతో తెలుగులో మతగ్రంథాలు అచ్చువేయాలని సంకల్పించాడు. చెక్క దిమ్మలపై తెలుగు అక్షరాలను చెక్కించాడు.

బెంజిమన్ షూల్జ్ 1746-47 మధ్యకాలంలో హాలేనగరంలో నాలుగు తెలుగు పుస్తకాలను అచ్చువేశాడు. *మోక్షానికి కొంచుపొయ్యే దోవ* (24 పుటలు), *సత్యమైన వేదంలో ఉండే జ్ఞాన ఉపదేశాల యొక్క సంక్షేపం* (24 పుటలు), *ఒక గురువు ఐదు బ్రాహ్మల యొక్క నడుమన... పెద్దస్వామి మీద ప్రసంగించిన తర్రమితె* (48 పుటలు), *బుద్ధి కలిగిన... నూరు జ్ఞానవచనాల* యొక్క చిన్న పుస్తకం ఇది (48 పుటలు). ఈ పుస్తకాల పొడవు పదహారు సెంటీమీటర్లు, వెడల్పు పది సెంటీమీటర్లు. ప్రతి పుటలో ఇరవై పంక్తులు. ప్రతి పంక్తికి పన్నెండు నుండి పద్నాలుగు అక్షరాలు. భాష వ్యావహారికం. ఈ పుస్తకాలు లండన్‌లోని బ్రిటీష్ గ్రంథాలయంలో ఉన్నాయి.

విలియంక్యారీ 1793లో భారతదేశంలో మిషనరీ పనిమీద అడుగుపెట్టాడు. చార్లెస్ విల్కిన్స్, మార్షమన్, విలియం వార్డు, పంచానన్ కర్మార్కర్ మరియు కర్మార్కర్ అల్లుడు మనోహర్ సాయంతో అన్ని భారతీయ భాషలలో, ఆసియా భాషలలో అచ్చులను తయారు చేయించాడు. మరోవైపు పండితులను వినియోగించి *బైబిల్*ను అనువదించడానికి ఏర్పాట్లు చేశాడు.

ఆ రోజుల్లో కలకత్తా - శ్రీరామ్‌పూర్‌లో అచ్చులు పోసేవారు, కూర్పరులు, ప్రూఫులు దిద్దేవారలతో కోలాహలంగా ఉండేదట! విలియంక్యారీ అనువదించిన *బెంగాలీ బైబిల్* 1801 లో అచ్చయింది. కదిలే అచ్చుల సాయంతో పుస్తకాలు ముద్రించడం భారతదేశంలో ఇదే ప్రథమం. విలియంక్యారీ తదేకదీక్షతో 1801-1832 మధ్యకాలంలో 42 భాషలలో *బైబిల్* అనువాదం చేయించి, టైపులు పోత పోయించి రెండువందల కాపీల చొప్పున పదివేల కాపీలకు పైగా ప్రచురించాడు క్యారీ భారతముద్రణా పితామహుడు.

భారతదేశంలోని ప్రతి ముద్రాపకుడు, ప్రచురణకర్త విలియంక్యారీ చిత్రపటాన్ని, ఆంధ్రదేశంలోని ప్రతి ముద్రాపకుడు, ప్రచురణకర్త బెంజిమన్‌షుల్జ్ చిత్రపటాన్ని తమ కార్యాలయాలలో అలంకరించడం ఆ మహామహులకు మనమిచ్చే నివాళి!

నేడు పుస్తక ప్రచురణలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. పుస్తకాలను ప్రచురించే తెలుగు ప్రచురణ కర్తలను ఓసారి తలచుకుందాం.

వావిళ్ళరామశాస్త్రి *ఆదిసరస్వతీ ముద్రణాలయము*; వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రి *వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్సు*; వెంకటగిరి సంస్థానరాజు శ్రీసర్వజ్ఞ కుమారయాచేంద్రులు, చదలవాడ సుందరరామశాస్త్రిగారల *శారదాంబా విలాస ముద్రాక్షరశాల*; దంపూరి నరసయ్యగారి *పీపుల్స్ ఫ్రెండ్ లైబ్రరీ*; వనపర్తి సంస్థానాధీశులు రాజా జనుంపల్లి రెండవ రామేశ్వరరాయలు గారి *విస్తృత రాజకవులు గ్రంథమాల*; మానవల్లి రామకృష్ణ కవిగారి *దక్షిణ భారత సంస్కృత గ్రంథమాల*; కందుకూరి వీరేశలింగం *రచనలు-ప్రచురణ*; *క్రిస్టియన్ లిటరేచర్ సొసైటి ఫర్ ఇండియా*; వేమూరి వేంకటకృష్ణమ్మ సెట్టి, తిరువేంగడత్తాన్ సెట్టిగారల *ఆనంద ముద్రణ సంస్థ*; ఆర్.వెంకటేశ్వర్ అండ్ కో, వేదం వేంకటరాయశాస్త్రి గారి *జ్యోతిష్మతీ ముద్రాక్షరశాల*; నందిరాజు చలపతిరావు, లక్కవరం సంస్థానాధీశులు రాజామంత్రప్రగడ భుజంగరావు గారల *మంజువాణి ముద్రాక్షరశాల*; పనప్పాకము ఆనందాచార్యులు (అనంతాచార్యులు) గారి *వైజయంతీ ముద్రణాలయం*.

పోలవరం జమీందారు కొచ్చెర్లకోట వేంకట జగన్నాథరావు, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారల *సరస్వతి గ్రంథమాల*; సత్యవోలు సన్నేశ్వరరావు, బంగారురాజు, లక్ష్మీపతిగారల *సత్యవోలు సన్నేశ్వరరావు అండ్ బ్రదర్స్*; ఈదర వెంకట్రావుగారి *వెంకట్రామ అండ్ కో*; కొమర్రాజు లక్ష్మణరావు, రావిచెట్టు రంగారావు, రాజా నాయని వెంకట రంగారావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యదేవర కాళేశ్వరరావు గారల *విజ్ఞాన చంద్రికాగ్రంథ మండలి*.

వడ్డెపాటి నిరంజన్ శాస్త్రిగారి *ప్రబోధిని ముద్రణాలయం*; దేవరాజు వేంకటకృష్ణారావు, భాగవతుల నృసింహశర్మ, తాపీధర్మారావు గారల *వేగుచుక్క గ్రంథమాల*; తల్లాప్రగడ సూర్యనారాయణరావు, కొవ్వూరి చంద్రారెడ్డి, అయ్యగారి నారాయణ మూర్తి, చాగంటి శేషయ్య, వెంకట పార్వతీశకవులు (బాలాంత్రపు వెంకటరావు, ఓలేటి పార్వతీశం)గారల *ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల*.

జయంతి రామయ్యపంతులు, పురాణం నాగభూషణం, వేదం వెంకటరాయశాస్త్రి, ఆచంట లక్ష్మీపతి, కంచి కృష్ణసామిరావు, పిట్టి త్యాగరాయ చెట్టిగారల ఆంధ్రభాషా మహాసంఘము; చెలికాని లచ్చారావు *శ్రీరామ విలాస గ్రంథమాల*; సురవరంప్రతాపరెడ్డి,చెలిమచర్ల రంగాచార్యులు, కేశవపంతుల నరసింహశాస్త్రిగారల *విజ్ఞాన వర్ధినీ పరిషత్తు*; తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారి *ఆఖ్యాయికా పరంపర గ్రంథమాల*; కోదాటి రామకృష్ణారావు, కోదాటి వెంకటేశ్వరరావు, ఎస్.బి. రామానుజాచార్యులు, షబ్నవీసు వెంకటరామ నరసింహారావు, అక్కినేపల్లి జానకిరామారావు, ఒద్దిరాజు సీతారామచంద్రరావు, ఒద్దిరాజు రాఘవ రంగారావు గారల *విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల*; శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి *కళాభివర్ధనీ పరిషత్తు గ్రంథమాల* ; చిలుకూరి వీరభద్రరావు *ఇతిహాస తరంగిణీ గ్రంథమాల* ; రెబ్బాప్రగడ మందేశ్వరరావు గారి *మతసాహిత్యవర్ధని సంఘము*.

తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి, చింతా భీమశంకరం, కొడవటిగంటి వెంకట సుబ్బయ్య, నోరి నరసింహశాస్త్రి, చింతా దీక్షితులు, త్రిపురారిభొట్ల వీరరాఘవస్వామి, పెద్దిభొట్ల పూర్ణశర్మ, వఝ్ఝల బాబూరావు, కొమ్మూరి హనుమంతరావు, కోపెల్ల శివకామేశ్వరరావు, చామర్తి రాజశేఖరరావు, కొత్తపల్లి సుబ్బన్నాచార్యులు గారలు *మొదలైనవారి సాహితీ సమితి*; ఎన్.చిన్నయ్య సెట్టి, లక్ష్మీనరసింహారావు గారల *కామగ్రంథమాల*; చిలుకూరి వీరభద్రరావు, చిలుకూరి నారాయణరావు, భావరాజు వెంకటకృష్ణారావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ గారల *ఆంధ్ర దేశయేతిహాస పరిశోధక మండలి*; శనివారపు సుబ్బారావు గారి *హిందుస్థాన్ పబ్లిషింగ్ హౌస్*.

ముదిగంటి జగ్గన్నశాస్త్రి, శనివారపు సుబ్బారావు, తాడిమేటి రామకృష్ణారావు గారల *పల్లెటూరు గ్రంథమండలి*; ముక్త్యాల జమీందారు వాసిరెడ్డి చంద్రమౌళీశ్వర ప్రసాద బహద్దరు వారి *మాహిష్మతీ ముద్రాక్షరశాల*; వల్లూరి సూర్యనారాయణరావు, రెంటాల వెంకట సుబ్బారావు గారల *సూర్యనారాయణీయ గ్రంథమాల*; ముడియం సీతారామారావుగారి *రామచంద్ర గ్రంథమాల*; గంటి సూర్యనారాయణ శాస్త్రిగారి *జి.యన్.శాస్త్రి అండ్ కో మరియు శృంగార గ్రంథమాల*; కొత్త సత్యనారాయణ చౌదరిగారి *భాషాపోషక గ్రంథమండలి*; పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారి *ఆర్యభారతీ గ్రంథమాల*; పాటిబండ మాధవశర్మ గారి *ఉషాగ్రంథావళి*; చక్రపాణి (ఆలూరి వెంకట సుబ్బారావు) గారి *యువప్రచురణలు*; మహీధర రామమోహనరావు, జగన్మోహనరావు, కృష్ణమోహన రావు గారల *విశ్వసాహిత్యమాల*.

విద్వాన్‌విశ్వం (మీసరగండ విశ్వరూపశాస్త్రి) గారి *ఇంటింటా విజ్ఞానమాల* మరియు *నవ్యసాహిత్యమాల*; కె.సి.గుప్తా (కల్వకుంట చంద్రసేన గుప్త), వెల్దుర్తి మాణిక్యాల రావు, గుండవరం హనుమంతరావు గారల *అణా గ్రంథమాల*; వట్టికోట ఆళ్వారుస్వామిగారి *దేశోద్ధారక గ్రంథమాల*; గాదే జగన్నాథ స్వామి గారి *ఆంధ్రకల్పకము గ్రంథమాల*; కవికొండల వెంకటరావు గారి *సుమనోహ్లాదినీ ప్రచురణలు*; చర్ల గణపతి శాస్త్రి గారి *ఆర్ష విజ్ఞాన పరిషత్తు*; కోదాటి నారాయణ రావు గారి *ప్రభాత ప్రచురణ సమితి*; వేదం వెంకటకృష్ణ శర్మగారి *సనాతన ధర్మ ప్రబోధిని*; ఉండ్రాజవరము ఎస్టేటుదారులు ముళ్ళపూడి తిమ్మరాజుగారి *నరేంద్రనాథ్ సాహిత్య మండలి*; బెజవాడ గోపాలరెడ్డి, మోటూరి సత్యనారాయణ, డి.వి.సుబ్బారెడ్డి, రాజా బొప్పరాజు రామకృష్ణరాజు, ఎస్.బి.పి.పట్టాభిరామారావు గారల *తెలుగు భాషా సమితి*; ముడియం సీతారామారావు గారి *రామచంద్రగ్రంథమాల*; దర్శి చెంచయ్య, నార్ల వెంకటేశ్వరరావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, విద్వాన్ విశ్వం, పందిరి మల్లికార్జున రావుగారల *ఇంటింటా విజ్ఞానమాల ప్రచురణలు*.

ఉప్పులూరి కాళిదాసుగారి *వ్యాస ప్రచురణాలయం*; కాళహస్తి తమ్మారావు, లచ్చయ్య, సూర్యప్రకాశం, పాపయ్యలింగం, వెంకటరమణ గారల *కాళహస్తి తమ్మారావు అండ్ సన్స్*; *సంస్కృతాంధ్ర బుక్ డిపో* మరియు *బాలసాహిత్య నికేతనం*; వేమవరపు రామదాసు పంతులుగారి *ఆంధ్రభాషాభి వర్ధనీ సంఘం*; కందుల శ్రీమన్నారాయణగారి *మానవసేవా గ్రంథమాల* ; ఇచ్చాపురపు యజ్ఞనారాయణగారి *హితకారిణీ గ్రంథమాల*; పురాణపండ మల్లయ్య శాస్త్రి, కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి గారల *ఆంధ్రభాషా సంరక్షక సమాజం*; హరిసత్యశాస్త్రి, జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి (సత్య సుబ్రహ్మణ్యేశ్వర కవులు) గారల *నవీణవాణీ గ్రంథమండలి*; బసవరాజు అప్పారావు, సీతారామమూర్తి, వింజమూరి రంగాచార్యులు, కురుగంటి

సీతారామయ్యగారల *ఆంధ్ర కవితా విమర్శన గ్రంథమాలిక*, గుమ్మలూరి నరసింహశర్మ గారి *జిర్జి ది ఫిఫ్త్ గ్రంథమాల*.

ఎన్.భాగీరథి గారి *ఆంధ్ర గ్రంథరత్నమాల*; సీపిరి ఆంజనేయులుగారి *విజ్ఞానవల్లికా గ్రంథమాల* బలిజేపల్లి లక్ష్మీకాంతం గారి *చంద్రికా గ్రంథమాల*; కొల్లూరి ధర్మారావు, ఈయుణ్ణి వీరరాఘవాచార్యులు, నిడదవోలు వెంకటరావు, కిళాంబి రంగాచార్యులు, విశ్వనాథ కవిరాజు, వెంకటకాళిదాసు కవులు గారల *ఆంధ్రగీర్వాణ సాహిత్య పరిషత్తు*; కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారి *ఆంధ్ర గ్రంథమాల*; అణ్ణంగరాచార్యస్వామి గారి *ఆంధ్ర గ్రంథమాల*; కాంచనపల్లి కనకమ్మ గారి *కవితిలక గ్రంథమాల*.

కలవటాల జయరామారావు గారి *భవానీ గ్రంథమాల*; ముదిగొండ సుబ్రహ్మణ్యశర్మ గారి *ఓరియంట్ పబ్లిషింగ్ కంపెనీ*; నడకుదుటి వీర్రాజు గారి *పురాణ గ్రంథమాలిక* ; పురిపండా అప్పలస్వామి, శ్రీశ్రీ, వడ్డాది సీతారామాంజనేయకవి గారల *కవితా సమితి*; దిగవల్లి వెంకట శివరావు గారి పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రేసు కమిటీ, ఎర్రాపాత్రుని కూర్మినాయుడు గారి *అనువాద గ్రంథమండలి*; ధూళిపాళ్ళ కోటయ్యగారి *కార్మిక ప్రచురణలు*; బాలాంత్రపు సత్యనారాయణ గారి *జాతీయ గ్రంథమాల*; కర్ణవీర నాగేశ్వరరావు గారి *ఆంధ్ర భారతీప్రకాశన మందిరం*.

గోదేటి జోగిరాజు గారి *గ్రామసేవా ముద్రణాలయం*, మధునాపంతుల సత్యనారాయణ *శాస్త్రిగారి ఆంధ్రకుటీరం*, సరిపెల్ల విశ్వనాథశాస్త్రి, కురుగంటి సీతారామయ్యగారల *సాధన సమితి*; దేశిరాజు కృష్ణశర్మ, అనిసెట్టి సుబ్బారావు, బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యంగారల *నవ్య కళాపరిషత్తు*; రాయప్రోలు సుబ్బారావు, మహమ్మద్ ఖాసింఖాన్ గారల *హైదరాబాదాంధ్ర సాహిత్య పరిషత్తు*; మాగంటి బాపినీడుగారి *జాతీయ జ్ఞానమందిర్*.

మాడపాటి హనుమంతరావు గారి *ఆంధ్రచంద్రికా గ్రంథమండలి*; జాస్తి వెంకటనరసయ్యగారి *భారతీసమితి*; కాకర్లమూడి సుబ్బారావు నాయుడు, కాశీనాథుని పూర్ణమల్లికార్జునుడు, బయ్యా సూర్యనారాయణ, అవటపల్లి హనుమంతరావు, అగ్నిహోత్రం విజయసారథి గారల *స్వాతంత్ర్య కుసుమమాల*; వెరైటీ సత్యనారాయణగారి *త్రిలింగ పబ్లిషంగ్ కంపెనీ*; పర్సా వెంకటేశ్వరరావు, దేవులపల్లి రామానుజరావు, వేమరాజు భానుమూర్తి *సంస్కృతీ నికేతనం*, దాశరథి కృష్ణమాచార్య, సి.నారాయణరెడ్డి, ఖండవల్లి లక్ష్మీరంజనం గారల *ఆంధ్ర రచయితల సంఘం*; పోలాప్రగడ సత్యనారాయణమూర్తి, ఉషశ్రీ, కనకప్రవాసి గారల *తరుణ సాహితి*; కె.టి.యల్. నరసింహాచార్యులు గారి *గోదా గ్రంథమాల*; హనుమకొండ శ్రీ రాజరాజ నరేంద్ర భాషానిలయం మిత్రమండలి వారి *వరంగల్ మిత్రమండలి*; వెలగల వీర్రెడ్డి గారి *కాలచక్రం ప్రచురణలు*.

గుండవరం హనుమంతరావు గారి ఆంధ్రకేసరి గ్రంథమాల దర్భా వెంకటరాయశాస్త్రి (రాంషా) గారి *కళాకేళి ప్రచురణలు*; ముదిగొండ వీరలింగ శాస్త్రిగారి *శైవప్రచారిణీ గ్రంథమాల*; నందగిరి వెంకట అప్పారావు పంతులు గారి *శివవెంకటీయ గ్రంథమాల*; పరవస్తు వెంకటాచార్యులు గారి *ఆర్షవాఙ్మయ ముద్రణాలయం*; ముద్దులపల్లి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి(శర్మ) గారి *కవితా సామ్రాజ్యము*; నల్లాన్ చక్రవర్తి శ్రీనివాస పార్థసారథి, శ్రీనివాస వెంకటాచార్యులు *గారల అజంతా ప్రింటర్స్*; గంధం శ్రీరామమూర్తి, ఇర్రింకి నరసింహమూర్తి గారల శ్రీరామ *నరసింహ గ్రంథరత్నమాల*; శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రిగారి *సావిత్రీ గ్రంథమండలి*; జంపాల శ్యామసుందరప్రసాద్, ఏటుకూరి వెంకటనరసయ్య, కొత్తసూర్యనారాయణగారల *సారస్వతమండలి*; రాప్తాటి సుబ్బదాసు గారి *నిగమార్థ చంద్రోదయ గ్రంథమాల*; నందగిరి శేషగిరిరావుగారి *ఆంధ్రవాణీ రత్నమాల* (గ్రంథమాల); వంగూరి సుబ్బారావు గారి *కమలమ్ కుటీర్‌ప్రెస్* మరియు *పబ్లికేషన్స్*. కామవరపు సూర్యనారాయణ కవిగారి *శ్రీ గౌరీదండక శతక వాఙ్మయమండలి*;వాసా సూర్యనారాయణశాస్త్రి గారి *శ్రీనివాసముద్రాశాల*; వాజపేయయాజుల రామసుబ్బా రాయుడు, వెంకటనారాయణ గారల *స్నేహలతా కవితా సమితి*.

గద్దం వెంకన్నగారి *మనోరంజనీ ముద్రాక్షరశాల*; రాజా బొమ్మరాజు బహద్దరు గారి *శ్రీ భారతీలీలా సదన ముద్రాక్షరశాల*; కర్లపాలెం కృష్ణారావు గారి *సాహిత్యలతా గ్రంథాలయం*, కోగంటి రాధాకృష్ణమూర్తిగారి *ప్రజాసాహిత్య పరిషత్తు ప్రచురణలు*; శ్రీపాద కామేశ్వరరావుగారి *అభినవాంధ్ర గ్రంథమాల*; మడిపడగ బలరామాచార్యులు

గారి *అరుణశ్రీ గ్రంథమాల*; అవ్వారి నారాయణగారి *అవ్వారి నారాయణ గ్రంథమాల*; పిల్లలమర్రి వెంకట హనుమంతరావు గారి *శారదాపీఠ గ్రంథమాల*; ఆకారపు నరసింగం గుప్తగారి *విశ్వేశ్వర గ్రంథమాల* మరియు *శివాగమ గ్రంథమాల*; కోట వెంకటాచలం గారి *ఆర్య విజ్ఞాన గ్రంథమాల*; చతుర్వేదుల పార్థసారథిగారి *భారతగ్రంథమాల*; దోమా వెంకటస్వామి గుప్తాగారి *వాఙ్మయ వినోదినీ గ్రంథమాల*; వెలగలేటి నరసింహాచార్యులు గారి *వెలగలేటి గ్రంథమాల*; ఘూళీకృష్ణమూర్తి, దేవదానం, కల్లూరి అహోబలరావు గారల *శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల*; తూము వరదరాజులు గారి *కాకతీయ గ్రంథమాల*; దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డి గారి *తెంకణ గ్రంథమాల*; కామరాజు హనుమంతరావు గారి *ప్రాక్ ప్రతీచీ గ్రంథమాల*.

కొమ్మూరి వెంకట్రామయ్య గారి *ఆధునిక గ్రంథమాల*, అద్దేపల్లి లక్ష్మణస్వామి గారి *అద్దేపల్లి అండ్ కో* మరియు *సరస్వతీ గ్రంథమండలి*; కొండపల్లి వీరవెంకయ్య గారి *కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్స్* మరియు *శ్రీ సత్యనారాయణ బుక్ డిపో*; గిడుగు రామమూర్తి పంతులు, సెట్టి లక్ష్మీనరసింహం, కిళాంబి రామానుజాచార్యులు, బుర్రా శేషగిరిరావు గారల *ఆంధ్ర సారస్వత సంఘం*; సోంపల్లి కృష్ణమూర్తి గారి *శ్రీ కోదండ రామగ్రంథాలయం*; కోట సుబ్రహ్మణ్య శాస్త్రి, కోట సత్యరంగయ్య శాస్త్రి (కోటసోదర కవులు) గారల *కవి చంద్రగ్రంథమాల*; దామరాజు పుండరీకాక్షుడు గారి *రామరాజ్య గ్రంథమాల*, చక్రావధానుల మాణిక్యశర్మ గారి *దేశీయ నాటక గ్రంథమాల*; సమర్థి రంగయ్యసెట్టి, వేదం వెంకటరాయశాస్త్రి, టేకుమళ్ళ రాజగోపాలరావు, ఆర్.ఎం.చల్లా, ఆర్.ఎస్.సుదర్శనం గారల *ఆంధ్రభాషాభి రంజనీ సంఘం*. స్వామి దయానంద సరస్వతి ప్రియశిష్యుడు స్వామి నిత్యానంద సరస్వతిగారి *ఆర్యసమాజం*; షబ్నవీసు వెంకటనరసింహారావుగారి *వీరేశలింగ కంఠాభరణ గ్రంథమాల*; వువ్వాడ వెంకటప్పయ్య గారి *కృషిప్రచారిణీ గ్రంథమాల*.

కిళాంబి రంగాచార్యులు గారి *రామానుజాచార్య విద్యాసమితి*; వేదం వెంకటరాయ శాస్త్రి గారి *వేదం వెంకటరాయశాస్త్రి అండ్ కో*; జమిలి నమ్మళ్వార్ గారి *నమ్మళ్వార్సు ప్రచురణలు*; తిరుమల రామచంద్ర, తిమ్మావజ్ఝల కోదండరామయ్య గారల *భాషా సేవక సమితి*; మంత్రి ప్రెగడ వెంకటేశ్వరరావు గారి *వైదిక ధర్మ గ్రంథమండలి*; నిడమర్తి అశ్వనీకుమార దత్తు, సోదరుడు ఉమారాజేశ్వరరావు గారల *ప్రగతి ప్రచురణలు*, అన్నప్రగడ కామేశ్వరరావు గారి *అతివాద గ్రంథమండలి*; పూండ్ల రామకృష్ణయ్య గారి *అముద్రిత గ్రంథ చింతామణి*; వడాలి నారాయణరావు గారి *మారుతీ రామ అండ్ కో*; వావిలాల గోపాలకృష్ణయ్య గారి భారతీ గ్రంథమండలి; కేశవపంతుల నరసింహశాస్త్రి గారి *విజ్ఞాన వర్షిణీ గ్రంథమాల*, రౌతు చంద్రయ్య గారి *రౌతు బుక్ డిపో*, దర్భాశ్రీరామమూర్తి గారి ప్రొలిటేరియన్ సిరీస్; భావరాజు నరసింహారావు గారి *త్రివేణీ పబ్లిషర్స్*; బులుసు అప్పన్న శాస్త్రి గారి *శారదా గ్రంథమాల*, పరవస్తు చిన్నయసూరి గారి *వాణీదర్పణ ముద్రాక్షరశాల*; తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారి *సారస్వత కుటీర గ్రంథమాల*, పండితగోపదేవ్‌గారి *అంబా దర్శన గ్రంథమాల*, కొవ్వలి లక్ష్మీనారాయణ గారి *ఇతిహాస పరిశోధక గ్రంథమాల*; పొట్లపల్లి రామారావు గారి *తెలంగాణా గ్రంథమాల*; ఆంధ్రశేషగిరిరావు గారి *విజాపురీ గ్రంథమాల*; చిలుకూరి శ్రీరాములు గారి *వెంకటేశ్వర గ్రంథమాల*; ఊటుకూరు సత్యనారాయణరావు గారి *సారస్వత చంద్రికా గ్రంథమాల*.

*కదళీపుర గ్రంథమాల, ఆంధ్రాభ్యుదయ గ్రంథమాల, వాణీగ్రంథమాల, వరూధినీ గ్రంథమాల, మానస గ్రంథమాల, విజ్ఞాన వర్షిణీ గ్రంథమాల, విజ్ఞానభానోదయ గ్రంథమాల, గోలకొండ గ్రంథమాల, కిన్నెర గ్రంథమాల, దివ్యవాణి గ్రంథమాల, సుకృతి గ్రంథమాల, ప్రసాదము గ్రంథమాల, మాతృభారతి గ్రంథమాల, ఆంధ్రశ్రీ గ్రంథమాల, పూలతోట గ్రంథమాల, శివధర్మ గ్రంథమాల, సాహితీమేఖల గ్రంథమాల, ఆంధ్రవాణీ రత్న గ్రంథమాల, రామానుజ గ్రంథమాల, శుకశ్యామలా రామలింగేశ్వర గ్రంథమాల, కృషి ప్రచారిణీ గ్రంథమాల, కవికోకిల గ్రంథమాల, శరత్ గ్రంథమాల, వీరశైవ ప్రచారిణీ గ్రంథమాల, శాంతి నిలయ గ్రంథమాల.*

*ఇంకాఉంది.....*

# చదవండి...

– ఎన్నార్కె




✦ **ధర్మగీత :** బుద్ధ ప్రవచన సంగ్రహము. అనువాదకుడు వాఖ్యాత జి.వి.ఆర్.కె.శర్మ. అష్టాంగ మార్గము, నిర్మాణము లాంటి ప్రశ్నలకు సమాధానముగ తథాగత ప్రవచనములైన ధమ్మపదలోని గాథలు, ఇతర ప్రామాణిక గ్రంథములలోని కొన్ని సూత్రములు ఎన్నుకుని, తేటగీతులలో అనువదించి, ఈ పుస్తకంలో పొందు పరిచారు. వెల అమూల్యమైన ఈ పుస్తకం గ్లేజ్‌డు కాగితం పై అచ్చువేశారు.

*పేజీలు 120, ప్రతులు కావలసినవారు సంప్రదించ వలసిన చిరునామా :* G.V.R.K. SHARMA, 44 Martha Jones Road, Westwood, MA 02090, U.S.A



✦ **డాక్టర్ యల్లా ప్రగడ సుబ్బారావు :** జీవితం, వ్యక్తిత్వం – రచన అబ్బూరి ఛాయాదేవి. తన జీవితం మొత్తం ప్రజారోగ్యం కోసం పాటుపడి, అమెరికా వెళ్ళి అక్కడే మరణించిన మహోన్నతుడు యల్లాప్రగడ. కొందరికి రావలసిన పేరు ప్రఖ్యాతులకంటే తక్కువ వస్తాయి. అటువంటి వారిలో మొదట చెప్పుకోదగ్గ వ్యక్తాయన. మెడిసన్‌లో నోబుల్ బహుమతికి అన్ని విధాలా అర్హునిగా భావించ బడ్డ వ్యక్తి. ప్రజా సేవలో అగ్రగణ్యునిగా ఘనత వహించిన ఆయన గురించి అందరూ తెలుసు కోవలసిన అవసరం ఎంతయినా ఉంది.

*పేజీలు 110, వెల : ₹ 70/–, రాజాచంద్ర ఫౌన్‌డేషన్, తిరుపతి. ఫోన్: 0877–2232888 లో సంప్రదించండి.*



✦ **1. బాలికార్టున్లు / 2. బాలి ఫినిక్స్ కార్టున్లు :** ఈ పుస్తకాలు బాలి కార్టూన్లకు సబంధించినవి. కార్టూన్లు నవ్విస్తాయి. బాలి కార్టూన్లు కడుపుబ్బ నవ్విస్తాయి. రాజకీయాల మీద, ఆధునిక జీవన విధానాల మీద వేసిన విసుర్లు, సెన్స్ ఆఫ్ హ్యూమర్ లేని వారినైనా నవ్వించటమే బాలీ కార్టూన్ల ప్రత్యేకత. వియన్నార్ బుక్ వరల్డ్ ప్రచురణ.

*1. పేజీలు 92, వెల : ₹ 100/–, 2. పేజీలు 275, వెల : ₹ 200/–, ప్రతులు కావలసినవారు శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్, ఫోన్: 9391343916 లో సంప్రదించండి.*




✦ **దర్శకుడు కె.వి. రెడ్డి :** కె.వి. రెడ్డి శత జయంతి ఉత్సవాల సందర్భంగా వారి అభిమాని చాగం కొండారెడ్డి వెలువరించిన ప్రత్యేక సంచిక. కె.వి.రెడ్డి తెలుగు చలన చిత్రరంగంలోనే కాదు, భారతీయ చలన చిత్రరంగంలోనూ మేరు నగధీరుడే. బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనంగా నిలిచే వారి చిత్రాలలానే రాయల్ సైజులో వెలువడిన ఈ పుస్తక సంపుటి విలువైనది.

*పేజీలు 150 వెల : ₹ 150/–, ప్రతులు కావలసినవారు ఫోన్: 9848039108 లో సంప్రదించండి.*




✦ **చీకటి గీతలు :** రచయిత గవర ఈశ్వరరావు. ఈ కథలన్నిటా సామాజిక కోణం నుంచి మానవీయ విలువల ఉన్నతీకరణ కనిపిస్తుంది. మొత్తం 21 కథలు. ఇవన్నీ ఇంతకు మునుపు స్వాతి, పల్లకి, మయూరి లాంటి పత్రికలలో ప్రచురితమయినవే.

*పేజీలు 160, వెల : ₹ 100/–, ప్రతులు అన్ని ప్రముఖ పుస్తక శాలలో లభిస్తాయి.*




✦ **చింతల వలస కథలు :** రచన డా॥ మూలం రవికుమార్. ఉత్తరాంధ్ర ప్రాంతమయిన చింతలవలస కేంద్రంగా ఈ కథలో సంఘటనలు తిరుగుతుంటాయి. వలస జీవుల జీవన వైవిధ్యాన్ని, శ్వేత విప్లవంలోని లోపాలను అన్యాపదేశంగా ఎత్తి చూపిస్తాయి కథలు.

*పేజీలు 120, వెల : ₹ 50/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9848039108 లో సంప్రదించండి.*




✦ **సాహిత్య వీధి :** పరిశోధనాత్మక వ్యాసాలు. రచయిత డా॥ శ్రీమాన్-పెరంబుదూరు శ్రీరంగాచార్యులు. ఇందులో ఉన్న 12 వ్యాసాలలో రెండు వ్యాసాలు సంస్మరణాత్మకాలు, మిగిలినవి పరిశోధనాత్మకాలు. గ్రంథ సంకలనంలో, గ్రంథ పరిష్కరణలో తెలంగాణా సాహిత్యం మీద ఆయన ముద్ర చెరుపరానిది. వ్యాసాలు పరిమితిలో చిన్నవైనా, విషయ పరిజ్ఞానంలో పెద్దవి.

*పేజీలు 192, వెల : ₹ 180/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9299451266 లో సంప్రదించండి.*




✦ **తెలుగు పత్రికలు తీరు తెన్నులు :** రచయిత డా॥జి.యస్.వరదాచారి. ఎంతగానో విస్తరించిన సమకాలీన పత్రికారంగంలోని జర్నలిష్టుల అనుభవాలను, దృష్టిలో పెట్టుకొని వృత్తిపరమైన పరిజ్ఞానం పెంపొందించు కోవడానికి ఉపకరించే రచనలను ప్రచురించాలనే ఉద్దేశంతో వచ్చిన వ్యాసాల సంపుటిది. మొత్తం వ్యాసాలను నాలుగు అధ్యాయాలుగా విభజించారు. ఇది జర్మలిజంపై మక్కువ వున్న వారినే కాక విద్యార్థులను, భాషాభిమానులను అలరించేలా ఉంది.

*పేజీలు 170, వెల : ₹ 150/-, ప్రతులు కావలసినవారు ఫోన్: 9849228018 లో సంప్రదించండి.*

✦ **రమణీయ భాగవత కథలు :** రచన ముళ్ళపూడి వెంకట రమణ. నభూతో నభవిష్యతి అనిపించే భారతాన్ని కల్పించిన వ్యాసుడు ఆ తరువాత భాగవతాన్ని ఎందుకు చెప్పాడు అన్నదే ఒక కనువిందు కలిగించే కమనీయమైన కథగా, చక్కటి గాథలుగా, పునరుక్తి లేకుండా, హృద్యంగా వ్రాశారు ముళ్ళపూడి. భారత, భాగవతాలు మన జాతి సంపదగా భావించే వారందరూ తప్పక చదవవలసిన గ్రంథం. ఉత్తమ సాహిత్యాన్ని మనకు ఎప్పుడూ అందించే రాజాచంద్ర ఫౌండేషన్ వారి ప్రచురణ.

*పేజీలు 800, వెల : ₹ 400/-, రాజాచంద్ర ఫౌండేషన్, తిరుపతి. ఫోన్: 0877-2232888 లో సంప్రదించండి.*




✦ **మార్పు చూసిన కళ్ళు :** భండారు శ్రీనివాసరావు వ్రాసిన నాటి ఆయన మాస్కో అనుభవాలు. జర్నలిస్టయిన రచయితలోని హాస్యప్రియత్వం, నిజాన్ని నిర్భయంగా చెప్పకలిగే కమిట్‌మెంట్ మనం చదివేటప్పుడు ఆహ్లాద పరుస్తాయి. కంటెంటే కాదు పుస్తక ప్రజంటేషన్ కూడా చాలా రిచ్‌గా ఉంది.

*పేజీలు 100, వెల : ₹ 75/-, ప్రతులకు* Veteran Journalists' Association, Plot No. 24, Journalists' Colony, Road No.3, Banjara Hills, Hyderabad-34.




✦ **పట్టుకుచ్చుల పువ్వు :** దాసరాజు రామారావు కవితాసంకలనం. మనిషిలోని మనిషితనాన్ని, మంచితనాన్ని ఆవిష్కరించాలన్న గాఢమైన ఆకాంక్ష ఆయన వ్రాసిన ఈ నలభై గేయాలలోనూ కనిపిస్తుంది. చాలా ఆర్తితో కూడిన రచనలు.

*పేజీలు 140, వెల : ₹ 50/-, ప్రతులు అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలలలో లభ్యం.*

# బొడ్డెమ్మ పండుగ

– శ్రీమంతుల దామోదర్

తెలంగాణ ప్రాంతంలో అతిపెద్దదైన బతుకమ్మ పండుగకు ముందు రోజుల్లో కన్నెపిల్లలు చేసే పండుగనే *బొడ్డెమ్మ పండుగ* అంటారు. దీనినే *చిన్న బతుకమ్మ* అని కూడా పిలుస్తారు. భాద్రపద బహుళ పంచమి నుండి మహాలయ అమావాస్య వరకు తొమ్మిది రోజుల పాటు బొడ్డెమ్మ పండుగను జరుపుకుంటారు. మన సంప్రదాయంలో తొమ్మిది రోజుల పాటు వినాయక ఉత్సవాలు, తర్వాత బొడ్డెమ్మ పండుగ, దాని తర్వాత బతుకమ్మ పండుగ వెంట వెంటనే వస్తాయి. ఈ పండుగలను భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. వినాయకచవితికి మగవారి ఆర్భాటాలు ఎక్కువైతే, బొడ్డెమ్మ పండుగను కన్నెపిల్లలు, బతుకమ్మను ఆడవాళ్ళందరు ఎంతో ఆనందంగా జరుపుకుంటారు. బొడ్డెమ్మను, బతుకమ్మను తల్లి బిడ్డలుగా పూజించడం ఆనవాయితీ.

బొడ్డెమ్మను ఆనవాయితీ, మొక్కుబడిగా ఉన్న ఇంటి ముత్తైదువులు మాత్రమే ప్రతిష్ఠిస్తారు. పుట్ట మన్నుతో ఐదు అంతరాలు ఉండే విధంగా గుండ్రంగా ఒక పీట మీద తయారుచేస్తారు. దీనిని పసుపు కుంకుమలతో, అలంకరిస్తారు. దీనిని పంచ భూతాలకు ప్రతీకగా చెప్పవచ్చు. దాని మీద రాగి లేదా ఇత్తడి చెంబు పెట్టి అందులో బియ్యం పోసి, దాని మీద ముడుపుగా తెల్లగుడ్డను పెడతారు. పసుపు, ఆవుపాలతో బొడ్డెమ్మను తయారు చేసి ముడుపుపైన పెట్టి గోరింట, మందార, రుద్రజాడ, నందివర్ధన, మొదలైన పూలతో అలంకరిస్తారు. బొడ్డెమ్మను ప్రతిష్ఠించిన చోటుకు కన్నెపిల్లలందరు పూలు, బియ్యం తీసుకు వస్తారు. అందరు బొడ్డెమ్మ చుట్టు ఒక్కో పువ్వు వేసుకుంటూ చప్పట్లు కొడుతూ తిరుగుతారు.

**ఒక్కొక పూవేసి చందమామ / ఒక్క జాములాయే చందమామ...**

అంటూ తొమ్మిది జాములు తొమ్మిది పూలు వరకు వేసి పాడతారు.

**శ్రీలక్ష్మీ నీ మహిమలు గౌరమ్మ /చిత్రమై తోచునమ్మ గౌరమ్మ / బ్రహ్మ కిల్లాలివై.**

అంటూ లక్ష్మీదేవి యొక్క మహిమల గురించి ఈ పాటలు పాడతారు.

**సీతమ్మ వాకిట్లో కోల్ / సిరిమల్లె చెట్టు కోల్**

**కొమ్మ వంచ కుండా కోల్ / పూలు కోయండి కోల్**

అంటూ సీతారాములకు సంబంధించి పాడుతూ ఆ పూల దండను శ్రీ సీతారాములకు వెయ్యండని పాడతారు.

అదే విధంగా....

**శ్రీ లక్ష్మీదేవియు చందమామ / సృష్టి బతుకమ్మవై చందమామ...**

ఈ పాటలో లక్ష్మీదేవియే బతుకమ్మ అని ఆ బతుకమ్మ మమ్మల్ని చల్లగా కాపాడాలనీ కోరుకుంటారు.

**బొడ్డెమ్మ బొడ్డెమ్మ కోల్ / బిడ్డా లెందారే కోల్**

**నీ బిడ్డా గౌరమ్మ కోల్ / నిత్య ఇల్లాలమ్మ కోల్ –**

అంటూ గౌరమ్మ యొక్క ప్రాతివత్యం గురించి ఈ పాటలో చక్కగా వివరిస్తారు. వీటితో పాటు...

**వెంకటేశ గుట్టా కాడ కోల్ / లంకా పుట్టింది కోల్ –**

అంటూ స్థానిక ఆలయాల ప్రభావంతో, పాడేపాటలు కోకొల్లలు. ఈ పాటల్లో చందమామా, గౌరమ్మ, ఉయ్యాలా, కోల్, లాంటివి పాట చివరలో వచ్చే విధంగా ఎంతో శ్రావ్యంగా పాడతారు.

ఇలాంటి పాటలు పెద్దవారి నుండి కన్నెపిల్లలు నేర్చుకొని ఎంతో లయబద్ధంగా పాడతారు. తర్వాత బొడ్డెమ్మకు పప్పుబెల్లం నైవేద్యంగా పెట్టి కొబ్బరికాయ కొడతారు. బొడ్డెమ్మను చివరగా నిద్రపుచ్చి ఇంట్లో దేవుడి పీఠం దగ్గర ఉంచుతారు.

బొడ్డెమ్మను ప్రతిరోజు ఆట ఆడి నిద్రపుచ్చే పాట –

**నిద్రపో బొడ్డెమ్మ నిద్రపోవమ్మా / నిద్రాకు నూరేళ్ళు నీకు వెయ్యేళ్ళు–**

అంటూ పాడతారు.

ఈ పాటలో బొడ్డెమ్మ యొక్క ఆయుష్షును కూడా జానపదులే చెప్పడం ఔచిత్యంగా చెప్పవచ్చు. ప్రతి ఆలయంలో దేవుడిని గరుడ సేవలతో నిద్రపుచ్చడం అనే సంప్రదాయం జానపదుల నుండే నేర్చుకున్నట్లు తెలుస్తుంది.

బొడ్డెమ్మకు ఎన్ని పాటలు పాడినప్పటికి బేసి సంఖ్యతో పాటలు ముగించడం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పవచ్చు. అక్కడికి వచ్చిన పిల్లలందరికి పప్పుబెల్లాన్ని ఫలహారంగా పంచి పెడతారు. ఈ విధంగా తొమ్మిది రోజులు ఆడతారు. చివరిరోజున పిల్లలు తెచ్చిన బియ్యం వేయించి పిండిచేసి పాలు శర్కరతో నైవేద్యం తయారు చేసి పంచి పెడతారు. పాటలు పాడిన తర్వాత బొడ్డెమ్మ పీటను అమ్మాయి ఎతుకుని దగ్గరలో ఉన్న చెరువుకు వెళ్ళి అందరు కలసి నిద్రపుచ్చి ఆ నీటిలో కలుపుతారు. అక్కడి నుండి నీళ్ళు తెచ్చుకొని గౌరమ్మ పసుపు ప్రమిదను తలా కొంత ముత్తైదువులకు పంచుతారు. చెంబులోని బియ్యంతో ప్రసాదం వండి అందరికి పంచుతారు.

ఈ విధంగా తెలంగాణాలోనే ప్రత్యేకంగా తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ పండుగ వలన పిల్లల్లో భక్తి భావంతో పాటుగా తరువాత వచ్చే బతుకమ్మ పండుగకు సిద్ధమైనట్టుగా కన్పిస్తుంది. ఇలాంటి పండుగలే మన సంప్రదాయాలకు ప్రతీకలు.

---

డాక్టరు శ్రీమంతుల దామోదర్,
ఫోన్ : 9989139136

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

## I. మిసిమి ప్రచురణలు

| | | ₹ |
|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు – *ఎ.వి.రెడ్డి* | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–1 ” | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–2 ” | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–3 ” | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | 150.00 |
| 8. | దూర తీరాలలో... – *వి. అశ్వినీకుమార్* | 60.00 |
| 9. | అమాహ ” | 60.00 |
| 10. | అంతర్వీక్షణం ” | 50.00 |
| 11. | సిద్ధార్థ ” | 50.00 |
| 12. | నాలో నేను ” | 30.00 |
| 13. | అగాధం ” | 75.00 |
| 14. | కథాంజలి–1 **– ఎస్సారె** | 80.00 |
| 15. | కథాంజలి–2 ” | 110.00 |
| 16. | THE THUNDERCLOUD ” | 120.00 |
| 17. | మిసిమి వ్యాసాలు – *నరిసెట్టి ఇన్నయ్య* | 125.00 |
| | **ఇతరములు** | |
| 18. | భట్టిప్రోలు కథలు | 150.00 |
| 19. | రెండు దశాబ్దాలు – కథ 1990–2009 | 150.00 |

## II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన – *ఎమ్. కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన – *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన – *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం: జె.లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన – *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం –*ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

## III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు

| | | ₹ |
|---|---|---|
| 1. | మహాపరిత్తం – *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హ: ఉపమలు – *బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు – *అన్నపరెడ్డి బుద్ధఘోషుడు* | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం:జె.లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం – బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు – *డాక్టరు ఈమని శివనాగిరెడ్డి* | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |
| 11. | విపశ్యనా ధ్యానమార్గదర్శిని *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 50.00 |
| 12. | మిళింద ప్రశ్నలు – *బోధచైతన్య* | 150.00 |
| 13. | బౌద్ధ ధర్మదర్శిని *(భదంత ఆనంద కౌసల్యాయన్ – అనువాదం జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 14. | ప్రజ్ఞాదీపిక *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 60.00 |
| 15. | శీలం–ధ్యానం – *బోధ చైతన్య* | 150.00 |
| 16. | లోకక్షేమగాథలు – *బోధ చైతన్య* | 75.00 |

## IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 2. | యతిగీతం– స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి) | 50.00 |
| 3. | చార్లీ చాప్లిన్ (నా కథ) – *వి. అశ్వినీకుమార్* | 299.00 |
| 4. | తిరుపతి తిమ్మప్ప – *గుత్తి చంద్రశేఖర రెడ్డి* | 250.00 |
| 5. | రైతు రాయలు – *గుత్తి చంద్రశేఖర రెడ్డి* | 50.00 |

మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in ; e-magazine : www.kinige.com/misimi

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు:** ....................................................

**2. చిరునామా:**

ఇం.నెం. ....................................................

వీధి ....................................................

పేట ....................................................

ఊరు ....................................................

పిన్ ....................................................

సెల్ ....................................................

**3. సంతకం:** ....................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

**మిసిమి** లో నూతన చందా దారులుగా చేరండి : **'సిద్ధార్థ' పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

అలాగే ఐదు సంవత్సరాలకు ₹1200 పంపండి అందమైన 2010 **మిసిమి** పుస్తకాల బైండు అందుకోండి.

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi



బసవన్న

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



సంక్రాంతి